సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 180

శుక్రవారం 20-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

మా కళ్లు చెబుతున్నాయి నిను ప్రేమించామని...



గొప్ప నటుడిగా, మంచి వ్యక్తిగా తనతో కలిసి నటించిన నటీనటులతోనూ, ప్రేక్షకులతోనూ 'మా కళ్లు చెబుతున్నాయి నిను ప్రేమించామని...' అనిపించుకున్నారు అక్కినేని. "అంతటి మహానటుడితో కలిసి నటించడం మా అదృష్టం" అంటున్నారు ప్రముఖ తారలు. ఈ నట సామ్రాట్ తమకు ఏ విధంగా ఆదర్శంగా నిలిచారో కొందరు నటీమణులు 'సాక్షి'తో ప్రత్యేకంగా పంచుకున్నారు. ఆ విశేషాలు... - IIలో



మరికొన్ని అక్కినేని కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
SAKSHI POST
sakshipost.com (english)

అక్కినేని శతజయంతి ముగింపు సందర్భంగా



గొప్ప నటుడిగా, మంచి వ్యక్తిగా తనతో కలిసి నటించిన నటీనటులతోనూ, ప్రేక్షకులతోనూ 'మా కళ్లు చెబుతున్నాయి నిను ప్రేమించామని...' అనిపించుకున్నారు అక్కినేని. "అంతటి మహానటుడితో కలిసి నటించడం మా అదృష్టం" అంటున్నారు ప్రముఖ తారలు. ఈ నట సామ్రాట్ తమకు ఏ విధంగా ఆదర్శంగా నిలిచారో కొందరు నటీమణులు 'సాక్షి'తో ప్రత్యేకంగా పంచుకున్నారు. ఆ విశేషాలు...

మా కళ్లు చెబుతున్నాయి నిను ప్రేమించామని...

నా మీద నాకు నమ్మకం వచ్చేలా చేశారు - షావుకారు జానకి



నాగేశ్వరరావుగారి గురించి చెప్పాలంటే ముఖ్యంగా 'అక్కా–చెల్లెళ్లు' సినిమా గురించి చెప్పాలి. ఆ సినిమాలో ఫస్ట్ నైట్ సీన్‌లో 'పాండవులు పాండవులు తుమ్మెద...' పాటకి డ్యాన్స్ చేయమని దర్శక–నిర్మాత అంటే, 'పాట వద్దండీ... ఏదైనా డైలాగ్‌తో సీన్ ముగించవచ్చు కదా' అంటూ వెనక్కి తగ్గాను. కానీ, ఆ చిత్రనిర్మాత రాజేంద్రప్రసాద్‌గారు, నాగేశ్వరరావుగారు పట్టుబట్టి చేయించారు. 'డెఫినెట్‌గా హైలైట్ అవుతుంది... బాగుంటుందమ్మా చెయ్యి... ఆ తర్వాత చూడు' అంటూ నాగేశ్వరరావుగారు ఎంతగానో ప్రోత్సహించారు. దాంతో చేశాను. ఆయన అన్నట్లే పాట హిట్ అయింది. ఆ తర్వాత 'చూశావా... చెయ్యనన్నావు... ఎంత బాగా వచ్చిందో' అన్నారు. మన మీద మనకు నమ్మకం లేని స్థితిలో అంతటి మహానటుడు ప్రోత్సహించి, చేయించడం అనేది నేను చేసుకున్న అదృష్టం అనిపించింది. మన ప్రతిభను గుర్తించి, ఎవరైనా ప్రోత్సహించడం అనేది చాలా గొప్ప విషయం. నా మీద నాకు నమ్మకం వచ్చేలా చేశారు.

అప్పుడు స్టన్నయ్యా...

ఇంకా నన్ను ఆయన అభినందించిన విషయాల్లో ముఖ్యమైనది ఒకటి చెబుతాను. నాగేశ్వరరావుగారిలానే నేనూ పెద్దగా చదువుకోలేదు. మా నాన్నగారి వృత్తి రీత్యా మేం ఎక్కువగా నార్త్‌లో ఉండేవాళ్లం. పదిహేనేళ్లకే పెళ్లయిపోయింది. ఆ తర్వాత మద్రాసులో ఉన్నాం. అనుకోకుండా సినిమాలకు అవకాశం వచ్చింది. నార్త్‌లో ఉన్నప్పటికీ మన తెలుగు భాష మీద ఉన్న ఇష్టంతో చాలా శ్రద్ధగా పట్టు సాధించాను. నేను తెలుగు మాట్లాడే తీరుని నాగేశ్వరరావుగారు బాగా మెచ్చుకునేవారు. ఆ ఉచ్చారణ, ఎక్కడ నొక్కాలి? ఎక్కడ తగ్గించాలి? వంటివి బాగుంటాయని ప్రశంసించేవారు. ఆల్ ఇండియా రేడియోలో చిన్న పిల్లలకు వాయిస్ ఇచ్చేదాన్ని. అప్పట్లో నాకు ఆల్ ఇండియా రేడియోలో 'ఏ స్టార్' స్టేటస్. ఇక కొందరు డైలాగ్స్ మింగేస్తున్నారని, సరిగ్గా పలకడంలేదని, నువ్వెందుకు వాళ్లకు తర్ఫీదు ఇవ్వకూడదని నాగేశ్వరరావుగారు అన్నప్పుడు నేను స్టన్నయ్యా. నా మీద ఆయన ఎంత భరోసా పెట్టుకున్నారో అప్పుడు అర్థమైంది. వహీదా రెహమాన్, కేఆర్ విజయలాంటి హీరోయిన్లకు వాయిస్ ఇచ్చాను. కానీ వారు కనిపించడంలేదు... జానకియే కనబడుతోందనే మాట రావడంతో ఎవర్నీ తక్కువ చేయడం ఇష్టంలేక వేరేవాళ్లకి వాయిస్ ఇవ్వడం మానేశాను. నాకు మంచి డైలాగ్స్ ఇచ్చిన రైటర్లకు, మంచి పాత్రలు ఇచ్చిన దర్శకులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు చెబుతున్నాను.

ఆపరేషన్‌కి వెళుతూ గిఫ్ట్ ఇచ్చారు - లక్ష్మి

మా అమ్మగారు (కుమారి రుక్మిణి) నాగేశ్వరరావుగారికి అమ్మగా, అత్తగా... ఇలా చాలా క్యారెక్టర్లు చేశారు. నా స్కూల్ సెలవులప్పుడు ఆ షూటింగ్స్ చూడ్డానికి అమ్మతో లొకేషన్‌కి వెళ్లేదాన్ని. సారథి స్టూడియోలో జరుగుతున్న ఓ సినిమా షూటింగ్‌కి వెళ్లినప్పుడు నాగేశ్వరరావుగారిని చూశాను. 'ఎంత పెద్ద యాక్టర్' అంటూ అలా చూస్తుండిపోయాను. 'ఏమ్మా... ఇవాళ స్కూల్ లేదా? ఫ్రీయా? వాట్ ఆర్ యు గోయింగ్ టు డూ' అంటూ చాలా ప్రేమగా మాట్లాడారు. ఇప్పుడు తలుచుకున్నా ఆయనకు నేను హీరోయినా? అనిపిస్తుంది. అప్పట్లో నేను యాక్ట్ చేసిన ఏయన్నార్‌గారు, ఎంజీఆర్‌గారు, శివాజీ గణేశన్‌గారు... వీళ్లంతా వయసులో నాకన్నా చాలా పెద్దవాళ్లు. అంత పెద్దవాళ్లతో సినిమాలు చేయడం వల్ల చాలా నేర్చుకోగలిగాను. నాగేశ్వరరావుగారితో నా ఫస్ట్ సినిమా 'సుపుత్రుడు'. కొడైకెనాల్‌లో షూటింగ్. మధురై నుంచి ఫ్లైట్‌లో వెళ్లాం. ఫ్లైట్‌లో కూర్చున్నాక 'ఏమ్మా ఎలా ఉన్నావ్... ఇన్నాళ్లూ షూటింగ్‌కి వచ్చి నన్ను చూసేదానివి. ఇప్పుడు నువ్వే హీరోయిన్‌వా? ఇప్పటిదాకా ఏం బేబీ అన్నాను... ఇప్పట్నుంచి ఏం హీరోయిన్ అనాలి' అని నవ్వారు.

నన్ను 'పెరుగన్నం' అని పిలిచేవారు

ఫ్లైట్‌లో వెళుతున్నప్పుడు 'నువ్వు చాలా ఇష్టపడి తినేవి ఏంటి' అని అడిగితే 'పెరుగన్నం సార్' అన్నాను. అది కాదమ్మా... 'జనరల్‌గా ఏం ఇష్టపడతావు' అంటే 'పెరుగన్నం' అన్నాను. అప్పట్నుంచి నన్ను ఆయన 'ఏయ్ పెరుగన్నం' అని పిలిచేవారు. ఎక్కడ కనిపించినా ఇదే పిలుపు. అంతెందుకు 'మిథునం' ఫంక్షన్‌కి హైదరాబాద్ వచ్చినప్పుడు, ఆ తర్వాత నాగేశ్వరరావుగారి అవార్డు ఫంక్షన్ ఉండటంతో వెళ్లాను. నేను, బాలు సార్, చంద్రమోహన్ అందరం వెళ్లాం. 'నైట్ డిన్నర్ ఉంది... నీ పెరుగన్నం నీకు రెడీ... వస్తావా' అంటే, బాలూగారూ 'అవునండీ... మధ్యాహ్నం, రాత్రి ఎప్పుడైనా పెరుగన్నమే...' అంటూ 'పెరుగు లక్ష్మి' అని పేరు పెట్టారాయన. మా అమ్మతో షూటింగ్‌కు వెళ్లిప్పటి (పన్నెండేళ్ల వయసు) నుంచి ఏఎన్నార్ గారిలో నేను గమనించిన ఒక విషయం ఏంటంటే... మనం కొన్ని విషయాలు



మర్చిపోతుంటాం... కానీ ఆయన మాత్రం ఏదీ మర్చిపోరు. వాట్ ఎ మెమరీ అంటే... ఓ సినిమా షూటింగ్ కోసం గోవా వెళ్లినప్పుడు నా స్కూల్ టైమ్‌లో నేను చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకుని, మాట్లాడితే ఆశ్చర్యపోయాను. ఇక సెన్సాఫ్ హ్యూమర్ అయితే సూపర్. నేను, వహీదా రెహమాన్‌గారు ఆయన కాంబినేషన్‌లో సినిమా చేస్తున్నప్పుడు ఆయన ఇంటికి మమ్మల్ని డిన్నర్‌కి పిలిచారు. అన్నపూర్ణమ్మ (ఏయన్నార్ సతీమణి), ఇంకా ఇతర కుటుంబ సభ్యులు మాట్లాడిన విధానం చాలా బాగా అనిపించింది.

నాగేశ్వరరావుగారి పిల్లలకు ఆయన క్లాస్ బిహేవియర్ వచ్చింది. నాగార్జునని చిన్నప్పుడు నేను సెట్లో చూసి, 'ఏయ్ హీరో... నేనే నీ హీరోయిన్‌ని... డ్యూయెట్ పాడాలి' అంటే సిగ్గు పడిపోయి పారిపోయేవాడు. 'రేయ్ రారా... నీ హీరోయిన్ వచ్చింది' అని నాగేశ్వరరావుగారు నవ్వేవారు. ఆయన నవ్వేటప్పుడు చక్కని పలువరుస, పెద్ద కళ్లు చూడముచ్చటగా ఉండేవి. 'పల్లెటూరి బావ'లో యాక్ట్ చేసేటప్పుడు నా కూతురు (నటి ఐశ్వర్య) లొకేషన్‌కి వస్తే... 'నాకు ఇంకో హీరోయిన్ రెడీ అయిపోయింది' అని తనని ఎత్తుకున్నారు. నాతోనే ఆయన అంత చనువుగా మాట్లాడుతున్నారు అనుకునేదాన్ని. కానీ ఓ షూటింగ్‌లో సుమిత్ర నాతో 'అక్కా... ఎంత పెద్ద ఆర్టిస్ట్ ఆయన. ఇంత బాగా మాట్లాడతారనుకోలేదు' అని నాతో అంది. అందరితోనూ ఆయన ఆప్యాయంగా మాట్లాడేవారు... సరదాగా ఉండేవారు. సెట్లో ఎవరూ టెన్షన్ పడని వాతావరణాన్ని క్రియేట్ చేసేవారు.

'నా హీరోయిన్' అంటూ...

అప్పట్లో మదరాసులో నాకు 'కళా సాగర్' అవార్డు ఇచ్చారు. ఆ ఫంక్షన్‌కి వచ్చిన నాగేశ్వరరావుగారు, శివాజీ గణేశన్‌గారు 'నా హీరోయిన్' అంటూ నా చేయి పట్టుకుని, స్టేజి మీదకు తీసుకెళ్లి, అవార్డు ఇచ్చిన సంఘటన నాకెప్పటికీ గుర్తే. ఒక ఆర్టిస్ట్‌గా నాకు ఇంతకన్నా ఏం కావాలి? అప్పట్లో మొబైల్ ఫోన్ లేదు... సెల్ఫీ తీసుకోవడానికి. ఇక నాగేశ్వరరావుగారి మనోధైర్యం గురించి చెప్పాలి. 1973లో అనుకుంటా ఆయన హార్ట్ ఆపరేషన్ చేయించుకోవడానికి యూఎస్ వెళుతున్నారు. 'పల్లెటూరి బావ' సినిమా చేస్తున్నాం. ఆయన తల్లిగా సుకుమారిగారు నటిస్తున్నారు. ఆపరేషన్‌కి వెళ్లే ముందు 'నేను మళ్లీ రావాలి.. ఐ విల్ కమ్‌బ్యాక్ పాజిటివ్లీ. కానీ ఏదైనా జరగకూడనిది జరిగితే... అందుకే నా గుర్తుగా ఏదైనా ఇవ్వాలనుకుంటున్నా' అని చాలా కూల్‌గా అన్నారు. మేం 'అయ్యో... అలా అనకండి సార్' అన్నాం. కానీ, గిఫ్ట్ ఇవ్వాల్సిందే అంటూ అమ్మాయిలకు వీఐపీ బ్రాండ్ మేకప్ వ్యానిటీ బాక్స్, అబ్బాయిలకు వీఐపీ బ్రీఫ్‌కేస్ ఇచ్చారు. నాకు రెడ్ కలర్ బాక్స్ ఇచ్చారు... ఇప్పటికీ ఆ గిఫ్ట్ నా దగ్గర భద్రంగా ఉంది. ఆయన రోజూ ఒక కప్పు మీగడ తినేవారు. 'ఈ మీగడ తినీ తినీ నేను హాస్పిటల్‌కి వెళుతున్నాను. నువ్వు పెరుగన్నంలో మీగడ వేసుకుని తినకు. మళ్లీ నాలా హాస్పిటల్‌కి వెళ్లాలి' అన్నారు.

ఒకసారి నేను ఒక షూటింగ్‌కి వెళుతూ తాజ్ బంజారా నుంచి కారులో వెళుతుంటే, పంచెకట్టులో ఓ ఐదారుగురు కనిపించారు. 'మన సార్‌లా ఉందే' అని కారు ఆపాను. ఆయన, సుబ్బరామి రెడ్డిగారు, ఇంకో ముగ్గురు నలుగురు ఉన్నారు. అప్పుడు టైమ్ ఉదయం ఆరు. నన్ను చూసి, 'ఏం లక్ష్మి... ఎక్కడికి వెళుతున్నావు? షూటింగ్‌కా?' అంటే... 'సార్ మీ స్టూడియోకే వెళుతున్నాను' అన్నాను. 'వెరీ గుడ్... మై హీరోయిన్ లక్ష్మి' అని తన ఫ్రెండ్స్‌కి పరిచయం చేశారు. వాకింగ్ స్టిక్ పట్టుకుని, ఆ పంచెకట్టులో ఆయన రూపాన్ని మర్చిపోలేను. ఆ ఆప్యాయంగా మాట్లాడటం అనే లెగసీ ఆయన కూతుళ్లకు, కొడుకులకు, ఆ తర్వాతి జెనరేషన్‌కి వచ్చింది.

నాలోని భయాన్ని తీసేశారు - శారద



నా ఫస్ట్ సినిమా (ఇద్దరు మిత్రులు) ఆయనతోనే. అంతకుముందు చైల్డ్ ఆర్టిస్ట్‌గా 'కన్యాశుల్కం' సినిమాలో ఒక పాటకి డ్యాన్స్ చేశాను. అప్పుడు నాకు పదేళ్లు ఉంటాయేమో. నా పదహారేళ్లప్పుడు 'ఇద్దరు మిత్రులు'లో నాగేశ్వరరావుగారి చెల్లెలిగా చేశాను. అందులో ఆయనవి రెండు పాత్రలు. ఒక పాత్రకు నేను చెల్లెల్ని. 'ఈ సీన్ ఇలా చెయ్యి... ఇదయ్యాక అలా చెయ్యాలి' అంటూ దగ్గర కూర్చుని చక్కగా నేర్పేవారు. ఆ వయసులో నాకు నటనంటే తెలియదు. ఇలాంటి పెద్దవాళ్లతో నటించడం అంటే చిన్న విషయం కాదు. నాకు ఆ అవకాశం రావడం నా అదృష్టం. మా ఫ్యామిలీలో పదమూడేళ్లకే పెళ్లి చేసి, పంపించేస్తారు. కానీ, మా అమ్మకు నన్ను ఆర్టిస్ట్‌ని చేయాలని ఉండేది. నాన్నని ఎంతో కన్విన్స్ చేసి, తీసుకొచ్చినప్పుడు నాకు దొరికిన అవకాశం 'ఇద్దరు మిత్రులు'. ఆ సమయంలో ఎల్వీ ప్రసాద్‌గారి ఆఫీసులో నాకు నవరసాల్లో ట్రైనింగ్ ఇస్తున్నారు. అప్పుడు చెల్లెలి పాత్రకు ఆర్టిస్ట్ దొరక్క తర్జన భర్జన పడుతున్నారు. అది తెలిసి, 'మా దగ్గర ఒక అమ్మాయి ఉంది' అని 'ఇద్దరు మిత్రులు' యూనిట్‌కి ఫోన్ చేసి, ఆ పక్కన ఉన్న వారి ఆఫీసుకి పంపించారు. నాతో రెండు డైలాగ్స్ చెప్పించారు. 'వండర్‌ఫుల్... నాగేశ్వరరావుగారి చెల్లెలిగా నువ్వే చేయబోతున్నావు' అని డైరెక్టర్ (ఆదుర్తి సుబ్బారావు)గారు అన్నారు. సెట్‌లో నాగేశ్వరరావుగారిని చూసినప్పుడు పెద్ద నటుడు, వయసులోనూ పెద్దవారు కాబట్టి కాస్త భయపడ్డాను. కానీ మాలాంటి కొత్తవారిని ఆయన ప్రోత్సహించిన తీరు అద్భుతం. మాలోంచి భయాన్ని తీసేసేవారు. 'శారదా.. ఈ సీన్ ఇలా చేయాలి' అని చక్కగా నేర్పేవారు. తనది పెద్ద స్థాయి అని కాకుండా అందరితో కలిసిపోయేవారు. నటుడిగా ఆయన ఎంత గొప్పో.. వ్యక్తిగానూ అంతే గొప్ప. ఎదుటివాళ్లు బాగా యాక్ట్ చేస్తే కొందరు చూడలేరు. పైకొచ్చినా చూడలేరు. కానీ, నాగేశ్వరరావుగారికి అలాంటివి లేవు. ఆయనేమో ఆయన వర్క్ ఏమో అన్నట్లు ఉండేవారు. ఒక పాత్రను ఎలా అవగాహన చేసుకోవాలి? డైలాగ్స్ ఎలా పలకాలి వంటివి ఆయన్నుంచి నేర్చుకున్నాను. ఆయనకు ఆరోగ్యం బాగా లేనప్పుడు ఇంటికి వెళ్లాను. అదే ఆఖరిగా ఆయన్ను కలిసింది.

– డి.జి. భవాని

డైలాగ్స్ చెప్పింది ఈ అమ్మాయేనా అన్నారు - రోజా రమణి



నాగేశ్వరరావుగారి 'మూగ మనసులు' సినిమాలోని 'గోదారి గట్టుంది...' పాటను ఆడిషన్‌కి వెళ్లినప్పుడు పాడటం వల్ల నేను 'భక్త ప్రహ్లాద' సినిమాకి సెలక్ట్ అయ్యాను. ఇక ఆయన కాంబినేషన్‌లో నటించే అవకాశం నాకు 'మరపురాని మనిషి' సినిమాలో వచ్చింది. అప్పుడు నాకు పదేళ్లు. ఆయన నాతో 'అమ్మాయ్... నువ్వు తొందరగా ఎదిగిపో... నా పక్కన హీరోయిన్‌గా చెయ్యాలి. ఇలా చిన్నపిల్ల వేషం వేయకూడదు' అని సరదాగా అన్నారు. ఆ తర్వాత 'ఆలు మగలు' సినిమాలో ఆయన కోడలిగా చేశాను. అప్పుడు కూడా 'ఏంటమ్మాయ్... నువ్వు నా పక్కన హీరోయిన్‌గా చేస్తావనుకుంటే చిన్నపిల్ల, కోడలు వేషాలు వేస్తావ్' అని చాలా జోవియల్‌గా అన్నారు. ఓ పదేళ్ల క్రితం అనుకుంటా... ఒకసారి గీతాంజలిగారు మా ఇంటికి వచ్చారు. 'రోజా... ఇవాళ నాగేశ్వరావుగారి బర్త్‌డే. ఆయన ఇంటికి వెళుతున్నాను... నువ్వూ వస్తావా' అన్నారు. 'నేనెప్పుడూ అలా వెళ్లలేదు' అన్నాను. 'నాకోసం రావా ప్లీజ్. పెద్దాయన బ్లెస్సింగ్స్ తీసుకుందాం' అన్నారావిడ. బ్లెస్సింగ్స్ అనగానే వెళ్లాలనిపించింది. ఇద్దరం వెళ్లాం. మేం వెళ్లినందుకు ఆయన ఎంత హ్యాపీగా ఫీలయ్యారంటే... 'అదేంటీ... ఎప్పుడూ గీత మాత్రమే వస్తుంటుంది... నువ్వు వచ్చావ్' అన్నారు. 'నేనే తీసుకొచ్చా' అన్నారు గీత. 'ఓ... నువ్వు తీసుకొస్తే వచ్చిందా తను' అన్నారాయన. వెంటనే నేను 'మీ బ్లెస్సింగ్స్ తీసుకుందామని వచ్చాను' అన్నాను. ఆయన మాకు టిఫిన్ పెట్టారు. చాలాసేపు మాట్లాడారు. అదొక గ్రేట్ మెమరీగా నా మనసులో ఉండిపోయింది.

ఆ తర్వాత ఒక ఫంక్షన్‌లో నా జీవితంలో మర్చిపోలేని కాంప్లిమెంట్ ఇచ్చారాయన. ఆ స్టేజి మీద 'భక్త ప్రహ్లాద' సినిమా చూశాను. ఆ సినిమాలో ఈ అమ్మాయి వేదాలు, పాటలు, సంస్కృత డైలాగ్స్‌ని ఐదారేళ్లకే అంత బాగా ఎలా చెప్పగలిగింది? అసలు చెప్పింది ఈ అమ్మాయేనా? ఎవరైనా చెప్పారా? అని చాలామందిని అడిగాను. ఆ అమ్మాయే చెప్పిందన్నారు. దాంతో నేను మళ్లీ ఆ సినిమా చూశాను. లిప్ మూమెంట్ అంత కరెక్ట్‌గా ఎలా ఇచ్చిందా అని ఆశ్చర్యపోయాను' అని నా గురించి చెప్పారు. మలయాళ సినిమా 'చెంబరుత్తి'కి మద్రాసు ఫ్యాన్స్ అసోసియేషన్ వాళ్లు నాకు ఉత్తమ నటి అవార్డు ఇచ్చారు. ఆ అవార్డుని నాగేశ్వరరావుగారి చేతుల మీదుగా అందుకోవడం అనేది నాకో మంచి మెమరీ. మా బాబు తరుణ్ కూడా ఆయన చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. ఆ తర్వాత నాగేశ్వరరావుగారి పేరు మీద ఉన్న అవార్డును నాకు ఇచ్చారు. అది స్వీకరించడం నా అదృష్టం. ఇక నాకు బాగా గుర్తుండిపోయినది ఒకసారి ఆయనతో కలిసి చేసిన ఫ్లైట్ జర్నీ. హైదరాబాద్ నుంచి చెన్నై వెళుతున్నాం. ఎర్లీ మార్నింగ్ ఫ్లైట్. ఆయనకు బ్రేక్‌ఫాస్ట్ వచ్చింది. కానీ ఆయన ఒకే ఒక్క ఇడ్లీ, కొన్ని బొప్పాయి ముక్కలు తీసుకున్నారు. అంతే తీసుకుంటారా? అని అడిగితే, 'అంతే అమ్మాయ్... బాగా ఆకలి అయితే ఇంకో ఇడ్లీ తింటాను' అన్నారు. లిమిటెడ్ ఫుడ్, మార్నింగ్ అన్నపూర్ణ స్టూడియోలో వాకింగ్ ఈ విషయాలన్నింటినీ చెప్పారు. ఆయన లైఫ్‌స్టైల్ బాగుంటుంది.

నా ఎక్స్‌పెక్టేషన్‌ని దాటేశావు అన్నారు - మీనా



ఏయన్నార్‌గారి దగ్గర్నుంచి నేను నేర్చుకున్నది 'పంక్చువాలిటీ'. 'సీతారామయ్యగారి మనవరాలు' సమయంలో 'షూటింగ్ లొకేషన్లో ఎవరి కోసం అయినా నువ్వు వెయిట్ చేయొచ్చు. కానీ నీకోసం ఎవరూ వెయిట్ చేయకూడదు. అది ఫాలో అవ్వు' అన్నారు. అప్పట్నుంచి ఇప్పటివరకూ షూటింగ్ విషయంలో నేను అదే ఫాలో అవుతున్నాను. ఇక ఆ సినిమా చేసేటప్పుడు 'నేను పెద్ద నటుణ్ణే. కానీ, ఇది నీ సినిమా. నువ్వే ఈ సినిమాకి బ్యాక్‌బోన్. క్యారెక్టర్‌ని బాగా అర్థం చేసుకుని డైలాగ్స్ చెప్పాలి... ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వాలి' అని ఆయన అన్నారు. ఆ సినిమా ప్రివ్యూ చూశాక 'న్యూ కమర్ కదా అనుకున్నాను. కానీ బాగా చేశావమ్మా... నా ఎక్స్‌పెక్టేషన్‌ని దాటేశావు. నీకు చాలా మంచి ఫ్యూచర్ ఉంది' అని అన్నారు. ఎప్పుడు ఆలోచించినా ఏయన్నార్‌గారిలాంటి పెద్ద నటుడు, పైగా టైటిల్‌లో నా రోల్ కూడా ఉండటం అనేది చాలా పెద్ద విషయంగా అనిపిస్తుంటుంది. నిజానికి నేను ఆ సినిమా చేయాలా? వద్దా అనుకున్నాను. ఎందుకంటే చదువుకుంటున్న టైమ్‌లో ఆ చాన్స్ వచ్చింది. ఈ సినిమా క్లిక్ అయితే సినిమాల్లో కంటిన్యూ అవుదామని చేశాను. కట్ చేస్తే... నా లైఫ్ టర్నింగ్ మూవీ అయిపోయింది. 'సీతారామయ్యగారి మనవరాలు' ఫస్ట్ డే షూట్ అప్పుడు ఏయన్నార్‌గారి కాళ్లకు నమస్కారం చేసి, ఆశీర్వాదం తీసుకున్నాను. ఆ సినిమా తర్వాత ఎక్కడ కనబడినా 'నా మనవరాలు వచ్చింది... రా' అని ఆయన అంటే... 'తాతయ్యా... ఎలా ఉన్నారు' అనేదాన్ని. నన్ను చూసి చాలా ప్రౌడ్‌గా ఫీలయ్యేవారు. అంతటి లెజెండ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం అనేది నా లక్.

అక్కినేని డ్యూయెట్స్ 50

విజిల్ వేయండి.. పజిల్ విప్పండి

అక్కినేని నాగేశ్వరరావు మహిళా ప్రేక్షకులకు ఆరాధ్య నటుడు. ముఖ్యంగా గృహిణులు ఏఎన్ఆర్ సినిమా కోసం ఎదురు చూసేవారు. దానికి తగ్గట్టే ఏఎన్ఆర్ సినిమాల కథాంశాలుండేవి. సావిత్రి, జమున ఆ తర్వాతి కాలంలో వాణిశ్రీ అక్కినేనికి సరిజోడుగా నటించి మెప్పు పొందారు. ఆయన సినిమాల్లో అందమైన యుగళ గీతాలుండేవి. అలాంటి 100 యుగళగీతాలను తలుచుకుందాం. అక్కినేని వల్ల మన జీవితంలో వచ్చిన ఆనందగీతాలను ఆస్వాదిద్దాం. ఈ తొలి పది పాటల్లో సైకిల్ మీద వెళుతూ బి.సరోజాదేవితో పాడే పాట ఏదో గుర్తుపట్టండి. అలాగే తర్వాతి రోజుల్లో కమెడియన్‌గా మారిన గిరిజతో ఎంతో మంచి డ్యూయెట్టు ఉంది. అది ఏది?

1. ఓ దేవదా చదువు ఇదేనా (దేవదాసు)
2. రాజశేఖరా నీపై మోజు తీర లేదురా (అనార్కలి)
3. చిగురాకులలో చిలకమ్మా చిన్నమాట వినరావమ్మా (దొంగరాముడు)
4. చూపులు కలిసిన శుభవేళ ఎందుకు నీకీ కలవరము (మాయాబజార్)
5. చెట్టులెక్కగలవా ఓ నరహరి (చెంచులక్ష్మి)
6. ఆకాశ వీధిలో అందాల జాబిలి (మాంగల్యబలం)
7. నేడు శ్రీవారికి మేమంటే పరాకా (ఇల్లరికం)
8. వాడుక మరచెదవేల (పెళ్లికానుక)
9. హాయి హాయిగా జాబిల్లి తొలి రేయి వెండి దారాలల్లి (వెలుగు నీడలు)



10. మధురం మధురం ఈ సమయం (భార్యాభర్తలు)

అక్కినేనికి కవి దాశరథి తన గ్రంథాన్ని అంకితమిచ్చారు. అందుకు కృతజ్ఞతగా అక్కినేని ఆయనకు పాటలు రాసే అవకాశం ఇచ్చారు. దిగువ ఉన్న పది పాటల్లో దాశరథి రాసినవి ఉన్నాయి.. గుర్తు పట్టండి. అలాగే తెలుగు సినిమాల్లో తొలి వాన పాట కూడా ఉంది. బెంగళూరులో పాట ఏం రాయాలో తోచక కారులో తిరుగుతున్న ఆత్రేయకు అప్పుడే మొదలైన వాన ఆ పాటను రాయించి నేటికీ మనం తడిసేలా చేస్తోంది.

11. పాడవేల రాధిక ప్రణయసుధా గీతిక (ఇద్దరు మిత్రులు)
12. నన్ను వదిలి నీవు పోలేవులే (మంచి మనసులు)
13. ప్రేమయాత్రలకు బృందావనము (గుండమ్మ కథ)
14. వినిపించని రాగాలే కనిపించని అందాలే (చదువుకున్న అమ్మాయిలు)
15. చిటపట చినుకులు పడుతూ ఉంటే (ఆత్మబలం)
16. నా పాట నీ నోట పలకాల సిలక (మూగమనసులు)



17. నిలువుమా నిలువుమా నీలవేణి (అమరశిల్పి జక్కన)
18. ఈ మౌనం ఈ బిడియం ఇదేనా ఇదేనా (డాక్టర్ చక్రవర్తి)
19. కనులు కనులతో కలబడితే (సుమంగళి)
20. పగడాల జాబిలి చూడు (మూగనోము)
21. కన్నులు నీవే కావాలి (సుమంగళి)
22. నువ్వంటే నాకెందుకో అంత ఇది (అంతస్తులు)
23. అది ఒక ఇదిలే అతనికి తగులే (ప్రేమించి చూడు)
24. సిగ్గేస్తోందా సిగ్గేస్తోందా (మనుషులు మమతలు)
25. ఒక పూలబాణం తగిలింది మదిలో (ఆత్మగౌరవం)
26. చిగురులు వేసిన కలలన్నీ సిగలో పూలుగా మారినవి (పూలరంగడు)
27. విన్నవించుకోనా చిన్న కోరిక (బంగారు గాజులు)
28. విన్నానులే ప్రియా కనుగొన్నానులే ప్రియ (బందిపోటు దొంగలు)
29. ఓ చామంతి ఏమిటే ఈ వింత (ఆత్మీయులు)
30. కళ్లలో పెళ్లిపందిరి కనపడసాగే (ఆత్మీయులు)



'దసరా బుల్లోడు'తో అక్కినేని కలర్ పాటలు. స్టెప్పులు చూసే వీలు ప్రేక్షకులకు కలిగింది. ఘంటసాలకు అలవాటు పడిన ప్రేక్షకులు ఆయన స్థానంలో వి.రామకృష్ణను వినేందుకు కూడా సిద్ధం కావాల్సి వచ్చింది. ఈ పాటల్లో లక్ష్మితో మంచి డ్యూయెట్ ఉంది. చూడండి.



31. పచ్చగడ్డి కోసేటి పడుచు పిల్లా (దసరా బుల్లోడు)
32. నీ కోసం వెలసింది ప్రేమమందిరం (ప్రేమ్ నగర్)
33. ఆకులు పోకలు ఇవ్వొద్దు (భార్యాబిడ్డలు)
34. మనసులు మురిసే సమయమిది (ప్రేమలు పెళ్లిళ్లు)
35. వయసే ఒక పూలతోట (విచిత్ర బంధం)
36. చెంగావి రంగు చీర కట్టుకున్న చిన్నది (బంగారు బాబు)
37. చెక్కిలి మీద కెంపులు మెరిసే చిలకమ్మా (బంగారు కలలు)
38. జాబిల్లి చూసేను నిన్ను నన్ను (మహాకవి క్షేత్రయ్య)
39. ఎదురుగా నీవుంటే ఎన్నెన్ని భావాలో (మహాత్ముడు)
40. మొరటోడు నా మొగుడు మోజు పడి తెచ్చాడు (సెక్రటరీ)

1980ల తర్వాత పూర్తిగా అక్కినేని కొత్తతరం హీరోయిన్లతో ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం గళంలో హుషారు పాటలతో కొనసాగారు. జయసుధ, జయప్రద, శ్రీదేవి, సుజాత వీరంతా ఎక్కువగా ఆయన పక్కన నటించారు. అక్కినేని హీరోగా రిటైర్ అయ్యే వరకు ఎన్నో హిట్లు ఉన్నా ఒక పది పాటలు చెప్పుకుందాం. ఈ లిస్ట్‌లోని చివరిపాటను మోహన్‌లాల్‌తో డ్యూయెట్‌గా అభినయించారు అక్కినేని. ఆ సినిమా సంగీత దర్శకుడు ఎవరు?



41. నేల మీది జాబిలి నింగిలోన సిరిమల్లి (రాజా రమేష్)
42. నా కళ్లు చెబుతున్నాయి నిను ప్రేమించానని (ప్రేమాభిషేకం)
43. ఒక లైలా కోసం తిరిగాను దేశం (రాముడు కాదు కృష్ణుడు)
44. మల్లెపూలు గొల్లుమన్నవి (అనుబంధం)
45. మధురం జీవన సంగీతం (వసంత గీతం)
46. చందమామ దిగి వచ్చే లోన (జస్టిస్ చక్రవర్తి)
47. ఇది మేఘ సందేశమో (ఏడంతస్తుల మేడ)
48. ఈ కోవెల నీకై వెలిసింది ఈ వాకిలి నీకై తెరిచింది (అండమాన్ అమ్మాయి)
49. తామరపువ్వంటి తమ్ముడు కావాలా (బంగారు కానుక)
50. గోరువంక వాలగానే గోకులానికి (గాండీవం)

– కూర్పు : కె

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 180

శుక్రవారం 20-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



రవిచంద్రన్ అశ్విన్ సెంచరీ

బంగ్లాదేశ్‌తో మొదటి టెస్టులో తొలి రోజు భారత్ స్కోరు 339/6

- 15లో



మార్కెట్ సరికొత్త రికార్డులు

సరికొత్త శిఖరంపై సెన్సెక్స్.. 83,184 వద్ద ముగింపు

- 15లో



జమ్మూకశ్మీర్‌లో యువ వికాసం

తమ పరిపాలనలో జమ్మూకశ్మీర్‌లోని యువతరం ప్రగతి పథంలో ముందడుగు వేస్తోందని ప్రధాని హర్షం వ్యక్తం చేశారు.

- వివరాలు 6లో▶



పేజర్ వీళ్లదే

హెజ్‌బొల్లా, లెబనాన్ సైన్యం కొన్న పేజర్లను తయారు చేసినది ఇజ్రాయెల్‌కు చెందిన డొల్ల సంస్థేనని తాజాగా వెల్లడైంది.

- వివరాలు 6లో▶



యుద్ధం అంచున..

లెబనాన్‌లో హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ దళాల దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి.

- వివరాలు 6లో▶



నా హత్యకు భారత్ కుట్ర

తన హత్యకు భారత్ కుట్ర పన్నిందంటూ ఖలిస్తాన్ వేర్పాటువాది గురు పత్వంత్ సింగ్ పన్నూ అమెరికాలో కోర్టుకెక్కాడు.


- వివరాలు 6లో▶

వెండితెరపై డర్టీ పిక్చర్!

తెలుగు చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపుల కలకలం

కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై ఆరోపణలు, అరెస్టుతో దుమారం

- తమకూ 'హేమ కమిటీ' కావాలంటూ వెల్లువెత్తుతున్న డిమాండ్లు... వెలుగులోకి రాని ది వాయిస్ ఆఫ్ ఉమెన్ కమిటీ నివేదిక
- ప్రభుత్వం స్పందించాలంటూ వినతులు
- జానీ మాస్టర్ బాధితురాలికి మద్దతుగా నిలిచిన గాయని చిన్మయి
- సినీ పెద్దలు ఇప్పటికైనా త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ప్రశ్నించాలన్న నటి పూనం కౌర్
- జానీ మాస్టర్ అరెస్టు నేపథ్యంలో 'ఎక్స్'లో నటుడు, జనసేన నేత నాగబాబు పోస్టులు



సాక్షి, హైదరాబాద్: వెండితెర వెనుక కొనసాగే వేధింపులు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. లైంగిక దాడులకు గురవుతూ మానసికంగా కుంగిపోతున్న బాధితులు ఇక భరించలేమంటూ మౌనం వీడుతున్నారు. తాము ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న వేధింపులపై గళం విప్పుతున్నారు. భవిష్యత్తు గురించిన భయాలు పక్కనపెట్టి ధైర్యంగా ఫిర్యాదులు చేస్తున్నారు. తాజాగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణలు రావడం, పోలీసులు అతన్ని అరెస్టు కూడా చేయడంతో వేడి రాజుకుంటోంది. గతంలో నటి పూనం కౌర్ పరిశ్రమలో పేరున్న దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌పై ఆరోపణలు చేయడం సంచలనం సృష్టించింది. జానీ మాస్టర్ ఉదంతం నేపథ్యంలో.. తాను చేసిన ఫిర్యాదుపై ఇప్పటికైనా సినీ పెద్దలు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ప్రశ్నించాలంటూ పూనం కౌర్ తాజాగా 'ఎక్స్'వేదికగా కోరడం మరోసారి చర్చనీయాంశమవుతోంది. తెలుగు చిత్ర పరిశ్రమలో ఇంకా ఎంతోమంది జూనియర్ ఆర్టిస్టులతోపాటు పలువురు ప్రముఖ నటీమణులు సైతం లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నా.. భవిష్యత్తు గురించిన ఆందోళనతో వారెవరూ బయటకు చెప్పడం లేదనే చర్చ ఉంది. అయితే దేశంలోని ఇతర సినీ పరిశ్రమల్లో సినీపెద్దలు చొరవ తీసుకోవడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కమిటీల ఏర్పాటుతో ఆరోపణలపై విచారణ జరిపిస్తున్నాయి. మరోవైపు చిత్ర పరిశ్రమల్లో లైంగిక వేధింపులపై 'మీ టూ' ఉద్యమం కొత్త ఒరవడికి నాంది పలికింది. ఎన్నో చిత్ర పరిశ్రమల్లో కదలిక తెచ్చింది. సోషల్ మీడియా వేదికగా వేధింపులను బహిర్గతపరచడం ప్రారంభమయ్యింది.

ఆదర్శంగా జస్టిస్ హేమ కమిటీ

మలయాళ చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులపై నియమించిన జస్టిస్ హేమ కమిటీ ఇప్పుడు

మిగతా 2వ పేజీలో ▶

జానీ మాస్టర్ అరెస్టు

- గోవాలో అదుపులోకి తీసుకున్న పోలీసులు.. పాస్‌పోర్టు స్వాధీనం
- ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు...
- కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు
- సోమవారం కస్టడీ పిటిషన్ దాఖలుకు సన్నాహాలు

2 లో



గురువారం సచివాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, పారిశ్రామికవేత్త, యూనివర్సిటీ బోర్డు చైర్మన్ ఆనంద్ మహీంద్రా

స్కిల్స్ వర్సిటీలో భాగస్వాములు కండి

యువతకు నైపుణ్యాలు నేర్పించి ఉపాధి కల్పనకు తోడ్పడండి

- కంపెనీలు, పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్ పిలుపు
- ఇకపై వర్సిటీ బాధ్యత ఆనంద్ మహీంద్రా చూస్తారని వెల్లడి
- సచివాలయంలో పారిశ్రామికవేత్తలు, వర్సిటీ బోర్డు సభ్యులతో భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీలతో పాటు పారిశ్రామికవేత్తలు తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో భాగస్వామ్యం కావాలని, యువతకు నైపుణ్యాలు నేర్పించి ఉపాధి కల్పించేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఈ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. సీఎం గురువారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, యూనివర్సిటీ బోర్డు చైర్మన్ ఆనంద్ మహీంద్రా, బోర్డు సభ్యులు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున యూనివర్సిటీకి 150 ఎకరాల స్థలంతో పాటు రూ.100 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు యూనివర్సిటీ పూర్తి స్థాయి నిర్వహణకు, కార్పస్ ఫండ్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఇకపై యూనివర్సిటీ బాధ్యతను బోర్డు చైర్మన్ ఆనంద్ మహీంద్రాకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఆయన స్కిల్స్ యూనివర్సిటీకి బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకం

మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ప్రజాభవన్ చుట్టూ కంచెలెందుకు?: కేటీఆర్



రుణమాఫీ కోరుతూ ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చిన రైతులను రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేయడాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. రుణమాఫీ కోరుతూ చలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చిన రైతులను నిర్బంధించడాన్ని తప్పుబట్టారు.

- వివరాలు 13లో▶

వచ్చేస్తోంది.. పెద్ద డ్రోన్



అత్యవసరాల్లో ట్రాఫిక్ కష్టాలుండవు.. అనుకున్న సమయానికి మీ కార్గో చేరిపోతుంది. ఎమర్జెన్సీలో తీసుకెళ్లాల్సిన వైద్య సంబంధిత వస్తువులు, ఆర్గాన్స్ కూడా గ్రీన్ చానల్ ఏర్పాట్లు లేకుండా గమ్యానికి చేరిపోతాయి.

- వివరాలు 13లో▶

నేటి నుంచి మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నేటి నుంచి రెండో విడత సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ చేపట్టనుంది.

- వివరాలు 5లో▶

2 నుంచి దసరా సెలవులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని స్కూళ్లకు అక్టోబర్ 2 నుంచి 14 వరకూ దసరా సెలవులను విద్యాశాఖ ప్రకటించింది. పాఠశాలలు తిరిగి 15వ తేదీన తెరుచుకుంటాయని పేర్కొంది. సెలవుల తర్వాత సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన హోంవర్క్ ఇవ్వాలని అధికారులు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	105 kg	Dressed with Skin	184 kg
₹ 72	Retail Live Bird	127 kg	Skin Less	210 kg

Issued in the interest of consumers

ఇదండీ సంగతి



అంతా క్లీన్ చేశా! ఇది కూడా తీసుకెళ్లండి సార్!

బడి.. ఇక త్రీడీ!

రాష్ట్రంలోని సర్కారీ స్కూళ్లలో డిజిటల్ విద్యకు ఏర్పాట్లు



- వర్చువల్ రియాలిటీ, త్రీడీ విధానాల్లో పాఠాల బోధన
- ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడుల్లో హైటెక్ హంగులు
- గతంలోనే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచనలు... రాష్ట్రంలో అమలు చేయడంపై ప్రభుత్వం ఫోకస్
- అవసరమైన మౌలిక సదుపాయాలు, ఏర్పాట్లపై పరిశీలన
- నిపుణులతో పలు దఫాలుగా చర్చలు జరపనున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: క్లాస్ రూంలో తాజ్‌మహల్ పాఠం చెప్పడం కాదు.. తాజ్‌మహల్ పక్కనే ఉండి వివరిస్తున్నట్టుగా ఉంటే.. విత్తనం మొలకెత్తే దగ్గర్నుంచి.. చెట్టుగా మారి.. పూలు, కాయడం మొత్తాన్ని ప్రత్యక్షంగా చూసిన అనుభూతి వస్తే.. విద్యార్థులకు ఈ థ్రిల్లే వేరు. సబ్జెక్ట్‌పై మంచి అవగాహన రావడమేకాదు, చదువుకోవడం, నేర్చుకోవడంపై మరింత ఆసక్తి కలగడమూ ఖాయమే. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలోనే ఈ తరహా డిజిటల్ బోధన అందుబాటులోకి రానుంది. విద్యార్థులకు వర్చువల్ రియాలిటీ (వీఆర్), త్రీడీ విధానాల్లో పాఠాలు బోధించే ఏర్పాట్లపై రాష్ట్ర సర్కారు దృష్టిసారించింది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై పరిశీలన జరుపుతోంది. నూతన విద్యా విధానంలో భాగంగా దీనిని అమల్లోకి తీసుకురానుంది. ఇటీవల రాష్ట్రంలో డిజిటల్ విద్యా బోధనపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సందర్భంగా.. అధికారుల నుంచి ప్రభుత్వం నివేదిక కోరింది. విద్యాశాఖ అధికారులు డిజిటల్ బోధనకు గల అవకాశాలు, అవసరమైన ఏర్పాట్ల వివరాలను సేకరిస్తున్నారు. నిపుణులతో చర్చించి నివేదిక రూపొందించేందుకు సిద్ధమవుతున్నారు.

రెండేళ్ల కిందటి నుంచే ప్రయత్నాలు

వర్చువల్ రియాలిటీ, త్రీడీ వంటి డిజిటల్ బోధన వల్ల విద్యలో నాణ్యత పెరుగుతుందని కేంద్ర

మిగతా 13వ పేజీలో ▶

కొత్త రేషన్‌కార్డులకు అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రేషన్ కార్డుల జారీకి పటిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కొత్త కార్డుల కోసం అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధివిధానాలపై గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ పలుసూచనలు చేశారు. అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు ఇవ్వడంపై చర్చించారు. దీనిపై త్వరలోనే మరోసారి సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



'హైడ్రా'పై తేలేది నేడే!

- చట్టబద్ధతపై నిర్ణయం తీసుకోనున్న రాష్ట్ర కేబినెట్
- వెంటనే ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశం
- వర్షాలు, వరద నష్టాలు, పరిహారం చెల్లింపుపై చర్చించనున్న మంత్రివర్గం
- కొత్త రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డుల జారీపై పరిశీలన

13 లో



వరంగల్ జిల్లా నర్సంపేటలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, చిత్రంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, తదితరులు

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

20 నుంచి 45 నిమిషాల్లో వైద్య చికిత్స అందేలా కార్యాచరణ

- గోల్డెన్ అవర్‌లో చికిత్స అందేలా ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు
- నర్సంపేటలో జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర

12 లో



క్లుప్తంగా...

బీసీ కులగణనకు కట్టుబడి ఉన్నాం: ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: బీసీ కులగణనపై కేటీఆర్ తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ఈ హామీ అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సీఎల్పీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వానికి డెడ్‌లైన్ పెట్టేంత సీన్ కేటీఆర్‌కు లేదని పేర్కొన్నారు. కులగణన చేయాల్సిన అవసరాన్ని తమ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారని, జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని చెప్పారని గుర్తు చేశారు. దీనిపై ప్రభుత్వం అసెంబ్లీలో కూడా తీర్మానం చేసిందని తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అంశానికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీఆర్ఎస్‌కు కులగణనపై చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఆ పార్టీ అధ్యక్షుడిగా, ప్రతిపక్షనేతగా కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ఉన్నారని, మూడు పదవులు వాళ్లకేనా? అని ప్రశ్నించారు.

'అక్టోబర్ 26న మున్నూరు కాపు రాష్ట్ర సమావేశం'

సాక్షి, హైదరాబాద్: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల సమావేశం అక్టోబర్ 26న గజ్వేల్ సమీపంలోని ములుగులో నిర్వహించనున్నారు. మున్నూరుకాపు సంఘం అపెక్స్ కౌన్సిల్ జిల్లా బాధ్యులు, జిల్లా అధ్యక్షులు గురువారం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ములుగు మల్లక్కపేటలోని వీపీజే ఫంక్షన్ హాలులో జరిగే ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తారని సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు, సంఘం గౌరవాధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో గురువారం అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి మాజీ మంత్రి జోగు రామన్న, కౌన్సిల్ సభ్యులు వీరమల్ల ప్రకాశ్, సి.విఠల్, మీసాల చంద్రయ్య, ఎర్రా నాగేంద్రబాబు తదితరులు హాజరయ్యారు.

లేలేలే.. లేలేలే.. నా రాజా

ఇది పాట కాదు.. ప్రామిస్

నిద్ర నుంచి ఎవరినైనా లేపొచ్చు.. ఈ పాటనే కాదు గానీ..
వేరే పాట పాడి కూడా లేపొచ్చు.. లేదా అలారం పెట్టి మరీ లేపొచ్చు.
మరి.. శాశ్వత నిద్ర నుంచి.. అదేనండి.. చచ్చిపోయాక ఎవరినైనా లేపొచ్చా??
మేం లేపుతాం అని అంటున్నాయి కొన్ని కంపెనీలు..
అంతేకాదు.. తాము చెబుతున్నది అబద్ధం కాదని..
కావాలంటే మీరు చచ్చినంత ఒట్టు అని కొంచెం గట్టిగానే చెబుతున్నాయి.
ఇప్పటికే వేల సంఖ్యలో జనం ఈ ఒట్లను నమ్మారు. చచ్చాక కచ్చితంగా లేపుతారు కదూ
అంటూ కంపెనీలతో తిరిగి ఒట్టేయించుకున్నారు కూడా..
వీళ్లంతా ఒట్లు తీసి గట్లు మీద పెట్టేలోపు.. మనం విషయంలోకి వెళ్లిపోదాం...




రేయ్.. ఎవుర్రా వీళ్లంతా

వీళ్లంతా ఎవరంటే.. అల్కార్, టుమారో బయో, సదరన్ క్రయోనిక్స్, క్రియోరస్, క్రయోనిక్స్ ఇన్‌స్టిట్యూట్ అని ఇలా కొన్ని కంపెనీలు ఉన్నాయి. వీళ్లేం చెబుతున్నారంటే.. చనిపోయాక మన శరీరాన్ని ప్రత్యేక పద్ధతిలో పరిరక్షించి.. 'ఫ్రిజ్'లాంటి దాంట్లో పెట్టేసి.. భవిష్యత్తులో అంటే ఏ 2100లోనో.. లేదా కల్కి 2898 ఏడీలోనో.. మరణాన్ని జయించే మందు లేదా ఏ జబ్బుతో చనిపోయారో దానికి చికిత్స వచ్చినప్పుడు మళ్లీ 'లేపుతారట'!! ఇందుకోసం జస్ట్.. రూ.1.5–1.8 కోట్లు ఇస్తే చాలట. ఎవరు నమ్ముతారు అని అనుకుంటున్నారా.. చెప్పాంగా.. చాలా మంది నమ్మారు. ఏకంగా 6 వేల మంది ఈ సర్వీసును బుక్ చేసుకున్నారు. అందులో 500 మంది దాకా.. ఆల్రెడీ 'ఫ్రిజ్'లో శాశ్వత నిద్రలో ఉన్నారు. భవిష్యత్తులో తమను నిద్ర లేపే అలారం కోసం వెయిట్ చేస్తున్నారు. ఇందులో సదరన్ క్రయోనిక్స్ ఇటీవలే 80 ఏళ్ల సిడ్నీవాసి మరణించాక.. అతడిని ప్రత్యేక పద్ధతిలో పరిరక్షించి.. భద్రపరిచింది. ఇలా భద్రపరిచిన వాటిల్లో పెంపుడు జంతువులు కూడా ఉన్నాయి.



ఏం జరిగింది.. ఏం జరుగుతోంది.. నాకు తెలియాలి..

అంతా క్రయోప్రిజర్వేషన్ మహిమ. అంటే.. అత్యంత శీతల వాతావరణంలో మానవ శరీరాన్ని భద్రపరచడం.



1. మనిషి చనిపోయాక.. ఈ కంపెనీల ఎమర్జెన్సీ బృందాలు రంగంలోకి దిగుతాయి. మెదడు 'చనిపోకుండా' ప్రత్యేక పరికరాల ద్వారా ఆక్సిజన్, రక్తాన్ని సరఫరా చేస్తారు.



2. శరీరాన్ని ఐసులో ఉంచుతారు. రక్తం గడ్డకట్టకుండా హెపారిన్ ఇంజెక్షన్ ఇస్తారు..
3. ప్లాంట్‌కు వెళ్లాక.. శరీరంలోని కణాలు ఫ్రీజ్ అయి దెబ్బతినకుండా ఉండటానికి వాటి నుంచి ద్రవాలను తీసేసి.. బదులుగా గ్లిజరాల్ బేస్డ్ రసాయనాన్ని ఎక్కిస్తారు (ఈ కంపెనీల్లో టుమారో బయో మాత్రం వాహనంలో ప్లాంటుకు తెస్తున్నప్పుడే ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని చెబుతోంది)
4. తర్వాత శరీరాన్ని డ్రై ఐసులో –130 డిగ్రీల ఉష్ణోగ్రతకు వెళ్లేదాకా ఉంచుతారు..
5. అనంతరం లిక్విడ్ నైట్రోజన్ (–196 డిగ్రీలు) ఉన్న మెటల్ కంటైయినర్‌లో తలకిందులుగా వేలాడదీస్తారు. ఎందుకంటే.. ఎప్పుడైనా ప్రమాదవశాత్తూ లిక్విడ్ నైట్రోజన్ లీక్ అయినా సరే.. మన మెదడు భాగం ద్రవాల్లోనే సురక్షితంగా ఉంటుంది.

నమ్మకమే జీవితం..

ఇంత చెబుతున్నారు సరే.. ఇంతకీ ఇది సాధ్యమేనా అంటే.. సినిమాల్లోనే అయితే సాధ్యమే. కానీ బయట అంటే.. ప్రస్తుతానికైతే చాన్సే లేదని నిపుణులు చెబుతున్నారు. వీళ్లను బతికించే టెక్నాలజీయే లేనప్పుడు ఇలా చేయడం మోసపుచ్చడమే అని విమర్శిస్తున్నారు. ఎప్పటికి వస్తుంది అంటే.. చెప్పడం కష్టమేనంటున్నారు. అయితే.. ఏదో సినిమాలో 'నమ్మకమే జీవితం'అన్నట్లు ఈ కంపెనీలు మాత్రం భవిష్యత్తుపై ఆశలు చూపుతున్నాయి. ఇటు జనమూ అలాగే డబ్బులు కట్టేస్తున్నారు. వీళ్లలో ఎక్కువ మంది సంపన్నులే. వీరు తమ సంపదను అనుభవించడానికి.. అలాగే అమరత్వం సాధించడానికి అన్నట్లుగా చేస్తుంటే.. మరికొందరు భవిష్యత్తులో వచ్చే కొత్త టెక్నాలజీలు, అద్భుతాలను వీక్షించేందుకు ఇదో అవకాశమని భావిస్తున్నారు. ఇప్పుడు నయంకాని జబ్బులను నయం చేసే మందులు భవిష్యత్తులో వస్తాయని వాళ్లు నమ్ముతున్నారు. అందుకే ఇలా చేస్తున్నామని అంటున్నారు. **ఇంతకీ మనమేం చేద్దాం..**

మనమూ.. రెండు చేతులూ జేబులో పెట్టుకుని.. అలా నడుచుకుంటూ వెళ్లిపోదాం..

– సాక్షి, సెంట్రల్ డెస్క్

జమిలి ఎన్నికల నిర్వహణకు కమిటీ

త్వరలో కేంద్రం ఏర్పాటు చేస్తుందన్న కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. జమిలి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడం స్వాగతించదగిన పరిణామమన్నారు. జమిలి ఎన్నికల విషయంలో కేబినెట్ నిర్ణయంపై దేశవ్యాప్తంగా చర్చకు ప్రోత్సహించడం, జమిలి ఎన్నికల నిర్వహణ అమలు కోసం కేంద్రం ఓ కమిటీని కూడా ఏర్పాటు చేస్తుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్న పార్టీలు కూడా త్వరలోనే దీనికి సహకరిస్తాయనే విశ్వాసం తనకుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఐదేళ్లపాటు ఏదో ఒకచోట ఎన్నికలు జరుగుతున్నందున.. కోడ్ అమల్లో ఉండటం తద్వారా విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేక ప్రభుత్వ నిర్ణయాలకు ఆటంకంగా మారాయన్నారు. కొన్నిసార్లు ప్రభుత్వాలు సాధారణ నిర్ణయాలు కూడా తీసుకోలేని పరిస్థితి ఉందని గుర్తు చేశారు. ఎన్నికల ర్యాలీలు, బహిరంగ సభల కారణంగా.. ధ్వని కాలుష్యం, ట్రాఫిక్ జామ్‌ల కారణంగా ప్రజలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించడం కారణంగా అవుతున్న ఖర్చు రూ.4,500 కోట్ల పైమాటేనన్నారు. జమిలి ఎన్నికల ద్వారా జాతీయ అంశాలతోపాటుగా, ప్రాంతీయ సమస్యలపైనా సమానస్థాయిలో చర్చ జరుగుతుందని తెలిపారు. వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించడంతో ఓటర్లలో ఎన్నికల ప్రక్రియ పట్ల నిరాసక్తత పెరిగి.. ఓటరుశాతం తగ్గటం స్పష్టంగా కనబడుతోందన్నారు. దీనికి జమిలి ఎన్నికలు ఓ పరిష్కారాన్ని చూపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికల కారణంగా, దేశంలో ద్రవ్యోల్బణంలో 1.1% తగ్గుతుందని రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ పేర్కొందన్నారు.

భద్రాద్రిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు

తెలంగాణలో కోకోనట్ బోర్డు ఏర్పాటు చేయండి

కేంద్ర మంత్రులు రామ్మోహన్, చౌహాన్‌లకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి



గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. చిత్రంలో గౌరవ్ ఉప్పల్ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, రాష్ట్రంలో కోకోనట్ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శివరాజ్‌సింగ్ చౌహాన్‌లకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీ పర్యటనలో భాగంగా తుమ్మల కేంద్ర మంత్రులతో విడివిడిగా సమావేశమై రాష్ట్రానికి చెందిన పలు అంశాలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లో ఎయిర్‌పోర్టుల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని రామ్మోహన్ నాయుడును కోరినట్లు తెలిపారు. తెలంగాణలో నూతన కోకోనట్ బోర్డ్ ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరానన్నారు. ఆయిల్‌పామ్ మీద 28% దిగుమతి సుంకం విధించి, దేశీయంగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నందుకు తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. ఆయిల్‌పామ్‌కు కేంద్రం కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు. అలాగే ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేటలో సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయాలని కూడా విన్నవించారు. ఇటీవలి వరదల్లో నష్టపోయిన ఖమ్మం జిల్లాకు తగిన మొత్తంలో సహాయం అందజేయాలని కోరారు. నష్టంపై నివేదిక రాగానే సహాయం అందిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కలిసి, తెలంగాణలో ఎక్కువగా పండే పంటలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరానన్నారు. అలాగే.. ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ ఆహార సదస్సులో పాల్గొని.. తెలంగాణలోని అవకాశాలను వివరించి, ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించడానికి రాష్ట్రానికి రావాలని ఆహ్వానించానన్నారు.

సాగు చేసేవారికే రైతుబంధు

వ్యవసాయం చేసే వారికే రైతుబంధు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కౌలు రైతు, భూమి యజమాని చర్చించుకొని రైతుబంధు ఎవరు తీసుకోవాలన్నది వారే నిర్ణయించుకోవాలన్నారు. ఏపీలో ఉన్నట్లుగా తెలంగాణలో కౌలు రైతు ఒప్పందాలు లేవని గుర్తుచేశారు. ఐదేళ్లలో కేసీఆర్ రూ.లక్ష రుణమాఫీ చేయలేదని, ఒకేసారి రూ.18,000 కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. అవసరమైతే ఇంకా నిధులు సమకూరుస్తామని తెలిపారు. ప్రతి పంట, ప్రతి రైతుకు వర్తించేలా రూ.3,000 కోట్లతో బీమా చేయనున్నట్లు తుమ్మల తెలిపారు.

జానీ మాస్టర్ అరెస్టు

గోవాలో అదుపులోకి తీసుకున్న స్పెషల్ ఆపరేషన్ టీమ్

- పాస్‌పోర్టు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలింపు
- కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు
- సోమవారం కస్టడీ పిటిషన్ దాఖలుకు సన్నాహాలు



సాక్షి, హైదరాబాద్: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ఎట్టకేలకు సైబరాబాద్ పోలీసులకు చిక్కాడు. గత నాలుగైదు రోజులుగా పరారీలో ఉన్న జానీ మాస్టర్‌ను గోవాలోని ఓ లాడ్జిలో నార్సింగి స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచి అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించారు. ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచిన అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తామని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. తనపై జానీ మాస్టర్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు అతని దగ్గర సహాయక కొరియోగ్రాఫర్‌గా పని చేసిన మైనర్ ఈనెల 15న నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసులు జానీ మాస్టర్‌పై ఐపీసీ 376 (2) (ఎన్), 506, 323 సెక్షన్లతో పాటు పోక్సో కింద కేసు నమోదు చేశారు.

భార్య ఇచ్చిన సమాచారంతోనే..

జానీ మాస్టర్‌తో పాటు ఆయన భార్య కూడా పలుమార్లు తనపై శారీరకంగా దాడికి పాల్పడిందంటూ మైనర్ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో జానీ మాస్టర్ భార్యను నార్సింగి పోలీసులు స్టేషన్‌లో విచారించారు. ఈనెల 15 నుంచే పరారీ లో ఉన్న జానీ మాస్టర్ తన ఫోన్‌ను స్విఛాఫ్ చేసుకున్నా డు. పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. జానీ భార్యను విచారిస్తున్న క్రమంలో ఆయన ఎక్కడున్నాడనే సమాచారాన్ని పోలీసులు రాబట్టారు. ఆ సమాచారం ఆధారంగా గోవాకు వెళ్లిన ప్రత్యేక బృందం జానీని అరెస్టు చేసింది. అతని వద్ద నుంచి పాస్ పోర్ట్, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలితో జానీ మాస్టర్ జరిపిన కాల్స్, వాట్సాప్ చాటింగ్, ఇతరత్రా ఆధారాలను సేకరించేందుకు సెల్‌ఫోన్‌లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. తదుపరి విచారణ నిమిత్తం జానీ మాస్టర్‌ను కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించిన పోలీసులు.. ఈమేరకు సోమవారం కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మైనర్‌పై లైంగిక వేధింపులు!

ఓ డ్యాన్స్ షోలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన బాధితురాలికి జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషాతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో జానీ 2019లో తన నృత్య బృందంలో సహాయ కొరియోగ్రాఫర్‌గా ఆమెను నియమించుకున్నాడు. ఓ డ్యాన్స్ ప్రాజెక్టు నిమిత్తం జానీ మాస్టర్‌తో పాటు ముంబై వెళ్లిన బాధితురాలిపై అక్కడి ఓ హోటల్‌లో జానీ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అప్పటికి బాధితురాలు వయసు 17 ఏళ్లే కావడం గమనార్హం. కాగా జానీ ఆ తర్వాత కూడా తనపై పలుమార్లు వేధింపులకు పాల్పడినట్లు పోలీసులకు చేసిన ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది.

విన్న ప్రతిదాన్నీ నమ్మొద్దు

జానీ మాస్టర్ అరెస్టు నేపథ్యంలో నాగబాబు

- నాగబాబు పరోక్షంగా జానీ మాస్టర్‌కు మద్దతు పలికారంటున్న నెటిజన్లు



సాక్షి, హైదరాబాద్: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అరెస్టు తర్వాత నటుడు, జనసేన పార్టీ నేత నాగబాబు 'ఎక్స్'లో చేసిన రెండు పోస్టులు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. 'న్యాయస్థానంలో నేరం రుజువయ్యే వరకు ఏ వ్యక్తినీ నేరానికి పాల్పడినట్లుగా పరిగణించలేరు'అన్న బ్రిటిష్ లాయర్ సర్ విలియం గారో కొటేషన్‌ను ఆయన రాసుకొచ్చారు. అలాగే 'మీరు విన్న ప్రతిదాన్నీ నమ్మొద్దు. ప్రతి కథకు మూడు పార్శ్వాలు ఉంటాయి. మీ వైపు, నా వైపు మరియు నిజం'అని అమెరికా జర్నలిస్ట్ రాబర్ట్ ఎవాన్స్ రాసిన కొటేషన్‌ను కూడా పోస్టు చేశారు. జానీ మాస్టర్ గురించి ప్రత్యక్షంగా ఆయన ఎక్కడా ప్రస్తావించకపోయినా పరోక్షంగా మద్దతు పలికారనే అభిప్రాయాన్ని నెటిజన్లు వ్యక్తం చేస్తున్నారు. జనసేన పార్టీలో జానీ మాస్టర్ కీలకంగా వ్యవహరించడం వల్లే నాగబాబు ఇలా స్పందించారని అంటున్నారు.

జానీ మాస్టర్.. తప్పు చేస్తే అంగీకరించండి: మంచు మనోజ్

జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు, అరెస్టు నేపథ్యంలో నటుడు మంచు మనోజ్ స్పందించారు. 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు. 'జానీ మాస్టర్.. కెరీర్ పరంగా ఈ స్థాయికి వచ్చేందుకు మీరు ఎంతగా కష్టపడ్డారో అందరికీ తెలుసు. అలాంటిది ఈరోజు మీపై ఇలాంటి తీవ్ర ఆరోపణలు రావడం చూస్తుంటే నా హృదయం ముక్కలవుతోంది. ఇప్పుడు కాకపోయినా నిజం ఎప్పటికైనా బయటపడుతుంది. ఎవరిది తప్పు, ఎవరిది కరెక్ట్ అన్నది చట్టం నిర్ణయిస్తుంది. ఒక మహిళ తన స్వరాన్ని వినిపించినప్పుడు పారిపోవడం అనేది సమాజానికి, రానున్న తరాలకు ఒక ప్రమాదకరమైన సందేశాన్ని ఇస్తుంది. ఈ కేసు విషయంలో త్వరితగతిన స్పందించి చర్యలు తీసుకున్న హైదరాబాద్ సిటీ పోలీసులకు నా అభినందనలు. ఈ సమాజంలో చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఇది తెలియజేస్తుంది. జానీ మాస్టర్.. మీరు ఏ తప్పూ చేయకపోతే పోరాటం చేయండి. తప్పు చేసి ఉంటే దానిని అంగీకరించండి..'అని మనోజ్ పేర్కొన్నారు. 'ఇచ్చిన మాట ప్రకారం ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌ని వెంటనే ఏర్పాటు చేయాలని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా)ను కోరుతున్నా. దానికంటూ ప్రత్యేకంగా సోషల్ మీడియా ఖాతాలు ఏర్పాటు చేయండి. పరిశ్రమలోని మహిళలకు గొంతుగా నిలపండి. మీరు ఒంటరిగా లేరని, మీ ఆవేదన, బాధలను వింటామనే విషయాన్ని ప్రతి మహిళకు తెలియజేయండి. కుమార్తె, సోదరి, తల్లి.. ఇలా ప్రతి మహిళ కోసం ఈ పోరాటం. వారికి అన్యాయం జరగకుండా చూద్దాం..'అంటూ మనోజ్ పోస్టు చేశారు.

వెండితెరపై డర్టీ పిక్చర్!

▶ మొదటి పేజీ తరువాయి

ఇతర రాష్ట్రాల సినీ పరిశ్రమలకు ఆదర్శంగా నిలుస్తోంది. జస్టిస్ హేమ కమిటీ ఏర్పాటు తర్వాత 20కి పైగా లైంగిక వేధింపుల కేసులు అక్కడ నమోదయ్యాయి. తమిళ చిత్ర పరిశ్రమలో ప్రముఖ రైటర్ వైరి ముత్తుపై గాయని చిన్మయి చేసిన పోరాటం పెను సంచలనమే సృష్టించింది. కర్ణాటక ప్రభుత్వం సైతం అక్కడి సినీ పరిశ్రమల్లో వేధింపుల అంతానికి ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది. ఇక తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కూడా గతంలో 'ది వాయిస్ ఆఫ్ ఉమెన్ కమిటీ'వేసినా తూతూ మంత్రంగానే మిగిలింది తప్ప బాధితులకు ఏ విధంగానూ బాసటగా నిలవలేకపోయిందనే విమర్శలున్నాయి.

ఇక్కడ 2019లోనే కమిటీ ఏర్పాటైనా..

మీటూ ఉద్యమం మొదలవడంతో తెలుగు సినీ పరిశ్రమలో వేధింపులపై అధ్యయనం చేసేందుకు 2018 అక్టోబర్‌లో తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం 2019 ఏప్రిల్‌లో 25 మందితో కమిటీ వేసింది. ఇందులో 12 మంది మహిళలతో ఏర్పాటు చేసిన ఉప కమిటీ 20కి పైగా సమావేశాలు నిర్వహించింది. తెలుగు సినీ పరిశ్రమ, టెలివిజన్ పరిశ్రమల్లోనూ మహిళలపై లైంగిక వేధింపులు, లింగ వివక్ష, వారిలో నెలకొన్న అభద్రతా భావం..ఇలా అనేక కోణాల్లో ఈ కమిటీ అధ్యయనం చేసింది. నటీమణులు, జూనియర్ ఆర్టిస్టులు, సినీ, టెలివిజన్ రంగాల్లోని వివిధ విభాగాల్లో పనిచేసే మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ కమిటీ రికార్డు చేసింది. పని ప్రదేశంలో వారు ఎదుర్కొంటున్న లైంగిక ఇబ్బందులు, బాత్‌రూంలు, డ్రెస్ చేంజ్ రూంలు వంటి కనీస వసతులు లేక జూనియర్ ఆర్టిస్టులు పడుతున్న వ్యథలు, పొట్టకూటి కోసం మౌనంగా వారు భరిస్తున్న బాధలు ఇలా..అనేక కీలక విషయాలను కమిటీ తన నివేదికలో ప్రస్తావించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కాగా 2022 జూన్‌లోనే కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినా..ఇప్పటి వరకు అందులో ఏముందో బహిర్గతం కాకపోవడం గమనార్హం. పోనీ అందులోని సిఫారసుల అమలు దిశగా ఏమైనా చర్యలు చేపట్టారా? అంటే అదీ లేదు. ఈ నేపథ్యంలోనే ఆ కమిటీ నివేదికను బయట పెట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. నటి సమంత ఇటీవల ఈ మేరకు తన గళం విప్పారు. నటి అమల కూడా ఇదే డిమాండ్ చేశారు. తాజాగా జానీ మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గాయకురాలు, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి సోషల్ మీడియాలో బాధితురాలికి అండగా నిలవడం గమనార్హం. కాగా గురువారం జానీ మాస్టర్ అరెస్టు నేపథ్యంలో నటుడు, జనసేన పార్టీ నేత నాగబాబు 'విన్న ప్రతిదాన్నీ నమ్మొద్దు'అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేయడం చర్చకు తెరలేపింది. నటుడు మంచు మనోజ్ కూడా ఓ సుదీర్ఘమైన పోస్టు పెట్టారు.

భయం వీడితేనే అభయం

కలల ప్రపంచంగా చెప్పుకునే సినీ పరిశ్రమలో అవకాశాలు రావడమే గొప్పగా పలువురు భావిస్తుంటారు. పరిశ్రమలో నిలదొక్కుకోవాలంటే ఎన్ని 'ఇబ్బందులైనా'పడక తప్పదనే ధోరణి ఇప్పటికీ చాలామంది బాధితుల్లో కనిపిస్తోంది. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులపై పదునైన చట్టాలున్నా..ఫిర్యాదు చేయనిదే తాము ఏమీ చేయలేమని పోలీసు ఉన్నతాధికారులు అంటున్నారు. అందుకే బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, డయల్ 100, షీ టీమ్స్, మహిళా భద్రత విభాగం, స్థానిక పోలీస్ స్టేషన్..ఇలా ఎక్కడ ఫిర్యాదు చేసినా తాము బాధితులకు తగిన న్యాయం చేస్తామని ఇటీవల 'సాక్షి' నిర్వహించిన 'మీతో సాక్షి'ప్రత్యేక కార్యక్రమంలో మహిళా భద్రతా విభాగం డీజీ శిఖా గోయల్ స్పష్టం చేశారు.

చోద్యం చూస్తున్న సినీపెద్దలు!

అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు సృష్టించే స్థాయికి తెలుగు చిత్ర పరిశ్రమ ఎదిగింది. అయితే తెరవెనుక లైంగిక వేధింపుల మకిలి ప్రజాక్షేత్రంలో చర్చనీయాంశమవుతూ అప్రతిష్ట పాలు చేస్తోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. సినీ పరిశ్రమలోని పెద్దలు లైంగిక వేధింపులపై దృష్టి సారించడం లేదని, నియంత్రణ దిశగా ఎలాంటి చొరవా ప్రదర్శించడం లేదనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. తమకు ఏ ఒక్క బాధితురాలూ ఫిర్యాదు చేయలేదని చెబుతున్నా.. పరిశ్రమలోని కొందరు కీచకుల వేధింపులతో మౌనంగా రోదిస్తున్న బాధితులెందరో ఉన్నారని పలు సందర్భాల్లో సినీ పెద్దలు సైతం పరోక్షంగా అంగీకరిస్తూనే ఉండటం గమనార్హం. ఇప్పటికైనా, ఇంటి పరువు పూర్తిగా పోకముందే సినీ పెద్దలు, స్పందించాలని, ప్రభుత్వం సైతం ఈ దిశగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ పలువర్గాల నుంచి వస్తోంది. జానీ మాస్టర్‌పై వివాదం తేలే వరకు అతన్ని డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి తప్పిస్తూ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వేటు వేయడం బాధితుల్లో కొంత స్థైర్యాన్ని నింపిందని, తాజా పరిణామాలతో మరికొందరు బాధితులు సైతం బయటకు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా తెలుగు చిత్ర పరిశ్రమలోని వేధింపుల అంతానికి రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పూర్తిస్థాయి విచారణ కమిటీలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంటోంది.

'మా'కు ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు



మంచు విష్ణు అధ్యక్షుడిగా 2021లో 'మా'కమిటీ ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటివరకు లైంగిక వేధింపులకు సంబంధించి ఏ వ్యక్తి నుంచీ ఎలాంటి ఫిర్యాదూ మాకు అందలేదు. ఒకవేళ ఫిర్యాదు వస్తే మేం వాటిని తీవ్రంగా పరిగణిస్తాం. సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– శివబాలాజీ, కోశాధికారి, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా)

మాకూ 'హేమ కమిటీ' కావాలి



తెలుగు చిత్ర పరిశ్రమలోని మహిళలమైన మేము జస్టిస్ హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తున్నాం. దీనికి బాటలు వేసిన కేరళ డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్) నిరంతర ప్రయత్నాలను అభినందిస్తున్నాం. తెలుగు చిత్ర పరిశ్రమలోని మహిళలకు మద్దతుగా నిలిచేందుకు 2019లో నెలకొల్పిన ది వాయిస్ ఆఫ్ ఉమెన్ కమిటీ కూడా డబ్ల్యూసీసీని స్ఫూర్తిగా తీసుకోవాలి. కమిటీ నివేదికను బయటపెట్టాలి. జస్టిస్ హేమ కమిటీ లాంటి కమిటీ వేయాలి.

– ఇటీవల సోషల్ మీడియాలో నటి సమంత


మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేయాలి



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు 'మా'అధ్యక్షుడిగా నాదొక విజ్ఞప్తి. తెలుగు చిత్ర పరిశ్రమలోని మహిళల భద్రత, రక్షణ మరింత మెరుగుపడేలా, వారి తరఫున ప్రాతినిధ్యం ఉండేలా ఓ కమిషన్‌ను ఏర్పాటు చేయండి. కెమెరా ముందు, వెనుక ప్రతి ఒక్కరికీ భద్రతతో కూడిన పరిస్థితులు ఉండాలన్న దానికి మేము ప్రాధాన్యం ఇస్తున్నాం.

– ఇటీవల 'ఎక్స్'లో మంచు విష్ణు

మా వరకు రాని ఫిర్యాదులపై ఏమీ చేయలేం



సినిమా పరిశ్రమలోనే కాదు.. ఏ రంగంలో అయినా సమస్యలు ఉంటాయి. తెలుగు చిత్ర పరిశ్రమ విషయానికొస్తే.. మా వరకూ వచ్చిన సమస్యలను పరిష్కరించాం. ఇక ముందు కూడా అలానే చేస్తాం. అయితే మా వరకూ రాని ఫిర్యాదులపై మేం ఏమీ చేయలేం.

– తమ్మారెడ్డి భరద్వాజ, దర్శక-నిర్మాత

ఆ కమిటీ రిపోర్టు బయటపెట్టండి



తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళలుగా మేం కేరళలోని డబ్ల్యూసీసీని అభినందిస్తున్నాం. తెలుగు సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులపై ఏర్పాటు చేసిన ది వాయిస్ ఆఫ్ ఉమెన్ కమిటీ నివేదికను బయటపెట్టాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా. అందులో పేర్కొన్న అంశాలు తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు తగిన విధానాల రూపకల్పనలో ప్రభుత్వానికి ఉపయోగపడతాయని భావిస్తున్నా.

– ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో నటి అమల

3 సమీకృత గురుకుల భవనాలకు వచ్చే నెలలో శంకుస్థాపన

మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమీకృత గురుకుల విద్యా సంస్థల ఏర్పాటుకు అధికార యంత్రాంగం చర్యలు వేగవంతం చేసింది. ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన మేనేజ్‌మెంట్ కమిటీ గురువారం తొలిసారిగా భేటీ అయ్యింది. సీఎస్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీ సమావేశంలో సమీకృత గురు కులాలకు సంబంధించి అనేక అంశాలపై చర్చించారు. అక్టోబర్ నెలాఖరునాటికి కొడంగల్, మధిర, లక్ష్మీపురంలో ప్రతిపాదించిన సమీకృత గురుకుల పాఠశాలల భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని సీఎస్ కార్యదర్శి శాంతికుమారి స్పష్టం చేశారు. పనుల పురోగతిపై ప్రతివారం సమీక్ష నిర్వహిస్తానని సీఎస్ చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్‌రాజు, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, బుర్రా వెంకటేశం, సందీప్‌కుమార్ సుల్తానియా, శ్రీధర్, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, గురుకుల సొసైటీల కార్యదర్శులు సైదులు, వర్షిణి పాల్గొన్నారు.

జైళ్లకు కొత్త చట్టం అవసరం..

నల్సార్ వర్సిటీ చర్చలో వక్తలు



సాక్షి, హైదరాబాద్: మారుతున్న కాలానుగుణంగా జైళ్లకూ కొత్త చట్టాలు అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొత్త చట్టం రూపొందించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణ జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ విభాగం ఇటీవల మోడల్ జైళ్లు అండ్ కరెక్షనల్ సర్వీసెస్ చట్టం–2023ని రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం దీన్ని పంపించాల్సిన క్రమంలో న్యాయపరమైన అంశాలపై అధ్యయనం చేసేందుకు గురువారం నల్సార్ యూనివర్సిటీలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పోలీస్, న్యాయ రంగాలకు చెందిన పలువురు హాజరై అభిప్రాయాలను వెలిబుచ్చారు. మోడల్ ప్రిజన్స్ యాక్ట్ 2023 పాత చట్టాన్ని భర్తీ చేయడంతోపాటు పునరావాసం, పునరేకీకరణపై దృష్టి సారించిందన్నారు. జైళ్ల విభాగం చిక్కులను అర్థం చేసుకుని, కొత్త చట్టాలను ఆహ్వానించే దిశగా ఇది ఒక ముందడుగు అని ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీ వై.రాజేష్, ఐజీ (సంక్షేమం) ఎన్.మురళీబాబు, డీఐజీ (హెచ్ఆర్) డి.శ్రీనివాస్, డీఐజీ (డబ్ల్యూఆర్) సంపత్, నల్సార్ వర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావు, వర్సిటీ క్రిమినల్ లా విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ డి.బాలకృష్ణ పాల్గొన్నారు.



రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళామహోత్సవ్

28న ప్రారంభించనున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము




రసూల్‌పురా (హైదరాబాద్): ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో బొల్లారం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళామహోత్సవ్ మొదటి ఎడిషన్‌ను సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 6 వరకు నిర్వహిస్తున్నారు. ఈనెల 28న భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఎనిమిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు చెందిన మూడు వందల మంది కళాకారులు కళలు, సంస్కృతి, చేతి పనులు, వంటకాల వైవిధ్యాన్ని ప్రదర్శించనున్నారు. రాష్ట్రపతి నిలయంలో ప్రతిరోజూ ఉదయం పది నుంచి రాత్రి ఎనిమిది గంటలవరకు జరిగే ఈ మహోత్సవ్‌ను తిలకించేందుకు రాష్ట్రపతి నిలయం అధికారిక వెబ్‌సైట్ నుంచి స్లాట్ బుక్ చేసుకోవడంతో పాటు నిలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద తమ వివరాలు తెలిపి లోనికి ప్రవేశించేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

అలయ్ బలయ్‌కు రండి

స్పీకర్‌కు హరియాణా గవర్నర్ దత్తాత్రేయ ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: వచ్చేనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'అలయ్ బలయ్' కార్యక్రమానికి రావాల్సిందిగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. గురువారం స్పీకర్‌ను ఆయన అధికార నివాసంలో కలుసుకుని ఆహ్వాన పత్రికను అందజేశారు. స్పీకర్‌ను ఆహ్వానించిన వారిలో దత్తాత్రేయతో పాటు ఆయన వియ్యంకుడు బి.జనార్దనరెడ్డి, అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఉన్నారు. ప్రతీ ఏడాది దసరా పండుగ మరుసటిరోజు 'దసరా మిలన్'ను పురస్కరించుకుని ఆత్మీయ సమ్మేళనాన్ని అలయ్ బలయ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.



పోస్టుల నియామకంపై వివరణ ఇవ్వండి

ఈఆర్‌సీకి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: మార్చిలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఖాళీల భర్తీపై వివరణ ఇవ్వాలని విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)కి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. '28 ఉద్యోగాల భర్తీ కోసం మార్చి 8న ఈఆర్‌సీ నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో 12 ఆఫీసర్, 16 ఇతర పోస్టులున్నాయి. డిప్యూటీ డైరెక్టర్ (కన్స్యూమర్ అసిస్టెన్స్) పోస్టుకు ఆర్.లక్ష్మారెడ్డిని ఎంపిక చేయడం చట్టవిరుద్ధం. సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించి ఈ నియామకం చేపట్టారు. అందువల్ల అతని ఎంపికను రద్దు చేయాలి. నోటిఫికేషన్ నిబంధనలకు అనుగుణంగా తిరిగి ఎంపిక చేసేలా ఈఆర్‌సీని ఆదేశించండి'అని కోరుతూ పెద్దపల్లికి చెందిన నిరుద్యోగి మూల శ్రీధర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్ గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఈఆర్‌సీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను అక్టోబర్ 3కు వాయిదా వేశారు.

ఎస్సీ గ్రూప్‌-ఏలో చేర్చండి

మంత్రి దామోదరకు ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు ఎస్సీ గ్రూప్‌-ఏలో 57 ఉపకులాలు చేర్చాలని ఆ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బైరి వెంకటేశ్ కోరారు. మినిస్టర్స్ క్వార్టర్స్‌లో గురువారం మంత్రి దామోదర్ రాజనర్సింహతో ఈ సంఘం ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బైరి వెంకటేశ్ మాట్లాడుతూ...సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా వర్గీకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి రిజర్వేషన్ల ఫలాలను అందించాలన్నారు. ఈ అంశంపై మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించినట్లు ఆయన వివరించారు.



నిరంతరం పాపకార్యాలకు పాల్పడుతూ, తీరా మరణ ఘడియలు సమీపించాక, 'ఇప్పుడు నేను పశ్చాత్తాపపడుతున్నాను' అని అనే వారి పశ్చాత్తాపం ఆమోదించబడదు.

– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 20 సెప్టెంబర్ 2024

ఒకే ఎన్నిక... అనేక కోణాలు!

కొన్నేళ్ళుగా చెబుతూ వస్తున్న 'ఒకే దేశం... ఒకే ఎన్నిక' ప్రతిపాదనపై కేంద్రంలోని అధికార బీజేపీ మరో అడుగు ముందుకు వేసింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని కమిటీ ఈ ప్రతిపాదనపై ఇచ్చిన నివేదికను ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర మంత్రివర్గం బుధవారం లాంఛనంగా ఆమోదం తెలపడంతో రథం కదిలింది. ఈ ప్రతిపాదనపై ఓ బిల్లును రానున్న పార్లమెంట్ శీతకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్టు భోగట్టా. దేశంలో లోక్‌సభకూ, అన్ని రాష్ట్రాల శాసనసభలకూ కలిపి ఒకేసారి ఎన్నికలు జరపడానికి ఉద్దేశించిన ఈ సంక్లిష్ట ప్రతిపాదనపై మొదటి నుంచి భిన్నాభిప్రాయాలు ఉన్నందున తాజా పరిణామాలతో మరోమారు దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. పైగా ఈ ప్రతిపాదనకు పార్లమెంట్‌లో మూడింట రెండొంతుల మెజారిటీతో రాజ్యాంగ సవరణలు అవసరం. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రతిపాదనను కేంద్రంతో పాటు రాష్ట్రాలూ ఆమోదించాల్సి ఉంటుంది. వెరసి, రాజ్యాంగపరంగానూ, ఆచరణలోనూ అనేక అవరోధాలున్న ఈ ప్రతిపాదనపై రాగల నెలల్లో పెద్దయెత్తున రచ్చ రేగడం ఖాయం.

నిజానికి, ఏకకాలంలో ఎన్నికలనేవి కొత్త ఏమీ కావు. గతంలో ప్రత్యేకంగా నియమం, చట్టం లాంటివేమీ లేకున్నా, 1951 – 52లో మొదటి జనరల్ ఎలక్షన్స్ నాటి నుంచి మన దేశంలో లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు కలిసే జరుగుతుండేవి. అయితే, కాలవ్యవధి పూర్తి కాకుండానే రాష్ట్ర అసెంబ్లీలు రద్దవడం ఎప్పుడైతే మొదలైందో, అప్పుడు 1967 తర్వాత నుంచి కథ మారింది. ఏకకాల ఎన్నికల క్యాలెండర్ మారిపోయింది. పదేళ్ళ క్రితం తొలిసారి అధికారంలోకి వచ్చే ముందే బీజేపీ తన మేనిఫెస్టోలో 'ఒకే దేశం... ఒకే ఎన్నిక'ను లక్ష్యంగా పేర్కొంది. అంతకు ముందు సన్నాయినొక్కులు నొక్కినా, బీజేపీ గద్దెనెక్కాక సహజంగానే భారత ఎన్నికల సంఘం ఈ ఆలోచనను సమర్థించింది. అలాగే, లా కమిషన్లు సైతం 1999లో, 2018లో ఈ ఏకకాలపు ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించాలన్నాయి. 2015 నాటి పార్లమెంటరీ స్థాయీ సంఘం ముందు పలు పార్టీలు ఈ ప్రతిపాదనకు మద్దతు నివ్వగా, కొన్ని పార్టీలు మాత్రం వ్యతిరేకించాయి. భిన్నాభిప్రాయాలున్న దీనిపై ఏకాభిప్రాయ సాధన అవసరమని మొదట్లో చెబుతూ వచ్చిన మోదీ సర్కార్, ఆ సంగతి పక్కనపెట్టి ఇటీవల తన అజెండాను ముందుకు నెట్టే ప్రయత్నం చేయడం గమనార్హం.

కోవింద్ కమిటీ వేయడం, ఆ కమిటీ ఈ ఏడాది మార్చిలో నివేదిక సమర్పించడం చకచకా జరిగాయి. తొలి దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు, ఆ వెంటనే రెండో దశలో 100 రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు – ఇలా రెండు దశలుగా 2029 నుంచి 'ఒకే ఎన్నిక' ప్రతిపాదనను అమలు చేయవచ్చని కమిటీ సిఫార్సు చేసింది. ఇప్పుడు కమిటీ నివేదికను క్యాబినెట్ ఆమోదించి, పార్లమెంట్‌లో చట్టం చేయడానికి సిద్ధమవుతోంది. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు కేంద్రానికి రూ. 4 వేల కోట్లు ఖర్చవుతుందని లెక్క. ఆ యా రాష్ట్రాల పరిమాణాన్ని బట్టి అసెంబ్లీ ఎన్నికలకు అయ్యే ఖర్చు వేరు. ఈ ప్రభుత్వ అధికారిక ఖర్చు కాక, వివిధ పార్టీలు, అభ్యర్థులు చేసే ఖర్చు అనేక రెట్లు. ఏకకాలపు ఎన్నికల వల్ల ఖర్చులు తగ్గుతాయనీ, తరచూ ఎన్నికలతో పాలన కుంటుపడుతున్నందున దాన్ని నివారించవచ్చనీ, ఒకేసారి ఎన్నికలతో ఓటింగ్ శాతం హెచ్చవుతుందనీ సమర్థకుల వాదన.

అయితే, ఏకకాలపు ఎన్నికల కోసం పలు రాష్ట్ర అసెంబ్లీలను ముందుగానే రద్దు చేయాల్సి వస్తుంది. రేపు పొద్దున ఒకేసారి ఎన్నికలు పెట్టినా... ఒకవేళ ఎక్కడైనా రాష్ట్ర ప్రభుత్వం పడిపోయి మధ్యంతర ఎన్నికలు వస్తే, కేవలం మిగిలిన కాలవ్యవధికే ఎన్నికల ద్వారా కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలట. ఇలాంటి ప్రతిపాదనలు వట్టి అర్థరహితం. పైగా, ఇది మరింత ఖర్చుకు దారి తీయడమే కాక, అసలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం. అలాగే ఏకకాలపు ఎన్నికల వల్ల స్థానిక, ప్రాంతీయ అంశాలు పక్కకుపోయి, జాతీయ అంశాలదే పైచేయి అవుతుందనీ, చివరకు స్థానిక, చిన్నపార్టీలు కనుమరుగై పోతాయనీ భయాందోళనలు నెలకొన్నాయి. ఇటీవల ఏకకాలంలో హర్యానా, జమ్మూ– కశ్మీర్, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు చేయలేమని చేతులెత్తేసిన ఎన్నికల సంఘం రేపు దేశమంతటా ఒకేసారి ఎన్నికలు ఎలా చేయగలుగుతుంది? కొన్ని కోట్ల ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, వేల సంఖ్యలో భద్రతా సిబ్బందిని ఏకకాలంలో సమకూర్చుకోవడం సాధ్యమా? దానికయ్యే ఖర్చుతో పోలిస్తే, 'ఒకే ఎన్నిక' వల్ల ఆదా అయ్యేది ఏపాటి?

అసలింతకీ కేంద్రంలోని కమలనాథులు ఇప్పుడీ పనిని ఎందుకు భుజాన వేసుకున్నట్టు? అధికార పక్షం సొంత మెజారిటీ ఉన్నప్పుడు ఇట్టే చేయగల పనిని మిత్రపక్షాలపై ఆధారపడిన ప్రభుత్వ హయాంలో తలకెత్తుకున్నదేమిటి? 2015 నాటి ఓ సర్వే ప్రకారం... ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగితే 77 శాతం ఓటర్లు రెండింటా ఒకే పార్టీకి ఓటు వేస్తారట. అదే గనక ఆరు నెలల విరామం తర్వాత జరిగితే 61 శాతం మందే ఒకే పార్టీకి ఓటు వేస్తారట. దేశమంతటా 'డబుల్ ఇంజన్ సర్కార్'కై తహతహలాడుతున్న బీజేపీ ఓటర్ల తాలూకు ఈ ఏకకాలపు ఎన్నికల మనస్తత్వం కలిసొస్తుందని భావిస్తూ ఉండవచ్చు. కానీ, వైవిధ్యానికి నెలవైన సమాఖ్య వ్యవస్థలో కృత్రిమంగా ఏకకేంద్రక స్వభావాన్ని జొప్పించడమే ఇదంతా అని విమర్శ. ఎవరి రాజకీయ, సైద్ధాంతిక వైఖరులు ఏమైనా అనేక అంశాలపై ప్రభావం చూపే ఈ ప్రతిపాదనకు తొందరపడితే సరిపోదు. కాగితంపై అందంగా కనిపించే ఆలోచనకు సైతం ఆచరణలో ఉండే ఇబ్బందులను గమనించాలి. వ్యతిరేకుల వాదన వినాలి. సహేతుకమైన వారి సందేహాల్ని తీర్చాలి. లేదంటే ప్రజాస్వామ్యానికే అర్థం లేదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.తదియ రా.1.41 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** రేవతి ఉ.9.37 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** తె.4.16, నుండి 5.46 వరకు (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.08 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.35 నుండి 8.54 వరకు, తదుపరి రా.1.15 నుండి 2.56 వరకు.

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం: 5.58
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సమానతే కులానికి ప్రత్యామ్నాయం

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

కులానికీ, వర్ణానికీ ఉన్న సంబంధాన్ని సామాజిక శాస్త్ర పునాదిగా చర్చిస్తే గానీ కులానికి ఉన్న పట్టు మనకు అవగతం కాదు. వర్ణ వ్యవస్థ నాలుగు వర్ణాలను పేర్కొంది. అవర్ణులుగా పంచములను పేర్కొంది. ఐతే ఆ విభజన సిద్ధాంతం, ప్రయోగంలో భారతదేశంలో శాఖోపశాఖలుగా విస్తరించింది. అంబేడ్కర్ కులనిర్మూలనను శాస్త్రబద్ధంగా నమ్మారు. భారతదేశంలో కులం పునాదులను అర్థం చేసుకున్న తర్వాత కుల నిర్మూలనా సిద్ధాంత గ్రంథాన్ని రచించారు. కులం పునాదుల మీద ఒక జాతిని నిర్మించలేము, ఒక నీతిని నిర్మించలేమని చెప్పారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానతను బోధించారు. సమానత్వపు విలువలను బోధించే భారత రాజ్యాంగమే కులనిర్మూలనా జీవన విధానానికి దిక్సూచి.

భారతదేశంలో కులం మూలాల గురించి చాలా చర్చ జరిగింది. కులం పునాదుల గురించి రాసిన వారిలో వి.ఎ.స్మిత్, జె.హెచ్.హట్టన్, హెచ్.హెచ్.రిజ్లీ, ఎస్.వి. కేత్కర్, జి.ఎస్.ఘుర్యే, జ్యోతిబా పూలే, బి.ఆర్.అంబేడ్కర్, రామ్ మనోహర్ లోహియా లాంటి ఎందరో ఉన్నారు. హట్టన్ కులాన్ని ఇలా విశ్లేషించారు: ''క్యాస్టు అనే మాట, కాస్టా అనే పోర్చుగీసు శబ్దం నుండి వచ్చింది. 'కాస్ట' అను శబ్దము 'చాలు', 'జాతి', 'రకము' అను పదముల అర్థమును తెలుపును. ఆ భాషలో 'హోమెన్ డీబోవ కాస్టియ' అను పద సమూహమునకు 'మంచి కుటుంబంలోని మనిషి' లేక 'కులీనుడు' అని అర్థము''.

1563లో గార్సియా డి ఓర్టా 'తన తండ్రి వృత్తి నుండి ఎవడూ మారడు. చెప్పులు కుట్టు ఒకే కులం వారంతా ఒకటే' అని రాసిన నాటి నుండి ఈ 'కాస్ట' మాటను మనమిపుడు గ్రహించు పరిమితమైన 'కులం (కాస్టు)' అనే అర్థములో వాడుతున్నట్లు కనిపిస్తున్నది. హట్టన్ 'కాస్ట్ ఇన్ ఇండియా' అనే గొప్ప గ్రంథం రాశారు. అది ప్రపంచ వ్యాప్తంగా చాలా చర్చకు దారి తీసింది. అలాగే రిజ్లీ కులం గురించి ఇలా రాశారు: ''కులం కొన్ని కుటుంబాల సముదాయంగా లేదా కుటుంబ సమూహాల సముదాయంగా ఉండి సామాన్య (ఒకే) నామాన్ని కలిగి ఉంటున్నది. ఒకే మానవుని నుండి లేదా దైవాంశ గల పురాణ పూర్వీకుని నుండి వంశక్రమాన్ని చెప్పుకుంటున్నది. వారసత్వంగా వచ్చిన ఒకే వృత్తిని అనుసరిస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించుకుంటున్నది.''.

కులం అనేది వర్ణ వ్యవస్థ నుండి రూపొందించబడిందని ఘుర్యే విశ్లేషించారు: 'రంగు అను అర్థం గల 'వర్ణం' సమాజంలోని వర్గాలను వివరించుటకు వాడబడింది. తరువాత 'జాతి' పదం పుట్టుకతో వచ్చిన సమూహ సభ్యత్వమును 'కులము'గా తెలుపుటకు ప్రత్యేకముగా ఉపయోగించబడింది'. 'ఒకడు దేనిలో పుడతాడో అది' అని 'జాతి' శబ్దానికి వ్యుత్పత్తి అర్థం. దీనిని 'వర్ణా'నికి సమానార్థంలో యోగ్యులైన ప్రాచీన సాధికారులు అడపా దడపా వాడారు.

ఈ కులం మూలాల మీద జరిగిన చర్చ తరువాత కులం మూలాలు వర్ణ వ్యవస్థలో ఉన్నాయనేది స్పష్టమైంది. ఒంటి రంగును బట్టి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములు ప్రత్యేకింపబడినట్లు తెలుస్తుంది. 'కపిల వర్ణం బ్రాహ్మణుడు, అరుణ వర్ణం క్షత్రియుడు, గోధుమ వర్ణం వైశ్యుడు, కృష్ణ వర్ణం శూద్రుడు' అని నామలింగాను శాసనం చెబుతుంది. ఈ సందర్భంగా సామాజిక శాస్త్రవేత్తలు పంచమ వర్ణం ఎలా పుట్టిందో చర్చించారు. వర్ణశబ్దం ఋగ్వేదంలో ప్రార్థ, మలాని ఆర్యులకూ, దస్యులకూ తేడాని తేల్చేదిగా వాడారు. ఋగ్వేదం పదవ మండలం రచనా కాలానికి 4 వర్ణాలు పేర్కొనబడ్డాయి. నాలుగు వర్ణాలలో మూడు ఆర్య వర్ణాలు కాగా నాల్గవది ఆర్యేతర వర్గం. అందుకే ఈ నాల్గవ వర్ణం వారు బ్రహ్మ పాదాల



నుండి జనించారని చెప్పబడింది. వీరు ఆర్య సమాజంలో కలిసి నాల్గవ మెట్టులో జీవించే సామాజిక చారిత్రక పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ వర్ణ సమాజానికి దూరంగా జీవించిన చండాలురు, పిపీలకాదులు, నిషాదులు పంచములుగా పిలవబడి ఆ తరువాత కాలంలో అస్పృశ్యులు అయి నారు. వీరిని ఋగ్వేద కాలంలో వైదికార్యులు అస్పృశ్యులుగా పరిగణించలేదు, పంచజనులుగా మాత్రమే పరిగణించారు. వర్ణ వ్యవస్థ నాలుగు వర్ణాలను పేర్కొంది. అవర్ణులుగా పంచములను పేర్కొంది. ఐతే ఆ విభజన సిద్ధాంతం ప్రయోగంలో భారతదేశంలో శాఖోపశాఖ లుగా విస్తరించింది. అవి శాఖలుగా ఉపశాఖలుగా వంశపారంపర్య తత్వంతో అంతశ్శాఖ వివాహ సంబంధాలు మాత్రమే కలిగి కుంచించుకు పోయాయి. ఆర్యులు వర్ణతత్వాన్ని భారతదేశానికి మోసుకు రాకముందు ఈ విధమైన విభజన భారతదేశంలో లేదు.

అంబేడ్కర్ భారతదేశంలో కులం పునాదులను అర్థం చేసుకున్న తర్వాత కుల నిర్మూలనా సిద్ధాంత గ్రంథాన్ని రచించారు. ఈ సందర్భంగా ఆయన అప్పటికి ప్రసిద్ధంగా ఉన్న అన్ని పార్టీల సిద్ధాంతాలతోనూ, నాయకులతోనూ పోరాడారు. మహాత్మాగాంధీకి సమాధానమిస్తూ తన కులనిర్మూలనా వాదనను లేఖ ద్వారా తెలియజేశారు: 'నా ఉద్దేశంలో హిందూ సమాజం కులరహిత సమాజం అయినప్పుడు మాత్రమే అది తనను తాను రక్షించుకొనే శక్తినీ, సామర్థ్యాన్నీ సంతరించుకోగలదు. ఆంతరంగికమైన బలం లేకుండా హిందువులకు స్వరాజ్యం వచ్చినా, అది మళ్ళీ దాస్యం వైపు ఒక అడుగు ముందుకు వెయ్యడమే కావచ్చు. బాగా ఆలోచించండి' అని గాంధీకి విన్నవించారు.

అంబేడ్కర్ కులనిర్మూలనను శాస్త్రబద్ధంగా నమ్మారు. కులం చేత పీడింపబడుతున్న వారిలో అస్పృశ్యులుగా చెప్పబడుతున్న పంచమ వర్ణులు ప్రధానంగా ఉన్నారని గుర్తించారు. అస్పృశ్యతను పాటించడం వల్ల భారతదేశంలో సోషలిజం రాదని కూడా చెప్పారు. సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. బుద్ధుడు, మహాత్మా పూలే స్ఫూర్తితో అంబేడ్కర్ తన సిద్ధాంతాలు రూపొందించుకున్నారు. భూములను జాతీయం చేయండి, పరిశ్రమలను జాతీయం చేయండి, స్త్రీలకు సమాన హక్కులు కలుగజేయండి, బహుజనులు రాజ్యాధికారానికి సొంతంగా ఉద్యుక్తులు కండి అని ప్రబోధిస్తూ వెళ్ళారు. రామ్ మనోహర్ లోహియా తన 'కులాల సమస్య' గ్రంథంలో భారత రాజకీయాలు కులాల గుప్పిట్లోకి వెళ్ళిపోతున్నాయని రాశారు.

ప్రజా సోషలిస్టు, సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాలు కూడా కులీనులు, ధనవంతుల గుప్పిళ్లలోనే ఉన్నాయి. ఒకప్పుడు పండిత నెహ్రూ కూడా దేశంలో విప్లవ నాయకుడుగానే ఉండేవారు. కాంగ్రెసులోని ఈ నాయకులే సమానత్వం గురించి మాట్లాడుతూ ఉండేవారు. కాని ఇప్పుడు వారు ఎలా మారిపోయారు? వర్గ స్వభావం, వర్గ పక్షపాతం ఎప్పుడూ అంతరించవు. రామ్ మనోహర్ లోహియా రాజకీయాల్లో కులాధిపత్యాన్ని నిర్మూలించి బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేయాలని చెప్పారు. పెరియార్ రామస్వామి నాయకర్ 1924 మార్చిలో కేరళలో అస్పృశ్యత నివారణ కోసం 'వైకోమ్' ఉద్యమం నడుపుతూ, ఆత్మగౌరవ పోరాటానికి పిలుపునిచ్చారు. ''ఆత్మగౌరవం పట్ల అవగాహన ఉంటేనే స్వతంత్రం గురించి మాట్లాడగలుగుతాం. అయితే ఇప్పుడు స్వతంత్రం గురించి మాట్లాడుతున్నవాళ్ళు ఆత్మగౌరవాన్ని విస్మరిస్తున్నారు. ఆత్మగౌరవం లేని స్వతంత్రానికి అర్థమే లేదు'' అని ఆయన ఆనాటి కాంగ్రెస్ నాయకులకు చురకలు వేశారు. తన ఇరవై యేళ్ళ వయస్సులోనే కాంగ్రెస్ సభలో రామాయణం, మహాభారతం, పురాణాలు, శాస్త్రాలను తీవ్రంగా విమర్శించేవారు.

నిజానికి భారతదేశంలో కుల నిర్మూలనా ఉద్యమాలుగా నడిచిన బౌద్ధం, జైనం, సాంఖ్యం ప్రేరణతో... పూలే, పెరియార్, లోహియా భావజాలంతో అంబేడ్కర్ మార్గంలో నడిస్తే ప్రత్యామ్నాయ సంస్కృతి రూపొందుతుంది. బహుజన రాజ్యాధికారాన్ని అనతి కాలంలో సాధించుకోవచ్చు. భారతదేశ రాజకీయాల్లో, సామాజిక వ్యవస్థల్లో, అన్ని మతాల్లో, పార్టీల్లో కులతత్వం చొచ్చుకుపోవడానికి కారణం అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని అందుకోకపోవడమే. అందుకే కులం పునాదుల మీద ఒక జాతిని నిర్మించలేము, ఒక నీతిని నిర్మించలేమని అంబేడ్కర్ చెప్పారు. కులానికి ప్రత్యామ్నాయంగానే ఆయన లక్ష పేజీల వాఙ్మయాన్ని రచించారు. కులనిర్మూలనా సిద్ధాంతకర్తగా పేరు పొందారు. అంబేడ్కర్ రచించిన రాజకీయ ప్రణాళికల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానతను బోధించారు. ఆయన బౌద్ధ సూత్రాలతో భారత రాజ్యాంగాన్ని నిర్మించారు. భారత రాజ్యాంగమే కుల నిర్మూలనా జీవన విధానానికి దిక్సూచి. ఆ మార్గంలో నడుద్దాం!

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అదే నాయకత్వం



ఒక బాస్‌గా మీరు ఎందరిని తీసేశారు, ఎందరిని తొలగించారు అనేదాన్ని ఎవరూ గుర్తుంచుకోరు. ఎంతమంది నాయకులను తయారుచేశారు అన్నదాన్ని బట్టి మీరు గుర్తుండిపోతారు.

– రాజేశ్ సహానీ, ఇన్వెస్టర్

పేదవాళ్లు బతకలేరు



మీరు గనక అమెరికాలో ధనవంతులైతే, ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లోని ప్రజలు ఎంతకాలం బతుకుతారో అంతకాలం బతుకుతారు. అదే పేదవాళ్లయితే, పదీ పదిహేనేళ్లు తక్కువ కాలం బతుకుతారు. ఇందులో ఎవరికీ ఏ సమస్యా కనబడటం లేదా?

– బెర్నీ శాండర్స్, అమెరికా నాయకుడు

అది కదా సమస్య?



తాలిబన్ అధికారులు పాకిస్తాన్ జాతీయ గీతానికి నిలబడలేదని పాకిస్తానీలు కలవరపడుతున్నారు. అందులో వీసమెత్తు అయినా – బాలికల విద్యను, మహిళల కదలిక హక్కును, ఆఖరికి బహిరంగ స్థలాల్లో వారి మాట్లాడే హక్కును నిషేధించి నగం దేశాన్ని నిర్బంధించిన తాలిబన్ల ప్రభుత్వ తీరు మీద పడితే!

– నిదా కిర్‌మాణి, పాక్ స్త్రీవాది

వాట్సాప్ హాక్



చూస్తుంటే నా వాట్సాప్ హాక్ అయినట్టుంది. నా కాంటాక్ట్స్‌లో ఉన్నవాళ్లకు ఎవరికైనా ఫలానా కోడ్, ఓటీపీ లేదా డబ్బులు అడుగుతూ నేను పంపని మెసేజ్ వస్తే దానికి స్పందించవద్దు. ఆ నంబర్‌ను బ్లాక్ చేయండి. ఇదేంటో పరిష్కరించే ప్రయత్నంలో ఉన్నా!

– స్వర భాస్కర్, నటి

ఎందుకు మార్చాలి?



ఇండియా తన విత్తనాలను మార్చాల్సి ఉందని బిల్ గేట్స్ అన్నారు. వలసవాదం అంటే ఇలాగే ఉంటుంది! బియ్యం, ఆవాలు, మినప, బబ్బెర, కంది, పనస, అరటి, మామిడి, మిరియాలు, పలు రకాల కూరగాయలు, చిరుధాన్యాల లాంటి వైవిధ్యతకు మారుపేరైన ఒక నాగరికతను పోషక విలువలు లేని, విషపూరితమైన జన్యుమార్పిడి విత్తనాలకు మారమని చెప్పడం ఇది.

– వందనా శివ, పర్యావరణవేత్త

ఒప్పుకున్నట్టే!



యువత నిరుద్యోగం, ఆశ్రిత పక్షపాతం నిజంగానే ఇండియాలో అంత ఎక్కువున్నాయా అని కొందరు అడుగుతుంటారు. వాళ్లు ప్రభుత్వ 'ఆర్థిక సర్వే 2023–24' చదవాలి. అది నిరుద్యోగం ఎక్కువుందని చెబుతూనే, 'భారతీయ కార్పొరేట్ రంగం' 'అధిక లాభాల్లో ఈదులాడుతోంది' అని అంగీకరిస్తుంది.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

తగ్గనున్న అనుమతులు



ఈ సంవత్సరం మేము 35 శాతం తక్కువ అంతర్జాతీయ స్టూడెంట్ పర్మిట్స్ ఇస్తున్నాం. తర్వాతి ఏడాది ఆ సంఖ్య మరో పది శాతం తగ్గుతుంది. మా ఆర్థిక వ్యవస్థకు వలసదారులు ప్రయోజనకరమే. కానీ విద్రోహ శక్తులు వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ, విద్యార్థులను వాడుకుంటే అణిచివేస్తాం.

– జస్టిన్ ట్రూడో, కెనడా ప్రధాని

ఇన్ బాక్స్

కమిషన్ ముందున్న సవాళ్లు

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 16తో ముగిసిందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఒక ప్రకటన చేసింది. మే నెలలో ప్రారంభమైన డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ సెప్టెంబర్ 16 వరకు కొనసాగితే నవంబర్ నెల లేదా డిసెంబర్ నెలలో నిర్వహించే మొదటి సెమిస్టర్ పరీక్షలు ఒక విద్యార్థి ఎలా రాయగలడు? ఒక విద్యార్థి ఒక సెమిస్టర్‌లో ఎన్ని క్లాసులకు హాజరు కావాలి? కాలేజీలో ఒక సెమిస్టర్ ముగిసే లోపల ఎన్ని పని దినాలు ఉండాలని నిర్ణయించారు? దీనికి ఏమైనా ఒక శాస్త్రీయ ప్రాతిపదిక ఉందా? ఉంటే దానిని ఎవరు అమలు చేస్తారు?

డిగ్రీలో ప్రవేశాల కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి దోస్త్ (డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ) అనే విధానాన్ని ప్రవేశపెట్టింది. అడ్మిషన్ల ప్రక్రియలో ఉన్న లోపాలను అధిగమించడానికి ఈ ప్రక్రియ బాగానే దోహదపడినప్పటికీ ఇంతటి సుదీర్ఘ కాలం పాటు సాగే ఈ దోస్త్ సెమిస్టర్ విధివిధాన లక్ష్యాన్ని దెబ్బ తీస్తున్నది. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అధ్యక్షుడుగా ఇద్దరు సభ్యులతో కూడిన విద్యాకమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ విద్యా కమిషన్ చేయబోయే సిఫార్సులు, అమలు పరచబోయే విధానాలపైనే రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

కమిషన్ దృష్టి పెట్టవలసిన ముఖ్యాంశాలు: 1. అకడమిక్ క్యాలెండర్‌ను తయారుచేయడం. 2. అన్ని ఎంట్రన్సులను జూన్ కల్లా నిర్వహించి అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేసి క్రమబద్ధీకరించడం. 3. అన్ని విశ్వవిద్యాలయాల సిలబస్ మరియు విద్యా సంవత్సరం ఒకేసారి ప్రారంభమయ్యి, ఒకేసారి ముగించేలా చేసి వేసవి సెలవులు నిర్ధారించడం. 4. ఇంటర్మీడియట్ విద్యలో ఉన్న లోపాలను గుర్తించి సవరించడం. 5. ఇంటర్మీడియట్ విద్యపై ఉన్న కార్పొరేట్ల గుత్తాధిపత్యాన్ని తొలగించడం. 6. ఇంటర్మీడియట్ విద్యలో రెండవ భాషగా సంస్కృతాన్ని మాత్రమే పరిమితం చేయడంపై పునరాలోచన చేయడం. వీటిని పరిష్కరించగలిగితే కాలేజీ విద్యావ్యవస్థ గాడిన పడినట్లే!

– డా॥ ఎ. హరిప్రసాద్ । విశ్రాంత రాజనీతిశాస్త్ర ఆచార్యులు, పాలకుర్తి

పాఠశాలలలో చెప్పాల్సిన ప్రకృతి వ్యవసాయం

అభిప్రాయం



డా॥ డి. పారినాయుడు

వ్యవసాయం మన జీవన విధానం. మొత్తం భారతదేశ విస్తీర్ణంలో 50 శాతం పైగా వ్యవసాయానికి అనుకూలంగా ఉండటం వలన మన దేశాన్ని వ్యవసాయక దేశమని అంటారు. భారతదేశ వ్యవసాయరంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర జనాభాలో 62 శాతం మంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యవసాయం మీద ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్నారు. వ్యవసాయంలో వచ్చిన హరిత విప్లవం రైతులు కృత్రిమ ఎరువులు, పురుగు మందులపై ఆధార పడేలా చేసింది.

ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదికల ప్రకారం 50 శాతానికి పైగా వ్యాధులు మనం తినే ఆహారం వల్లనే వస్తున్నాయి. గతంతో పోల్చుకుంటే ఆహారంలో 20–30 శాతం పోషకాలు తగ్గిపోయాయి. మనుషుల్లో కేన్సర్ లాంటి జబ్బులు రావడానికి పురుగు మందుల అవశేషాలే కారణమని పలు పరిశోధనలు రుజువు చేశాయి. మరో వైపు నేలలో జీవవైవిధ్యంతో పాటు, మొక్కల వైవిధ్యం కూడా తగ్గిపోయింది. దీనివల్ల నేలల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. నేలకోత వలన దేశంలో సగటున ప్రతి సంవత్సరం ఒక హెక్టారు భూమి నుండి 16.5 టన్నుల మట్టిని కోల్పోతున్నాం. అధిక ఉష్ణోగ్రతల వలన భూతాపం పెరిగిపోయింది. దీని వలన వ్యవసాయ దిగుబడులు భారీగా తగ్గే ప్రమాదం ముంచుకొచ్చింది. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఈ నేల మీద మొక్కలు కూడా మొలిచే పరిస్థితులుండవు అనేది శాస్త్రజ్ఞుల అంచనా.

ఇటీవల డెవలప్‌మెంట్ ఆఫ్ ఇంటలిజెన్స్ యూనిట్ (డీఐయూ) విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయిమెంట్ రిపోర్టు 2024' భయంకరమైన నిజాలను మన ముందు పెట్టింది. ప్రస్తుతం సాగుచేస్తున్న రైతుల్లో 60 శాతం మంది అతి తక్కువ దిగుబడుల కారణంగా సాగును వదిలేయాలని నిర్ణయించుకున్నారు. కుటుంబం సంతోషంగా జీవించడానికి వ్యవసాయం ఉపయోగకరం కాదని 63.8 శాతం పురుషులు, 62.7 శాతం



పిల్లలతో కలిసి మొక్కలను పరిశీలిస్తున్న ఐఏఎస్ శ్యాంప్రసాద్

మహిళలు అభిప్రాయపడ్డారు. అందుకే గ్రామీణ యువత ఉద్యోగాలు వెతుక్కుంటూ వలస పోవడానికి ఇష్టపడుతున్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను వ్యవసాయ వృత్తిలో కొనసాగించాలనుకోవడం లేదు.

ఇది మనందరి ఉమ్మడి సమస్య. వ్యవసాయం లాభదాయకం కాదని వదిలేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా కోట్లాదిమంది జీవనోపాధిని కోల్పోతారు. కరవు విలయతాండవం చేస్తుంది. దిగుబడుల కోసం కృత్రిమ ఎరువులు వుపయోగించడం వలన రోగాలతో జనం మంచాన పడతారు. వ్యవసాయ పర్యావరణం దెబ్బతింటే వాతావరణం అసమతుల్యత పెరిగిపోయి ఈ భూమి కూడా నివాస యోగ్యం కాకుండా పోతుంది.

దీనికి పరిష్కారం మన చేతుల్లోనే ఉంది. మన పిల్లలకు చిన్నప్పటినుండే ప్రకృతి వ్యవసాయం పట్ల, పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలి. పాటలు, పాఠాల ద్వారా వ్యవసాయం పట్ల మక్కువ కలిగించాలి. మన నేల పట్ల, ప్రకృతి పట్ల, శ్రమ పట్ల నిర్లక్ష్యం వహిస్తే మన భవిష్యత్‌తో పాటు పిల్లల బంగారు భవిష్యత్తును కూడా పాడుచేసిన వాళ్ళం అవుతాము.

బడి పిల్లల్లో బడితోట పట్ల అవగాహన కలిగించడం కోసం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ 'మాబడి – మాతోట' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయుల మార్గదర్శనంలో పిల్లలు బడితోటలను వేస్తున్నారు.

గత 15 సంవత్సరాలుగా 'బడి నుండి పొలం బడి'కి కార్యక్రమం ద్వారా పిల్లలకూ, పిల్లల నుండి వారి తల్లిదండ్రులకూ; పర్యావరణ విద్య, ప్రకృతి వ్యవసాయ భావనలు చేరాలని వాచకాలను 'జట్టు' ట్రస్టు ముద్రించింది. పైలట్ ప్రాజెక్ట్‌గా కొన్ని పాఠశాలల్లో అమలు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 750 మంది ఉపాధ్యాయులను గుర్తించి ఈ కార్యక్రమ అమలుకు మాస్టర్ ట్రైనర్‌లకు శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ప్రస్తుత ఏపీ ప్రభుత్వం దీన్ని ముందుకు తీసుకువెళ్ల వలసిన అవసరం ఉంది.

వ్యాసకర్త ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త
మొబైల్: 94401 64289

సహజాతం మారదు

మరణం గురించి ఒక మంచి విషయాన్ని చెప్పాడు ధర్మపురికి చెందిన శేషప్ప కవి. ఆ ఊరిలో వెలసి ఉన్న శ్రీ నారసింహస్వామి భక్తుడయిన ఆయన 'నరసింహ శతకం' రచించాడు. మనిషి జీవితానికి నూరు సంవత్సరాలు పరిమితిగా చెప్పబడినప్పటికీ, బాల్యంలోనో, యవ్వనంలోనో, ముసలితనంలోనో, ఊరిలో సన్నిహితుల మధ్య ఉన్నపుడో, పొరుగూరికి ఏదైనా పని మీద వెళ్ళినపుడో, విహారయాత్రలో ఉన్నప్పుడో లేక ఇంట్లోనే ఉండి సేద దీరుతున్నప్పుడో... అలా ఎప్పుడు మరణం సంభవిస్తుందో తెలియదు. అందువల్ల బుద్ధిమంతుడైన మనిషి ప్రాణంతో ఉన్నప్పుడే భక్తి కలిగి ఉండి భగవంతుణ్ణి ధ్యానించి దైవత్వాన్ని సాక్షాత్కరింప జేసుకుని అనుభవంలోకి తెచ్చుకునే ప్రయత్నం చేయాలని ఓ పద్యంలో అన్నాడు. భాషా పరిజ్ఞానం పెద్దగా లేని వాడనని శేషప్పకవి తనను గురించి తాను వినమ్రంగా చెప్పుకున్నప్పటికీ, **'దేహమున్నంతలో మిమ్ము దెలియ వలయు'** అన్న తేలికైన మాటలలో, మనిషి 'ప్రాణంతో ఉండగానే పరమాత్మ తత్త్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలని' సుభాషితంగా చెప్పాడు.



జ్యోతిర్మయం

పూర్వకవుల కావ్యాలను, ఛందోగ్రంథాలను చదివిన పాండిత్యం తగినంతగా లేనివాడైయుండీ, స్వామి మీద భక్తితో మాత్రమే తాను శతక రచనకు పూనుకున్నానని, ఒకటో రెండో తప్పులు దొర్లినందు వలన భక్తి తక్కువైనట్లు కాదని, ఒక చక్కని పోలికతో మరొక పద్యంలో ఇలా చెప్పాడు:

'తప్పుపడ నేమి సద్భక్తి తక్కువౌనె
చెఱుకునకు వంకపోనేమి చెడునె తీపు!'

పెరుగుతూ ఉండగా చెఱుకు గెడ మధ్యలో ఒక చోట వంకరగా అయినంత మాత్రాన ఆ చెఱుకులో తీయదనం తగ్గిపోయి చప్పగా మారదు కదా! అలాగే భక్తిరచనలో ఒకటి రెండు మాటలు తప్పుగా పడినంత మాత్రాన అంతరంగంలోని సద్భక్తి మలినమైనదిగా మారినట్లు కాదు అని పై పంక్తుల భావం. ఏదో కారణం చేత శారీరకంగా లోపం సంభవించినప్పటికీ, అది సత్పురుషుని అంతరంగంలోని సద్భావాన్ని మాయం చేసేదిగా ఉండదని కూడా పై మాటల నుండి గ్రహించవచ్చు.

– భట్టు వెంకటరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

నేటి నుంచి మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్

- టీఎస్ఈఆర్ఎల్, ఎస్డీఎస్డీ ఇంజనీర్లను విచారించనున్న కాళేశ్వరం కమిషన్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ శుక్రవారం నుంచి రెండో విడత సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ప్రారంభించనుంది. తొలిరోజు తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్ రీసెర్చ్ ల్యాబొరేటరీస్ (టీఎస్ఈఆర్ఎల్), స్టేట్ డ్యామ్ సేఫ్టీ విభాగం (ఎస్డీఎస్డీ) ఇంజనీర్లను విచారించనుంది. టీఎస్ఈఆర్ఎల్ చీఫ్ ఇంజనీర్ శ్రీదేవి, జాయింట్ డైరెక్టర్ మనోజ్, మాజీ అధికారి ఆశీర్వాదం, డ్యామ్ సేఫ్టీ విభాగం చీఫ్ ఇంజనీర్ ప్రమీల, ఎస్ఈ మురళి, ఈఈ రఘునాథ శర్మతో మరో ఇంజనీర్‌ను కూడా క్రాస్ ఎగ్జామిన్ చేయనుంది. బరాజ్‌ల నిర్మాణానికి ముందు జరిపిన ఇన్వెస్టిగేషన్లు, మోడల్ స్టడీస్, సర్వేల్లో టీఎస్ఈఆర్ఎల్ నిపుణుల పాత్రతో పాటు బరాజ్‌ల నిర్మాణం తర్వాత వాటి భద్రతను పర్యవేక్షించిన డ్యామ్ సేఫ్టీ విభాగం అధికారుల పాత్రపై కమిషన్ విచారణ జరపనుంది. గత నెలలో నిర్వహించిన తొలి విడత క్రాస్ ఎగ్జామినేషన్‌లో 15 మందిని విచారించిన కమిషన్ ఈ దఫాలో 25 మందిని విచారించే అవకాశముంది. ఇప్పటికే కమిషన్ ముందు విచారణకు హాజరై అఫిడవిట్లు దాఖలు చేసిన అధికారులు, అనధికారులందరినీ సాక్షులుగా పరిగణించి క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించాలని కమిషన్ నిర్ణయం తీసుకుంది. సాక్షులు ఇచ్చిన సమాచారం ఆధారంగా వచ్చే నెలలో రాజకీయ నేతలను విచారణకు పిలిచే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా బరాజ్‌ల నిర్మాణంలో లోపాలతో పాటు శాశ్వత పునరుద్ధరణ చర్యలపై సత్వరంగా తుది నివేదికను సమర్పించాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీకి మళ్లీ కమిషన్ లేఖ రాసింది. కాగా విచారణ ప్రక్రియలో కమిషన్‌కు సహకరించడానికి ప్రభుత్వం ఓ న్యాయవాదిని నియమించడానికి అనుమతినిచ్చింది.

రాళ్లలో రతనాలు పండేనా?

వరదలతో రాళ్లు తేలి, ఇసుక మేటలు వేసిన పొలాల రైతుల ఆవేదన

- ఖమ్మం జిల్లాలో మొత్తంగా 68,345 ఎకరాలకు దెబ్బ
- అందులో 5 వేలకుపైగా ఎకరాల్లో రాళ్లు, ఇసుక మేటలు
- ఎకరాకు రూ.10వేలు పరిహారం ఇస్తామన్న సర్కారు
- ఇసుక మేటలు వేసిన భూములకు అదనంగా పరిహారం ఇవ్వాలనే డిమాండ్లు
- వాటిని సాగు యోగ్యంగా మార్చాలంటే రూ.లక్షలు ఖర్చవుతాయని ఆవేదన



రాళ్లు, ఇసుక మేటలతో వ్యవసాయానికి పనికిరాకుండా పోయిన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలుకు చెందిన బండారు దేవేందర్‌రెడ్డి పొలం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: భారీ వర్షాలు, వరదలతో ఖమ్మం జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మొత్తం 68 వేల ఎకరాలకుపైగా దెబ్బతినగా.. అందులో ఇందులో 5 వేల ఎకరాలకుపైగా ఇసుక, రాళ్ల మేటలు వేశాయి. ఈ భూములను సాగుయోగ్యంగా మార్చడం ఎలాగని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు పరిహారం ఇస్తామని ప్రకటించిందని.. కానీ ఇసుక, రాళ్ల మేటలు వేసిన తమ భూముల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ భూములను సాగుయోగ్యం చేయాలంటే లక్షల రూపాయలు ఖర్చవుతాయని.. ప్రభుత్వం అదనంగా పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

ఆనవాళ్లు కూడా లేనంతా..

భారీ వర్షాలతో ఖమ్మం జిల్లాలో మున్నేరు, ఆకేరు విలయ తాండవం చేశాయి. వీటి పరీవాహకంలో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. నష్టంపై సర్వే చేపట్టిన అధికారులు.. 33శాతం పైన దెబ్బతిన్న పంటలనే పరిగణనలోకి తీసుకుని, 68,345 ఎకరాల్లో నష్టం జరిగినట్టు గుర్తించారు. వీటికి ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందనుంది. అయితే కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్, నేలకొండపల్లి, మధిర, ఎర్రుపాలెం, బోనకల్, తల్లాడ తదితర మండలాల్లో వేల ఎకరాల్లో భూములు సాగుయోగ్యం కాకుండా పోయాయి. ముఖ్యంగా తిరుమలాయపాలెం మండలం రాకాసితండాలో సారవంతమైన మట్టి అంతా కొట్టుకుపోయి రాళ్లు తేలి, ఇసుక మేట వేసింది. పంటలు సాగు చేయాలంటే.. భూములను బాగు చేసుకోవాలి. ఇందుకోసం లక్షల రూపాయలు ఖర్చవుతాయని రైతులు వాపోతున్నారు.

సర్వం కోల్పోయి.. భూమీ దెబ్బతిని..



తిరుమలాయపాలెం మండలం అజ్మీరా తండా పరిధిలోని రాకాసి తండాకు చెందిన భూక్యా దేశ్యా తన మూడెకరాలకు తోడు మరో ఎకరం కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశారు. రూ.4 లక్షలు వెచ్చించి మల్చింగ్ పద్ధతిలో నాటాడు. కానీ ఆకేరు వరదతో పంట ఆనవాళ్లు లేకుండా పోయింది. పైగా పొలం అంతా ఇసుక మేటలు వేసింది. వరదలతో ఇంట్లో ఉన్న సర్వం కోల్పోయామని.. జీవనాధారమైన భూమి కూడా బాగా దెబ్బతిన్నదని దేశ్యా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.



సీఎంఆర్ఎఫ్‌కు సింగరేణి ఉద్యోగులు రూ.10.25 కోట్ల విరాళం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సహాయ నిధికి సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఉద్యోగులు తమ ఒకరోజు మూల వేతనం రూ.10.25 కోట్లను విరాళంగా అందజేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సింగరేణి సంస్థ ఇన్‌చార్జ్ సీఎండీ ఎన్.బలరామ్, గుర్తింపు కార్మిక సంఘాల నేతలు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ విరాళం చెక్కును అందజేశారు. ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు రూ.25 లక్షలు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రూ.2.5 లక్షల విరాళాన్ని కూడా సీఎంకు అందజేశారు.

ఉద్యోగుల ఒక రోజు వేతనం సీఎం సహాయనిధికి జమ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఉపాధ్యాయుల సెప్టెంబర్ నెలలో ఒక రోజు వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి జమ చేసేలా సంబంధిత శాఖల అధిపతులు, డ్రాయింగ్ ఆఫీ సర్లు చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణ గురువారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో వివిధ వర్గాల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఒక రోజు వేతనం ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో ఉద్యో గులు, గెజిటెడ్ అధికారులు, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లతో కూడిన తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఒక రోజు వేతనం విరాళంగా ప్రకటించిన నేపథ్యంలో రామకృష్ణ ఆయాశాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

‘స్త్రీ నిధి’లో అక్రమాలపై విచారణకు కమిటీ

సాక్షి, హైదరాబాద్: ‘స్త్రీ నిధి’ క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్‌లో నిధుల దుర్వినియోగం, ఇతర ఆరోపణలపై పీఆర్, ఆర్డీ కమిషనర్ అనితా రామచంద్రన్ నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ సంస్థలో నిధుల మళ్లింపుతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల వినియోగంలో అక్రమాలు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అక్రమ తొలగింపు తదితర ఆరోపణలపై విచారణకు ఈ కమిటీని ఏర్పాటుచేశారు. సభ్యులుగా ఐటీ శాఖ ఏజీఎం పెండ్యాల శ్రీనివాస్, ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ చంద్రకళ, సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ జి. శ్రీనివాస రావులను నియమించారు. శాఖాపరంగా విచారణ జరిపి రెండునెలల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని పీఆర్ శాఖ ఈ కమిటీని ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. స్త్రీనిధి సహకార సమాఖ్యలో అక్రమాలు జరిగాయంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఓయూ తెలంగాణ విద్యార్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం శ్రీకాంత్ సర్కార్ సమర్పించిన వినతిపత్రం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉంటే.. గత రెండేళ్లుగా స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డిపై అనేక ఆరోపణలు వచ్చాయని తాము చేసిన ఫిర్యాదుపై స్పందించి ప్రభుత్వం విచారణ కమిటీని వేసిందని శ్రీకాంత్ సర్కార్ ఒక ప్రకటనలో తెలిపారు.

అమ్మ ప్రాణం తీసిన రూ.500

- తల్లి కళ్లెదుటే కన్న కొడుకుల పెనుగులాట
- విడిపించేందుకు వెళ్లిన వృద్ధురాలిని నెట్టేసిన కొడుకు
- పిల్లలు చూస్తుండగానే ప్రాణం వదిలిన వైనం



శంకరమ్మ మృతదేహం

పరిగి: గొడవ పడుతున్న కొడుకులను విడిపించేందుకు వెళ్లిన ఓ తల్లి ప్రాణం కోల్పోయింది. క్షణికావేశంతో మొదలైన చిన్నపాటి తగాదా ఆమె నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. వికారాబాద్ జిల్లా పరిగి మండలం సయ్యద్‌మల్కాపూర్‌లో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శంకరమ్మ (63)కు వెంకటయ్య, శ్రీను, సత్యమ్మ సంతానం. భర్త గతంలోనే మృతిచెందగా.. చిన్న కొడుకు శ్రీనుతో కలిసి ఉంటోంది. పెద్దకొడుకు వెంకటయ్య కుటుంబంతో సహా సమీపంలోని నజీరాబాద్ తండాలో జీవిస్తున్నాడు. ఇదిలా ఉండగా ఇటీవల శ్రీను అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ నేపథ్యంలో అన్న వెంకటయ్యకు ఫోన్ చేసి.. మహ్మదాబాద్‌కు చెందిన పసుపుల మల్లయ్య వద్ద రూ.5 వేలు తీసుకురమ్మని చెప్పాడు. డబ్బులు తీసుకొచ్చిన వెంకటయ్య వాటిని తమ్ముడికి ఇచ్చేందుకు బుధవారం రాత్రి భార్యతో కలిసి సయ్యద్‌మల్కాపూర్ వచ్చాడు. ఇదిలా ఉండగా అనారోగ్యం పాలైన తమ్ముడిని పరామర్శించేందుకు అక్క సత్యమ్మ సైతం వచ్చింది. అయితే రాత్రి వేళ అందరూ భోజనానికి సిద్ధమవుతుండగా.. అన్నదమ్ములిద్దరూ మద్యం తాగేందుకు కూర్చున్నారు. కొద్దిసేపటి తర్వాత అక్క సత్యమ్మ తనకు ఇవ్వాల్సిన రూ.500 ఇవ్వలేదని వెంకటయ్య వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆగ్రహానికి గురైన శ్రీను తనను చూసేందుకు వచ్చిన అక్కను డబ్బులు అడుగుతావా అంటూ అన్నను నిలదీశాడు. ఇలా ఇరువురి మధ్య మాటా మాటా పెరిగింది. డబ్బు తెచ్చిస్తానని సత్యమ్మ చెప్పినా అన్నదమ్ముల వాగ్వాదం ఆగలేదు. ఈ క్రమంలో ఇద్దరూ పెనుగులాడుతూ ఇంటి ఎదురుగా ఉన్న సీసీ రోడ్డుపైకి చేరుకున్నారు. కొడుకులు కొట్టుకుంటున్నారని గాబరాపడిన తల్లి శంకరమ్మ.. ఇరువురినీ విడిపించే ప్రయత్నం చేసింది. దీంతో సహనం కోల్పోయిన శ్రీను మధ్యలో నీవెందుకు వస్తున్నావంటూ తల్లిని తోసేయగా, సీసీ రోడ్డుపై పడిపోయింది. కుటుంబ సభ్యులు వచ్చి లేపేందుకు ప్రయత్నించగా చలనం కనిపించలేదు. చుట్టుపక్కల వాళ్లు 108కి ఫోన్‌చేసి, అంబులెన్స్‌లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పెద్ద కొడుకు వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

హైదరాబాద్‌కని బయల్దేరి.. చికెన్ సెంటర్‌లో పని చేసి..

- ఇబ్రహీంపట్నంలో గురుకుల విద్యార్థుల ఆచూకీ లభ్యం




విద్యార్థులను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

దేవరకొండ: అదృశ్యమైన ముగ్గురు పదోతరగతి విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. దేవరకొండలో డీఎస్పీ గిరిబాబు గురువారం ఆ వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంకొండభీమనపల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న అబ్దుల్ రహమాన్, ముజీబ్, తౌఫిక్‌లు మంగళవారం ఉదయం పాఠశాల ప్రహరీ దూకి పారిపోయిన విషయం తెలిసిందే. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

చికెన్ సెంటర్‌లో పనిచేసి..

పాఠశాల నుంచి పారిపోయిన ముగ్గురు విద్యార్థులు ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కని బయల్దేరారు. టికెట్ సరిపడా డబ్బులు లేకపోవడంతో ఇబ్రహీంపట్నం వద్ద దిగిపోయారు. మంగళవారం రాత్రి అక్కడే బస చేశారు. విద్యార్థుల్లో ఒకరైన తౌఫిక్ తండ్రి చికెన్ సెంటర్ నిర్వహించేవాడు. తౌఫిక్ అప్పుడప్పుడూ తండ్రికి చేదోడువాదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నంలో ఏదైనా చికెన్ సెంటర్‌లో పని దొరుకుతుందేమోనని ప్రయత్నించారు. ఓ చికెన్ సెంటర్ యజమాని వారిని పనిలో పెట్టుకున్నాడు. బుధవారం రాత్రి విద్యార్థులకు చికెన్ సెంటర్ యజమాని రూ.200 ఇచ్చాడు. ఆ డబ్బులతో హైదరాబాద్‌లోని చార్మినార్ వెళ్లేందుకు సన్నద్ధమయ్యారు. దేవరకొండ సీఐ నర్సింహులు, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం గాలింపు చేపట్టగా, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద ఉన్నట్టు గుర్తించి బుధవారం అర్ధరాత్రి దేరకొండ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

‘సీతారామ’లో ట్రయల్‌రన్ విజయవంతం



ట్రయల్‌రన్‌లో ఎగిసిపడుతున్న గోదావరి జలాలు

ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం శివారులోని సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్ఆర్ఎల్ఐపీ) పంప్‌హౌజ్ -2లో ఆరో మోటార్ ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ పంప్‌హౌజ్‌లో ఒక్కొక్కటి 40 మెగావాట్ల సామర్థ్యం గల ఆరు మోటార్లు ఉన్నాయి. ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మోటారు -1ను ఆన్‌చేసి, సీతారామ ప్రాజెక్టును ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇక ఆరో మోటార్‌కు గురువారం ట్రయల్ రన్ చేపట్టి మోటారు సామర్థ్యాన్ని పరీక్షించారు. దీంతో గోదావరి జలాలు ఎగిసిపడుతూ ప్రధాన కాలువ గుండా కమలాపురం పంప్‌హౌజ్ -3లోకి పరుగులిడాయి. మిగిలిన నాలుగు మోటార్లను సైతం ట్రయల్‌రన్ కోసం నీటిపారుదలశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కార్యక్రమంలో డీఈ మోతీలాల్, ఏఈలు గఫూర్‌పాషా, రామన్, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆర్‌జీఐఏకు సీఐఐ జాతీయ అవార్డులు

శంషాబాద్: జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరోసారి అవార్డులు వరించాయి. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ‘ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్’ 25వ జాతీయ అవార్డుల కార్యక్రమంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) నేషనల్ ఎనర్జీ లీడర్, ఎక్స్‌లెంట్ ఎనర్జీ ఎఫీషియెంట్ యూనిట్ అవార్డులను అందుకుంది. ఆర్‌జీఐఏ వరుసగా ఆరోసారి నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డును అందుకోగా ఎక్స్‌లెంట్ ఎనర్జీ ఎఫీషియంట్ యూనిట్ అవార్డును ఎనిమిదోసారి సొంతం చేసుకుందని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జీరో ఉద్గారాలను సాధించడంతో పాటు పర్యావరణ హిత ఇంధన సామర్థ్యాలను పెంపొందించడంతో ఆర్‌జీఐఏ అవలంబిస్తోన్న విధానాలకు ఇది గుర్తింపని ఫణీకర్ పేర్కొన్నారు.

ఆడపిల్లలపై ఇప్పటికీ వివక్షే

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బంజారాహిల్స్(హైదరాబాద్): సమాజంలో ఇప్పటికీ ఆడపిల్లలు వివక్షకు గురవుతున్నారని, గర్భంలోనే తుంచేస్తున్న ఘటనలు కలచి వేస్తున్నాయని మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. అందుకే ఆడపిల్లలు చదువుకుంటే కుటుంబంతోపాటు దేశం బాగుపడుతుందని చెప్పారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో విప్రో కన్జ్యూమర్ కేర్, సంతూర్ స్కాలర్‌షిప్ 9వ ఎడిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తన తల్లి కూడా ఓ రైతుకూలీగా పనిచేసేదని, ఆ రోజుల్లో ఇద్దరు టీచర్లు మా గ్రాండ్ పేరెంట్స్‌ను మోటివేట్ చేసి చదివించడం వల్ల తన తల్లి హెడ్‌మాస్టర్ అయ్యిందని, ఆమె పిల్లలమైనా మేము ఉన్నత విద్యావంతులు కాగలిగామని చెప్పారు. వ్యాపార సంస్థలు ఇలా ఆడపిల్లల చదువుల కోసం స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నీరజ్ ఖత్రి మాట్లాడుతూ ఇప్పటికే తాము తెలంగాణ, ఏపీ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని 8,137 మంది పేదింటి ఆడపిల్లలకు చదువుల కోసం సహాయం చేశామన్నారు. స్కాలర్‌షిప్ అవసరమైన విద్యార్థులు సంతూర్ స్కాలర్‌షిప్స్ డాట్ కామ్‌లో ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి శుభ్రతాదాస్ పాల్గొన్నారు.

తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

Lr No.E1/119/2024 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది : 20.09.2024

రూ.81.00 లక్షల మొత్తముతో సి.సి.రోడ్లు వేయుటకు, రూ.20.00 లక్షల మొత్తముతో అండర్ గ్రౌండ్ డ్రైన్ నిర్మాణము చేయుటకు, రూ.5.00 లక్షల మొత్తముతో గ్రావెల్ రోడ్లు వేయుటకు మరియు రూ.10.00 లక్షల మొత్తముతో శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేయుటకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. టెండరు షెడ్యూలు దిగువ విధంగా ఉన్నవి. టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేది : 20.09.2024 ఉ.10.00 గం. నుండి 27.09.2024 సా.4.00 గం.వరకు కమిషనర్, తుక్కుగూడ మున్సిపాలిటీ వారిచే స్వీకరించబడును మరియు టెండర్లను తెరచుట తేది : 27.09.2024 సా.04.01 గం.కు కమిషనర్, తుక్కుగూడ మున్సిపాలిటీ లేదా వారి డిప్యూటీచే తెరవబడుతుంది. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in దర్శించండి లేదా తుక్కుగూడ మున్సిపాలిటీ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించు నెం. 8639160741. సం/- కమిషనర్, తుక్కుగూడ మున్సిపాలిటీ

DIPR RO No.4269-PP/CL/Advt/1/2024-25, Dt: 19.09.2024

గౌరవనీయ తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సమక్షంలో

విద్యుత్ నియంత్రణ్ భవన్, జీటీఎస్ కాలనీ, కళ్యాణ్‌నగర్, హైదరాబాద్-500 045.

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (TGTRANSCO)

బహిరంగ ప్రకటన

O.P.No. 14 of 2024 మరియు O.P.No. 15 of 2024

1. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీట్రాన్స్‌కో) FY 2024-25 నుండి FY 2028-29 కొరకు టీజీట్రాన్స్‌కో యొక్క ARR మరియు ట్రాన్స్‌మిషన్ బిజినెస్ కొరకు ప్రతిపాదిత ఛార్జీలు మరియు స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (SLDC) కార్యకలాపాల కొరకు తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (TGERC) సమక్షంలో దాఖలు చేసినదని ఇందుమూలముగా అందరికీ తెలియజేయడమైనది. ఈ ఫైలింగ్స్‌ను వరుసగా O.P.No. 14 of 2024 (ట్రాన్స్‌మిషన్ బిజినెస్) మరియు O.P.No. 15 of 2024 (SLDC కార్యకలాపాలు) లో కమిషన్ ద్వారా రికార్డులోకి తీసుకోబడినవి.
2. ఈ ఫైలింగ్స్ కాపీలు చీఫ్ ఇంజనీర్ (Comml. & RAC), రూం నం. 149, ‘ఏ’ బ్లాక్, టీజీ ట్రాన్స్‌కో, విద్యుత్ సౌధ, హైదరాబాద్ - 500 082 మరియు చీఫ్ ఇంజనీర్ / (మెట్రో జోన్, రూరల్ జోన్, కరీంనగర్ జోన్ మరియు వరంగల్ జోన్) మరియు సూపరింటెండింగ్ ఇంజనీర్ / OMC / టీజీ ట్రాన్స్‌కో (ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, మెట్రో ఈస్ట్, మెట్రో వెస్ట్, మెట్రో సెంట్రల్, హైదరాబాద్‌లో ఉన్న సంగారెడ్డి) కార్యాలయాలలో 20.09.2024 నుండి లభించును. ఆసక్తి గల వ్యక్తులు ఉచితంగా సదరు ఫైలింగ్స్‌ను సదరు కార్యాలయాల్లో ఎక్కడైనా కార్యాలయ పనివేళల్లో తనిఖీ చేసి / చదువుకోవలెను మరియు వాటిని గమనించవలెను. ఈ ప్రతిపాదనలు www.tgtransco.comలో కూడా లభిస్తాయి మరియు వాటిని www.tgerc.telangana.gov.inలో కూడా పొందవచ్చును. ఈ ఫైలింగ్స్ యొక్క కాపీలను పైన తెలిపిన కార్యాలయాల నుంచి నగదుగా ఫొటో కాపీయింగ్ ఛార్జీలు చెల్లించి పొందవచ్చును.
3. ఆధార మెటీరియల్‌తోపాటు సదరు ఫైలింగ్స్‌పై ఏవైనా అభ్యంతరాలు / సూచనలను చీఫ్ ఇంజనీర్ (Comml. & RAC), రూం నం. 149, ‘ఏ’ బ్లాక్, టీజీ ట్రాన్స్‌కో, విద్యుత్ సౌధ, హైదరాబాద్-500 082 వారికి స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా 11.10.2024న లేదా అలోగా సాయంత్రం 5.00 గంటల వరకు చేరే విధంగా పంపవలెను. దాని కాపీని పైన తెలిపిన చిరునామాలోని కమిషన్ సెక్రటరీ, TGERC వారికి కూడా దాఖలు చేయాలి. అభ్యంతరాలు / సూచనలను తగువిధంగా సంతకం చేసి మరియు అభ్యంతరాలు / సూచనలను పంపే వ్యక్తుల పూర్తి పేరు, తపాలా చిరునామాతో ఉండాలి. అభ్యంతరాలు / సూచనలు ఏదేని సంస్థ లేదా వినియోగదారుల కేటగిరీ తరఫున దాఖలు చేస్తే దానిని స్పష్టంగా పేర్కొనవలెను. అభ్యంతరాలు / సూచనలతోపాటు దిగువ తెలిపిన స్టేట్‌మెంట్‌ను కూడా జతచేయాలి.

అభ్యంతరం తెలిపిన వ్యక్తి పేరు మరియు పూర్తి చిరునామా	అభ్యంతరం(లు)/ సూచన(లు) సంక్షిప్త వివరాలు	ARR మరియు ట్రాన్స్‌మిషన్ బిజినెస్ కొరకు ప్రతిపాదిత ఛార్జీలు మరియు SLDC కార్యకలాపాల కొరకు టీజీ ట్రాన్స్‌కో ద్వారా ఫైలింగ్స్‌పై అభ్యంతరాలు	టీజీ ట్రాన్స్‌కో ఆఫీసు వద్ద అభ్యంతరం కాపీ మరియు ఐక్నాలెడ్జ్‌మెంట్ రుజువు జత చేయబడింది (అవును/కాదు)	అభ్యంతరం తెలిపే వ్యక్తి స్వయంగా విన్నవించు కోదలిచారు (అవును/కాదు)

4. తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ 22.10.2024 (మంగళవారం)న ఉ. 10.30 గం. నుండి TGERC యొక్క కోర్టు హాలులో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని ఉద్దేశిస్తున్నది.

ప్రదేశం : హైదరాబాద్
తేది : 20.09.2024

సం/- ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, టీజీ ట్రాన్స్‌కో

షెడ్యూలు-I

ట్రాన్స్‌మిషన్ బిజినెస్ యొక్క FY 2024-25 నుండి FY 2028-29 కొరకు యాగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్ (ARR)

క్ర. సం.	వివరాలు	నియంత్రణ కాల వ్యవధి FY 2024-25 (n+1)	FY 2025-26 (n+2)	FY 2026-27 (n+3)	FY 2027-28 (n+4)	FY 2028-29 (n+5)
1	ఆపరేషన్ & మెయింటెనెన్స్ ఖర్చులు	1,489.89	1,600.09	1,708.95	1,883.6	2,047.74
2	తరుగుదల	661.73	780.71	916.08	1,054.15	1,110.10
3	రుణంపై వడ్డీ మరియు ఫైనాన్స్ ఛార్జీలు	971.83	1,109.47	1,244.05	1,388.80	1,518.20
4	నిర్వహణ మూలధనంపై వడ్డీ	71.50	90.09	99.54	113.69	124.18
5	ఈక్విటీపై రాబడి	822.12	945.29	1,071.56	1,210.77	1,343.74
6	తగ్గింపు :					
6.1	నాన్-టారిఫ్ ఆదాయం	464.70	515.70	580.46	641.18	651.18
6.2	ఓపెన్ యాక్సెస్ ఛార్జీల నుండి ఆదాయం	-	-	-	-	-
6.3	ఇతర వ్యాపారం నుండి ఆదాయం	-	-	-	-	-
7	కలుపుట :					
7.1	ముందటి కాలానికి ట్రూ-అప్ ప్రభావం	-582.68	-	-	-	-
8	యాగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్	2,969.68	4,009.95	4,459.72	5,009.83	5,492.77

షెడ్యూలు-II

FY 2024-25 నుండి FY 2028-29 కొరకు ట్రాన్స్‌మిషన్ టారిఫ్‌లు మరియు నష్టాల ఫైలింగ్

వివరాలు	FY 2024-25 (n+1)	FY 2025-26 (n+2)	FY 2026-27 (n+3)	FY 2027-28 (n+4)	FY 2028-29 (n+5)
ట్రాన్స్‌మిషన్ బిజినెస్ యొక్క ARR (రూ. కోట్లలో)	2,969.68	4,009.95	4,459.72	5,009.83	5,492.77
ట్రాన్స్‌మిషన్ కాంట్రాక్టెడ్ కెపాసిటీ (MW)	22,590.84	22,359.01	22,276.22	22,131.05	21,606.63
ట్రాన్స్‌మిషన్ ఛార్జీలు (Rs/kW/month)	109.55	149.45	166.83	188.64	211.85

వివరాలు	2024-25 (Proj)	2025-26 (Proj)	2026-27 (Proj)	2027-28 (Proj)	2028-29 (Proj)
ట్రాన్స్‌మిషన్ నష్టాల శ్రేణి	2.48 +/- 0.2	2.46 +/- 0.2	2.44 +/- 0.2	2.42 +/- 0.2	2.40 +/- 0.2

షెడ్యూలు-III

SLDC కార్యకలాపాలలో FY 2024-25 నుండి FY 2028-29 కొరకు యాగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్ (ARR)

వివరాలు	FY 2024-25 (n+1)	FY 2025-26 (n+2)	FY 2026-27 (n+3)	FY 2027-28 (n+4)	FY 2028-29 (n+5)
SLDC వ్యాపారం యొక్క ARR (రూ. కోట్లలో)	83.59	89.16	110.26	114.08	118.11
జనరేషన్ కాంట్రాక్టెడ్ కెపాసిటీ (MW)	23,598.52	23,366.69	23,283.90	23,130.72	22,600.31
SLDC ఛార్జీలు (Rs/MW/month)	2,951.80	3,179.74	3,946.22	4,109.97	4,355.03

DIPR RO No. 4303-PP/CL/ADVT/1/2024-25, Dt. : 19.09.2024

CSIR - INDIAN INSTITUTE OF CHEMICAL TECHNOLOGY
(Council of Scientific & Industrial Research)
Hyderabad - 500007.

WALK-IN-INTERVIEW NOTIFICATION NO. 11/2024

CSIR-IICT, Hyderabad is conducting Walk-in-Interviews on 27th & 30th September, 2024 for the positions of Project Staff having qualifications of MSc in (Chemistry / Microbiology / Biotechnology) / B.Tech in Chemical Engineering / M.Pharm / B.Sc / (SSC / 10th plus ITI) etc.

For full details visit our website www.iictindia.org

Sd/-
Controller of Administration

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, I&CADD, ఇరిగేషన్ సర్కిల్, కె.సి.కాలనీ, వరంగల్-506015

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

టెండరు ప్రకటన నం. 04/2024-25(1st Call) తేది : 13.09.2024

పని పేరు : I&CAD శాఖ - ఫేజ్-I & ఫేజ్-II స్కీమ్స్ యొక్క ఆపరేషన్ &నిర్వహణ- 01.10.2024 నుండి 31.05.2026 (20 నెలలు) వరకు వర్తింపుతో 01.06.2024 నుండి 31.05.2026 (24 నెలలు) వరకు ఫేజ్-I క్రింద నాలుగు (4) ఎత్తిపోతల దశల్లో భీంఘన్‌పూర్, పుల్కుర్తి మరియు ధర్మసాగర్ మీదుగా ఆర్.ఎస్. ఘన్‌పూర్ ట్యాంక్‌కు ఇన్‌టేక్ నుండి 2.5 మీ. దయా పైప్‌లైన్‌తో ములుగు జిల్లా, కన్నాయిగూడెం (మం), గంగారం (గ్రా) దగ్గర మరియు ఆరు (6) దశల్లో భీంఘన్‌పూర్, సలివాగు, ధర్మసాగర్, గండిరామారం మరియు బొమ్మకూరు మీదుగా తాపస్‌పల్లి ట్యాంక్‌కు మరియు ఒకే దశలో ఆర్.ఎస్.ఘన్‌పూర్ నుండి అశ్వారావుపల్లి ట్యాంక్‌కు ఇన్‌టేక్ నుండి 3.0, 2.5, 2.0 మీ. దయా సింగిల్ పైప్‌లైన్ ద్వారా గోదావరి నది నుంచి నీటిని తోడుట. అంచనా వ్యయం (రూ.లక్షల్లో) : రూ.24,87,65,542/-. టెండరు డాక్యుమెంట్ల లభ్యత : 20.09.2024న ఉ.11.00 గం. నుండి. మరిన్ని వివరాలకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దర్శించండి : https://tender.telangana.gov.in

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, I&CADD, ఇరిగేషన్ సర్కిల్, కె.సి.కాలనీ, వరంగల్

DIPR RO No.4291-PP/CL/Advt/1/2024-25, Dt: 19.09.2024

TELANGANA POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA :: HYDERABAD -82.

T.No.e-15/CEG/SEG-1/KTPS-V&VI/E2A6/TGGENCO/2024-25
PJHEP- Design, Engineering Manufacture, inspection & shop testing at manufacturer's works before dispatch, delivery on F.O.R project site basis, Supply, erection, testing and commissioning of latest Governor system. Digital Governor control panel with latest hot redundant bcontrollers and Hydraulic Mechanical Cabinet (HMC) along with its accessories etc., required for control of kaplan turbines for Units #1, 2 & 3 of each 9 MW at Pochampad Hydro Power Station, Nizambad Dist. - Value of the works: ₹ 3,37,50,000/- Scheduled Extended upto: 27-09-2024 at 15:00 Hrs.

T.No.e-13/CE/O&M/SE/Civil/KTPS-VII/TGGENCO/2024-25
BTPS - Supply of 1No.3.10 MVA, 33/6.6KV, DYN11 Transformer to Bhadradri Thermal Power Station, Manuguru, Bhadradri Kothagudem Dist-Value of the works: ₹ 36,84,200/- Scheduled Open & Closing Date: 10-09-2024 at 18:00 Hrs. & 10-10-2024 at 11:00 Hrs.

T.No.e-16/CEG/SEG-III/BTPS/GT/E8A1/TGGENCO/2024-25
CETD - Supply, Erection Testing and Commissioning of Fire fighting system at Skill Development Centre at Centre of Excellence for Training & Development, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works: ₹ 19,18,882/- Scheduled Open & Closing Date: 11-09-2024 at 12:30 Hrs. & 15-10-2024 at 15:30 Hrs.

T.No.e-126/CE/O&M/KTPS-VII Stage/P31/TGGENCO/2024-25
KTPS-VII - Procurement of Metal filling electrodes and dissimilar electrodes at Kothagudem Thermal Power Station Stage VII, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works: ₹ 24,23,295/- Scheduled Open & Closing Date: 09-09-2024 at 12:40 Hrs. & 01-10-2024 at 15:30 Hrs.

T.No.e-136/CE/O&M/KTPS-VII Stage/P31/TGGENCO/2024-25
KTPS-VII - Supply, Erection and Commissioning of CGL make 6.6KV vacuum circuit breaker panels in ICHP. at Kothagudem Thermal Power Station Stage VII, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works: ₹ 29,40,000/- Scheduled Open & Closing Date: 10-09-2024 at 10:50 Hrs. & 04-10-2024 at 15:30 Hrs.

DIPR RO No.4289-PP/CL/Advt/1/2024-25, Dt: 19.09.2024

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003

PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri / Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	SHRI I V SOMA RAJU	SHRI BANDI SHESHURAJU S/o BANDI SUBBA RAO	FNO 103/GF SRI APARTMENTS ON PNO 62 & 63 SY NO 291/2, BOWENPALLY	SALE DEED NO 1487/2024 DT 21/06/2024 (LINK DOCUMENT)
2	SMT JUGTA AHLUWALIA	1.SHRI HARSHDEEP SINGH AHLUWALIA S/o HARCHARAN SINGH AHLUWALIA 2.SMT SIMRAN MAINI W/o VIKAS MAINI	PNO A-3/GF VIKRAMPURI CHS (VENT'A) KARKHANA	DEATH CERTIFICATE OF JUGTA AHLUWALIA WILL DEED DT 12/06/2023 & AFFIDAVIT FROM WITNESSES TO THE WILL (LINK DOCUMENT)
3	SHRI PRODDATURI SRINIVAS	SHRI R REDDAPPA S/o R CHINNARAJULU REDDY	FNO 109/FF SRI SAI MARUTHI APRTS TRIMULGHERRY	SALE DEED NO 2027/2022 DT 10/11/2022 (LINK DOCUMENT)
4	1.SHRI MAYANK SANGHANI S/o LALIT CHANDRA C SANGHANI 2.SMT PREETI SANGHANI W/o MAYANK SANGHANI	SHRI CHUNDURU SIVA PRASAD S/o SUBBARAYUDU CHUNDURU	PNO 3/GF/FF, SYNO 26 LAXMI NAGAR PICKET	SALE DEED NO 1270/2024 DT 22/07/2024 (LINK DOCUMENTS)
5	SHRI S SRIDHAR RAO	SMT S SHILPA W/o S SANTOSH N RAO	PNO 33/P/GF BHAVANA COLONY BOWENPALLY	SALE DEED NO 308/2021 DT 24/02/2021 (LINK DOCUMENT)
6	1.SMT M BALAMMA 2.SHRI M RAMULU	SHRI MADDIKUNTA GOPAL S/o M M RAMULU	PORTION OF HNO 1-20-0151 RASOOLPURA VILLAGE, RASOOLPURA	GIFT SETTLEMENT DEED NO 972/2008, DT 16/07/2008 (LINK DOCUMENT)

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.

No. SCB/Tax branch/1657, Office of the Cantonment Board,
Court House Compound, S.P. Road, Secunderabad - 500 003. Date : 19-09-2024

Sd/-
D. Madhukar Naik
Chief Executive Officer, Secunderabad Cantonment Board.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED

Hetero Healthcare Limited

Job Opportunity: Sr.Executive & Executive Marketing
Stream: Digital & Product Executive
Experience: 1-3 Years
Location: Hyderabad
Qualifications: MBA (Marketing)
Salary: On par with market standards.

Interested candidates are invited to fill out the application form and upload the resume using QR code.

Scan QR Code





పేరు వేరే అయినా..
పేజర్ వీళ్లదే

హంగేరీలో నకిలీ కంపెనీ స్థాపించిన ఇజ్రాయెల్!

ఈ పేజర్ల కోసం ఆర్డర్ ఇచ్చిన హెజ్‌బొల్లా

లెబనాన్‌లో పేలుళ్ల ఘటనలో వెలుగులోకి కొత్త విషయాలు

లెబనాన్‌లో వేలాది పేజర్‌లు ఒకే సమయంలో పేలి వేలాది మందిని గాయపరిచి, కొందరి ప్రాణాలు తీసిన ఘటనలో కొత్త విషయాలు బయటికొస్తున్నాయి. పేలిన పేజర్‌లను హంగేరీలోని ఒక సంస్థకు హెజ్‌బొల్లా, లెబనాన్ సైన్యం ఆర్డర్ ఇవ్వగా వాటిలో స్వల్ప పరిమాణంలో పేలుడు పదార్థాన్ని అమర్చి సరఫరా చేశారని గత రెండ్రోజులుగా వార్తలొచ్చాయి. అయితే వాస్తవానికి ఆ పేజర్‌లను తయారుచేసిన సంస్థ ఇజ్రాయెల్‌కు చెందిన డొల్ల కంపెనీ అని అంతర్జాతీయ మీడియా కోడై కూస్తోంది. హంగేరీలో పేరులో 'బీఏసీ' అక్షరాలుండే కంపెనీలు కుప్పలుతెప్పలుగా ఉన్నాయి. వీటి పోలికలతో 'బీఏసీ కన్సల్టింగ్ కేఎఫ్‌టీ' పేరిట ఒక నకిలీ కంపెనీని ఇజ్రాయెల్ స్థాపించింది. పేజర్‌లను అది తయారుచేస్తుంది. హెజ్‌బొల్లా సభ్యులకు పేలుడు పదార్థమున్న పేజర్‌లను సరఫరా చేసి వారిని అంతంచేయడమే ఈ కంపెనీ లక్ష్యం. ఇందుకోసం ముగ్గురు ఇజ్రాయెల్ నిఘా విభాగ అధికారులు ప్రత్యేకంగా పనిచేశారని తెలుస్తోంది. లెబనాన్ నుంచి పేజర్‌ల సరఫరా కాంట్రాక్ట్ సంపాదించేందుకు ఇజ్రాయెల్ చాన్నాళ్ల క్రితమే మూడు డొల్ల కంపెనీలను ఏర్పాటుచేసిందని న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ఈ మూడు కంపెనీల్లో ఒకటైన బీఏసీ కన్సల్టింగ్ కేఎఫ్‌టీ హంగేరీలోని బుడాపెస్ట్ కేంద్రంగా పనిచేస్తోంది. ఈ సంస్థకు, ఇజ్రాయెల్‌కు సంబంధం ఉంటుందని హెజ్‌బొల్లా అస్సలు ఊహించలేదు. ఎలాంటి అనుమానం రాకపోవడంతో బీఏసీ కన్సల్టింగ్ సంస్థకే హెజ్‌బొల్లా పేజర్ల సరఫరా ఆర్డర్ ఇచ్చిందని ఇరాన్‌లోని మెహర్ న్యూస్‌ఏజెన్సీ వివరించింది. బీఏసీ కన్సల్టింగ్ గత మూడేళ్లుగా తైవాన్‌కు చెందిన గోల్డ్ అపోలో బ్రాండ్‌తో పేజర్లు తయారుచేసి విక్రయిస్తోంది. దీంతో హెజ్‌బొల్లా నుంచి చాలా సులువుగా బీఏసీ సంస్థ ఆర్డర్ సాధించగల్గిందని మెహర్ తన కథనంలో పేర్కొంది. అందుకే యూరప్ దేశానికి చెందిన పేజర్‌లు పేలితే తనకేం సంబంధం అన్నట్లు ఇజ్రాయెల్ ఇంతవరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదని తెలుస్తోంది. అయితే ఈ విషయమై బీఏసీ కన్సల్టింగ్ వాదన మరోలా ఉండటం విశేషం. ''పేజర్ల తయారీలో మాకు ఎలాంటి సంబంధం లేదు. మేం కేవలం వాటిని రవాణా చేశాం'' అని బీఏసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిణి క్రిస్టినా బార్సోనీ అర్సిడియాకోనో స్పష్టంచేశారు. పేలిన పేజర్లను మాత్రమేగాక సాధారణ పౌరుల కోసం కూడా వేలాది పేజర్‌లను ఈ సంస్థ తయారుచేసినట్లు సమాచారం. ఈ సాధారణ పేజర్‌లు ఏవీకూడా పేలినట్లు వార్తలు రాలేదు. హెజ్‌బొల్లా సభ్యులు వాడిన, పేలిన పేజర్‌లు 2022 ఏడాది అర్ధభాగంలో తయారుచేసి ఉంటారని తెలుస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

యుద్ధం అంచున..

- భారీ మూల్యం తప్పదంటూ హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లా ప్రసంగం
- వెనువెంటనే దక్షిణ లెబనాన్‌పై దాడులకు దిగిన ఇజ్రాయెల్
- ప్రతిదాడులతో యుద్ధక్షేత్రంగా మారుతున్న సరిహద్దు ప్రాంతాలు
- ఇద్దరు ఇజ్రాయెలీ సైనికుల దుర్మరణం
- పశ్చిమాసియాలో కమ్ముకుంటున్న యుద్ధమేఘాలు


లెబనాన్ సరిహద్దు గ్రామం అద్షిత్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో కమ్ముకున్న పొగలు

బీరుట్: చేతిలో ఇమిడే చిన్నపాటి పేజర్‌లు, వాకీటాకీలను పేల్చేసి హెజ్‌బొల్లాపై అనూహ్య దాడులకు దిగిన ఇజ్రాయెల్ శుక్రవారం ఏకంగా లెబనాన్ రాజధాని బీరుట్ గగనతలంలో జెట్‌విమానాలతో రంగ ప్రవేశం చేసి ఒక్కసారిగా యుద్ధవాతావరణాన్ని సృష్టించింది. అనూహ్య పేలుళ్లతో వేలాది మంది హెజ్‌బొల్లా సాయుధుల, పౌరుల రక్తం కళ్లజూసిన ఇజ్రాయెల్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా ప్రసంగించిన కొద్దిసేపటికే ఇజ్రాయెల్ సైనిక చర్యకు దిగింది. దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లా స్థావరాలపై దాడులు చేసి పశ్చిమాసియాలో సమరాగ్నిని మరింత రాజేసింది. ఇజ్రాయెల్ బలగాలకు హెజ్‌బొల్లా దీటుగా బదులిస్తున్నాయి. ఈ సందర్భంగా అల్-మర్జ్ ప్రాంతంలో హెజ్‌బొల్లా జరిపిన దాడిలో ఇజ్రాయెల్ సైన్యంలోని 43 ఏళ్ల రిజర్వ్ మేజర్ నేయిల్ ఫార్సీ, 20 ఏళ్ల సర్జెంట్ టోమర్ కెరెన్ ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒకరు డ్రోన్ దాడిలో, మరొకరు ట్యాంక్ విధ్వంసక క్షిపణి దాడిలో చనిపోయారని ఇజ్రాయెల్ ఎన్12 న్యూస్ వార్తాసంస్థ ప్రకటించింది. బీరుట్ నగరం మీదుగా ఒక్కసారిగా ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు తక్కువ ఎత్తులో చెవులు చిల్లులుపడేలా ధ్వని వేగంతో దూసుకుపోవడంలో అసలేం జరుగుతుందో తెలీక జనం భయపడిపోయారు. తాము చాలా డ్రోన్లను ఆకాశంలో చక్కర్లు కొట్టడం చూశామని స్థానికులు చెప్పారు.

హెజ్‌బొల్లా స్థావరాలపై దాడులు

హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లా ప్రసంగిస్తుండగానే హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. దాదాపు 150 రాకెట్ లాంచర్లను ధ్వంసంచేసింది. హెజ్‌బొల్లా ఉగ్ర కార్యకలాపాలు, మౌలిక సదుపాయాల నాశనమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ ప్రకటించింది. చాలా సంవత్సరాలుగా సరిహద్దు ప్రాంతాల పౌరుల ఇళ్లను ఆయుధాలతో నింపి వాటి కింద సొరంగాలు తవ్విందని హెజ్‌బొల్లాపై ఆరోపణలు గుప్పించింది. పౌరులను మానవ కవచాలుగా వాడుకుంటూ దక్షిణ లెబనాన్‌ను యుద్ధ భూమిగా మార్చిందని ఆరోపించింది. ''ఉత్తర ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా దాడులతో తరలిపోయిన ఇజ్రాయెలీలు మళ్లీ సరిహద్దు ప్రాంతాల సొంతిళ్లకు తిరిగి చేరుకోవడం మాకు ముఖ్యం. వారి రక్షణ, భద్రత లక్ష్యంగా ఎలాంటి సైనిక చర్యలకైనా మేం సిద్ధం. సమస్యను మరింత జఠిలం చేస్తూ, ఆలస్యం చేసేకొద్దీ హెజ్‌బొల్లా మరింతగా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు'' అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యవ్ గాలంట్ హెచ్చరించారు. '' ఈ దాడులు ఆగవు. అయితే హెజ్‌బొల్లాతో పోరు చాలా సంక్లిష్టతతో కూడుకున్న వ్యవహారం'' అని సైన్యాధికారులతో భేటీలో గాలంట్ వ్యాఖ్యానించారు. పరస్పర దాడులతో ప్రపంచ దేశాలు అప్రమత్తమయ్యాయి. ఇది పూర్తి స్థాయి యుద్ధంగా పరిణమించకుండా సంయమనం పాటించాలని, ఉద్రిక్త పరిస్థితులను తగ్గించుకోవాలని ఇరుపక్షాలకు అమెరికా, ఫ్రాన్స్ సూచించాయి. ఈ విపరిణామంతో లెబనాన్‌లో ప్రజారోగ్యం కుదేలవుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ గెబ్రియేసిస్ ఆందోళన వ్యక్తంచేశారు. లెబనాన్ అభ్యర్థన మేరకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి శుక్రవారం అత్యవసరంగా సమావేశమయ్యే వీలుంది. యుద్ధభయాలతో అక్కడి తమ పౌరులు లెబనాన్‌ను వీడాలని బ్రిటిషర్లకు బ్రిటన్ విదేశాంగ శాఖ శుక్రవారం అత్యవసర అడ్వైజరీ జారీచేసింది. మరోవైపు లెబనాన్‌లో పేజర్లు, వాకీటాకీలు, సోలార్ వ్యవస్థల పేలుళ్లలో చనిపోయిన వారి సంఖ్య గురువారానికి 37కు పెరిగింది.

బీరుట్ ఎయిర్‌పోర్ట్‌లో పేజర్, వాకీటాకీలపై నిషేధం

వేలాది పేజర్‌లు, వాకీటాకీల పేలుళ్లతో కొంతమంది మరణాలు, వేలాదిగా హెజ్‌బొల్లా సభ్యులు క్షతగాత్రులైన ఘటనతో లెబనాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. విమాన ప్రయాణికుల, పౌర విమానయాన సంస్థల విమానాల భద్రతపై దృష్టిసారించింది. ఇందులోభాగంగా బీరుట్ నగరంలోని రఫీక్ హరీరీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరే ఏ విమానంలోనూ పేజర్, వాకీటాకీలను అనుమతించబోమని స్పష్టంచేసింది. ఈ మేరకు అన్ని విమానయాన సంస్థలకు గురువారం మార్గదర్శకాలు జారీచేసింది. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులందరికీ ఈ నిషేధం అంశం తెలియజేయాలని విమానయాన సంస్థలకు సూచించింది.

రెడ్‌లైన్ దాటి భారీ తప్పిదం చేసింది: నస్రల్లా



పరస్పర దాడులు మొదలుకావడానికి ముందే గుర్తుతెలియని ప్రదేశం నుంచి హమాస్ చీఫ్ నస్రల్లా టెలివిజన్‌లో ప్రసంగించారు. ''పేజర్‌లు, వాకీటాకీల పేలుళ్లతో వేలాది మంది ప్రాణాలు హరించేందుకు బరితెగించి ఇజ్రాయెల్ యుద్ధానికి దిగింది. వేల మందిని రక్తమోడేలా చేసి యుద్ధనేరానికి పాల్పడింది. పరికరాల విధ్వంసంతో మా కమ్యూనికేషన్‌కు భారీ నష్టం వాటిల్లిన మాట వాస్తవమే. అయినాసరే దాడులతో మాలో నైతిక స్థైర్యం మరింత పెరిగింది. ఇజ్రాయెల్‌పై పోరుకు మరింత సంసిద్ధమయ్యాం. అనూహ్య పేలుళ్లతో శత్రువు తన పరిధి దాటి ప్రవర్తించాడు. అన్ని నియమాలను, రెడ్‌లైన్‌ను దాటేశాడు. వాళ్లు ఊహించినట్లే దాడులు చేస్తాం. ఊహించనంతగా దాడి చేస్తాం. గాజాలో దాడులు ఆపేదాకా మేం ఉత్తరలెబనాన్ సరిహద్దులో దాడులు ఆపబోం. మా దాడుల దెబ్బకి పారిపోయిన సరిహద్దు ప్రాంతాల ఇజ్రాయెలీలు ఎన్నటికీ తమ సొంతిళ్లకు రాలేరు. దక్షిణ లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ బలగాలు అడుగుపెడితే అది మాకు సువర్ణావకాశం. వాళ్లు దారుణ ఫలితాలను చవిచూస్తారు'' అని అన్నారు.

ఏబీసీ చైర్మన్‌గా రియాద్ మాథ్యూ



న్యూఢిల్లీ: పత్రికల సర్క్యులేషన్‌ను మదింపు చేసి.. ధ్రువీకరించే ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ)కి చైర్మన్‌గా మలయాళ మనోరమకు చెందిన రియాద్ మాథ్యూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2024–25 సంవత్సరానికి ఆయన ఏబీసీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. చీఫ్ అసోసియేట్ ఎడిటర్ అయిన మాథ్యూ మలయాళ మనోరమ గ్రూపు డైరెక్టర్ కూడా. మాథ్యూ పీటీఐ వార్తా సంస్థ బోర్డులో కూడా 2009 నుంచి డైరెక్టర్‌గా ఉన్నారు. కరుణేష్ బజాజ్ (ఐటీసీ) డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నిక కాగా, మోహిత్ జైన్ కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. యాడ్ ఏజెన్సీల ప్రతినిధి విక్రమ్ సఖుజా కోశాధికారిగా తిరిగి ఎన్నికయ్యారు. 2024–25 సంవత్సరానికి ఏబీసీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్‌లోని సభ్యుల వివరాలు..

పబ్లిషర్స్ ప్రతినిధులు: రియాద్ మాథ్యూ (మలయాళ మనోరమ), ప్రతాప్ జి.పవార్ (సకాల్ పేపర్స్), శైలేష్ గుప్తా (జాగరణ్ ప్రకాశన్ లిమిటెడ్), ప్రవీణ్ సోమేశ్వర్ (హెచ్‌టి మీడియా లిమిటెడ్), మోహిత్ జైన్ (బెన్నెట్, కోల్‌మన్ అండ్ కంపెనీ లిమిటెడ్), ధ్రువ ముఖర్జీ (ఏబీపీ ప్రైవేట్ లిమిటెడ్), కరణ్ దర్డా (లోక్‌మత్ మీడియా ప్రై. లిమిటెడ్), గిరీష్ అగర్వాల్ (డీబీ కార్ప్ లిమిటెడ్).

ప్రకటనకర్తల ప్రతినిధులు: కరుణేష్ బజాజ్ (ఐటీసీ లిమిటెడ్), అనిరుధ హల్దార్ (టీవీఎస్ మోటర్స్ కంపెనీ లిమిటెడ్), పార్థో బెనర్జీ (మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్).

యాడ్ ఏజెన్సీల ప్రతినిధులు: శ్రీనివాసన్ కె.స్వామి (ఆర్‌కే స్వామి లిమిటెడ్), విక్రమ్ సఖుజా (మాడిసన్ కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్), ప్రశాంత్ కుమార్ (గ్రూప్ ఎం మీడియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్), వైశాలి వర్మ (ఇనీషియేటివ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్), సేజల్ షా (పబ్లిక్స్ మీడియా ఇండియా గ్రూపు).

విదేశీ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా శశిథరూర్



సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభలో నాలుగు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను దక్కించుకున్న విపక్ష కాంగ్రెస్ పార్టీ వాటికి చైర్మన్లను ఎంపిక చేసింది. ఇందులో అత్యంత కీలకమైన విదేశీ వ్యవహారాల స్టాండింగ్ కమిటీకి లోక్‌సభ ఎంపీ శశిథరూర్‌ను, వ్యవసాయంపై పార్లమెంటరీ ప్యానెల్‌కు పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీని, గ్రామీణాభివృద్ధిపై స్టాండింగ్ కమిటీకి కోరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, విద్యాశాఖ స్టాండింగ్ కమిటీకి రాజ్యసభ సభ్యుడు దిగ్విజయ్ సింగ్‌ల పేర్లను ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

సందీప్ ఘోష్ రిజిస్ట్రేషన్ రద్దు



కోల్‌కతా: వైద్యురాలి హత్యోదంతంలో అరెస్టయిన ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ రిజిస్ట్రేషన్‌ను పశ్చిమబెంగాల్ మెడికల్ కౌన్సిల్ (డబ్ల్యూబీఎంసీ) గురువారం రద్దు చేసింది. ఇక ఘోష్ వైద్యుడిగా ప్రాక్టీసు చేయలేరు. డబ్ల్యూబీఎంసీ నిర్వహించే రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ల జాబితా నుంచి సందీప్ ఘోష్ పేరును తొలగించినట్లు కౌన్సిల్ సభ్యుడొకరు వెల్లడించారు.

ఆతిశి కేబినెట్‌లో ముకేశ్ అహ్లావత్



న్యూఢిల్లీ: ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఆతిశి ఈ నెల 21న ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) గురువారం ధ్రువీకరించింది. ఆతిశి తోపాటు ఐదుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తారని వెల్లడించింది. అరవింద్ కేజ్రీవాల్ కేబినెట్‌లో సభ్యులైన గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్, కైలాశ్ గహ్లోత్, ఇమ్రాన్ హుస్సేన్‌కు మరోసారి మంత్రులుగా అవకాశం లభించిందని పేర్కొంది. ఆతిశి కేబినెట్‌లో కొత్తగా ముకేశ్ అహ్లావత్ చేరబోతున్నారని తెలిపింది. అహ్లావత్ 2020లో సుల్తాన్‌పూర్ మాజ్రా నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు.

'370'పై కాంగ్రెస్–ఎన్‌సీ, మా వైఖరి ఒక్కటే

పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న వేళ పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏల పునరుద్ధరణ విషయంలో తమ దేశ వైఖరి, కాంగ్రెస్–ఎన్‌సీ కూటమి వైఖరి ఒక్కటేనని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఎన్నికల అంశంగా తీసుకున్న ఈ రెండు పార్టీలు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచే అవకాశాలున్నాయంటూ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్ నైజం బయటపడింది: అమిత్ షా

ఆర్టికల్ 370కు మద్దతిస్తున్న కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ)లకు పాకిస్తాన్ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ వత్తాసు పలకడంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. పాక్ మంత్రి వ్యాఖ్యలతో ప్రతి పక్ష కాంగ్రెస్ పార్టీ నైజం మరోసారి బయట పడిందన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్, పాకిస్తాన్ వైఖరి ఒకేలా ఉంటాయని, రాహుల్ దేశ ప్రజల మనో భావాలను గాయపరుస్తూ, దేశ వ్యతిరేక శక్తులతోనే దోస్తీ చేస్తుంటారని గురువారం అమిత్ షా 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. భారత్‌లో ఉన్నది మోదీ ప్రభుత్వం, ఆర్టికల్ 370, ఉగ్రవాదం కశ్మీర్‌కు తిరిగి రావనే విష యం కాంగ్రెస్, పాక్ మర్చిపోయినట్లున్నాయని పేర్కొన్నారు.

కశ్మీర్‌లో యువ వికాసం

శ్రీనగర్, కాత్రాలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ హర్షం

శ్రీనగర్/కాత్రా: జమ్మూకశ్మీర్ యువత ఇక నిస్సహాయులు కాదని, వారితో సాధికారత మొదలైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రజాస్వామ్యంపై యువతలో విశ్వాసం పెరిగిందని, ఓటుతో మార్పు వస్తుందని వారంతా నమ్ముతున్నారని తెలిపారు. గురువారం జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో, రియాసీ జిల్లా కాత్రాలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని పునరుద్ఘాటించారు. తమ పరిపాలనలో ఇక్కడి యువతరం ప్రగతి పథంలో ముందడుగు వేస్తోందని హర్షం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్ యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా బీజేపీ ఎన్నో హామీలు ఇచ్చిందని, అవన్నీ నెరవేరుస్తామని ప్రకటించారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ పార్టీలపై మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. ఈ మూడు కుటుంబ పార్టీలు సొంత లాభం కోసం ప్రజాస్వామ్యాన్ని, కాశ్మీరియత్‌ను అణచివేశాయని మండిపడ్డారు. యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించకుండా దగా చేశాయని ఆరోపించారు. ఓటు వేసినా, వేయకున్నా ఆ మూడు కుటుంబాలే పెత్తనం చెలాయిస్తాయన్న ఆలోచన యువతలో ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయిందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఇంకా ఏం మాట్లాడారంటే...


కాత్రాలో రోడ్ షోలో పాల్గొన్న ప్రధాని మోదీ

ప్రజాస్వామ్య పండుగ

''జమ్మూకశ్మీర్‌లో గత ఐదేళ్లలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గతంలో సాయంత్రం 6 గంటలకే ఎన్నికల ప్రచారం నిలిపివేయాల్సి వచ్చేది. ఇంటింటి ప్రచారం అసాధ్యమే. ఇప్పుడు అర్ధరాత్రి దాకా స్వేచ్ఛగా ప్రచారం చేసుకోవచ్చు. ఎలాంటి ఆటంకాలు లేవు. ఇక్కడి ప్రజలు ప్రజాస్వామ్యాన్ని ఒక పండుగలా జరుపుకుంటున్నారు. ఓటు ప్రజాస్వామిక హక్కు. ఆ హక్కుతో చుట్టూ ఉన్న సమాజంలో కోరుకున్న మార్పును సాధించుకోవచ్చన్న భరోసా యువతలో ఏర్పడింది. సాధికారత దిశగా ఇదొక గొప్ప ముందడుగు. జమ్మూకశ్మీర్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తాం. కుటుంబంలో ఒక మహిళకు ఏటా రూ.18 వేల చొప్పున ఇస్తాం. ఆరోగ్య బీమాను రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచుతాం. జమ్మూకశ్మీర్ వేగంగా అభివృద్ధి చెందాన్నలదే మా ఆశయం. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు జమ్మూకశ్మీర్ భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయి. నూతన జమ్మూకశ్మీర్‌ను నూతన శిఖరాలకు తీసుకెళ్లే ఎన్నికలివి. అందుకే తెలివిగా ఓటు వేయాలి. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి. దశాబ్దాలుగా కొనసాగుతున్న వివక్షకు చరమగీతం పాడుతాం. ఇప్పుడు మన నినాదం అబ్‌కీ బార్.. బీజేపీ సర్కార్' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

బెంగాల్ జూడాల పాక్షిక సమ్మె విరమణ

- శనివారం నుంచి విధుల్లోకి
- అత్యవసర సేవలకు మాత్రమే..

కోల్‌కతా: సమ్మెను పాక్షికంగా విరమిస్తున్నట్లు బెంగాల్ జూనియర్ డాక్టర్లు గురువారం రాత్రి ప్రకటించారు. ఎమర్జెన్సీ, అత్యవసర సేవల విభాగాల్లో శనివారం నుంచి విధులకు హాజరవుతామని తెలిపారు. తమ డిమాండ్లలో చాలావాటిని మమతా బెనర్జీ సర్కారు ఆమోదించి, అమలులో పెట్టడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జూడాలు తెలిపారు. ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో పీజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ జూడాలు 41 రోజులుగా విధులను బహిష్కరిస్తున్నారు. స్వాస్థ్య భవన్ ఎదుట బైఠాయింపును కూడా విరమించుకుంటామని తెలిపారు. స్వాస్థ్య భవన్ నుంచి సాల్ట్ లేక్‌లోని సీబీఐ కార్యాలయానికి శుక్రవారం ర్యాలీ నిర్వహిస్తామని ప్రకటించారు. ఔట్ పేషెంట్ విభాగాల్లో (ఓపీ) పనిచేయబోమని స్పష్టం చేశారు. మమత సర్కారు ఇచ్చిన హామీలన్నీ కార్యరూపం దాల్చడానికి వారం రోజులు వేచిచూస్తామని, హామీలను నెరవేర్చకపోతే తిరిగి విధుల బహిష్కరణకు దిగుతామని తెలిపారు.

టీఎంసీ ఎంపీ సర్కార్ రాజీనామా



న్యూఢిల్లీ: వైద్యురాలి హత్యాచార ఉదంతంలో మమతా బెనర్జీ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోలేదని ఆక్షేపించిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ జవహర్ సర్కార్ గురువారం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. సర్కార్ రాజీనామాను రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆమోదించినట్లు అధికారవర్గాలు తెలిపాయి. వైద్యురాలి హత్యోదంతంలో బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు అత్యల్పమని, చాలా ఆలస్యంగా స్పందించిందని పేర్కొంటూ సర్కార్ తృణమూల్ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి ఇటీవల లేఖ రాశారు. రాజకీయాలకు స్వస్తి చెబుతానని ప్రకటించారు.

అంతరిక్షంలోనే సునీత బర్త్ డే



వాషింగ్టన్: భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతరిక్షంలో 59వ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. బోయింగ్ సంస్థ అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌తో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్‌ఎస్) చేరుకున్న సునీతా విలియమ్స్ అక్కడే చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. గురువారం తన పుట్టినరోజు కావడంతో సునీత ఐఎస్‌ఎస్‌లో తోటి వ్యోమగాములతో కలిసి తన బర్త్‌డే పార్టీ చేసుకున్నారు. సునీతా జన్మదిన వేడుకలు అంతరిక్షంలో జరగడం ఇది రెండోసారి. 2012లో ఆమె బర్త్‌డే అంతరిక్షంలోనే జరిగింది.

నా హత్యకు కుట్ర: పన్నూ

- అమెరికా కోర్టులో భారత ప్రభుత్వంపై పన్నూ దావా
- సమన్లు జారీ చేసిన న్యాయస్థానం



న్యూఢిల్లీ: తనను హత్య చేయడానికి భారత ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపిస్తూ ఖలిస్తాన్ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ ఇటీవల అమెరికా కోర్టును ఆశ్రయించాడు. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు ఫర్ సదరన్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్‌లో దావా వేశాడు. దీనిపై న్యాయస్థానం స్పందించింది. భారత ప్రభుత్వంతోపాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, భారత నిఘా సంస్థ 'రా' మాజీ అధినేత సమంత్ గోయల్, ఉద్యోగి విక్రమ్ యాదవ్, భారత వ్యాపారవేత్త నిఖిల్‌గుప్తాకు తాజాగా సమన్లు జారీ చేసింది. సమన్లు అందుకున్న వ్యక్తులు 21 రోజుల్లోగా సమాధానం చెప్పాల్సి ఉంటుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 21 నుంచి 23వ తేదీ దాకా అమెరికాలో పర్యటించనున్నారు. ఇంతలోనే అమెరికా కోర్టు భారత ప్రభుత్వానికి సమన్లు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. గురు పత్వంత్‌సింగ్ పన్నూకు కెనడాతోపాటు అమెరికా పౌరసత్వం ఉంది.

ఉగ్రవాది వేసిన దావాపై సమన్లా?

గురు పత్వంత్ సింగ్ పన్నూ వేసిన దావాపై తమకు అమెరికా కోర్టు సమన్లు జారీ చేయడం పట్ల భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉగ్రవాది అయిన పన్నూ వేసిన దావాపై భారత ప్రభుత్వానికి సమన్లు జారీ చేయడం పూర్తిగా అసమంజసమని పేర్కొన్నారు. ప్రభుత్వంపై పన్నూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. పన్నూ ప్రాతినిధ్యం వహిస్తున్న ఖలిస్తాన్ సంస్థపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం–1967 కింద నిషేధం అమల్లో ఉందని గుర్తుచేశారు. దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో ఆ సంస్థకు ప్రమేయం ఉందని విక్రమ్ మిస్రీ వెల్లడించారు.

జార్ఖండ్ మీపై కేసు వేస్తే తెలీదా?

- తెలియదని అంగీకరించిన అటార్నీ జనరల్ వెంకటరమణి
- సుప్రీంకోర్టులో ఆసక్తికర సన్నివేశం



న్యూఢిల్లీ: ఒక రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా కేంద్ర ప్రభుత్వంపై ధిక్కరణ పిటిషన్ వేస్తే తెలీకపోవడమేంటి? అని కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో ఆయన కొద్దిసేపు ఒకింత గందరగోళానికి గురైన ఘటన సర్వోన్నత న్యాయస్థానంలో చోటుచేసుకుంది. దేశంలోని పలు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తుల నియామకం కోసం సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను కేంద్రం అమలుచేయడానికి నిర్దిష్టకాలావధిని నిర్ణయించాలంటూ లాయర్ హర్ష్ విభోరే సింఘాల్ దాఖలుచేసిన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం గురువారం విచారించింది. అయితే దీనిపై శుక్రవారం వాదోపవాదనలు జరగనున్నాయి. అయితే అదనపు సమాచారం కోసం ఈ కేసును మరో వారంపాటు వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అటార్నీ జనరల్ వెంకటరమణి కోరారు. అంతలోనే సీజేఐ కలగజేసుకుని.. '' వాయిదా సంగతి సరే. అసలు కేంద్రం వైఖరిని తప్పుబడుతూ, కొలీజియం సిఫార్సులను కేంద్రం వెంటనే ఆమోదించట్లేదంటూ జార్ఖండ్ ప్రభుత్వం కేంద్రం మీద ధిక్కార కేసు వేసింది. మీకు ఆ విషయం తెలుసా?'' అని ప్రశ్నించారు. దీంతో అవాక్కవడం వెంకటరమణి వంతయింది. మళ్లీ సీజేఐ కలగజేసుకుని '' నిన్న కోర్టు పనులు ముగించుకుని రాత్రి ఇంటికి బయల్దేరేముందు దీనిని నా దృష్టికి తీసుకొచ్చారు. కేంద్రంపై ఏకంగా సుప్రీంకోర్టులో కేసు నమోదైతే ఆ విషయం కేంద్రం తరఫున వాదించే మీకు తెలీకపోవడమేంటి?' అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. '' అవును నిజంగానే తెలియదు'' అని ఆయన ఒప్పుకున్నారు.

రవ్‌నీత్ సింగ్ బిట్టూపై ఎఫ్‌ఐఆర్



బెంగళూరు: సిక్కులను విడగొట్టాలని చూస్తున్న రాహుల్‌గాంధీ అతిపెద్ద ఉగ్రవాది అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేంద్ర ఆహారశుద్ధి శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూపై కర్ణాటకలో కేసు నమోదైంది. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పథాధికారి ఇచ్చిన ఫిర్యాదుమేరకు గురువారం ఎఫ్‌ఐఆర్ నమోదుచేసినట్లు పోలీసు అధికారి చెప్పారు. రెండు వర్గాల మధ్య శత్రుత్వం పెంచి, ఘర్షణకు దారితీసేలా తప్పుడు ఆరోపణలు చేశారంటూ భారతీయ న్యాయ సంహిత చట్టంలోని పలు సెక్షన్ల కింద బెంగళూరులోని హైగ్రౌండ్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బిట్టూ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేయడం తెల్సిందే. భవిష్యత్తులో దేశంలోని సిక్కులు తలపాగా, కడియం ధరించి గురుద్వారాకు వెళ్లాలంటే పోరాటం చేయాల్సిన పరిస్థితులు వస్తాయేమో అని ఇటీవలి అమెరికా పర్యటనలో రాహుల్ వ్యాఖ్యానించారు. దీంతో రాహుల్‌ను విమర్శిస్తూ రవ్‌నీత్ బిట్టూ స్పందించడం తెల్సిందే. '' సిక్కులను విడగొట్టేలా ఉన్న రాహుల్ మాటలను ఉగ్రవాదులు సైతం మెచ్చుకున్నారు. అలాంటి వారి మద్దతు పొందుతున్న రాహుల్ దేశంలోనే నంబర్‌వన్ ఉగ్రవాది. అందుకే రాహుల్‌ను పట్టుకున్న వారికి.. దేశానికి పెద్ద శత్రువును పట్టిచ్చిన వారికిచ్చే బహుమానం ఇవ్వాలి'' అని బిట్టూ గతంలో అన్నారు.

కేసులతో భయపడను: మంత్రి

కేసు నమోదుపై మంత్రి స్పందించారు. '' కేసులతో భయపడేది లేదు. భారత్‌లో సిక్కుల పరిస్థితిపై రాహుల్ మాట్లాడింది ముమ్మాటికీ తప్పే. నా మాటలకు కట్టుబడి ఉన్నా. వంద కేసులు వేసినా వెనక్కి తగ్గను. దేశ ఐక్యత కోసం మాట్లాడతా. బుల్లెట్లకు భయపడని కుటుంబం నుంచి వచ్చా'' అని అన్నారు. బిట్టూ తాత, మాజీ పంజాబ్ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ గతంలో బాంబుదాడిలో ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే.

విఫల నేతను ప్రమోట్ చేయడానికే..

ప్రధాని మోదీకి ఖర్గే లేఖపై జేపీ నడ్డా వ్యాఖ్య



న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అభ్యంతకర రీతిలో దుర్భాషలాడుతున్న ఎన్డీఏ పక్షాల నేతలను అదుపు చేయాలని ప్రధాని మోదీకి ఇటీవల కాంగ్రెస్ చీఫ్ ఖర్గే రాసిన లేఖ వ్యవహారం ఇప్పుడప్పుడే చల్లారేలా లేదు. దేశ వ్యతిరేక శక్తులకు కొమ్ముకాయడంతోపాటు ప్రధాని మోదీని, ఓబీసీలను దొంగలనడం, ప్రధానిని అమర్యాదకరంగా దూషించిన రికార్డు రాహుల్ గాంధీకి ఉందని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా ఆరోపించారు. ఈ మేరకు నడ్డా గురువారం ఖర్గేకు మూడు పేజీల లేఖ రాశారు. ఏ నమ్మకంతో మీరు రాహుల్ గాంధీని సమర్థిస్తున్నారంటూ అందులో నిలదీశారు. ప్రజలతో పదేపదే తిరస్కారానికి గురైన విఫలమైన ఉత్పత్తి వంటి రాహుల్ గాంధీని బలవంతంగా రాజకీయంగా ప్రమోట్ చేయడానికే ప్రధాని మోదీకి లేఖ రాశారని ఖర్గేను ఎండగట్టారు.

మూడు రోజులు మంచులో చిక్కుకున్న జవాన్ రక్షించిన సైన్యం

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లో భారత్–చైనా సరిహద్దులో గస్తీ నిర్వహిస్తూ, దారి తప్పి మంచులో చిక్కుకుపోయిన ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీసు(ఐటీబీపీ) జవాను అనిల్ రామ్‌తోపాటు పోర్టర్ దేవేంద్ర సింగ్‌ను మూడు రోజుల తర్వాత భారత సైన్యం రక్షించింది. మున్స్యారీ–మిలామ్ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా విపరీతంగా మంచు కురియడంతో దారి మూసుకుపోయింది. జవాన్ అనిల్ రామ్, పోర్టర్ దేవేంద్ర సింగ్ దారితప్పారు. ఎటు వెళ్లాలో తెలియక ఓ గుహలో తలదాచుకున్నారు. వారిద్దరి ఆచూకీ తెలియకపోవడంతో సైన్యానికి చెందిన ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. మూడు రోజులపాటు గాలింపు చేపట్టింది. మున్స్యారీకి 84 కిలోమీటర్ల దూరంలోని ఒక గుహలో వారు ఉన్నట్లు గుర్తించింది. పూర్తిగా మంచుతో కప్పి ఉన్న గుహ నుంచి వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చింది. ఇద్దరినీ ఉత్తరాఖండ్‌లోని సైనిక ఆసుపత్రిలో చేర్పించింది.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



ఎన్ఆర్ఐలే టార్గెట్

జల్సాలకు అలవాటు పడిన ఓ యువకుడు.. అమెరికాలో ఉంటున్న ఎన్నారైలనే టార్గెట్‌గా చేసుకుని బెదిరింపు వసూళ్లకు పాల్పడ్డాడు. సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కాడు. -8లో



ఆశయ 'శిఖరాలు'..

పిట్ట కొంచెం పర్వతం ఘనం.. కానీ కూత ఘనమైన పిట్ట ముందు పర్వతం కొంచెంగా మారిపోతోంది. నగరం చిన్నారి మౌంటెనీర్లకు చిరునామాగా అవతరిస్తోంది. - సిటీ ప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/23.0

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. రాత్రివేళ వాతావరణం వేడిగా ఉంటుంది.




భక్తి శ్రద్ధలతో మిలాదున్ నబీ

మహ్మద్ ప్రవక్త జయంతి వేడుకైన మిలాదున్ నబీని ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. నగరంలోని వివిధ మిలాద్ కమిటీలు సభలు, సమావేశాల ఏర్పాటు చేసి మహ్మద్ ప్రవక్త ఔనత్యాన్ని, గొప్పతనాన్ని కొనియాడుతూ గేయాలు, ప్రసంగాలు చేశారు. పాతబస్తీతో పాటు పలుచోట్ల బైకులు, ఇతర వాహనాలతో ర్యాలీలు నిర్వహించారు. వీధులను ఆకుపచ్చ తోరణాలు, రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.

– సాక్షి, సిటీబ్యూరో





22,23 తేదీల్లో మహ్మద్ ప్రవక్త జయంతి బహిరంగ సభలు



సాక్షి, సిటీబ్యూరో: మహ్మద్ ప్రవక్త జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22, 23వ తేదీల్లో రెండు రోజుల పాటు బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు 'తామీరే మిల్లత్' అధ్యక్షుడు జియావుద్దీన్ నయ్యర్ తెలిపారు. ఈమేరకు గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22వ తేదీ ఎగ్జిబిషన్ మైదానంలో, 23న చంచల్‌గూడ జూనియర్ కాలేజ్ మైదానంలో ఈ బహిరంగ సభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సభల్లో దేశ, విదేశాల నుంచి ప్రముఖ మతగురువులు, ధార్మిక పండితులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో పాటు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు పాల్గొంటారని చెప్పారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ ప్రధాన వక్తలుగా హాజరవుతారని పేర్కొన్నారు.

పాఠశాలల్లో హాజరుశాతం

పెంచాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్‌పీ) పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. గురువారం డీఈఓ కార్యాలయంలో సీఆర్‌పీలు, సూపరింటెండెంట్స్, సెక్టోరల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ జాబ్ చార్ట్ ప్రకారం పనిచేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు.

గతంలో పాఠశాలల్లో హాజరు శాతం 50 శాతం కన్నా తక్కువగా ఉండేదని, ప్రత్యేక అధికారులను నియమించడంతోపాటు, కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమంతో ఫేస్ రికగ్నిజేషన్ సిస్టంలో 67.65 శాతం హాజరు పెరిగి రాష్ట్ర స్థాయిలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలబడిందన్నారు. పాఠశాలల్లో గైర్హాజరు హాజరవుతున్న పిల్లల తల్లిదండ్రులతో సీఆర్‌పీలు మాట్లాడి హాజరు శాతం పెరిగేలా బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కాగా పాఠశాలల్లో హాజరు శాతం తక్కువగా ఉన్న పది మంది సీఆర్‌పీలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ అనుదీప్ జిల్లా విద్యాశాఖాధికారికి ఆదేశించారు. చాలా కాలంగా గైర్హాజరవుతున్న సీఆర్‌పీస్‌ల నుండి వివరణ తీసుకోవాలన్నారు. వచ్చేవారం ఓరియంటేషన్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారిణి ఆర్.రోహిణి, అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏ ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిట..

- చాపకింద నీరులా పాకుతున్న వైరల్ జ్వరాలు
- అధికమవుతున్న చికున్ గున్యా, టైఫాయిడ్, డెంగీ, మలేరియా
- దోమల స్వైర విహారం, పారిశుధ్యలోపంతో రోగాలు

వైరల్..వైరల్!

నగరంలో ఎక్కడ చూసినా జ్వరాలే



వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి వద్ద..

సాక్షి, సిటీబ్యూరో/నల్లకుంట/వనస్థలిపురం:

వైరల్ ఫీవర్.. వైరల్ ఫీవర్.. ఎవరిని పలకరించినా ఇదే మాట చెబుతున్నారు. తీవ్ర జ్వరం..ఒళ్లు నొప్పులు..తల నొప్పితో పాటు జలుబు వంటి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఆస్పత్రి చూసినా జ్వరాల బారిన పడిన రోగులతో కిటకిటలాడుతోంది. వైరల్ జ్వరాలతో పాటు టైఫాయిడ్, మలేరియా, చికున్ గున్యా, డెంగీ వంటి జ్వరాలు కూడా ప్రబలుతున్నాయి. ఫీవర్ సర్వే చేస్తున్నామంటూ అధికారులు ఊదరగొడుతున్నా.. క్షేత్ర స్థాయిలో అలాంటి సర్వే చేస్తున్న జాడే కనిపించట్లేదు. నామ మాత్రంగా అక్కడో క్యాంపు.. ఇక్కడో క్యాంపు పెట్టి మమ అనిపించేస్తున్నారు. ఇక, వైద్యాధికారులను గట్టిగా అడిగితే మాత్రం..ఈ సీజన్‌లో జ్వరాలు కామన్ అంటూ సమాధానం దాటేస్తున్నారు. గత రెండు నెలలుగా నగరంలో పరిస్థితి ఇలాగే ఉన్నా అధికార యంత్రాంగం నుంచి ఎలాంటి చర్యలు కనిపించట్లేదు.

దోమల బెడద పట్టదా..?

నగరవ్యాప్తంగా దోమల బెడద తీవ్రమైంది. బస్తీలు, కాలనీల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకున్న నాథుడే కనిపించట్లేదు. దోమల వ్యాప్తి ద్వారా ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి జ్వరాలు వస్తున్నాయి. ఎప్పుడో ఒకసారి అలా వచ్చి దోమల పొగ స్ప్రే చేసి వెళ్తున్నా, దోమలను పూర్తి స్థాయిలో నివారించే చర్యలేవీ కనిపించట్లేదు. దీంతో అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారు.

ఫీవర్‌కు పెరుగుతున్న తాకిడి

అపరిశుభ్ర వాతావరణం, గతంలో కురిసిన వర్షాల ప్రభావంతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, డెంగీ, డయేరియా, వైరల్ ఫీవర్లతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. రక్త పరీక్షల్లో మాత్రం అధికంగా వైరల్ ఫీవర్ కేసులే తేలుతున్నాయి. ఓపీతో పాటు ఇన్ పేషంట్లుగా చేరే వారి సంఖ్య కూడా ఇటీవల పెరిగింది. ఇక, నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి జ్వరాల బాధితులతో కిక్కిరిస్తోంది. ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ ప్రతిరోజు 900కు పైగా ఓపీ నమోదవుతోంది. రోజుకు 20 నుంచి 45 మంది వరకు ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు. దీంతో మెడికల్ వార్డులు రోగులతో నిండిపోతున్నాయి. గతంలో 400 నుంచి 600 వరకు ఉన్న ఓపీ ఇప్పుడు 945కు చేరింది. అలాగే ఆయా ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీల్లోని యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో వైద్యం కోసం ఆశ్రయిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రులకు వెళ్లి అడ్మిషన్ పొందుతున్న వారు కూడా ఎక్కువే ఉన్నారు.

పారిశుధ్య లోపమే కారణం!

నగరంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారడం.. మంచి నీరు కూడా కలుషితం కావడం వల్ల టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలుతున్నాయి. వీటి నివారణకు వైద్య, ఆరోగ్య, సంబంధిత అధికారులు సరైన ముందస్తు చర్యలు తీసుకోలేదని ప్రజలు వాపోతున్నారు. దోమలు విజృంభిస్తున్న కారణంగా సీజనల్ వ్యాధులతో బాధపడే వారికి రక్త పరీక్షల్లో నార్మల్ వస్తున్నా.. జ్వరం, దగ్గు, నీరసం, జలుబు వంటి లక్షణాలతో బాధపడే వారు పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు.

పిల్లలపై ప్రభావం అధికమే..

వర్షాలు, వరదల అనంతరం విష జ్వరాల బాధితుల్లో చిన్నారులే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితుల్లో సుమారు 40 శాతం మంది పదేళ్ల లోపు చిన్నారులే ఉన్నారని చెబుతున్నారు. ఉన్నట్టుండి శరీరం వేడెక్కడం, నీరసం, చలి, గొంతునొప్పి వంటి లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారు.

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో..

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఓపీ కౌంటర్ వద్ద, వైద్య పరీక్షల కోసం, మందుల కోసం క్యూలైన్లలో నిల్చుంటున్నారు. గర్భిణులు, పిల్లలు, కుక్క కాటు బాధితులు, విష జ్వరాల బారిన పడిన వారి కోసం ప్రత్యేకంగా ఓపీలు ఏర్పాటు చేశారు. విష జ్వరాల బారినపడినవారే అధికంగా వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. గతంలో రోజుకు 500 నుంచి 600 మంది వచ్చే వారని, ప్రస్తుతం వెయ్యి నుంచి 1,100 మంది రోగులు వస్తున్నారని పేర్కొంటున్నారు.



నిలోఫర్ ఆస్పత్రిలో..

జ్వరాల కేసులు పెరిగాయి

ఈ నెల 1 నుంచి 18 వరకు మొత్తం 13,287 ఓపీ నమోదు కాగా, 10 నుంచి 18 వరకు 242 ఐపీ కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా ఇటీవల జ్వరాల కేసులు పెరిగాయి. ఇక, మరో 867 కుక్క కాటు కేసులు ఉన్నాయి.

– డాక్టర్ జయలక్ష్మి, ఫీవర్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

అన్ని మందులూ ఉన్నాయి..

ఆస్పత్రిలో ప్రస్తుతం డెంగీ కేసులు మూడు నమోదయ్యాయి. వారికి ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నాం. కుక్కకాటు బాధితులు కూడా రోజూ పదుల సంఖ్యలో వస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వైద్య సిబ్బంది ఉన్నారు.

– డా.ఎస్.కృష్ణ, సూపరింటెండెంట్

గత పది రోజుల్లో ఫీవర్‌లో నమోదైన ఓపీ, ఐపీ కేసుల వివరాలు

తేదీ	ఔట్ పేషంట్ (ఓపీ)	ఇన్ పేషంట్లు (ఐపీ)
10న	829	31
11న	836	28
12న	942	28
13న	936	23
14న	879	31
15న	382	04
16న	941	35
17న	594	17
18న	816	45



ఫీవర్ ఆస్పత్రిలో..

సాయం చేయండి.. వైద్యం అందిస్తాం

నిమ్స్‌లో పేషెంట్ వెల్ఫేర్ ఫండ్ ఖాతా

లక్డీకాపూల్ : పేదలకు కార్పొరేట్ వైద్య సేవలందిస్తున్న నిమ్స్..'సాయం చేయండి.. వైద్యం అందిస్తాం' అంటూ విరాళాల సేకరణకు తెరలేపింది. ఆస్పత్రికి మెరుగైన చికిత్స పొందేందుకు వచ్చే నిరుపేద రోగుల సంక్షేమం దృష్ట్యా యాజమాన్యం పేషెంట్ వెల్ఫేర్ పంఢ్ ఖాతాను తెరిచింది. ఆస్పత్రికి వచ్చే నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలన్న కృతనిశ్చయంతో నిమ్స్ ఈ పేషెంట్ కేర్ ఫండ్ సేకరణకు సమాయత్తమైంది. వైద్య సేవల కోసం ఆస్పత్రి వచ్చే సంపన్న వర్గాలు, ఎన్ఆర్ఐ రోగులను దృష్టిలో పెట్టుకుని 'స్కాన్ ఇన్ పే' అంటూ క్యూ ఆర్ కోడ్‌లను డిస్‌ప్లే చేసింది. అందుకు ఆస్పత్రి ప్రాంగణంలోని యూనియన్ బ్యాంక్‌లో ప్రత్యేక ఖాతాను సైతం యాజమాన్యం తెరిచింది. ఈ సందర్భంగా పేద రోగులకు వైద్య సాయం అందించాలన్న యాజమాన్య నిర్ణయాన్ని స్వాగతిస్తూ..ఆస్పత్రిలో పాలనపరంగా ఎదురయ్యే అవకతవకలను కూడా చక్కదిద్దాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందంటున్నారు.

పాతబస్తీలో పారిశుధ్య చర్యలు పరిశీలించిన ఆమ్రపాలి

సాక్షి, సిటీబ్యూరో: మిలాద్ ఉన్‌నబీ ర్యాలీలను పురస్కరించుకొని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి గురువారం పాతబస్తీలో ఆకస్మికంగా పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. చార్మినార్ జోన్ పరిధిలోని అలియాబాద్, శంషీర్ గంజ్, ఇంజన్ బౌలి, శాలిబండ మెయిన్ రోడ్, ఫలక్‌నుమా బ్రిడ్జి ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించారు. సేకరించిన చెత్తను వెంటనే డంప్ యార్డుకు తరలించేందుకు అవసరమైన వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గణేష్ శోభాయాత్ర సందర్భంగా అక్కడక్కడ వెలసిన ఫ్లెక్సీలు తొలగించాలని సూచించారు.



టూర్స్ టైం

రేపటి నుంచి కార్పొరేటర్ల పర్యటనలు ప్రారంభం

- మేయర్ ఆధ్వర్యంలో ఇండోర్, లక్నోలకు..
- డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో అస్సాం, గౌహతిలకు ఆరు రోజుల పర్యటన

సాక్షి, సిటీబ్యూరో: అధ్యయన యాత్రల పేరిట వివిధ నగరాల్లో కార్పొరేటర్ల పర్యటనకు రంగం సిద్ధమైంది. శనివారం నగరం నుంచి వీరు బయల్దేరి వెళ్తారు. ఆయా నగరాల్లో, పరిసర ప్రాంతాల్లో పర్యటించి తిరిగి 26వ తేదీన నగరానికి వస్తారు. ఈ నెల ఆరంభం నుంచే ట్రిప్పుకు దాదాపు 50 మంది చొప్పున మూడు బ్యాచ్‌లుగా వెళ్లాలని నిర్ణయించుకున్నప్పటికీ, హైదరాబాద్‌లో భారీఎత్తున జరిగే గణేశ్ ఉత్సవాలు, నిమజ్జనాలను పురస్కరించుకొని నిమజ్జనాల కార్యక్రమాలు ముగిశాక వెళ్లేలా ప్లాన్‌ను మార్చారు. నిమజ్జనోత్సవాలు ముగిసిపోవడంతో ఈ నెల 21వ తేదీ నుంచి పర్యటనలకు వెళ్లేలా షెడ్యూలు ఖరారు చేశారు. తొలుత భావించినట్లుగా మూడు బ్యాచ్‌లుగా వెళ్తున్నప్పటికీ, బ్యాచ్‌కు దాదాపు 50 మంది వెళ్లడం లేదు. ఒక బ్యాచ్‌కు మేయర్ నేతృత్వం వహించనుండగా, మరో బ్యాచ్‌కు డిప్యూటీ మేయర్ నేతృత్వం వహించనున్నారు. వారిద్దరి నేతృత్వంలో కాకుండా ఎంఐఎం సభ్యులు మరోబ్యాచ్‌గా విడిగా వెళ్లనున్నట్లు తెలిసింది.



మేయర్ బ్యాచ్ ఇండోర్‌కు..

మేయర్ వెంట వెళ్లే బృందంలో 48 మంది వెళ్లనున్నారు. వీరిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్పొరేటర్లున్నారు. వీరు ఇండోర్, లక్నో, తదితర ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

డిప్యూటీ మేయర్ బ్యాచ్ గౌహతికి..

డిప్యూటీ మేయర్ బృందంలోని 47 మంది అస్సాం, గౌహతి, తదితర ప్రాంతాలకు వెళ్లనున్నారు. ఈ బ్యాచ్‌లో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కార్పొరేటర్లున్నారు.

వారెటో..

ఎంఐఎం సభ్యుల్లో 16 మంది మేయర్, డిప్యూటీ మేయర్‌ల నేతృత్వంలో కాకుండా వారు విడిగా 22వ తేదీన బయల్దేరనున్నట్లు తెలిసింది. వీరు కూడా అస్సాం, గౌహతి తదితర ప్రాంతాల్లో పర్యటించనున్నారు. మిగతావారు ఎక్కడికి వెళ్లాలో తేల్చుకోలేక డైలమాలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతానికి వారి నుంచి సమ్మతి లేకపోవడంతో తర్వాత వారికి నచ్చిన ప్రాంతాలకు వెళ్లే అవకాశాలున్నాయి.

నేర్చుకునేదేమిటో.. ?


అధ్యయన యాత్రల పేరిట ఈ టూర్లకు వెళ్తున్న కార్పొరేటర్లు అక్కడ కొత్తగా నేర్చుకునేది ఏముంటుందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. వివిధ అభివృద్ధి పనులతో పాటు ఘనవ్యర్థాల నిర్వహణ, తదితర అంశాలను అధ్యయనం చేయనున్నట్లు చెబుతున్నప్పటికీ, హైదరాబాద్‌లో ఘనవ్యర్థాల నిర్వహణ కంటే వారు వెళ్తున్న నగరాల్లో గొప్పగా ఉన్న దాఖలాలేమీ లేవని సంబంధిత ఇంజినీర్లు చెబుతున్నారు. గతంలోనూ పలు నగరాలు చుట్టివచ్చారు. కానీ..వచ్చాక చేసిందేమీ లేదు. ప్రస్తుతం దేశంలోని వివిధ నగరాల నుంచే జీహెచ్ఎంసీ అమలు చేస్తున్న బెస్ట్‌ప్రాక్టీసెస్‌ను అధ్యయనం చేయడానికి ఇక్కడకు వస్తున్నారు. ఈ అధ్యయనయాత్రల పేరిట నిధుల దుబారా తప్ప నగరానికి ఒరిగేదేమీ ఉండదనే అభిప్రాయం ఉంది.

ఇక జంక్షన్ల విస్తరణ!

పాదచారుల ఇబ్బందులు తీరేలా హుమ్టా ప్రణాళిక

అమీర్‌పేట్‌లో నేటి నుంచి ట్రయల్‌రన్

- దశలవారీగా మిగతా జంక్షన్ల అభివృద్ధి
- ట్రాఫిక్, ఆర్టీసీ, మెట్రో రైల్ విభాగాలతో సమన్వయం



సాక్షి, సిటీబ్యూరో: రహదారిపై నాలుగడుగులు నడవాలంటే భయం. ఏ వైపు నుంచి వాహనాలు దూసుకొస్తాయో తెలియదు. ఆక్రమణల కారణంగా ఫుట్‌పాత్‌లపైన నడిచేందుకు చోటు ఉండదు. మెట్రో దిగి సిటీ బస్సెక్కాలన్నా, బస్సు దిగి మెట్రో రైలెక్కాలన్నా కష్టమే. బస్సుకు, మెట్రోకు మధ్య సమన్వయమే లేదు. దీంతో సగటు నగరవాసిని సిటీ రోడ్లు హడలెత్తిస్తున్నాయి. మెట్రో కూడళ్లు, ప్రధాన జంక్షన్లు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ క్రమంలో పాదచారుల రాకపోకలను సులభతరం చేసేందుకు, ఆర్టీసీ బస్సులు, మెట్రో సర్వీసుల మధ్య సమన్వయం ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (హుమ్టా) నడుం బిగించింది. ఈమేరకు జంక్షన్ల విస్తరణకు ప్రణాళిక రూపొందించింది. ట్రాఫిక్, ఆర్టీసీ, మెట్రో, తదితర విభాగాల సమన్వయంతో జంక్షన్లు, ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది. వివిధ ప్రజారవాణా సదుపాయాల మధ్య సమన్వయాన్ని పెంచడం ద్వారా ప్రయాణికులకు లాస్ట్‌మైల్ కనెక్టివిటీని అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా నిర్ణయించింది.

అమీర్‌పేట్‌లో ట్రయల్‌రన్....

హైదరాబాద్‌లో అమీర్‌పేట్ అతి పెద్ద జంక్షన్. మెట్రో రైళ్ల రాకపోకలకు ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ కూడా కావడంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. నాగోల్–రాయదుర్గం, ఎల్బీనగర్–మియాపూర్ కారిడార్‌లు అమీర్‌పేట్ స్టేషన్ మీదుగా ఉండడంతో అన్ని వైపుల నుంచి ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. మరోవైపు ఈ రూట్‌లో వాహనాల రద్దీ కూడా ఎక్కువే. కూకట్‌పల్లి వైపు నుంచి, సారథి స్టూడియో రూట్‌లో, సత్యం థియేటర్ రూట్‌లో వచ్చే వాహనాలతో రద్దీ చోటుచేసుకుంటుంది. ప్రస్తుతం ఎస్సార్‌నగర్ వైపు నుంచి వచ్చే బస్సులన్నీ స్వర్ణజయంతి కాంప్లెక్స్ వద్ద ఆగుతున్నాయి. దీంతో ఇక్కడ బస్సు దిగిన ప్రయాణికులు మరికొంత దూరం నడిస్తే తప్ప మెట్రో ప్రయాణం సాధ్యం కాదు. మెట్రో ప్రయాణికులు కూడా మెట్రో దిగి బస్సు కోసం కొంత దూరం వెనక్కి రావలసి ఉంటుంది. ఒకవైపు వాహనాల రాకపోకలు, రద్దీ, మరోవైపు నడకదారి లేక ఇబ్బందులకు గురయ్యే పాదచారులతో ఈ ప్రాంతం గందరగోళంగా ఉంటుంది. దీన్ని నివారించేందుకు హుమ్టా ప్రణాళికలను సిద్ధం చేసింది. శుక్రవారం నుంచి ఈ నెలాఖరు వరకు ఈ జంక్షన్ల వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించనున్నారు. అలాగే సిటీ బస్సులను కూడా స్వర్ణజయంతి వద్ద కాకుండా మెట్రో స్టేషన్ వద్ద నిలుపుతారు. దీంతో చాలా వరకు గందరగోళానికి తెరపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఫలితాలు ఆశించిన విధంగా ఉంటే ట్రయల్ రన్ ప్రాజెక్టును శాశ్వతంగా కొనసాగిస్తారు.

మార్పులు ఇలా....

- అమీర్‌పేట్ వైపు నుంచి బేగంపేట్ వైపు వెళ్లే రూట్‌లో ఫుట్‌పాత్‌లపైన ఉన్న వ్యాపారులను సత్యం థియేటర్ వద్దకు మార్చనున్నారు.
- సారథి స్టూడియో వైపు నుంచి అమీర్‌పేట్ మీదుగా పంజగుట్టకు వెళ్లే వాహనాలతో పాటు, కూకట్‌పల్లి వైపు నుంచి వచ్చే వాటి వల్ల వాహనాల నియంత్రణ కష్టంగా ఉంది. దీన్ని నివారించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ఒక ఐలాండ్‌ను ఏర్పాటు చేయనున్నారు.
- అలాగే సత్యం థియేటర్ నుంచి అమీర్‌పేట్ మీదుగా పంజగుట్ట వైపు వెళ్లే వాహనాలను కూడా నియంత్రించేందుకు సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది.
- స్వర్ణజయంతి కాంప్లెక్స్ నుంచి అమీర్‌పేట్ స్టేషన్‌కు బస్టాపును మార్చడం వల్ల ఆర్టీసీ, మెట్రో మధ్య సమన్వయం ఏర్పడుతుంది. ప్రయాణికులు ఒక ట్రాన్స్‌పోర్ట్ మోడ్ నుంచి మరో ట్రాన్స్‌పోర్ట్ మోడ్‌కు తేలిగ్గా మారగలుగుతారు. దీంతో ఇటు మెట్రోకు, అటు ఆర్టీసీకి లాభదాయకం. అన్ని వైపులా ఫుట్‌పాత్‌ల విస్తరణ చేపట్టడం వల్ల పాదచారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.



నిత్యం రద్దీగా అమీర్‌పేట ఏరియా

మెట్రోకు 500 మీటర్ల పరిధిలో..

- కాలుష్య రహితమైన, పర్యావరణ హితమైన రవాణా సదుపాయాలను పెంపొందించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు, సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని హుమ్టా అధికారులు ప్రతిపాదించారు. ఇందుకోసం నగరంలోని ప్రధాన మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి వాటి చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఫుట్‌పాత్‌లు, సైకిల్‌ట్రాక్‌లు వంటివి ఏర్పాటు చేయడం వల్ల సమీపంలోని కాలనీలకు చెందిన ప్రయాణికులు తేలిగ్గా మెట్రో స్టేషన్‌లకు చేరుకొంటారు.
- ఢిల్లీ వంటి కొన్ని నగరాల్లో ఎంపిక చేసిన మెట్రోస్టేషన్ల వద్ద నాన్‌మోటరైజ్డ్ వాహనాలను వినియోగించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో చాలామంది సైకిళ్లపైన వచ్చి మెట్రోల్లో ప్రయాణం చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.
- అదే తరహాలో హైదరాబాద్‌లో అవకాశం ఉన్న మెట్రోస్టేషన్లు, కూడళ్ల వద్ద జంక్షన్లను అభివృద్ధి చేయడం వల్ల నాన్‌మోటరైజ్డ్ వాహనాల వినియోగం పెరుగుతుందని భావిస్తున్నారు.
- ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లానింగ్‌లో భాగంగానే మెట్రో స్టేషన్‌లకు లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కోసం నాన్‌మోటరైజ్డ్ సర్వీసుల వినియోగాన్ని పెంచాలనే ప్రతిపాదన ఉంది.
- కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లానింగ్ కోసం లీ అసోసియేషన్ ఇప్పటికే అధ్యయనం చేపట్టిన సంగతి తెలిసిందే.

అకడమిక్ వెయిటేజ్ మార్కులు కలపాలి

తెలంగాణ నర్సింగ్ సమితి నేతల డిమాండ్

కవాడిగూడ: మెడికల్ హెల్త్ స్టేట్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఇటీవల విడుదల చేసిన నర్సింగ్ ఆఫీసర్స్ నోటిఫికేషన్‌లో నాన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అభ్యర్థులకు అకడమిక్ వెయిటేజ్‌ని ప్రతి సంవత్సరానికి ఒక మార్కు చొప్పును గరిష్టంగా 10 మార్కులను కలపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ నర్సింగ్‌సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు గోవర్ధన్, వెంకి నాని మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అకాడమిక్ వెయిటేజ్ మార్కులను ఇచ్చేవారని, 2003 నుంచి వస్తున్న నోటిఫికేషన్లలో వెయిటేజ్ మార్కులను తొలగించారని, దీనితో ప్రైవేటు సెక్టార్‌లో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న సీనియర్ నర్సింగ్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ కష్ట సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించామని, నాన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ అభ్యర్థుల సేవలు దృష్టిలో పెట్టుకుని అకాడమిక్ వెయిటేజ్ మార్కులను కలపాలని కోరారు. నర్సింగ్ అభ్యర్థుల పరీక్షను మూడు షిఫ్టలకు కాకుండా ఒకే షిఫ్ట్‌లో నిర్వహించి మినిమం క్వాలిఫయింగ్ మార్కులను నిర్ణయించాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో శ్యామ్, లక్ష్మి, ప్రశాంత్ ఉన్నారు.

రైలు ఢీకొట్టడంతో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి-బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (30) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మరో ఘటనలో..

గుర్తుతెలియని వ్యక్తి (35) ఫలక్‌నుమా - బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫారం నం.3 [రెగ్యులేషన్ -15(1) (a) చూడండి]

కోల్‌కతా డెట్స్ రికవరీ అప్పిల్లేట్ ట్రిబ్యునల్‌లో కోల్‌కతా వద్ద
అప్పీలు డైరీ నం.567 ఆఫ్ 2024
SA/13/2019 లో 15-05-2024 తేదీగల తుది ఉత్తర్వు నుండి ప్రారంభం
(డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-1లో హైదరాబాద్ వద్ద)
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- వర్సెస్ -
శ్రీ జి.నాగరాజు మరియు ఇతరులు
సమను

దిగువ వారికి,

1) **శ్రీ జి.నాగరాజు తండ్రి జి.వెంకటేష్,** ఇం.నం. 42-463/64/A, నం.353/1, ఫ్లాట్ నం. 64A, గాయత్రి నగర్, మౌలాలి, GHMC పరిధి, మల్కాజ్‌గిరి సర్కిల్ మరియు మండలం, ఆర్.ఆర్. జిల్లా -500047. (రెస్పాండెంట్ నం.1)

2) **శ్రీ కాలేరు రమేష్ తండ్రి కాలేరు అంజనేయులు,** ఇం.నం.12-1-508/B/17/1, శ్రీపురి కాలనీ, లాలాపేట సికింద్రాబాద్ -500017. (రెస్పాండెంట్ నం.6)

3) **శ్రీమతి కాలేరు అమరావతి భర్త శ్రీ కాలేరు రమేష్,** ఇం.నం. 12-1-508/B/17/1, శ్రీపురి కాలనీ, లాలాపేట, సికింద్రాబాద్ -500017. (రెస్పాండెంట్ నం.7)

..... రెస్పాండెంట్స్

1. లెర్నెడ్ **DRT-1, హైదరాబాద్** వారిచే జారీచేయబడిన **SA/13/2019**లో **15.05.2024 తేదీగల తుది ఉత్తర్వు** నుండి ప్రారంభమైన మరియు ఇతర ఉపశమనాలపై సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (SARFAESI ACT) లోని సెక్షన్ 18 క్రింద అప్పీలుదారు ఒక అప్పీలును దాఖలు చేశారు. సదరు క్లెయిముకు జవాబు ఇచ్చేందుకు **05 నవంబర్, 2024న ఉ.10.30 గం.లకు** లేదా ట్రిబ్యునల్ సౌకర్యార్థం ఆ తర్వాత వచ్చే అట్టి సమయానికి ఈ ట్రిబ్యునల్ సమక్షంలో హాజరై, వ్రాతపూర్వక స్టేట్‌మెంట్ దాఖలు చేయవలసిందిగా ఇందుమూలంగా మీకు సమను ఇవ్వడమైనది.
2. మీరు ఏవైనా డాక్యుమెంట్లను దాఖలు చేయదల్చినో, మీరు వ్రాతపూర్వక స్టేట్‌మెంట్‌తో పాటు జాబితాతో వాటిని దాఖలు చేయవచ్చును.
3. మీరు స్వయంగా లేదా తగువిధంగా సూచించిన ప్లీడర్/ అడ్వకేట్ ద్వారా ట్రిబ్యునల్ సమక్షంలో మీరు హాజరయ్యేటప్పుడు మీ సమాధిత చిరునామా మరియు హాజరు మెమోను దాఖలు చేయవలెను.
4. పైన తెలిపిన తేదీన మీరు హాజరుగుటలో విఫలమైతే, ప్రొసీడింగ్స్ మీ గైర్హాజరులో విచారించబడి, నిర్ధారించబడునని గమనించవలెను.

నాచే స్వయంగా, ఈ ట్రిబ్యునల్ సీల్‌తో తేది **12 సెప్టెంబర్, 2024**న ఇవ్వబడింది.

సం/- రిజిస్ట్రార్
డెట్స్ రికవరీ అప్పిల్లేట్ ట్రిబ్యునల్, కోల్‌కతా

కంట్లో కారం చల్లి మంగళసూత్రం చోరీ

అంబర్‌పేట: ఇంటి ముందు కూతురితో ఆడుకుంటున్న ఓ మహిళ మెడలోంచి మూడున్నర తులాల మంగళసూత్రాన్ని లాక్కెళ్లాడు. ఈ సంఘటన గురువారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం... గోల్నాక రామాలయం వీధిలో ఎం.పుష్పలత సాయంత్రం తన కూతురుతో ఇంటి ముందు ఆడుకుంటోంది. గుర్తుతెలియని వ్యక్తి వాహనంపై వచ్చి ఆమె కంట్లో కారం చల్లి మెడలో ఉన్న మూడున్నర తులాల మంగళసూత్రాన్ని లాకెళ్లాడు. దీంతో ఆమె తీవ్ర భయందోళనకు గురైంది. స్థానికుల సహకారంతో అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ **UGC Approved Online Programs** Admission in B.Com, BA, MBA, MCA & PG. Learner Can Attend From Any Where. Ph: 9849670808 [H-796275]

Real Estate

PLOT FOR SALE

■ షాద్‌నగర్ @ కేశంపేట్‌లో DTCP లేఔట్‌లో, ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 40 EMI పద్ధతిలో 75 గజాల ఓపెన్ ప్లాట్స్ కలవు. నెలకు 10 వేలు మాత్రమే డైరెక్ట్ కంపెనీ ఆఫర్ సైట్ విజిట్ కొరకు, ఫోన్: 9949695027 [H-796199]

TO-LET

■ **Luxury 3 BHK Duplex Villas For** Rent @ Affordable Price in Cherlapally, Near Railway Station with Modern Amenities. Call: 9502759933 [HA-664]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [800506]

BUSINESS OFFER

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న. మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9398709618 [H-796629]

■ **Data Editing Software Projects** are Available for Outsourcing to Companies with Minimum 5 Computers. Contact; 9652438681 [HA-15213]

PERSONAL CARE

CHANGE OF NAME

■ **I, Cerisapala Narasimhulu S/o** Kummari Obula Kondanna, R/o 6-5-195/88, Markandeya Nagar, Kattedan I.e Rajendra Nagar Mandal, Ranga Reddy District, Telangana - 500077, have changed my name to Kummari Narasimhulu [HA-37927]

Join India's Largest NBFC-MFI CreditAccess

RPC - Maker
Requirements:
• Minimum 1-year experience in data entry or Fresher.

RPC - Checker
Requirements:
• Minimum 3-years experience in data entry.

RPC - Quality Control
Requirements:
• Minimum 3-years experience in Document Verification.

Graduate/Post Graduate with good communication skills
Should know regional language & English language. (Read, write & speak)

Interview Date: 21 Sep 2024, Saturday
Hotel SVM Grand,
Beside Nagole Metro Station, Uppal, Hyderabad-500039
Contact Person: Prashanth 9381476086

LOST

■ **I, Ambati Krishna, S/o A.** Rajakomuraiah, Lost my Passport No. A7680009 while Travelling from Kompally to Pet Basheerabad. If found Call: 7989424010 [HA-15222]

OLD AGE HOME

■ శ్రీరామ హోమ్ కేర్ సర్వీస్ హోల్డర్ కేర్, బేబీ కేర్, నర్సింగ్ కేర్, హౌస్ కీపింగ్, ఇంటి/వంట పనికి 24/7 మీ ఇంటి వద్దకే కేర్ టేకర్స్ స్త్రీ/పు.లను పంపబడును. ఫోన్: 8019779801,9493725800 [HA-666]

■ వృద్ధులు, **Rtd** ఎంప్లాయిస్ విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, 24/7 మెడికల్ సర్వీస్. ఉప్పల్ మరియు ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 8074327715 [H-778850]

Wanted

■ హైదరాబాద్ పరిసర ప్రాంతములో **ATM Cashior,** ATM Cash Lode సెక్యూరిటి గార్డ్స్ కావలెను. జీతం: 15000/- + ఇన్సెంటివ్స్ (5000), వయస్సు: 20-35, Qly: 10th. 9494678548, 8143886858 [G-824474]

■ మీసేవా లో పనిచేయుటకు **Online** సర్వీస్ అనుభవం గల అమ్మాయి, అబ్బాయి కావలెను. ఫోన్: 7386586229, 9381411020 [SCA24000255]

■ ఇంట్లోనే ఉంటూ ప్రముఖ ఇన్సూరెన్స్ సంస్థలో పార్ట్ / ఫుల్ టైమ్ పనిచేయుటకు 10th ఆ పైన చదివిన వారు కావలెను. నోటార్గెట్స్ & ఫీల్డ్ వర్క్. ఫోన్: 8074680699 [H-782715]

■ సుధీర్ హోమ్ కేర్ సర్వీసులో పని చేయుటకు కేర్ టేకర్స్, ANM, GNM నర్సులు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000 To 50000 రూమ్, భోజనం ఫ్రీ. Ph: 8688432635/6303835653 [HA-646]

■ ఘట్‌కేసర్‌లో ఇంజినీరింగ్ కాలేజి నందు కాలేజి బస్సులు నడుపుటకు 5 సం॥లు హెవీ లైసెన్స్ గల డ్రైవర్లు కావలెను. కొండాపూర్, అజీజ్ నగర్, బోడుప్పల్ ప్రాంతాల వారికి ప్రాధాన్యత. ఫోన్: 09492570976, 9951530159 [HA-638]

■ సికింద్రాబాద్‌లో పని చేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్, సూపర్ వైజర్స్ Q: డిగ్రీ (పు), Ex. సర్వీస్ మెన్ & శానిటేషన్ వర్కర్స్ కావలెను. ఫోన్: 9346800433, 8555031103 [HA-1936]

■ **Wanted Computer Knowledge &** Fluently Telugu, Hindi & English. Telecalling & Marketing Skills. Cont: GICSS Ph: 9502443577,9908582531 [HA-796279]

■ **Wanted Marketing Sales** Mans / Girls For Cement, Building Materials Laxmi Enterprises. Ph: 8790762298, 7993490259 [HA-2236]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

ఎన్నారైలే టార్గెట్

సైబర్ కాప్స్‌కు చిక్కిన సెక్స్టార్షనిస్ట్

- డేటింగ్ సైట్‌లో యువతిగా నకిలీ ప్రొఫైల్ క్రియేట్
- కాలిఫోర్నియాలో ఉండే నగర వాసి పుత్రుడికి ఎర
- అతడి వ్యక్తిగత ఫొటోలు సంగ్రహించి బెదిరింపులు
- 1721 డాలర్లు కాజేసి, మరికొంత ఇవ్వాలని డిమాండ్
- తండ్రి ఫిర్యాదుతో కేసు, అరెస్టు చేసిన పోలీసులు





నిందితుడు రిద్ధ్ బేడీ

సాక్షి, సిటీబ్యూరో: బెంగళూరుకు చెందిన 26 ఏళ్ల యువకుడు అమెరికాలో ఉన్నత విద్యనభ్యసించాడు. కొన్నేళ్లు అక్కడే ఉన్నప్పుడు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డాడు. తిరిగి వచ్చిన తర్వాత జల్సాలకు అవసరమైన డబ్బు కోసం సెక్స్టార్షనిస్ట్ అవతారం ఎత్తాడు. డేటింగ్ వెబ్‌సైట్స్‌లో నకిలీ ప్రొఫైల్స్ క్రియేట్ చేశాడు. విదేశీయులు.. ప్రధానంగా అమెరికాలో ఉంటున్న ఎన్నారైలనే టార్గెట్‌గా చేసుకుని బెదిరింపు వసూళ్లకు పాల్పడ్డాడు. ఓ బాధితుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసినట్లు డీసీపీ ధార కవిత గురువారం వెల్లడించారు. బెంగళూరులోని బ్రోకే ఫీల్డ్ ప్రాంతానికి చెందిన రిద్ధ్ బేడీ కాలిఫోర్నియాలో మెకానికల్ ఇంజినీరింగ్ చదివాడు. అక్కడే దాదాపు ఆరేళ్ల పాటు ఉన్న అతను ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారాడు. అక్కడి నుంచి తిరిగి వచ్చినప్పటికీ విలాసాలకు దూరం కాలేకపోయాడు. వీటిని కొనసాగించడానికి సెక్స్టార్షనిస్ట్ అవతారం ఎత్తాడు. బెంగళూరులోని విలాసవంతమైన విల్లాలో నెలకు రూ.75 వేల అద్దె చెల్లిస్తూ నివసిస్తున్న ఇతగాడు అనేక డేటింగ్ వెబ్‌సైట్స్‌లో యువతిగా ప్రొఫైల్ క్రియేట్ చేసుకున్నాడు. ఇంటర్‌నెట్‌తో పాటు వివిధ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్ నుంచి ఆకర్షనీయమైన యువతుల ఫొటోలు తస్కరించి ఇందులో పొందుపరిచాడు. ప్రధానంగా అమెరికాతో పాటు విదేశాల్లో ఉంటున్న ఎన్నారైలను టార్గెట్‌గా చేసుకుని వారికి రిక్వెస్ట్‌లు పంపేవాడు. తన వల్లోపడిన వారితో చాటింగ్ చేస్తూ రెచ్చగొట్టేవాడు. ఈ చాటింగ్స్ నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక ఆటంకాలు కలగకుండా ఉండటానికి 1000 ఎంబీపీఎస్ సామర్థ్య కలిగిన ఇంటర్‌నెట్ కనెక్షన్ వినియోగిస్తున్నాడు. సాధారణంగా ఈ స్థాయి బ్రాడ్‌బ్యాండ్‌ను సాఫ్ట్‌వేర్, టెక్నాలజీ సంస్థలు భారీ డేటాను బదిలీ చేయడానికి మాత్రమే వాడుతుంటాయి. ఆయా దేశాల్లో ఉన్న వారితో చాటింగ్ కోసం రిద్ధి రాత్రంతా మెలకువగా ఉంటూ పగటి పూట నిద్ర పోతుంటాడు. ఇలా తన వల్లో పడిన వారిని రెచ్చగొట్టి వారి వ్యక్తిగత విషయాలు, ఫొటోలు సేకరించేవాడు. కొందరితో వీడియో కాల్‌లో మాట్లాడుతూ ప్రత్యేక యాప్స్ ద్వారా ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన అశ్లీల వీడియోలు చూపేవాడు. ఇవి చూసిన వారు ఎదుటి వ్యక్తే కెమెరా ముందు అలా చేస్తున్నట్లు భ్రమపడేవాళ్లు. ఆపై వారినీ నగ్నంగా మారమని చెప్పే రిద్ధి ఆ తతంగం మొత్తం స్క్రీన్ రికార్డింగ్ చేయడం, ఫొటోలు తీయడం చేసేవాడు. వీటిని సోషల్‌మీడియాలో పెడతానంటూ బెదిరించి డబ్బు డిమాండ్ చేసేవాడు. తన ఉనికి బయటపడకుండా ఉండేందుకు నగదు ను అమెరికాకు చెందిన పేమెంట్ ప్లాట్‌ఫామ్స్‌కు బదిలీ చేయించుకునేవాడు. దాని ద్వారా ఇక్కడ ఉన్న వివిధ బ్యాంకు ఖాతాల్లోకి చిన్న మొత్తాలుగా ట్రాన్స్‌ఫర్ చేస్తాడు. నగరానికి చెందిన యువకుడు ప్రస్తుతం కాలిఫోర్నియాలో ఉంటున్నాడు. అతడిని టార్గెట్ చేసిన రిద్ధి బ్లాక్‌మెయిల్ చేసి 1721 డాలర్లు తీసుకున్నాడు. మరికొంత మొత్తం డిమాండ్ చేయడంతో పాటు ఇబ్బందులు పెట్టాడు. నగరంలోని బ్యాంకు ఖాతాలతో లింకై ఉన్న ఫోన్ నెంబర్ ద్వారానే బాధితుడు నగదు బదిలీ చేశాడు. దీంతో అతడి తండ్రి సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఏసీపీ ఆర్‌జీ శివ మారుతి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ పి.ప్రమోద్‌కుమార్, ఎస్సై వెంకటాద్రి ఈ కేసు దర్యాప్తు చేశారు. సాంకేతిక ఆధారాలను బట్టి నిందితుడిని గుర్తించి బెంగళూరులో అరెస్టు చేశారు. ఇతగాడు అనేక మందిని ఇదే తరహాలో మోసం చేసినట్లు అనుమానిస్తున్న అధికారులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లికి నిరాకరించినందుకే...

నర్సు శ్రుతి ఆత్మహత్య

- రెడ్ స్టోన్ హోటల్‌లో ప్రియుడు జీవన్‌పాల్‌తో ఘర్షణ
- పెళ్లి చేసుకోవాలని కోరిన శ్రుతి
- నిరాకరించడంతో మనస్తాపంతో ఆత్మహత్య
- నిందితుడు జీవన్ రిమాండ్



నిందితుడు విద్యాపోగు జీవన్ పాల్

గచ్చిబౌలి: ప్రియుడు జీవన్ పాల్ తనను పెళ్లి చేసుకునేందుకు నిరాకరించినందుకే మనస్తాపానికిలోనైన నర్సు శ్రుతి ఆత్మహత్యకు పాల్పడినట్లు గచ్చిబౌలి పోలీసులు పేర్కొన్నారు. ఆత్మహత్యకు కారకుడైన ప్రేమికుడు విద్యాపోగు జీవన్ పాల్(26)ను గురువారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..జడ్చర్లకు చెందిన గొల్ల శ్రుతి(22) నర్సింగ్ కోర్సు పూర్తి చేసి ఓ హాస్పిటల్‌లో నర్సుగా పని చేస్తూ డ్యూటీ మానేసింది. ఆమె తన ప్రియుడు జీవన్ పాల్ , స్నేహితులు మౌనిక , పి.వెంకటేష్‌లతో కలిసి ఈ నెల 14న చిన్న అంజయ్యనగర్‌లోని రెడ్‌స్టోన్ లాడ్జిలో రెండు వేర్వేరు గదుల్లో అద్దెకు దిగారు. రూమ్ నెంబర్ 505లో శ్రుతి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి రూమ్ నెంబర్ 301లో నలుగురు స్నేహితులు మద్యం సేవించారు. ఆ సమయంలో శ్రుతి తనను పెళ్లి చేసుకోవాలని జీవన్‌ను కోరగా అందుకు అతను నిరాకరించాడు. అదే సమయంలో కొందరు యువతులు జీవన్‌కు ఫోన్ చేశారు. వారితోనూ స్నేహంగా ఉన్నట్లు మాట్లాడటంతో శ్రుతి ఆగ్రహం వ్యక్తం చేస్తూ తనలా ఎంతమందిని మోసం చేస్తావని నిలదీసింది. తనకు పెళ్లి చేసుకోకుండా ఉండటమే ఇష్టమని జీవన్ తేగేసి చెప్పడంతో మనస్తాపానికిలోనైన శ్రుతి రూమ్ నెంబర్ 505కు వెళ్లి డోర్ లాక్ చేసుకుంది. దీంతో ఆమె స్నేహితురాలు మౌనిక ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో రూమ్ వద్దకు వెళ్లింది.అయితే ఆమె డోర్ తీయకపోవడంతో జీవన్, వెంకటేష్తో కలిసి మౌనిక సికింద్రాబాద్‌లో వినాయక నిమజ్జం చూసేందుకు వెళ్లింది. తెల్లవారు జామున లాడ్జికి చేరుకున్న వారు సిబ్బంది సహాయంతో మాస్టర్ కీతో డోర్ ఓపెన్ చేసి చూడగా శ్రుతి ఉరివేసుకుని కనిపించింది.

గతంలో గోవా లోనూ ఘర్షణ

2022లో డ్రైవింగ్ నేర్చుకునేందుకు మహబూబ్‌నగర్‌లోని ఓ డ్రైవింగ్ స్కూల్‌కు వెళ్లిన శ్రుతికి జీవన్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో స్నేహితులతో కలిసి తరచూ హోటళ్లకు వెళ్లడం, మద్యం సేవించడం చేసేవారు. కొద్ది నెలల క్రితం స్నేహితుల పెళ్లి కోసం శ్రుతి, జీవన్ పాల్ గోవాకు వెళ్లారు. ఈ సందర్భంగా మనం కూడా పెళ్లి చేసుకుందామని జీవన్‌తో గొడవకు దిగింది. ఇలా తరచూ పెళ్లి చేసుకోవాలని జీవన్‌పై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అయితే జీవన్‌కు పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదని, వేరే అమ్మాయిలతోనూ చనువుగా ఉంటున్నాడని భావించిన శ్రుతి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎల్ అండ్ టీ మెట్రో అకౌంట్ హ్యాక్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ఎల్‌అండ్‌టీ మెట్రో రైల్ అధికారిక ఎక్స్ అకౌంట్ గురువారం హ్యాక్ అయింది. దీంతో ఎల్‌అండ్‌టీ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఈ మేరకు తమ సంస్థ పేరిట వచ్చే నోటిఫికేషన్‌లు, లింక్‌లను క్లిక్ చేయరాదని ప్రయాణికులను, సాధారణ ప్రజలను కోరుతూ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎక్స్ అకౌంట్‌ను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటనలో వెల్లడించారు.

అస్వస్థతతో ఇద్దరు ప్రయాణికుల మృతి

శంషాబాద్: విమాన ప్రయాణంలో అస్వస్థతకు గురై ఇద్దరు వేర్వేరు ప్రయాణికులు మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింద. ఆర్‌జీఐ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన నితీష్ (40) గోవా వెళ్లి అక్కడి నుంచి ఈ నెల 16న ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరారుడు. విమానంలో ఉండగానే స్పృహ కోల్పోయిన అతడికి విమాన సిబ్బంది సీఆర్‌పీ చేసినప్పటికి స్పృహలోకి రాలేదు. సాయంత్రం 6.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకోగానే అతడిని అపోలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో సంఘటనలో హైదరాబాద్ పాతబస్తీకి చెందిన షేక్‌హసీనా (70) మక్కా నుంచి తిరిగి వస్తుండగా ఈ నెల 17న తెల్లవారు జామున శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అస్వస్థతకు గురికాగా అపోలో ఆస్పత్రి చేర్పించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

'గాంధీ'లో 25 డెంగీ కేసులు నమోదు

గాంధీఆస్పత్రి : మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో గడిచిన వారం రోజుల్లో 25 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత ఏడు రోజుల్లో గాంధీ ఆస్పత్రి అవుట్ పేషెంట్ విభాగంలో 312 , ఇన్‌పేషెంట్ విభాగంలో 131 మొత్తం 443 ఫీవర్ కేసులు నమోదు కాగా, మెరుగైన వైద్యసేవలు అందించడంతో బాధితులు కోలుకుంటున్నారు. జ్వర లక్షణాలైన జలుబు, దగ్గు, కీళ్లనొప్పులు తదితర సమస్యలతో బాధపడుతున్న మరో 106 మందికి వైద్యసేవలు అందించినట్లు ఆస్పత్రివర్గాలు తెలిపాయి. గాంధీఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ స్పష్టం చేశారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో చందానగర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: హైడ్రా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో చందానగర్ సర్కిల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ నందగిరి సుధాంశ్ పిటిషన్ దాఖలు చేశారు. శేరిలింగంపల్లి మండలం మదీనగూడ గ్రామంలోని ఈర్ల చెరువు బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, వాటిని అడ్డుకోవడంలో విఫలమైన అధికారులపై హైడ్రా ఫిర్యాదు చేసిందన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు ఆగస్టు 30న కేసు నమోదు చేశారన్నారన్నారు. నిబంధనల మేరకు తాను విధులు నిర్వహించానని, నిరాధారంగా తప్పుడు కేసు నమోదు చేశారని.. కేసును కొట్టివేస్తూ ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ కేసులో పోలీసులు అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా, ఇదే అంశంపై సుధాంశ్ తొలుత రంగారెడ్డి కోర్టును ఆశ్రయించారు. అక్కడ పిటిషన్ కొట్టివేయడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒకట్రెండు రోజుల్లో ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టనుంది.

తెలుగు రాష్ట్రాల్లో వృద్ధిలోకి రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్...

- తెలంగాణలో మొదటి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించనున్న ఫ్రెయర్ ఎనర్జీ..
- ఐదేళ్లలో రూ. 100 వ్యాపారం, ఈ ఏడాదిలో మరో 5 వేల ఇన్‌స్టాలేషన్ల లక్ష్యం..



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రధాన పట్టణాలతో పాటు మారుమూల గ్రామాల్లోనూ రూఫ్‌టాప్ సోలార్ ల్యాండ్‌స్కేప్‌ను విస్తృతంగా వృద్ధిలోకి తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందించామని ఫ్రెయర్ ఎనర్జీ సహ-వ్యవస్థాపకురాలు రాధికా చౌదరి తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలోని కరీంనగర్ వేదికగా మొదటి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని గురువారం నగరంలోని తాజ్ వివంతాలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాధికా చౌదరి మాట్లాడుతూ., ఇప్పటి వరకు ఫ్రెయర్ ఎనర్జీ ఆధ్వర్యంలో 5 వేలకు పైగా సోలార్ సెటప్‌లను ఏర్పాటు చేయగలిగామని, ఈ ఐదేళ్లలో వంద కోట్ల వ్యాపారం నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో భాగంగా సబ్సిడీ కూడా లభిస్తుండటంతో సోలార్ ఎనర్జీ వినియోగానికి ఆదరణ పెరిగిందన్నారు. కరీంనగర్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నంలోనూ తమ సేవలను ప్రారంభించనున్నామని, మొత్తంగా దేశవ్యాప్తంగా 50 సెంటర్లను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాదిలోనే మరో 5 వేల ఇన్‌స్టాలేషన్లను పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ మర్దా వివరించారు. 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ సెట్‌కు కేంద్ర ప్రభుత్వం తరపున రూ. 60 వేల సబ్సిడీ లభిస్తుందని, 10 కిలోవాట్లలోపు సెట్‌లకు ఎలాంటి ఆంక్షలు, అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్ ఆదా చేయడం కోసం వినియోగించే సోలార్ సెట్‌లు 25 ఏళ్ల పాటు పనిచేస్తాయని, వీటికి టైర్1, టైర్ 2 నగరాలతో పాటు మారుమూల గ్రామాల నుంచి సైతం అదే స్థాయిలో స్పందన లభిస్తుందని వివరించారు.

రెడ్డి కార్పొరేషన్ పాలక వర్గాన్ని ప్రకటించాలి



సాక్షి,సిటీబ్యూరో: రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించడంతో పాటు నిధులు, విధివిధానాలతో పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘం తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి అధ్వర్యంలో ప్రతినిధులు బృందం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి లను కలిసి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటును రాష్ట్ర కేబినెట్ ఆమోదించిందని, కానీ ఇప్పటి వరకు విధివిధానాలు, పాలకవర్గాన్ని ప్రకటించలేదని గుర్తు చేశారు. తక్షణమే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. నిరుపేద రెడ్డి యువతను ఆదుకునేందుకు ఈడబ్ల్యూఎస్ పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఈబ్ల్యూఎస్ కమిషన్‌ను జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. ప్రతినిధుల బృందంలో బి వెంకటేశ్వర రెడ్డి, నల్లా సంజీవ్ రెడ్డి, లింగా రెడ్డి, కేశవ రెడ్డి, శ్రీపతిరెడ్డి, శరత్ రెడ్డి,శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాల పట్టివేత

- ఎండీఎంఏ, ఎస్ఎస్‌డీ బ్లాస్ట్ స్వాధీనం
- ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

గచ్చిబౌలి: వేర్వేరు చోట్ల ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ బ్లాస్ట్‌ను స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీలో బుధవారం రాత్రి డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో డీఎస్పీ తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో దాడి చేసిన పోలీసులు దత్తి లతీన్, పడాల అభిరామ్, కొడాలి నాయుడులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.83 వేల విలువైన 5.7 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ జ్యోతి, కానిస్టేబుళ్లు రాజేశ్వర్ వికాస్, శశికిరణ్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులే లక్ష్యంగా..

ఇంజినీరింగ్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ అధికారులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్‌కు బానిసలైన వీరు వాటిని కొనలేక డ్రగ్స్ అమ్మకాలకు పాల్పడుతున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 37 వద్ద చెన్నైలో ఇంజినీరింగ్ చదువుతున్న చరణ్ తేజ్, కౌశిక్ తూబోటి, సయ్యద్ సర్ఫరాజ్‌లు ఎల్ఎస్‌డీ డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.70 వేల విలువ చేసే 30 ఎల్ఎస్‌డీ బ్లాట్స్ స్వాధీనం చేసుకున్నారు. చరణ్ తేజ్, కౌశిక్, సర్ఫరాజ్‌ను అరెస్ట్ చేశామన్నారు. దాడుల్లో పాల్గొన్న అధికారులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి అభినందించారు.

ప్రధాని మోదీ పాలనలోనే దేశాభివృద్ధి


జూబ్లీహిల్స్ ఇందిరానగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదులో నాయకులు

బంజారాహిల్స్: ప్రధాని మోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో బీజేపీ ఇంటింటి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. 130 బూత్ అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై సభ్యత్వ నమోదు రశీదులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, నాయకులు ముద్దంగుల శ్రీనివాస్, రమేష్, కస్తూరి మహిపాల్ రెడ్డి, గణేష్‌యాదవ్, శ్రీనివాస్‌చారి, కుబేరుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం


ఉచిత డెంటల్ క్యాంపు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ జూబ్లీహిల్స్ సభ్యులు

ఫిలింనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చాలామంది దంత సమస్యలతో బాధపడుతున్నారని అందుకే ఉస్మానియా డెంటల్ వైద్యులచే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని డెంటల్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ జి. బాబురావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో గురువారం మెగా డెంటల్ క్యాంపును జి. బాబురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు దంత సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో తాము ఉస్మానియా డెంటల్ వైద్యులతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు అవసరమైన చికిత్సలతో పాటు మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ నాగేష్ కంపాటి, డిస్ట్రిక్ట్ అడ్వయిజర్ లయన్ సూర్యరాజ్, జీఎస్టీ కో–ఆర్డినేటర్ పద్మావతి, వీడీజీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 600 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కాచిగూడ: తెలంగాణ భవన, నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకోవాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు రక్షణ కోసం ఇతర సమస్యల పరిష్కారం కోసం వేలాదిమంది భవన నిర్మాణ కార్మికులు ఈ నెల 23న 'చలో హైదరాబాద్' పేరిట కమిషనర్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ ప్రతినిధులు ఆర్.కోటంరాజు, రాములు, అన్వేష్, అనురాధ, కె.ఐలన్న, కుమార్, ఇ.చిన్నారావు, తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి నిధులను దారి మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసం పని చేయాలని, ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వమే కార్మికులకు సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను బీమా కంపెనీలకు ఇవ్వడం వల్ల చిన్న, చిన్న కారణాలు చూపించి కార్మికులకు నష్టపరిహారం చెల్లించకుండా చేస్తాయని, వెల్ఫేర్ బోర్డు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు.

'ఎఫ్ఎంఎస్'లో న్యూరోమస్కులర్ డెంటిస్ట్రీ స్పెషాలిటీ సేవలు


మాట్లాడుతున్న పార్థసారథిరెడ్డి తదితరులు

బంజారాహిల్స్: న్యూరోమస్కులర్ డెంటిస్ట్రీ అనేది దంత వైద్యంలో కొత్త పంథా అని హాస్పిటల్ వ్యవస్థాపకుడు, చైర్మన్ పార్థసారథిరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎఫ్ఎంఎస్ డెంటల్ హాస్పిటల్‌లో న్యూరోమస్కులర్ డెంటిస్ట్రీ స్పెషాలిటీ సేవలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దస్పల్లా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా నొప్పులకు సరికొత్త పరిష్కారంగా దీనిని చెప్పవచ్చన్నారు. ఆధునిక దంత వైద్యంలో పళ్లు పాడవడం తదితర సంప్రదాయ సమస్యలు, టెంపోరో మ్యాండిబులర్ జాయింట్ (టీఎంజే) రుగ్మతలలో క్లిష్టమైన పరిస్థితులను పరిష్కరించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ పైసల్‌జార్జీ తదితరులు పాల్గొన్నారు.

కేబినెట్ సబ్ కమిటీని వెంటనే రద్దు చేయాలి

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీని తక్షణమే రద్దు చేయాలని, జ్యుడీషియల్ కమిటీని వెయ్యాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రతినిధులు చెరుకు రాంచందర్, భావనా సాహెబ్, న్యాయవాది రత్నంలు మాట్లాడుతూ వర్గీకరణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్‌కమిటీలో ఒక్క మాల కులస్తునికి అవకాశం ఇవ్వలేదని, అగ్రవర్ణాల వారు, బీసీలు ఉన్నారని వెంటనే దాన్ని రద్దు చేసి జ్యుడీషియల్ కమిటీ వెయ్యాలని డిమాండ్ చేశారు. దళితుల్లో మాలల జనాభా తక్కువగా ఉందని, అవకాశాలు మాత్రం వారే ఎక్కువగా అనుభవిస్తున్నారని ఒక వర్గం అనవసర గ్లోబల్ ప్రచారం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి తెలుగు రాష్ట్రాల్లో మాదిగల కన్నా మాలల జనాభానే ఎక్కువని అత్యంత వెనకబడి ఉంది కూడా మాలలే అన్నారు. వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా 33 జిల్లాలు పర్యటించి మాలలను చైతన్యపరిచి హైదరాబాద్ కేంద్రంగా మా జనాభా చూపించుకునేందుకు లక్షల మందితో భారీ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జంగ శ్రీనివాస్, శంకర్, కిషన్, సుధీర్, రంగ, లలిత, బ్రహ్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

వెంగళరావునగర్: సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని వెంగళరావునగర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో గురువారం ఆయన క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా రోడ్లను ఊడ్చి, దోమల మందును పిచికారి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వానాకాలంలో నీరు ఎక్కువగా నిలిచి ఉండటం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. వీటి వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు సంభవిస్తాయని అన్నారు. అందువల్ల ఎవరి ఇళ్ళ పరిసరాలను వారే నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంగళరావునగర్ కాలనీనేతలు పాల్గొన్నారు.

చేర్పులు, మార్పులపై ఇంటింటి సర్వే!

నియోజకవర్గంలో మొత్తం 3,00,457 మంది ఓటర్లు

- 245 పోలింగ్ బూత్‌లలో ఓటర్ల వివరాల సేకరణ!
- ఇప్పటి వరకు 76 శాతం సర్వే పూర్తి
- చనిపోయిన వారు, ఇళ్లు ఖాళీ చేసిన వివరాలు నమోదు
- అభ్యంతరాల కోసం అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు దరఖాస్తుల స్వీకరణ


ఇంటింటి ఓటరు సర్వే చేస్తున్న బీఎల్ఓలు..

బంజారాహిల్స్: ఓటరు జాబితా సవరణలపై ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇంటింటి సర్వే ముమ్మరం జరుగుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా బూత్‌స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఓటరు జాబితాతో ప్రతి ఇంటికీ వెళ్తున్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) 2024–25లో భాగంగా ఓటరు జాబితా రూపొందిస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రస్తుతం 3,00,457 మంది ఓటర్లు ఉన్నారు. ఇంటింటి సర్వే ఇప్పటి వరకు 76 శాతం పూర్తయ్యింది. సర్వేలో భాగంగా 2,000 మంది ఓటర్లు మృతి చెందినట్లు గుర్తించారు.

- 14,000 మంది ఓటర్లు ఇప్పటి వరకు తాము ఉన్న ప్రాంతం నుంచి మరో చోటకు వెళ్లినట్లుగా తేలింది.
- ఒకే ఓటరుకు రెండు మూడు చోట్ల ఓటు ఉన్న వారిని 300 మందిని గుర్తించారు.
- ఇంటింటి సర్వేకు వెళ్లినప్పుడు 200 మంది ఓటర్లు ఆ అడ్రస్‌లో లేకపోవడాన్ని నిర్ధారించారు.
- మరో 24 శాతం సర్వే రెండు మూడు రోజుల్లో పూర్తవుతుందని అధికారులు పేర్కొన్నారు.

ఉన్నారా..వెళ్లిపోయారా..!

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం.. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని 245 పోలింగ్ బూత్‌లలో బీఎల్ఓలు సర్వే చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి జాబితాలో పేరున్న వారు ఉన్నారా..? లేదా ఎక్కడికి వెళ్లిపోయారా? అన్న వివరాలు సేకరిస్తున్నారు. అద్దెకు ఉన్నవారు ఇతర ప్రాంతానికి వెళితే..ఆ ఓట్లను అక్కడికి బదిలీ చేశారు. శాశ్వతంగా వెళ్లిపోయినా, మరణించిన వారి ఓట్లను తొలగిస్తారు. మరణించిన వారి ఆధార్ కార్డులు తీసుకుంటున్నారు. వివరాలు సేకరించిన ఇంటికి సర్వే పూర్తయినట్లు బీఎల్ఓలు రాస్తున్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా అక్టోబర్ 29న ముసాయిదా జాబితా, వచ్చే ఏడాది జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు.

18 ఏళ్లు నిండితే..

2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరు తమ పేరు నమోదు చేసుకోవచ్చు. వీరు ఎక్కడికి వెళ్లాల్సిన పని లేదు. ఇంటి వద్దకు వచ్చే బీఎల్ఓ నుంచి ఫారం–6ను తీసుకుని దానిని భర్తీ చేసి పుట్టిన తేదీకి సంబంధించిన ఏదైనా ధ్రువీకరణ పత్రం జత చేసి వారికి ఇస్తే సరిపోతుంది. యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

అభ్యంతరాల పరిశీలన..

ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించిన తర్వాత అభ్యంతరాలు, సవరణ పరిశీలనకు అవకాశం ఉంటుంది. ఇందుకు అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారు. వాటిని మరోసారి క్షేత్రస్థాయికి వెళ్లి డిసెంబర్ 24వ తేదీ లోపు పరిష్కరిస్తారు. అనంతరం అధికారులు తుది జాబితాను 2025 జనవరి 6వ తేదీన ప్రకటిస్తారు.

షిఫ్టు అయిన వారికి నోటీసులు పంపిస్తున్నాం

ఓటరు జాబితా ఇంటింటి సర్వే ముమ్మరం జరుగుతుంది. బీఎల్ఓలు మొబైల్ యాప్‌లో పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారు. ఫిజికల్‌గా రిజిస్టర్‌లో కూడా రాయడం జరుగుతుంది. ఈఆర్వో లాగిన్‌లో ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు మేము సర్వేను పరిశీలిస్తున్నాం. ఓటర్లు ఇక్కడి నుంచి మరోచోటికి షిఫ్టు అయితే వారికి నోటీసులు పంపిస్తున్నాం. బీఎల్ఓలు ఆ వివరాలను మరోసారి వెరిఫై చేస్తారు.

– ప్రశాంతి, డీఎంసీ
జీహెచ్ఎంసీ సర్కిల్–18



జేఎన్ఎఫ్ఏయూకి భూ కేటాయింపు ఆలోచనను విరమించుకోవాలి

అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని గురువారం అంబేడ్కర్ వర్సిటీలోని అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ముక్తకంఠంతో ఖండించారు. భారతదేశంలోనే మొట్టమొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అని, అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో పెడుతూ ఎంతో మంది సబ్బండ, పేద విద్యార్థులకు దూర విద్య ద్వారా విద్యనభ్యసించుకునే వెసులుబాటు కల్పిస్తుందని ఈ సందర్భంగా ఉద్యోగులు స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్య ప్రతియేటా పెరుగుతూనే ఉందన్నారు. ఇప్పటికే యూనివర్సిటీలో ఉన్న బిల్డింగ్స్ ఇతర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సరిపోకపోవడంతో అటు విద్యార్థులు, ఉద్యోగస్తులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. గుట్టలు, రాళ్లతో నిండిన క్యాంపస్‌లో ఒక్క ఎకరం జాగా కూడా నిర్మాణాలకు అనువుగా లేదన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం యూనివర్సిటీ స్థలాలను ఇతరులకు కేటాయిస్తే భవిష్యత్తులో తమ యూనివర్సిటీ అభివృద్ధికి, విస్తరణకు అవకాశం ఉండదని యూనివర్సిటీ ఉద్యోగులు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం తమ ఆలోచనను విరమించుకోకపోతే తీవ్రమైన ఉద్యమం ప్రారంభిస్తామని జేఏసీ హెచ్చరించింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలంటూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ సుధారాణికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అన్నిఉద్యోగ సంఘాల నాయకులు పల్లవి కాబ్డే, పుష్పా చక్రపాణి, మాధురి, చంద్రకళ, వెంకటరమణ, భోజు శ్రీనివాస్, బానోత్ ధర్మ, వెంకటేశ్వర్లు, ఎల్వీరెడ్డి, కృష్ణారెడ్డి, వేణుగోపాల్, నారాయణరావు, మహేశ్వర్‌గౌడ్, ఎండీ హబీబుద్దీన్, కాంతం, ప్రేమ్‌కుమార్, యాకేష్ దైద, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం


లబ్ధిదారులకు సబ్సిడీ పత్రాలు ఇస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. గురువారం ఆమె చౌక ధరల దుకాణంలో అభయహస్తం పథకంలో భాగంగా రూ. 500కే వంట గ్యాస్ పథకం లబ్ధిదారులకు సబ్సిడీ పత్రాలు అందచేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 94,746 మంది లబ్ధిదారులకు ఈ పథకం మంజూరయ్యిందని, వారందరికీ ప్రభుత్వం సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు.

21న జాతీయ మహిళా అధ్యాపకుల సదస్సు

పంజగుట్ట: అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్ (ఎబీఆర్ఎస్ఎమ్) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో జాతీయ మహిళా అధ్యాపకుల సదస్సు ఈ నెల 21వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ, ఠాగూర్ ఆడిటోరియంలో జరగనున్నట్లు సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం.శైలజ తెలిపారు. ఎన్విజనింగ్ న్యూ భారత్ అనే థీమ్ ఆధారంగా కొనసాగే ఈ ఒక్కరోజు సదస్సును రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు కో కన్వీనర్లు ప్రొఫెసర్ ఎస్.కవితా దేవి, డాక్టర్ డి.సునిత, ప్రొఫెసర్ ఎన్.కృష్ణ, డాక్టర్ ఇ.యాదయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా అధ్యాపకుల ఆధునీకరణ లక్ష్యంగా ఈ సదస్సు కొనసాగుతుందన్నారు.

ద్విచక్ర వాహనాలు మాయం

వెంగళరావునగర్: ఇళ్ళ ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఆలీనగర్‌లో నివాసం ఉండే మహ్మద్ ఆహ్మద్ బుధవారం రాత్రి తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. ఉదయం వచ్చి చూడగా కనిపించ లేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. అదే విధంగా మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థలో విధులు నిర్వహించే ఎస్.వెంకటేశ్వర్లు కూడా తన ద్విచక్ర వాహనాన్ని ఈనెల 16వ తేదీ రాత్రి మధురానగర్‌లోని తన గృహం వద్ద పార్కింగ్ చేశారు. ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే జి.సుశీల్‌రాజు సినిమా ఇండస్ట్రీలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. గత నెల 29వ తేదీనాడు తాను నివసిస్తున్న అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ద్విచక్ర వాహనం పార్కింగ్ చేశాడు. అనారోగ్య కారణాల వల్ల బయటకు వెళ్ళలేదు. ఈనెల 17వ తేదీ వచ్చి చూడగా తన వాహనం కనిపించలేదు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనానికి వెళితే.. బంగారు చైన్ కొట్టేశారు !

వెంగళరావునగర్: వినాయక నిమజ్జన కార్యక్రమాలను తిలకించడానికి వెళ్ళిన యువకుడి మెడలోని బంగారు గొలుసును దొంగల కాజేసిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసించే సముద్రాల దత్తసాయి ఈనెల 17వ తేదీ ఉదయం వినాయక నిమజ్జనాలను వీక్షించడానికి నెక్లెస్ రోడ్డులోని ఎన్టీఆర్ మార్గ్‌కు తన స్నేహితులు సాయికుమార్, నవీన్‌చంద్రతో కలిసి వెళ్ళాడు. అక్కడ బాగా కిక్కిరిసిన జనం ఉన్నారు. వినాయక నిమజ్జనం చూసిన తర్వాత మధ్యాహ్న సమయంలో తిరిగి హాస్టల్‌కు వచ్చాడు. హాస్టల్‌కు వచ్చి పరిశీలించుకోగా అతని మెడలోని బంగారు చైన్ కనిపించలేదు. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





గోవులను కాపాడాలి

పంజగుట్ట: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలంటే గోవులను కాపాడడం ఎంతో ముఖ్యమని స్వామి ముకుందానంద బ్రహ్మచారీజీ అన్నారు. గోవులను జాతీయ మాతగా ప్రకటించాలని, దేశవ్యాప్తంగా గో ప్రతిష్ఠా, ఆందోళన, గోధ్వజస్థాపన భారత్ యాత్రను ఉత్తరాఖండ్ పీఠాధిపతి పూజ్య శంకరాచార్య అవిముక్తేశ్వరానంద్‌జీ నేతృత్వంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 26 వరకు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం యాత్ర కరపత్రాన్ని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శంకరాచార్య స్వాగత కమిటీ చైర్మన్ చిలప్పగారి లక్ష్మి రాజం తదితరులతో కలిసి ఆవిష్కరించారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE : AT BHONGIR
Tr. O. P. No. 10 OF 2023
BETWEEN:
Gundla Rajaiah ...petitioner
AND
Gundla Poshetty & Others ...Respondents
NOTICE
To,
[R-4] Pancala Sadhubai W/o. Sathaiah, aged about 52 years, Occ: House-Wife, R/o. Wadaparthi Village of Bhongir Mandal, Yadadri-Bhongir District.
[R-5] Teppala Uma W/o. Chandram, aged about 50 years, Occ: House-Wife R/o. Wadaparthi Village of Bhongir Mandal, Yadadri-Bhongir District.
[R-7] Gaddala Somaiah, S/o. Late Narayana aged about [illegible] years, Occ: Agriculture, R/o. H.No. Vinayaka nagar, Ramakrishnapuram, Secunderabad
[R-8] [illegible] Balnarsimha S/o. Late Narsimha aged about 50 years, Occ: Business, R/o. H.No.[illegible], Rampally Dayara Village, Keesara Mandal Medchal Malkajgiri District
[R-9] R. Thirupathaiah, S/o. Late Sri [illegible] aged 70 years, Occ: Retd Employee, R/o. Flat No.[illegible] Jyothi Paradise, Brindavan Colony, Kapra Municipal, Medchal Malkajgiri District
[R-10] R.[illegible] Lakshmi, W/o. Thirupathaiah aged 50 years, Occ: Housewife, R/o. Flat No.[illegible], Jyothi Paradise, Brindavan Colony, Kapra Municipal, Medchal Malkajgiri District
[R-11] [illegible] Reddy, S/o. Late [illegible] Reddy, aged 51 years, Occ: Agriculture, R/o. H.No.4-12, Keesara Village & Mandal, Medchal Malkajgiri District
[R-12] R.P. Bahet; S/o. Late Punamchand Bahet, aged 80 years, Occ: Business, R/o. H. No [illegible] Officer's Colony, Hyderabad - 500082.
[R-13] Yenigalla Jagan Mohan Rao, S/o. Venkata Subbaiah, aged 89 years, Occ: Business, R/o. Plot No. 117, Flat No.3, Navnirman Nagar, Jubilee Hills Road No.7, Hyderabad - 96.
[R-14] Yenigalla Sriram Prasad, S/o. Jagan Mohan Rao aged 63 years, Occ: Retd Employee, R/o. Plot No.117, Flat No.3, Navnirman Nagar, Jubilee Hills Road No.7, Hyderabad-96
Please take notice that the above named Petitioner filed the Transfer OP for Memorandum of Transfer Petition Filed to Transfer the suit in O.S. No. 199 of 2017 on the File of Hon'ble Addl. Junior Civil Judge, At Bhongir to O.S.No. 32 of 2018 on the file of the Hon'ble Prl. Junior Civil Judge at Bhongir and the above said case is posted to 26-09-2024 for your appearance. In spite of this notice if you the above named Respondents No. 4,5 and 7 to 14 fails to appear before the above said court on 26-09-2024 at 10:30 AM either in person are through an advocate in case of your absence on the said date and time before the said court the matter will be decided as set ex-parte.
(By order of the Hon'ble court)
Sd/- P. Linga Reddy, Advocate, Bhongir
Cell: [illegible]

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని మజీదు వద్ద మిలాద్ ఉన్‌నబీ ర్యాలీ..


బంజారాహిల్స్‌లో ర్యాలీలను పర్యవేక్షిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి...

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోకజవర్గాల్లో మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించే మిలాద్-ఉన్-నబీ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మసీదుల నుంచి పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

– బంజారాహిల్స్/జూబ్లీహిల్స్


జహిరానగర్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి


శుభాకాంక్షలు తెలుపుతున్న అజహరుద్దీన్


అన్నదాన కార్యక్రమంలో సీఎన్‌రెడ్డి


బోరబండలో ..



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

వసంత్ సేనకు డాక్టరేట్



సాక్షి, సిటీబ్యూరో: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పి.వసంత్ సేనకు ఈ నెల 12వ తేదీన జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్) నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ విజయవంతంగా పూర్తి చేసినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఆయన జేఎన్టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్, పరీక్షల అదనపు కంట్రోలర్ పి.సమ్మూలాల్ మార్గదర్శకత్వంలో పరిశోధన చేశారు. తన పరిశోధనలో 'స్మార్ట్ వాటర్ గ్రిడ్‌లో డీప్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్‌ని ఉపయోగించి లీకేజ్ డిటెక్షన్, లోకలైజేషన్, వినియోగానికి గ్రాఫ్ ఆధారిత ప్రిడిక్షన్ మోడల్'ని అభివృద్ధి చేశారు. స్మార్ట్ వాటర్ గ్రిడ్‌లో డీప్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్‌ను ఉపయోగించి అధునాతన అల్గారిథమ్‌లను కూడా తన పరిశోధనలో అభివృద్ధి చేశారు. ఇది నీటి డిమాండ్ అంచనా, నిర్వహణలో భవిష్యత్ అనువర్తనాలకు ఉపయోగపడుతుంది. పి.వసంత్ సేన గ్రాడ్యుయేషన్ వరకు ఆదిలాబాద్ జిల్లాలో చదివారు. తన పీహెచ్‌డీని విజయవంతంగా పూర్తి చేయడం పట్ల జేఎన్టీయూ కంప్యూటర్ సైన్స్-ఇంజినీరింగ్ విభాగంలో సిబ్బంది, సీటీఐటీ ఏఐ, డీఎస్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రాధిక, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.నరసింహులుతో పాటు పలువురు అభినందించారు.

డాక్టర్ ఏఎం రెడ్డికి ఫోర్బ్స్ ఐకానిక్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ ఏఎం రెడ్డిని ఫోర్బ్స్ ఐకానిక్ అవార్డు వరించింది. బ్రిటన్ పార్లమెంటులో ఆయన తరఫున అంజాద్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆటిజంతో బాధపడుతున్న ఎంతో మంది పిల్లలకు డాక్టర్ ఏఎం రెడ్డి అందిస్తున్న సేవలు అనిర్వచనీయమైనవని ఆయనను పలువురు కొనియాడారు.

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను పురస్కరించుకొని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట దృశ్యాలతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక మంది కమ్యూనిస్టులు ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. వారి పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ట్యాంక్‌బండ్ నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ముషీరాబాద్ కన్వీనర్ దశరథ్, మహేందర్, రఘుపాల్, ఎస్.వినయ్‌కుమార్, శోభన్‌నాయక్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మొత్తం డబ్బులు చెల్లించండి

సిటీ కోర్టులు: అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ నిర్మాణం కోసం డబ్బులు తీసుకొని ఒప్పంద పత్రం రాసుకున్నా.. రిజిస్ట్రేషన్ చేయకుండా బాధితురాలిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఓ రియల్ ఎస్టేట్ కంపెనీపై హైదరాబాద్ వినియోగదారుల కమిషన్-3 ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్ చెల్లించిన మొత్తం రూ.14.74 లక్షలను 12 శాతం వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశించింది. అంతేగాకుండా రూ.50 వేలు పరిహారం, ఫిర్యాదుదారు ఖర్చుకు రూ.5 వేల అదనంగా చెల్లించాలని కమిషన్ అధ్యక్షుడు రాంగోపాల్‌రెడ్డి, మెంబర్ నారాయణరెడ్డి రియల్ ఎస్టేట్ సంస్థను ఆదేశించారు.

డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారు..

సాహితీ ఇన్‌ఫ్రా టెక్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్, కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపడుతోంది. ఇందులో భాగంగానే మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లిలో సాహితీ గ్రీన్‌హోమ్స్ పేరిట అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. మల్లంపేట, బాచుపల్లికి చెందిన శశి 2022లో గ్రీన్ హోమ్స్‌లోని రెండో అంతస్తులో ఓ ఫ్లాట్‌ను కొనుగోలు చేశారు. ఫ్లాట్ ధర రూ.61 లక్షలు ఉండగా ఇందులో రూ.14.74 లక్షలను చెల్లించి ఒప్పంద పత్రం రాసుకున్నారు. అయితే తర్వాత సేల్ రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పిన కంపెనీ యాజమాన్యం రిజిస్ట్రేషన్ చేయట్లేదని పిటిషనర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేగాకుండా ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయండి, లేదా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నిసార్లు కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించినా స్పందిస్తలేరని, దీంతో విసుగు చెందిన పిటిషనర్ వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైదరాబాద్ వినియోగదారుల కమిషన్-3 బాధితుడి నుంచి తీసుకున్న డబ్బును వడ్డీతో సహా 45 రోజుల్లోపు చెల్లించాలని కంపెనీని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

8 నెలల నుంచి జీతాల్లేవ్..

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



విజయనగర్‌కాలనీ: ప్రభుత్వ కళాశాల హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్లకు నెలనెలా జీతాలు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికీ కొన్ని జిల్లాల్లో 8 నెలల నుంచి జీతాలు రావడం లేదని, ఈ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మాసబ్‌ట్యాంక్ దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌ను హాస్టల్ వర్కర్లతో కలిసి గురువారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ వర్కర్ల జీతాలు రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచడంతో పాటు ఔట్‌సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేయాలన్నారు. బీసీ హాస్టళ్లలో ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి శాశ్వత ప్రాతిపాదికన ఉద్యోగులను నియమించాలన్నారు. ప్రతి హాస్టల్‌కు అటెండర్, వాచ్‌మెన్, కామాటి, కుక్‌లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలన్నారు. రెగ్యులర్ చేయడంతో పాటు సమస్యలన్నీ పరిష్కరించాలని అన్నారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు వర్కర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట



- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి
- ఓయూలో అథ్లెటిక్స్ పోటీలు షురూ

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్రస్థాయి 10వ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్(హెచ్‌డీఏఏ), అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం సహకారంతో యూనివర్సిటీలోని సింథటిక్ ట్రాక్‌లో గురువారం ఏర్పాటు చేశారు. హెచ్‌డీఏఏ అధ్యక్షుడు ప్రొ రాజేష్‌కుమార్ అధ్యక్షత వహించగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో తొలిరోజు 33 జిల్లాలకు చెందిన 1200 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి వచ్చే నెల పాండిచ్చేరిలో జరిగే సౌత్ జోన్ జూనియర్ నేషనల్స్ అథ్లెటిక్స్ పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బీఈ స్టాన్లీ జోన్స్, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, ఒలింపియన్ అథ్లెటిక్స్ క్రీడాకారిణి జెజె శోభ, మనోజ్‌కుమార్ నాయర్, హెచ్‌డీఏఏ చైర్మన్ లక్ష్మీపతి, జనరల్ సెక్రటరీ బీసీ భాస్కర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శాస్త్రీ, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, మాజీ వీసీ ప్రొ.లక్ష్మీకాంత్ రాథోడ్, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, డా.దీప్లా ఉన్నారు.











ఇంకెప్పుడు..?

- మ్యాన్‌హోళ్లకు జియో ట్యాగింగ్ కరువు
- ఎయిర్‌టెక్ యంత్రాలపై జీపీఎస్‌తో నిఘా ఏదీ?
- జలమండలిలో మారని పరిస్థితి



సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో సాంకేతిక పరిజ్ఞానంతో మురుగు నీటి వ్యవస్థ నిర్వహణ చేపట్టాలన్న జలమండలి ప్రయత్నాలు ఆచరణలో ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. మ్యాన్‌హోళ్లకు మరమ్మతుల్లో చేతివాటం, అక్రమాలకు చెక్ పెట్టేందుకు అమలు తలపెట్టిన జియో ట్యాగింగ్ ప్రక్రియకు కాంట్రాక్టర్ల ఒత్తిళ్లు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కక్కుర్తితో ఆదిలోనే హంసపాదు ఎదురైంది. సరిగ్గా నాలుగేళ్ల క్రితం మ్యాన్‌హోళ్లకు జియో ట్యాగింగ్ చేసి జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)తో కనెక్ట్ చేసి ప్రధాన కార్యాలయం నుంచి కొత్త, మరమ్మతు పనులను పర్యవేక్షించాలని భావించినా ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. సీవరేజీ పైప్‌లైన్ క్లీనింగ్‌కు వినియోగిస్తున్న ఎయిర్‌టెక్ యంత్రాలకు జీపీఎస్ అనుసంధానం చేసి పనితీరుపై నిఘా పెట్టాలని నిర్ణయించినా వాటి సాధ్యాసాధ్యాలపైనే జలమండలి అధికారులు మల్లగుల్లాలు పడటం విస్మయానికి గురిచేస్తోంది.

యంత్రాల పనితీరు అంతంతే..

మురుగు నీటి నిర్వహణలో యంత్రాల పనితీరు అంతంతగానే తయారైంది. పైప్‌లైన్ల క్లీనింగ్ కోసం యంత్రాలకు అద్దె పేరిట కోట్లాది రూపాయలు చెల్లిస్తున్నా.. ప్రతినిత్యం డ్రైనేజీ మ్యాన్ హోల్స్ ఓవర్ ఫ్లోను బట్టి వాటి పనితీరు బహిర్గతమవుతోంది. వాస్తవంగా గతంలో మ్యానువల్ పద్ధతిలో సీవరేజీ లైన్లు, మ్యాన్‌హోల్స్ శుభ్రం చేసే విధానం ఉండేది. 2016లో జరిగిన ప్రమాద ఘటనల నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికులు మ్యాన్‌హోళ్లలో పనుల కోసం దిగడాన్ని జలమండలి నిషేధించింది. అప్పటి నుంచి మానవరహిత మురుగు నీటి నిర్వహణ ప్రక్రియ కొనసాగుతోంది. 2017లో మొదటిసారిగా జలమండలి సీవర్ జెట్టింగ్ యంత్రాలను అందుబాటులో తెచ్చింది. ఆ తర్వాత మానవ ప్రమేయం లేకుండా మురుగు నీటి వ్యవస్థ నిర్వహణ కోసం ఎయిర్‌టెక్ యంత్రాల వినియోగాన్ని భారీగా పెంచింది. మొత్తం మీద భారీ జెట్టింగ్ యంత్రాలతో పాటు మినీ ఎయిర్‌టెక్ మిషన్లు సైతం అందుబాటులో తెచ్చింది. యంత్రాల క్షేత్రస్థాయి పనితీరుపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మురుగు పైప్‌లైన్ల క్లీనింగ్ మాత్రం మొక్కుబడి తంతుగా కొనసాగుతోంది. దీంతో పైప్‌లైన్ మార్గం క్లియర్‌గా లేక అందులో చెత్తాచెదారం పేరుకొనిపోయి అక్కడక్కడా స్తంభించి మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగి పొరడం నిత్యకృత్యమైంది.

మహానగరంలో ఎయిర్ టెక్ యంత్రాలు ఇలా

మ్యాన్‌హోళ్లు	6,31,379
భారీ జెట్టింగ్ మిషన్లు	74
మినీ ఎయిర్‌టెక్ మిషన్లు	138
నెలసరి యంత్రాల అద్దె చెల్లింపు	రూ.4 కోట్లు
నెలసరి మ్యాన్‌హోళ్ల నిర్వహణ వ్యయం	రూ.50లక్షలు

అద్దె ప్రాతిపదికన యంత్రాలు

మహా నగరంలో మురుగు నీటి వ్యవస్థ నిర్వహణ కోసం భారీ, మినీ కలిపి సుమారు 212 ఎయిర్‌టెక్ మిషన్లను అద్దె ప్రాతిపదికన వినియోగిస్తోంది. ప్రతి యంత్రం మురుగు పైప్‌లైన్లను శుభ్రం చేస్తే దాని ప్రకారం నిర్దిష్ట రుసుం లెక్కగట్టి సదరు యజమానికి చెల్లిస్తారు. ఇలా ఒక్కో వాహనానికి నెలకు సగటున రూ.2 లక్షల వరకు ప్రయోజనం చేకూరుతుంది. నిబంధనల ప్రకారం ప్రతి ఎయిర్‌టెక్ యంత్రం రోజూ 500 మీటర్లు శుభ్రం చేయాలి. ఈ పూడికతీత లెక్కింపు కూడా అశాస్త్రీయంగా ఉంటోంది. ఒక మ్యాన్‌హోల్ వద్ద పేరుకున్న చెత్త తీస్తే.. దాన్ని మ్యాన్‌హోల్ నుంచి మ్యాన్ హోల్ వరకు క్లినింగ్ చేసినట్లు సదరు కాంట్రాక్టర్లు లాగ్ పుస్తకాల్లో తప్పుడు సమాచారం నమోదు చేయడం సర్వసాధారణమైంది. జలమండలి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఒక కారణమైతే.. కొందరు వారితో లోపాయికారి ఒప్పందాలు చేసుకొని తప్పుడు లెక్కలతో జలమండలి ఖజానాకు గండి కొడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మ్యాన్‌హోళ్ల క్లీనింగ్‌లో జాప్యం

ఎయిర్‌టెక్ యంత్రాల ద్వారా పైప్‌లైన్ల క్లీనింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మురుగు పొంగడంపై జలమండలి కస్టమర్ కేర్ సెంటర్‌కు ఫిర్యాదు అందుతున్న తక్షణమే ఎయిర్‌టెక్ యంత్రాలు అక్కడికి చేరుకున్న దాఖలాలు మాత్రం లేకుండా పోయాయి. ఫిర్యాదు చేసి 24 గంటలు దాటితేనే కానీ ఎయిర్‌టెక్ యంత్రాలు రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో స్థానికుల ఒత్తిళ్లతో క్షేత్రస్థాయి సిబ్బంది మ్యాన్‌హోళ్ల మూత తీసి కర్ర సహాయంతో మురుగు కదిలేలా చేస్తున్నారు. వాస్తవంగా డివిజన్ల వారిగా ఎయిర్‌టెక్ మిషన్లు కేటాయించినప్పటికీ వాటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతోనే పనితీరు మొక్కుబడిగా తయారైనట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జలమండలి అధికార గణం స్పందించి సాంకేతిక పరిజ్ఞానంతో మురుగు నీటి వ్యవస్థపై దృష్టి సారిస్తే మురుగు పొంగి పారడాన్ని కట్టడి చేయవచ్చని సీనియర్ ఇంజినీరింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నగరంలో నేడు

- ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ - వేగేశ్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి మహోత్సవం సందర్భంగా పెద్ద అంబర్‌పేట కుంట్లూరులోని ఘంటసాల గుడిలో ఉదయం 9 గంటలకు అక్కినేని పాటకు పట్టాభిషేకం జరుగుతుంది.
- హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లోని కన్హా శాంతి వనంలో ఉదయం 8.30 గంటలకు రైసింగ్ విత్ కైండ్‌నెస్ కార్యక్రమం జరుగుతుంది.
- మహారాజ్‌గంజిలోని శ్రీసావిత్రి కన్య ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు జరిగే 82వ వార్షికోత్సవ వేడుకల్లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొనున్నారు.
- కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా సోమాజీగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ సమావేశాన్ని నిర్వహిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

సీఎం కప్‌ను విజయవంతం చేద్దాం

- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంలో త్వరలో నిర్వహించే సీఎం కప్-2024 విజయవంతానికి క్రీడా సంఘాల సహకారం ఎంతో అవసరమని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి అన్నారు. ఈ మేరకు ఎల్బీస్టేడియంలో వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులతో సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ యువ క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం కల్పించాలనే లక్ష్యంతో, మట్టిలో మాణిక్యాలను గుర్తించాలని సదుద్దేశంతో సీఎం కప్ నిర్వహించాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తామని ఇందు కోసం సాంకేతికంగా, నిర్వహణ పరంగా క్రీడా సంఘాల మద్దతు అవసరమని కోరారు. గతంలో మాదిరిగా కాకుండా మరింత మెరుగ్గా గ్రామీణ యువ క్రీడా ప్రతిభను ప్రోత్సహించే విధంగా ఈ ఉత్సవాలు జరగాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వివరించారు. ఎన్నో టోర్నమెంట్లు నిర్వహించిన క్రీడా సంఘాల ప్రతినిధులు, అనుభవజ్ఞుల సలహాలు, సూచనలతో సీఎం కప్‌ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు జగదీశ్వర్ యాదవ్, ప్రేమ్‌రాజ్ మహేశ్వర్‌తో పాటు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రవాణా రంగంలో సుస్థిరమైన విధానాలకు ప్రాధాన్యం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు
- బర్మింగ్ హామ్ వర్సిటీతో కలిసి పనిచేస్తాం

శంషాబాద్: రవాణారంగంలో సుస్థిరమైన విధానాల రూపకల్పన కోసం బర్మింగ్ హామ్ వర్సిటీతో కలిసి పనిచేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన కోల్డ్ చైన్ అన్‌బ్రోకేన్-2024 ముగింపు సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఔషధ, ఆహార పదార్థాల రవాణాలో శీతలీకరణ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ఔషధ తయారీలో దేశంలోనే హైదరాబాద్ ప్రముఖ స్థానంలో ఉందన్నారు. అంతర్జాతీయంగా అనేక ప్రముఖ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాలకు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. రవాణాలో ప్రస్తుతం శీతలీకరణ అవసరం ఎంతో ముఖ్యమైందన్నారు. కోల్డ్ చైన్ అన్‌బ్రోకెన్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. కోల్డ్‌చైన్ అన్‌బ్రోకెన్ సంస్థ చైర్మన్ సతీష్ లక్కిరాజు మాట్లాడుతూ.. దేశానికి ఫార్మా రాజధానిగా హైదరాబాద్ ఎదుగుతుందన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శనను మంత్రి ఒక్కొక్కటిగా అడిగి తెలుసుకున్నారు.



సదస్సులో వస్తువుల ప్రదర్శన వివరాలు తెలుసుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు

రాజ్యాధికారం సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యం



పద్మశాలి భవన్‌లో దసరా మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎల్.రమణ, ఈ.అనిల్ కుమార్, కందగట్ల స్వామి తదితరులు

- ఎమ్మెల్సీ ఎల్.రమణ

కాచిగూడ: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో వెనుకబడిన పద్మశాలీలు రాజ్యాధికారంలో వాటా సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ దిశగా పద్మశాలీలు సంఘటితంగా కృషి చేయాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ పిలుపునిచ్చారు. పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో గురువారం నారాయణగూడ పద్మశాలి భవన్‌లో 'పద్మశాలి దసరా మేళా' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అక్టోబర్ 20న ఆటోనగర్‌లోని హరిణి వనస్థలి అనన్య ఎకో పార్కు ఆవరణలో ఈ నెల 22వ తేదీన పద్మశాలి దసరా మేళాను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పద్మశాలి సంఘం ఎల్బీనగర్ అధ్యక్షుడు పున్న గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు పద్మశాలి ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. పద్మశాలీలు రాజ్యాధికార సాధన దిశగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పద్మశాలి, చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే మన పద్మశాలీల సంఘటిత శక్తిని ప్రభుత్వానికి, ప్రభుత్వ పెద్దలకు, వివిధ పార్టీలకు చూపించినప్పుడే అది సాధ్యమవుతుందని అన్నారు. పద్మశాలీలు సంఘటితంగా ఉన్నప్పుడే పార్టీలైనా, ప్రభుత్వాలైనా తగిన గుర్తింపునిచ్చి సమస్యలను పరిష్కరిస్తాయని అన్నారు. పద్మశాలీలు ఐక్యతను చాటేందుకు దసరా మేళా వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. వేలాదిగా పద్మశాలీలు మేళాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఖనిజ అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, మేళా కమిటీ చైర్మన్ కొకుంట్ల రవితేజ, గడ్డం లక్ష్మీనారాయణ, రాపోలు సుధాకర్, అవ్వారి భాస్కర్, గడ్డం జగన్నాథం, మాచర్ల రాంచందర్, వనం దుశ్యంతల, సంధ్యారాణి, గుంటక రూపా సదాశివ్, బొల్ల శివశంకర్, కత్తుల సుదర్శన్ రావు, బొడ్ల తిరుపతి పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి ప్రపంచ దేశాలకు ఆదర్శం

నాంపల్లి: సంగీతం, నృత్యం, లలిత కళలు, జానపదాలను పరిరక్షించి భావితరాలకు అందించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి అన్నారు. నవ్య నాటక సమితి, తెలంగాణ సంగీత నాటక సమితి సంస్థల సంయుక్త నిర్వహణలో గురువారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో 49వ జాతీయ స్థాయి అఖిల భారత సంగీత, నృత్య పోటీలు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర హైకోర్టు జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి హాజరై ప్రారంభించి ప్రసంగించారు. అనేక శతాబ్దాలుగా మన సంస్కృతి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా ఉందన్నారు. అందుకు కారణం మన సాంస్కృతిక మూలాలే అన్నారు. మారుతున్న కాలంలో యువతకు పాశ్చాత్య సంస్కృతిపై, జీవన విధానంపై వ్యామోహం పెరుగుతుందని చెప్పారు. 66 సంవత్సరాలుగా నవ్య నాటక సమితి సాంస్కృతిక రంగానికి చేసిన సేవలను అభినందించారు. గౌరవ అతిథిగా హాజరైన భారత్ బయోటెక్ ముఖ్య ఆర్థిక అధికారి టి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతికి విదేశాల్లో ఆదరణ పెరుగుతుంటే మన యువత పాశ్చాత్య సంస్కృతి పట్ల ఆకర్షితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూట్స్ కొలిజియం అధిపతి పదాల భిక్షపతి, రాష్ట్ర ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర, ఆకుల రజితకుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఎన్ఎన్ఎస్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్‌పర్సన్ యువిఎల్.ఆనంద, నవ్యనాటక సమితి అధ్యక్షులు వి.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.సుధారాణి పాల్గొన్నారు.



హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలి



వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర హోంగార్డుల సంఘం నాయకులు

రాయదుర్గం: హోంగార్డుల ప్రధాన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న హోంగార్డులను పర్మనెంట్ చేసే ఎస్‌పీఏ ఫైల్‌ను మరోసారి పరిశీలించాలని తెలంగాణ రాష్ట్ర హోంగార్డుల నాయకులు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర హోంగార్డుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కొత్వాల్ దయానంద్ ఆధ్వర్యంలో హోంగార్డుల నాయకులు గురువారం ఆయనను కలిశారు. రాష్ట్రంలో హోంగార్డులను పర్మనెంట్ చేస్తే రాష్ట్రంలో 16వేల మంది జీవితాల్లో వెలుగులు నింపినట్లు అవుతుందని వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. హోంగార్డుల సమస్యల పట్ల ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తెసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షులు మహ్మద్ తాహీర్, హరిబాబు, అశోక్‌కుమార్(సైబరాబాద్), రాష్ట్ర కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, శివనారాయణ కలిసి వినతిపత్రాన్ని సమర్పించిన వారిలో ఉన్నారు.

రామాయణ్ మేళా చీఫ్ కన్వీనర్‌గా గోవింద్‌రాఠి



అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దసరా వేడుకలకు నిర్వహించే 52వ రామాయణ్ మేళా చీఫ్ కన్వీనర్‌గా గోవింద్‌రాఠి మరోసారి నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ రాజస్థాని ప్రగతి సమాజ్ అధ్యక్షుడు కమల్‌నారాయణ అగర్వాల్ ప్రకటించారు. గోవింద్ రాఠి మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ ఏడాది కూడా పెద్దఎత్తున రామాయణ్ మేళా వేడుకలు నిర్వహిస్తామన్నారు. రామాయణ్‌పట్ల అవగాహన, దాండియా వేడుకలు, రావణ దహనం చేపడతామన్నారు.



'కాల్‌మణి' రేటింగ్
కిర్రాక్

పిన్న వయస్సులోనే నవల
భారతీయ విద్యాభవన్ స్కూల్ విద్యార్థి అనిరుథ్‌రెడ్డి ఘనత

బంజారాహిల్స్: చదివేది ఎనిమిదో తరగతి.. నవల అంటే కూడా తెలియని ఆ వయసులో తాను రాసిన నవల అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి మార్కెటింగ్ వేదికలపై 4.8 రేటింగ్ సాధించింది. భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న అనిరుథ్ రెడ్డి రావుల 'కాల్‌మణి' పేరుతో రాసిన నవల ఇప్పుడు పాపులర్ అయ్యి ప్రశంసలనూ అందుకుంటుంది. అనిరుథ్ తాను రాసిన 'కాల్‌మణి' పుస్తకాన్ని స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీకి అందజేశారు. గడిచిన వేసవి సెలవులను ఈ బాలుడు సద్వినియోగం చేసుకుని ఈ పుస్తకాన్ని రాశాడు. ఫిక్షన్‌స్టోరీగా మలచిన ఈ పుస్తకాన్ని రాయడానికి రెండు వారాలు పట్టిందని ఈ సందర్భంగా సదరు విద్యార్థి తెలిపాడు. ఇప్పటికే ఈ పుస్తకానికి అమెజాన్‌లో 4.8 రేటింగ్‌తో పాపులర్ అయ్యిందని అనిరుథ్ తెలిపాడు. సోమాజీగూడలో నివసించే అనిరుథ్ తల్లిదండ్రులు రాం.సి.రెడ్డి, మాధవీలతల ప్రోత్సాహం బాగా ఉండడంతో తర్వాత పుస్తక రచనకు కూడా అనిరుథ్ శ్రీకారం చుట్టాడు. కాల్‌మణి పుస్తకంలో అన్స్ అనే బాలుడికి ఓ వజ్రం (మణి) దొరుకుతుందని, దానికి ఉన్న శక్తుల ప్రకారం దానిని మంచి కార్యక్రమాలకు ఎలా ఉపయోగించాలో ఇందులో చెప్పినట్లు అనిరుథ్ తెలిపాడు. పిన్న వయసులోనే అనిరుథ్ ఈ పుస్తకం రాయడం తనకెంతో ఆనందంగా ఉందని, తనకు, స్కూల్‌కు కూడా మంచి పేరు వచ్చిందని ప్రిన్సిపాల్ అరుణశ్రీ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని మంచి పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు.





మౌంటెనీర్స్‌లో చెరిగిపోతున్న వయోబేధాలు

భయమెరుగని బాల్యానికి తలొంచుతున్న శిఖరాలు

పిట్ట కొంచెం పర్వతం ఘనం.. కానీ కూత ఘనమైన పిట్ట ముందు పర్వతం కొంచెంగా మారిపోతోంది. నగరం చిన్నారి మౌంటెనీర్లకు చిరునామాగా అవతరిస్తోంది. గత కొంత కాలంగా వరుస పెట్టి టీనేజ్ పర్వతారోహకులు సాధిస్తున్న విజయాలు పర్వతారోహణ రంగంలో నగర భవిష్యత్తుపై అంచనాలను పెంచుతున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

ఆశయ శిఖరాలు..

శిఖరారోహణలో సిటీ టీనేజ్ క్రేజ్

- నగరంలో పెరుగుతున్న చిరుప్రాయపు మౌంటెనీర్లు
- ఇతర మెట్రో నగరాల నుంచీ తరలివస్తున్న శిక్షకులు

చిన్నారి పర్వతారోహకులు చిచ్చర పిడుగులు అవుతున్నారు. పెద్దలు సైతం సాహసించలేని రీతిలో శిఖరారోహణ చేస్తూ చరిత్ర తిరగరాస్తున్నారు. గత కొన్ని నెలల వ్యవధిలోనే పలువురు టీనేజర్లు, చిన్నారులు పర్వతారోహకులుగా మారడం విశేషం.



హైదరాబాద్ వైబ్స్

ఆ నలుగురు...

పర్వతారోహకుడు సత్యరూప్, రాంచీకి చెందిన ఐ-3 ఫౌండేషన్ సిద్ధాంత సారథ్యంలో రాష్ట్రానికి చెందిన నలుగురు లట్టుపల్లి లలిత్యా రెడ్డి, షామిన్ రమేష్ క్యాతం, లట్టుపల్లి శ్రీహన్ రెడ్డి, గోలి ప్రీతం 11-16 సంవత్సరాల వయసు గలవారే. వీరు ఇటీవల ఓ పర్వత యాత్రను పూర్తి చేశారు. దీనిలో ముంబైకి చెందిన జాన్వీ మంత్రి, రియా శ్రీధర్ కూడా పాల్గొన్నారు. ఈ 14-రోజుల సాహసయాత్ర ఖాట్మండు నుంచి ప్రారంభమై లుక్లా, ఫక్డింగ్, మోంజో, నామ్చే బజార్, టెంగ్‌బోచే, డింగ్‌బోచే, లోబుచేలను దాటి లోబుచే నుంచి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకూ సాగింది.



శిఖర'నాథుడు'..

నగరంలోని బాలానగర్‌లో నివసించే విశ్వనాథ్ కార్తికేయ చిన్న వయస్సులో అనేక పర్వతాలను విజయవంతంగా అధిరోహించాడు. అధిక బరువు ఉన్నప్పటికీ తాను 11 ఏళ్ల వయసులో 2020 లాక్‌డౌన్ సమయంలో పర్వతారోహణ ప్రారంభించాననే కార్తికేయ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్‌లో 10 రోజుల అడ్వెంచర్ కోర్సుకు హాజరై పర్వతారోహణ నైపుణ్యాలను నేర్చుకున్నాడు. నాంగ్‌కార్త్‌షాంగ్ శిఖరాన్ని (5,364 మీ) అధిరోహించాడు. అలాగే కాంగ్ యాట్సే, జో జోంగోలను 72 గంటల్లో అధిరోహించిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. 'పర్వతారోహణలోనే కాదు, జీవితంలోని అన్ని అంశాలలో క్రమశిక్షణ చాలా ముఖ్యం. లక్ష్యాలను సాధించడంలో మానసిక బలం కీలకం' అంటాడు విశ్వనాథ్. కొన్నిసార్లు వయసు అవరోధంగా మారుతుందంటున్న విశ్వనాథ్.. ఇప్పటికే 3 ఎత్తయిన శిఖరాలను అధిరోహించి తాను 16 ఏళ్లలోపు మొత్తం ఏడు శిఖరాలను పూర్తి చేయాలనుకున్నా కానీ ఎవరెస్ట్ శిఖరం 16ఏళ్ల వయసు దాటిన వారికి మాత్రమే కాబట్టి తన వయసు 16 దాటాకే ఎవరెస్ట్‌పై గురి పెట్టనున్నట్లు చెబుతున్నాడు.

కిలిమంజారోపై.. మన టీనేజ్ హీరో..

నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 16 ఏళ్ల విద్యార్థి ప్రీతమ్ గోలీ, గత జులైలో కిలిమంజారో పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించిన అతి పిన్న వయస్కుల్లో ఒకడిగా చరిత్ర సృష్టించాడు 'ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పూర్తి చేసిన తర్వాత, మరిన్ని సాధించాలని కోరుకున్నాను' అని కిలిమంజారో ప్రయత్నం వెనుక కారణాన్ని ప్రస్తుతం 12వ తరగతి చదువుతున్న ప్రీతం, వివరించాడు. భారత జాతీయ జెండాను శిఖరాగ్రాన ఆవిష్కరిండం ఈ క్షణాన్ని తన అత్యుత్తమ అనుభవాలలో ఒకటిగా అభివర్ణించాడు.





అప్రమత్తతే తోడుగా..

ఈ చిన్నారుల సాహసయాత్రలకు సంబంధించి పూర్తి స్థాయిలో భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నారు. ఇందులో అవసరాన్ని బట్టి హెలికాప్టర్ తరలింపు సేవలతో సహా సమగ్ర బీమా కవరేజ్ ఏర్పాటు చేస్తున్నారు. ఎవరికి వారికి సొంత ఆక్సిజన్ సరఫరాలను కూడా అందిస్తున్నారు ప్రయాణంలో ఆకస్మిక వైద్య అవసరాలను తీర్చడానికి కాల్ ఆన్ డాక్టర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు.



అధిరోహిస్తే శిఖరం..
అన్నింటా విజయం...

గతేడాది హైదరాబాద్‌కు చెందిన 10, 11 ఏళ్ల చిన్నారులు కూడా పలు పర్వతాలను అధిరోహించారు. నిజానికి చిన్నారులు పర్వతారోహణలో బాగా రాణిస్తారు. ఆ వయసులో భవిష్యత్తు విజయాలకు ఇది చక్కని పునాదిగా ఉపకరిస్తుంది. నేను దేశవ్యాప్తంగా పలు నగరాలకు చెందిన చిన్నారులకు శిక్షణ ఇస్తాను. అయితే హైదరాబాద్, బెంగళూరులో స్కూల్స్ నుంచి బాగా రెస్పాన్స్ వస్తోంది. హైదరాబాద్‌లో గత కొంతకాలంగా చిన్నారులకు శిక్షణ అందిస్తున్నాను. చిన్నారుల్ని పర్వతాలకు తీసుకెళ్లడంతో పాటు ఇక్కడ పలు స్కూల్స్‌లో అడ్వెంచర్ క్లబ్స్ ప్రారంభించడంపై దృష్టి పెట్టాను. మౌంటెనీరింగ్ అనేది ఒక క్రీడ కాదు. లైఫ్ స్కిల్. ఒక శక్తివంతమైన వ్యక్తిగా మారుస్తుంది. అలాగే ఏ రంగంలో ఉన్నప్పటికీ తాము ఉన్న రంగంలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలను, శక్తియుక్తుల్ని అందిపుచ్చుకోడానికి మార్గంగా మౌంటెనీరింగ్ ఎంచుకోవచ్చు. జీవితంలో ఎత్తుపల్లాల్ని ఎదుర్కోడానికి పనికొస్తుంది.

– సత్యరూప్, పర్వతారోహకుల శిక్షకులు

ఓన్లీ ఫర్ లేడీస్!
మహిళలకు సాధికారత కల్పించడమే లక్ష్యం

షీ జాబ్స్ వ్యవస్థాపకురాలు స్వాతి నేలభట్ల

ఈవై ఆంత్రప్రెన్యూరియల్ విన్నింగ్ ఉమెన్‌గా గుర్తింపు

అమెరికాలో ఉమెన్స్ కోసం చేసిన కృషి ఫలితం



సాక్షి, సిటీబ్యూరో: ఆమె పడిన కష్టాలే సంస్థకు పునాదులు వేశాయి. తనలా మరే మహిళ కూడా ఇబ్బందులు పడొద్దనే ఆలోచన నుంచే ఆ స్టార్టప్‌కు బీజం పడింది. మైనారిటీలు, దివ్యాంగులైన మహిళలకు సగౌరవమైన ఉద్యోగం కల్పించడమే లక్ష్యంగా షీజాబ్స్ అనే సంస్థను స్థాపించారు. ఆమె పేరే స్వాతి నేలభట్ల. తాజాగా ఆమెకు నార్త్ అమెరికా క్లాస్ ఆఫ్ 2024 ఈవై ఆంత్రప్రెన్యూర్ విన్నింగ్ విమెన్‌గా ఎంపికయ్యారు. ఈ అవార్డు సాధించిన తొలి భారతీయ మహిళ కావడం గమనార్హం. షీజాబ్స్ ద్వారా గ్రామీణ భారతంలో ఆమె ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. తన బిడ్డ ఆరోగ్య సమస్యకు సంబంధించి చికిత్స కోసం అమెరికా వెళ్లిన స్వాతి వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదురైన సమస్యలు వేరే వారికి ఎదురు కాకూడదనే ఉద్దేశంతో షీజాబ్స్ అనే వేదిక ఏర్పాటు చేశారు. షీజాబ్స్ ఆధ్వర్యంలో మహిళలకు ప్లేస్‌మెంట్లు చూపించడంతో పాటు ఇన్‌టర్న్‌షిప్ ప్రోగ్రామ్స్ కల్పిస్తూ ఎందరో మహిళలకు అవకాశాలు అందిస్తున్నారు.

ఎన్నో అవార్డులు..

స్వాతి నేలభట్ల ప్రయాణంలో ఎన్నో అవార్డులు ఆమెను వరించాయి. యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ నుంచి గ్లోబల్ ఇన్‌స్పిరేషనల్ లీడర్ అవార్డు, జేపీ మోర్గాన్ సంస్థ నుంచి 100 ఉమెన్ టూ నో ఎక్రాస్ అమెరికా అవార్డులు ఆమెను వరించాయి.



సమాజసేవలో
లార్డ్ వెల్ఫేర్

చింతల్: సమాజసేవలో తనవంతుగా లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రజలకు సేవలందిస్తూ ముందుకు సాగుతోంది. తన చుట్టూ ఉండే పేదలు పడే బాధల్ని చూసి తట్టుకోలేక ఈ సేవా సంస్థని స్థాపించారు డాక్టర్ లయన్ సురేష్‌కుమార్. గత కొన్నేళ్లుగా కుత్బుల్లాపూర్ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాలు, మహిళలకు ఉచిత శిక్షణా తరగతులు, ఓల్డేజ్ హోమ్స్, బాలింతలు, గర్భిణులకు ఉచితంగా మందులు, పౌష్టికాహారం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు.

సేవా కార్యక్రమాలు ఇలా..

- గర్భిణులకు క్యారీయింగ్ అయిన క్షణం నుండి డెలివరీ వరకూ ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందజేస్తారు.
- పేద విద్యార్థుల విద్యకు కావలసిన పుస్తకాలు బ్యాగ్‌లు, షూస్ వంటివి పంపిణీ చేయడం.
- కొంతమంది పేదలను దత్తత తీసుకొని వారి విద్యకు సంబంధించి అన్ని బాధ్యతలూ తీసుకోవడం.
- పేదల కోసం మెడికల్ క్యాంప్స్, అవేర్నెస్ క్యాంప్స్ నిర్వహణ.
- కంటి వెలుగు కంటే మొదటగా లార్డ్ వెల్ఫెయ్యర్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో వందలాది మందికి కంటి ఆపరేషన్లు.
- కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే క్యాజువల్ లేబర్‌కు కంటి పరీక్షలు చేయించి వారికి కళ్లద్దాలు, ఆపరేషన్‌లు చేయించడం.
- తల్లిదండ్రులు లేని యువతకు పెళ్లిళ్లు, వృద్ధులకు ఓల్డేజ్ హోమ్‌లు.
- నిరాదరణకు గురైన వృద్ధులను ఓల్డేజ్ హోమ్‌లో చేర్పడం, తల్లిదండ్రులను చూసుకోని వారికి కౌన్సెలింగ్ ఇప్పించడం.

ఉచిత టైలరింగ్ శిక్షణలో..

ఐదు సంవత్సరాలుగా పేద మహిళలకు ఉచితంగా టైలరింగ్ సెంటర్‌ను స్థాపించి వారికి లయన్స్ క్లబ్ సహకారంతో ఉచితంగా టైలరింగ్ నేర్పించి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. ఇప్పటి వరకూ సంస్థ ఆధ్వర్యంలో వందలాది మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి వారు స్వశక్తితో నిలబడేలా కృషి చేశారు. సురేష్‌కుమార్ సతీమణి సాయిలక్ష్మి ఉచిత టైలరింగ్ తరగతులు నిర్వహిస్తూ మహిళలకు సహకరిస్తున్నారు. అంతేకాకుండా లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సమాజిక సేవా కార్యక్రమాలకు డాక్టర్ బాబురావు, సూర్య రాజు, జీఆర్ సుజాత, ఒంగోలు కళాశాల ఛైర్మన్ కళ్యాణ చక్రవర్తి పూర్తి సహకారాలు అందజేస్తున్నారు.



అంతిమ యాత్ర వాహనం..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఎవరైనా మరణిస్తే వారిని తీసుకువెళ్లడానికి వాహనం, ఫ్రీజర్ బాక్స్‌లు ఉండేవి కావు. వాటిని అద్దెకు తీసుకోవడం ఖర్చుతో కూడుకున్నది కావడంతో చాలా మంది ఇబ్బందులకు గురయ్యేవారు. లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరుపేదల అంతమ యాత్రకు ఉచితంగా వాహనాన్ని సమకూర్చడంతో పాటు ఫ్రీజర్ పెట్టెను సైతం అందిస్తున్నారు.

22న 'సిగ్నాథన్ 2024'..

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ సంజ్ఞా భాషల (సైన్ లాంగ్వేజ్ డే-సెప్టెంబర్ 23) దినోత్సవం సందర్భంగా వినికిడి లోపం ఉన్నవారి సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఆశ్రయ్ అకృతి ఎన్‌జీఓ ఆధ్వర్యంలో 'సిగ్నాథన్ 2024' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 'వాక్ ఫర్ ఇన్‌క్లూజివిటీ' అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని ఈ నెల 22న నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేయనున్నారు. వినికిడి లోపం ఉన్న వ్యక్తులు తమ మానవ హక్కులను పూర్తిగా వినియోగించుకునేలా, సమాజంలోని అన్ని అంశాలలో పాల్గొనేలా సంజ్ఞా భాషలు పోషించే కీలక పాత్రను గుర్తించడానికి ఆచారంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. భాషా, సాంస్కృతిక వైవిధ్యంలో సైన్ లాంగ్వేజ్‌ను సంరక్షించడానికి, కమ్యూనికేషన్ అంతరాలను తగ్గించడం, వినికిడి లోపం ఉన్నవారి హక్కులను ప్రోత్సహించడంలో దీని ప్రాముఖ్యత పై అవగాహన పెంచడానికి నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 2 కి.మీ సైన్ మార్చ్, ఇండియన్ సైన్ లాంగ్వేజ్ పై ఇంటరాక్టివ్ సెషన్‌లు, విద్యార్థుల టాలెంట్ షోకేస్, ఫ్లాష్‌మాబ్ తదితర కార్యక్రమాలు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఇందులో పాల్గొనాలనుకునే ఔత్సాహికులు https://ashrayakruti.org/లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

గర్బా, దాండియా
నృత్య శిక్షణ

లాలాపేట: సీఎస్‌ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో గర్బా, దాండియా నృత్యంలో ట్రైనింగ్, వర్క్‌షాపును నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకూ ఈ శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. ఈ వర్క్‌షాపు ఈ నెల 30 వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు జ్యోతి తెలియజేశారు. ఆసక్తి గల వారు ఫోన్ నెంబర్ 6303868045లో సంప్రదించాలని సూచించారు.



క్లుప్తంగా...

స్పిన్నర్ల, నేత కార్మికుల వేతనాల పెంపు

- కేంద్ర ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ చైర్మన్ మనోజ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: దేశంలోని స్పిన్నర్లకు 25 శాతం, నేత కార్మికులకు 7 శాతం వేతనాలు పెరుగుతున్నట్లు కేంద్ర ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ చైర్మన్ మనోజ్ కుమార్ వెల్లడించారు. మహాత్మాగాంధీ జయంతి అక్టోబర్ 2 నుంచి పెరిగిన వేతనాలు అమలులోకి వస్తాయని ప్రకటించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖాదీ కార్మికులకు వరాలు ప్రకటించారు. న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీఎంఈజీపీ 1,100 కొత్త యూనిట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 3,911 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.101 కోట్ల మార్జిన్ మనీ సబ్సిడీని అందించినట్లు చెప్పారు. కొత్త యూనిట్ల ప్రారంభంతో 43,021 మందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. పీఎంఈజీపీ ద్వారా గత పదేళ్లలో 9.58 లక్షల కొత్త ప్రాజెక్టులతో 83.48 లక్షల మందికి ఉపాధి లభించిందని చెప్పారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో 10.17 లక్షల కొత్త ఉద్యోగాలను కల్పించినట్లు వివరించారు. దేశవ్యాప్తంగా 3 వేల ఖాదీ సంస్థల ద్వారా 4.98 లక్షల మంది ఖాదీ కళాకారులు ఉపాధి పొందుతున్నారని, వీరిలో 80 శాతం మంది మహిళలన్నారు. ఖాదీ ద్వారా గ్రామీణ భారతదేశం ఆర్థికంగా సాధికారత సాధిస్తుందనడానికి ఇదే ప్రతీక అని అన్నారు.

'నెస్ట్స్' స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా శరత్

గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శికి జాతీయ కమిటీలో చోటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ శరత్‌కు కేంద్ర ప్రభుత్వ కమిటీలో చోటు దక్కింది. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (నెస్ట్స్)లో శరత్‌ను స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాదిపాటు ఆయన కమిటీలో కొనసాగనున్నారు. గిరిజన సంక్షేమ శాఖ గిరిజన ప్రాంతాల్లో విద్యను ప్రోత్సహించేందుకు రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోంది. వీటి నిర్వహణ, పర్యవేక్షణతోపాటు కేంద్ర ప్రభుత్వానికి సలహాలు అందించడంపై స్టీరింగ్ కమిటీ కీలకం కానుంది. శరత్‌ను దేశంలోని అన్ని రాష్ట్రాల తరఫున కమిటీ సభ్యుడిగా కేంద్రం నామినేట్ చేసింది. ఈ సందర్భంగా గిరిజన, ఏకలవ్య మోడల్ పాఠశాలల, గిరిజన గురుకుల సిబ్బంది శరత్‌ను అభినందించారు.

రేషన్ కార్డులకు సన్న బియ్యం ఎలా?

జనవరి నుంచే రేషన్ షాపులకు సన్నబియ్యం అని ప్రకటించిన ప్రభుత్వం



- ప్రస్తుతం సర్కార్ గోడౌన్‌లలో సన్న బియ్యం నిల్వలు స్వల్పమే
- పౌరసరఫరాల శాఖ సేకరిస్తున్న ధాన్యంలో 95 శాతం దొడ్డు వడ్లే
- ఈ ఖరీఫ్‌లో సన్న ధాన్యం మార్కెట్‌కు వస్తుందని సర్కార్ భావన
- రూ.500 బోనస్ ప్రకటనతో పంట పెరుగుతుందని అంచనా

సాక్షి, హైదరాబాద్: రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం రాష్ట్రంలోని పౌరసరఫరాల శాఖ గోడౌన్‌లలో సన్నబియ్యం నిల్వలు 50 వేల మెట్రిక్ టన్నులు కూడా లేవని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీకి అవసరమయ్యే సన్న బియ్యాన్ని ఎలా సేకరించాలనే విషయమై సంస్థ తర్జనభర్జన పడుతోంది. ఖరీఫ్ పంట అక్టోబర్ నుంచి మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఎంత మేరకు ధాన్యం వస్తుందనే విషయంలో స్పష్టత లేదు. వచ్చిన సన్నాలను మరాడించి సన్న బియ్యంగా జనవరి నుంచి రేషన్ దుకాణాలకు పంపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.

24 ఎల్ఎంటీల బియ్యం అవసరం

రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో రేషన్‌కార్డులు 89.96 లక్షలున్నాయి. ఈ కార్డుల లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు నెలకు 1.80 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బియ్యం అవసరం. అంటే ఏడాదికి 21.60 ఎల్ఎంటీల సన్నబియ్యం కావాలి. ఇవికాకుండా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంక్షేమ హాస్టళ్లకు, మధ్యాహ్న భోజన పథకానికి కలిపి ఏటా 2.5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కావాలి. అంటే ఏటా సన్నబియ్యం 24 ఎల్ఎంటీలు అవసరమవుతుంది. ఇందుకోసం 36 ఎల్ఎంటీల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించాల్సి ఉంటుంది. విద్యార్థులకు గత ప్రభుత్వ హయాం నుంచే సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నారు. ఈ ఏడాది సన్నబియ్యం కొరత ఏర్పడటంతో గత మే నెలలో 2.2 ఎల్ఎంటీ సన్న బియ్యం కొనుగోలు కోసం టెండర్లను ఆహ్వానించిన ప్రభుత్వం తరువాత వెనకడుగు వేసింది.

ఖరీఫ్‌లో వచ్చే సన్న ధాన్యం 5 ఎల్ఎంటీ లోపే..

రాష్ట్రంలో సగటున ఏటా కోటిన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ సేకరిస్తుంది. ఇందులో ఖరీఫ్‌లో మాత్రమే రైతులు సన్నాలను పండిస్తున్నారు. ఈ సీజన్‌లో పౌరసరఫరాల శాఖ 50 నుంచి 60 ఎల్ఎంటీల ధాన్యం మాత్రమే సేకరించగలుగుతోంది. ఇందులో 5 ఎల్ఎంటీలే సన్నాలు ఉంటున్నాయి. రైతులు ఈ సీజన్‌లో సన్నాలను పండించినప్పటికీ, తమ అవసరాలకు నిల్వ చేసుకుంటుండటంతో మార్కెట్‌కు రావట్లేదు. నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, నారాయణపేట జిల్లాల్లో పండే మేలు రకం సన్న ధాన్యం నేరుగా మిల్లులకు వెళ్లడం లేదంటే బియ్యంగా మార్చి విక్రయించడం జరుగుతోంది. రబీలో వచ్చే మరో 70 ఎల్ఎంటీల ధాన్యంలో సన్నాలు నిల్. రాష్ట్ర వాతావరణం రీత్యా రబీలో సన్న ధాన్యం పండిస్తే, నూకల శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది దీర్ఘకాల పంట పంట కావడంతో రైతులు దొడ్డు ధాన్యాన్నే పండిస్తున్నారు.

ఈ ఖరీఫ్ సీజన్‌పై సర్కార్ ఆశ

రూ.500 బోనస్ ప్రకటనతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సన్నాలను రైతులు అధికంగా పండించినట్లు ప్రభుత్వం భావిస్తోంది. ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,320 ఉండగా, ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తే ఆ మొత్తం రూ. 2,820 అవుతుంది. కాగా 30 రకాలను రూ. 500 బోనస్ ఇచ్చే ఫైన్ వెరైటీలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫైన్ వెరైటీల్లో అధిక డిమాండ్ ఉన్న హెచ్ఎంటీ, సోనా మసూరి, జైశ్రీరాం వంటి రకాలు అధిక ధరలకు అమ్ముడుపోయినా, మిగతా వెరైటీలకు డిమాండ్ లేకపోవడంతో అవి మార్కెట్‌కు వస్తాయని భావిస్తోంది. అక్టోబర్ చివరి నుంచి ధాన్యం సేకరణ చేపట్టి, సన్నాలను వెంట వెంటనే మిల్లింగ్ చేస్తే జనవరి నాటికి రేషన్ దుకాణాలకు పంపవచ్చని ఓ అధికారి చెప్పారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- 20 నుంచి 45 నిమిషాల్లో వైద్యచికిత్స అందేలా కార్యాచరణ
- గోల్డెన్ అవర్‌లో చికిత్స అందేలా ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు
- నర్సంపేటలో జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, వరంగల్/నర్సంపేట: ఏ ప్రభుత్వానికైనా మొదటి ప్రాధాన్యంగా విద్య, వైద్యం ఉండాలి.. అవి అమలు చేసేదిశగా మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో రూ.183 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, వైద్య కళాశాలను గురువారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 4 వేల మెడికల్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల ఖాళీలు భర్తీ చేశామని వెల్లడించారు. 7 వేల మందికి నర్సింగ్ పోస్టింగ్‌లు ఇచ్చామని, త్వరలో ఇంకో 2,500 మందికి పోస్టింగ్ ఇచ్చే దిశగా నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. 'సామాన్యులకు ఎక్కడి నుంచైనా 20 నుంచి 45 నిమిషాల్లో వైద్యచికిత్స అందేవిధంగా ప్రాథమిక, ఏరియా, జిల్లా ఆస్పత్రులను నిర్మించే ఏర్పాట్లు చేస్తున్నాం. సామాన్య ప్రజలకు వైద్యం అందుబాటులోకి వచ్చే విధంగా 108, 104, 102 ఆరోగ్యశ్రీ ట్రస్టు లాంటివి కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. 2004 నుంచి ఇప్పటివరకు ట్రీట్‌మెంట్ ప్రొసీజర్ చార్జెస్ గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా పెంచలేదు. కానీ మా ప్రభుత్వం ఏర్పాటు కాగానే 40 శాతం పెంచింది. దానికోసం రూ.4,000 కోట్లు అదనంగా ఖర్చు చేశాం'అని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన గంట (గోల్డెన్ అవర్)లోపు వైద్యం అందించే విధంగా తెలంగాణవ్యాప్తంగా ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకున్న మిషన్ భగీరథలో భారీ అవినీతి జరిగిందని, రూ.46వేల కోట్ల ఈ ప్రాజెక్టులో రూ.15 వేల నుంచి రూ.20 వేల కోట్లు పక్కదారి పట్టాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిషన్ భగీరథపై సర్వే నిర్వహించగా, 53 శాతం ఇళ్లకు మంచి నీరు అందడం లేదనే భయంకరమైన విషయాలు వెలుగు చూశాయని వెల్లడించారు. ఈ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రజల కోసం చేసినట్టుగా లేదని, వారి జేబులు నింపుకోవడానికి చేసినట్టుగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, డాక్టర్ మురళీనాయక్, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, డీఎంఈ వాణి పాల్గొన్నారు.

మంత్రుల నోట వైఎస్ అభివృద్ధి మాట

దేశ చరిత్రలోనే పేదలకు కార్పొరేట్‌స్థాయి వైద్యసేవలు అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి తీసుకున్న నిర్ణయాలను మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ కొనియాడారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పేదలకు వైఎస్ ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టి అధిక ప్రాధాన్యం ఇచ్చారని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అంతే ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. పేదల సంక్షేమానికి కృషి చేసిన వైఎస్ సేవలు మరచిపోలేమన్నారు.

స్కిల్స్ వర్సిటీలో భాగస్వాములు కండి

మొదటి పేజీ తరువాయి

ఉందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటి నుంచి యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టిసారిస్తుందని తెలిపారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పి, 2028 ఒలింపిక్స్‌లో ఇండియాకు గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణ అందిస్తుందని చెప్పారు.

పట్టాలు ముఖ్యం కాదు.. నైపుణ్యం కావాలి

డిగ్రీ, పీజీ పట్టాలు ఉంటే సరిపోదని, ఏటేటా లక్షలాది మంది యువకులు డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్నప్పటికీ, అందరూ ఉద్యోగాలు సాధించలేక పోతున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన లక్షలాది మంది యువకులు ఒక ఉద్యోగం ఇప్పించమని తన వద్దకు వస్తున్నారంటూ తనకు ఎదురైన కొన్ని అనుభవాలను వివరించారు. ఇదే సమయంలో పరిశ్రమలు మానవ వనరుల కొరతను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ఈ అంతరాన్ని తొలిగించేందుకు స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాలని, తద్వారా యువత ఉపాధికి ఢోకా ఉండదని భావించినట్లు తెలిపారు.

ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్: దుద్దిళ్ల

స్కిల్స్ యూనివర్సిటీకి సంబంధించి పలు కీలక అంశాలను మంత్రి శ్రీధర్‌బాబు పారిశ్రామికవేత్తలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకుందని అన్నారు. ఇందులో భాగంగా కొత్తగా ఫ్యూచర్ సిటీని నెలకొల్పుతోందని, ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని చెప్పారు. ముఖ్యమంత్రి స్వీయ ఆలోచనతో త్వరలోనే స్కిల్ యూనివర్సిటీ లో కొత్త కోర్సులు ప్రారంభమవటం ఆనందంగా ఉందన్నారు.

సీఎం ఆలోచనలో దార్శనికత ఉంది: ఆనంద్ మహీంద్రా

తెలంగాణ నుంచి నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచానికి అందించాలన్న ముఖ్యమంత్రి ఆలోచన గొప్పదని ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు. ప్రభుత్వాలు సబ్సిడీలు, ఆకర్షణీయమైన పథకాలకు ఎక్కువగా ప్రాధాన్యమిస్తాయని, కానీ యువతను నిపుణులుగా తీర్చిదిద్దాలని భావించడంలో దార్శనికత ఉందన్నారు. అతి పెద్ద యూఎస్ కాన్సులేట్ తెలంగాణలో ఉందని, ఇక్కడి నుంచే అమెరికాకు ఎక్కువ మంది వెళుతున్నారని తెలిపారు. స్కిల్స్ వర్సిటీలో దసరా పండుగ తర్వాత కోర్సులు ప్రారంభించనున్నట్లు బోర్డు తెలిపింది. సమావేశంలో బోర్డు కో చైర్మన్ శ్రీనిరాజు, సభ్యులు పి.దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బోర్డు సభ్యులు మనీష్ సభర్వాల్, సంజీవ్ బిక్చందానీ, ఎంఎం మురుగప్పన్, డాక్టర్ కేపీ కృష్ణన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

వంద రోజుల వంచన..

మంచి ఎక్కడ? అంతా మోసమే

అన్ని వర్గాలకు సీఎం చంద్రబాబు దగా.. పాలనలో ఘోర వైఫల్యం



సాక్షి, అమరావతి: వంద నాలుకలు..! వంద మోసాలు... వైఫల్యాలు..! ఇదీ సీఎం చంద్రబాబు వంద రోజుల పాలన!! అన్ని వర్గాలను దారుణంగా మోసగించి సూపర్ సిక్స్ హామీలను అటకెక్కించిన సీఎం చంద్రబాబు తాజాగా ఇది మంచి ప్రభుత్వం అంటూ తన ఫొటోలతో ఇంటింటికీ స్టిక్కర్లు అతికించేందుకు సిద్ధం కావడంపై సర్వత్రా తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది. నమ్మి ఓట్లేస్తే అధికారంలోకి వచ్చాక దగా చేశారు. నాడు ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ హామీలను ప్రచారం చేసి బాండ్లు ఇస్తామని ఓట్లు వేయించుకున్నారు. ఇప్పుడు ఆ హామీల పేరు వింటేనే భయమేస్తోందంటున్నారు. దీన్ని మంచి అంటారా? మోసం అంటారా? అని ప్రజానీకం ప్రశ్నిస్తోంది. బడికి వెళ్లే పిల్లల దగ్గర నుంచి తల్లులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు .. ఇలా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను విస్మరించిన సీఎం చంద్రబాబు ఏ ఒక్కటైనా నెరవేర్చారా? అని నిలదీస్తున్నారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ జరుగుతోంది. అదే వైఎస్ జగన్ ప్రభుత్వం ఉండి ఉంటే ఈపాటికి అన్ని పథకాలు అందేవని, ఆయన ఇచ్చిన పథకాలకు సైతం చంద్రబాబు అడ్డుపడటాన్ని మంచి అంటారా? మోసం అంటారా? అని ప్రశ్నిస్తున్నారు. ఇవాళ ఏ రైతన్నను పలుకరించినా రైతు భరోసా లేదని.. రూ.20 వేలు పెట్టుబడి సాయం హామీని మట్టిలో కలిపేశారని, క్రాప్ ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ, ఈ క్రాప్ ఊసే లేకుండా వంచించారని ఆవేదన చెందుతున్నారు. నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు ఇస్తామంటూ చిన్న పిల్లలను సైతం చంద్రబాబు మోసగించారని తల్లులు ఆక్రోశిస్తున్నారు. 40 లక్షల మందికిపైగా తల్లులు అమ్మ ఒడికి దూరమై నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీతో ఒక్కో ఇంటికి రూ.30 వేలు చొప్పున వస్తాయని నమ్మామని ఇద్దరు పిల్లలున్న తల్లులు పేర్కొంటున్నారు. విద్యా సంస్కరణలను నీరుగార్చడంతో పిల్లలకు నాణ్యమైన గోరుముద్ద కరువైందని, ఇంగ్లిషు మీడియం చదువులు, టోఫెల్, ఐబీ, సీబీఎస్ఈ సిలబస్ సర్కారు బడికి దూరమయ్యాయని, నాడు-నేడుతో బాగుపడ్డ స్కూళ్లు కళ తప్పాయని నిర్వేదంగా చెబుతున్నారు. ఇప్పుడు ఓ చేయూతగానీ సున్నావడ్డీ గానీ ఆసరా లాంటి పథకాలు గానీ లేవని మహిళలు వాపోతున్నారు. ఈ ప్రభుత్వంలో ఓ మత్స్యకార భరోసాగానీ వాహనమిత్ర లాంటి పథకాలుగానీ లేవని సొంత ఉపాధి పొందుతున్న వారు పేర్కొంటున్నారు. ఇక 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామన్న హామీకి చంద్రబాబు తూట్లు పొడిచారు. యువతకు నిరుద్యోగ భృతి లేకపోగా డీఎస్సీ దరిదాపుల్లోనే లేదు..! గత వంద రోజులుగా రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారింది. కొత్తవి ప్రవేశపెట్టకపోవగా గత ఐదేళ్లుగా అమలైన సంక్షేమ పథకాలు, వ్యవస్థలను రద్దు చేయడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుంది. కనీసం బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేక కాలయాపన చేస్తుండటం 40 ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబు వైఫల్యానికి నిదర్శనం. ఉచిత ఇసుక విధానం ముసుగులో పచ్చముఠాల భారీ దోపిడీకి రాచబాట వేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి రావల్సిన 700 ఎంబీబీఎస్ సీట్లకు మోకాలడ్డి, కొత్త వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేసి మన విద్యార్థులకు తీరని అన్యాయం చేసింది. విజయవాడను వరదలు ముంచెత్తుతాయని స్పష్టమైన సమాచారం ఉన్నా అలవి మాలిన నిర్లక్ష్యంతో వ్యవహరించింది. వరదలు బీభత్సం సృష్టిస్తుంటే ప్రభుత్వం పత్తాలేకుండా పోయింది. వంద రోజుల్లో చంద్రబాబు ప్రభుత్వం సాధించింది మాత్రం ఒక్కటి ఉంది... అదే రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట రాష్ట్రంలో అరాచక రాజ్యాన్ని సృష్టించడం. హత్యలు, హత్యాయత్నాలు, దాడు లు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, లైంగిక దాడులు, వేధింపులు, కక్ష సాధింపులతో రాష్ట్రాన్ని భయానక వాతావరణంలోకి నెట్టివేయడం. ఇదీ చంద్రబాబు వంద రోజుల పాలన ట్రాక్ రికార్డ్! ఈ నేపథ్యంలో ఇన్ని మోసాలు చేసి రెడ్‌బుక్ పాలన సాగిస్తూ మంచి చేశామని నిస్సిగ్గుగా చెప్పుకునేందుకు మనసు ఎలా వచ్చింది? అని ప్రజానీకం ప్రశ్నిస్తోంది.

సూపర్ సిక్స్ మోసాలివిగో..

1) 20 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు.

2) తల్లికి వందనం పథకం కింద స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారు. కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికీ ఇస్తామని నమ్మబలికి చంద్రబాబు చిన్న పిల్లలను సైతం మోసం చేశారు. ఇప్పుడా పథకాన్ని అమలు చేసే ఉద్దేశమే లేదన్నట్టుగా వ్యవహరిస్తుండంతో కోట్లాది మంది విద్యార్థులు నష్టపోతున్నారు.

3) ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చి ఖరీఫ్ సీజన్ మొదలైనా రైతులకు ఆర్థిక సహాయం ఊసే ఎత్తడం లేదు.

4) ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామంటూ మీనమేషాలు లెక్కిస్తున్నారు.

5) 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు మహిళలు అందరికీ నెలకు రూ.1,500 చొప్పున ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఇప్పుడు అసలు ఆ హామీ ఇచ్చిన విషయమే గుర్తు లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

6) మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై అధ్యయనాల డ్రామాతో పథకం అమలు చేయకుండా మోసగిస్తున్నారు. సూపర్ సిక్స్ హామీల పేరు వింటేనే భయం వేస్తోందంటూ సీఎం చంద్రబాబే చెబుతున్నారు.

ఆవు నెయ్యి.. టీడీపీకి గొయ్యి!

తాను తీసుకున్న గోతిలో తానే పడ్డ ముఖ్యమంత్రి చంద్రబాబు

- శ్రీవారి లడ్డూ తయారీకి జంతువుల కొవ్వు కలిసిన నెయ్యి వాడారని ఉన్మాద వ్యాఖ్యలు
- వాటిపై నిప్పులు చెరిగిన భక్తులు
- దాంతో ఎన్‌డీడీబీ పరీక్ష నివేదికను వక్రీకరించబోయి అడ్డంగా దొరికిన టీడీపీ



చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సరఫరా అయిన నెయ్యినే జూలై 17న ఎన్‌డీడీబీ పరీక్ష కోసం పంపినట్లు.. ఆ శాంపిల్‌ను పరీక్షించినట్లు జూలై 23న విడుదల చేసిన నివేదిక ఇది.

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి మహా ప్రసాదమైన లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిపై ఉన్మాద వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తాను తవ్వుకున్న గోతిలో తానే పడ్డారు. జంతువుల కొవ్వు కలిసిన నెయ్యిని శ్రీవారి లడ్డూ తయారీలో వినియోగించారంటూ దుర్మార్గపు ఆరోపణలు చేయడంపై ప్రపంచ వ్యాప్తంగా భక్తులు భగ్గుమన్నారు. వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేసి, రాజకీయంగా లబ్ధి పొందడానికి తిరుమల శ్రీవారిని వాడుకుంటారా.. అంటూ హిందువులు నిప్పులు చెరిగారు. దాంతో తాను చేసిన ఆరోపణలను సమర్థించుకోవడానికి గురువారం ఎన్‌డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు) పరీక్ష నివేదికను వక్రీకరించి.. జంతువుల కొవ్వు నెయ్యిలో కలిపారంటూ సామాజిక మాధ్యమాల్లో టీడీపీ మూకలతో హోరెత్తించారు. కానీ.. ఆ పరీక్ష నివేదికను పరిశీలిస్తే.. ఆవు నెయ్యిని పరీక్షల కోసం 2024 జూలై 12న టీటీడీ పంపగా, అది తమకు జూలై 17న చేరిందని.. పరీక్షించి జూలై 23న నివేదిక ఇచ్చినట్లు అందులో స్పష్టంగా ఉంది. అప్పుడు అధికారంలో ఉన్నది చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వమే. దానికి బాధ్యత వహించాల్సింది చంద్రబాబు ప్రభుత్వమే.

అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు..

టీటీడీ ఈవోగా జె.శ్యామలరావును జూన్ 14న చంద్రబాబు ప్రభుత్వం నియమించింది. ఎన్‌డీడీబీ పరీక్ష నివేదిక టీటీడీకి ఇచ్చిన రోజు అంటే.. జూలై 23న టీటీడీ ఈవో జె.శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ ఒక ఆవు నెయ్యి ట్యాంకర్‌లో వనస్పతి వంటి వెజిటబుల్ ఫ్యాట్‌లు కల్తీ అయినట్లు ఎన్‌డీడీబీ నివేదిక ఇచ్చిందని చెప్పారు. ఆవు నెయ్యి కల్తీ చేసి సరఫరా చేసిన సంస్థను బ్లాక్ లిస్ట్‌లో ఎందుకు పెట్టకూడదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసు ఇచ్చామని చెప్పారు. మరో ట్యాంకర్ ఆవు నెయ్యిలోనూ వెజిటబుల్ ఫ్యాట్ కలిపినట్లు తేలిందని, దాన్ని సరఫరా చేసిన సంస్థకు షోకాజ్ నోటీసు ఇచ్చామని ఈవో శ్యామలరావు స్పష్టం చేశారు. ఎన్‌డీడీబీ జూలై 23న రెండు ట్యాంకర్ల ఆవు నెయ్యిపై ఇచ్చిన పరీక్షల నివేదికలను విశ్లేషిస్తే.. అందులో వెజిటబుల్ ఫ్యాట్ కలిసినట్లు ఉందే తప్ప, ఎక్కడా జంతువుల కొవ్వు కలిసినట్లు లేదని టీడీపీ అధికార వర్గాలతోపాటు ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా తేల్చి చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే.. జంతువుల కొవ్వు కలిసిన నెయ్యిని శ్రీవారి లడ్డూ తయారీలో వినియోగించారంటూ చంద్రబాబు చేసిన ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టమవుతోంది.

నివేదిక 5 పేజీలుంటే ఆరో పేజీ ఎలా వచ్చింది?

ఆవు నెయ్యి శాంపుల్‌ను పరీక్షించి.. ఐదు పేజీలతో ఎన్‌డీడీబీ నివేదిక ఇచ్చిందని, నాలుగు పేజీలతో నివేదిక పూర్తయిందని (ఎండ్ ఆఫ్ టెస్ట్ రిపోర్టు) పేర్కొంటూ దాన్ని పరీక్షించిన నిపుణులు అవానీ మక్వాన్, కైలాస్ చంద్ర బెహరా డిజిటల్ సంతకాలు చేశారు. ఐదో పేజీలో నియమ నిబంధనలు ఉన్నాయి. ఆరో పేజీ ఉన్నట్లు ఆ నివేదికలో ఎక్కడా లేదు. కానీ.. టీడీపీ సోషల్ మీడియాలో పోస్టు చేసిన నివేదిక, నేషనల్ మీడియాలో టీడీపీ వర్గాలు చూపుతున్న నివేదికలో ఎనెక్చర్ (అనుబంధం)-1 పేరుతో ఒక పేజీని చేర్చారు. అందులో ఒకటో విభాగం కింద సోయాబీన్, సన్‌ప్లవర్, ఆలీవ్, ర్యాప్‌సీడ్, లిన్‌సీడ్, వీట్ జెర్మ్, మెయిజ్ జెర్మ్, కాటన్ సీడ్, ఫిష్ ఆయిల్.. రెండో విభాగం కింద కోకనట్ అండ్ పామ్ కెర్నెల్ ఫ్యాట్.. మూడో విభాగం కింద పామాయిల్, బీఫ్ ట్యాలో.. నాలుగో విభాగం కింద ల్యార్డ్.. ఐదో విభాగం కింద పైవన్నీ అంటూ పేర్కొంది.

టెండర్ల ద్వారా స్వచ్ఛమైన ఆవు నెయ్యి కొనుగోలు

శ్రీవారి నైవేద్యాలు, లడ్డూల తయారీ కోసం రోజుకు 15 టన్నుల నెయ్యిని టీటీడీ వినియోగిస్తోంది. ఈ నెయ్యిని ఈ - ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా టెండర్లు పిలిచి కొనుగోలు చేస్తుంది. తక్కువ ధరకు కోట్ చేసిన సంస్థలకు ఆవు నెయ్యి సరఫరా బాధ్యతలను అప్పగిస్తుంది. టెండర్లలో పేర్కొన్న ప్రమాణాల మేరకు నెయ్యిని సరఫరా సంస్థలు ట్యాంకర్లలో టీటీడీకి సరఫరా చేయాలి. ప్రతి ట్యాంకర్ నెయ్యిని టీటీడీ అధికారులు తనిఖీ చేస్తారు. పరీక్షల్లో టెండర్లలో పేర్కొన్న ప్రమాణాల మేరకు నెయ్యి ఉంటేనే తీసుకుంటారు. లేదంటే.. సరఫరా సంస్థకు వెనక్కు పంపుతారు. కల్తీ నెయ్యి సరఫరా చేసినందుకు బ్లాక్ లిస్ట్‌లో ఎందుకు పెట్టకూడదో వివరణ ఇవ్వాలంటూ సంబంధిత సరఫరా సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు. టీటీడీ చరిత్రలో ఇప్పుడే కాదు.. ఎప్పుడూ జంతువుల కొవ్వుతో కల్తీ అయిన నెయ్యిని సరఫరా సంస్థలు సరఫరా చేసిన దాఖలాలు లేవని.. అప్పుడప్పుడు వెజిటబుల్ ఫ్యాట్ కలిసిన నెయ్యిని సరఫరా చేస్తే.. దానిని వెనక్కు పంపుతున్నామని.. నెయ్యి కొనుగోలులో కీలక భూమిక పోషిస్తున్న టీటీడీ ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు.

బాసర దేవాలయంలో 4 రాజగోపురాలు

- వేములవాడ, భద్రాచలం ఆలయాల విస్తరణ పనుల్లో వేగం పెంచాలి: మంత్రి సురేఖ ఆదేశం
- పొంగులేటి, సీతక్క, పొన్నంతో కలిసి సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు పొన్నం, సురేఖ, సీతక్క

సాక్షి, హైదరాబాద్: బాసర దేవాలయంలో ప్రస్తుతం ఉన్న రెండు రాజగోపురాల సంఖ్యను నాలుగుకు పెంచాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. దేవాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా, ప్రాకారం, గోపురాలు, గర్భాలయ విస్తరణ పనులను ప్రారంభించాలని సూచించారు. గురువారం సచివాలయంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయం, బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయం, భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయాల అభివృద్ధి పనులపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లతో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. విస్తరణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. బాసరలో సత్రాలు, వాటిల్లోని గదుల సంఖ్య భక్తులకు సరిపోతోందీ లేనిదీ, పార్కింగ్, మూత్రశాలలు, క్యూ లైన్లు, ఇతర వసతుల గురించి మంత్రులు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేములవాడ ఆలయ గోశాలలో ఆవులు, కోడెల ఉచిత పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేములవాడ దేవాలయ అభివృద్ధి నిధులతో బద్ది పోచమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. కొత్తగా నిర్మిస్తున్న శివరచన వేదికలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలపగా, కార్తీక, శ్రావణమాసాల్లో నిర్వహించే ఉత్సవాలతోపాటు ప్రత్యేక పర్వదిన వేడుకలను కూడా అక్కడే నిర్వహించాలని మంత్రులు ఆదేశించారు. భద్రాచల ఆలయ విస్తరణకు ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో భూసేకరణ పనులు చేపట్టాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. కళ్యాణ మండపానికి అనుబంధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు మరో మండపాన్ని నిర్మించాలని ఆదేశించారు. దసరా నేపథ్యంలో బాసర దేవాలయంలో నిర్వహించే శరన్నవరాత్రి వేడుకల పోస్టర్‌ను ఈ సందర్భంగా మంత్రులు విడుదల చేశారు.

87 శాతం హామీలు.. వంద రోజుల్లోనే అమలు

నాడు తొలి కేబినెట్‌లోనే అనేక నిర్ణయాలతో దేశానికే ఆదర్శంగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించిన జననేత

అప్పట్లో ఉద్యోగులకు జూలై నుంచి 27 శాతం మధ్యంతర భృతి.. 2019 అక్టోబరులో వైఎస్సార్ రైతుభరోసా అమలు..

అదే నెల 2 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ కూడా.. అన్ని శాఖల్లోని పారిశుధ్య కార్మికుల వేతనాలు రూ.18 వేలకు పెంపు.. అంగన్‌వాడీ వర్కర్లు, కార్యకర్తల జీతాలు కూడా..

డ్వాక్రా యానిమేటర్లు, రిసోర్స్ పర్సన్స్‌కు రూ.10 వేలు గౌరవ వేతనం.. ఖజానా ఖాళీగా ఉందని ఏనాడూ సాకులు చెప్పలేదు

ఇదీ హామీలపట్ల వైఎస్ జగన్ చిత్తశుద్ధి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎస్‌ఈసీగా బాధ్యతలు చేపట్టిన రాణీ కుముదిని



బాధ్యతలు స్వీకరించిన అనంతరం గవర్నర్‌ను కలిసిన ఎస్‌ఈసీ రాణీ కుముదిని

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ (ఎస్‌ఈసీ)గా విశ్రాంత ఐఏఎస్‌ అధికారి రాణీ కుముదిని బాధ్యతలు స్వీకరించారు. గురువారం స్టేట్‌ ఎలక్షన్‌ కమిషన్‌ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎస్‌ఈసీ నియామకం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే...ఈ నెల 8న ఎస్‌ఈసీగా పదవీ విరమణ చేసిన పార్థసారథి, వార్డులు, పంచాయతీల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా తయారీపై షెడ్యూల్‌ జారీచేశారు. ఈ నెల 28న ఈ ఓటర్ల తుది జాబితాలను వార్డులు, పంచాయతీలు, మండల పరిషత్‌ కార్యాలయాల్లో ప్రచురించాల్సిందిగా ఆదేశించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన కసరత్తు సాగుతోంది. గ్రామపంచాయతీ ఎన్నికల్లో పాటించే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల శాతంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే స్టేట్‌ ఎలక్షన్‌ కమిషన్‌ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్‌ జారీచేయనుంది. ఎస్‌ఈసీగా బాధ్యతలు చేపట్టిన కొత్త కమిషనర్‌ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కసరత్తును కొనసాగించనున్నారు.

బీఆర్‌ఎస్‌ నాయకులపై దాడులను అరికట్టండి

డీజీపీని కలసిన బీఆర్‌ఎస్‌ ముఖ్య నేతలు



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో తమ నాయకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని బీఆర్‌ఎస్‌ పార్టీ డిమాండ్‌ చేసింది. బీఆర్‌ఎస్‌ నాయకులకు రక్షణ కల్పించడంలో స్థానిక పోలీసుల వైఫల్యం, సీనియర్‌ నాయకులకు పొంచి ఉన్న ముప్పు విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు గురువారం డీజీపీ జితేందర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద్‌, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్‌ కె.సంజయ్‌, పార్టీ నేత ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ డీజీపీని కలసిన వారిలో ఉన్నారు. అనంతరం డీజీపీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'పోలీసులతో కలసి కాంగ్రెస్‌ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్‌ నేతలపై దాడులు చేస్తున్నారు. సూర్యాపేట, ఖమ్మంలో బీఆర్‌ఎస్‌ నేతలపై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనం. సిద్దిపేటలో హరీశ్‌రావు క్యాంప్‌ ఆఫీసు, కౌశిక్‌రెడ్డి నివాసంపై జరిగిన దాడులతో పోలీసుల పట్ల విశ్వాసం సన్నగిల్లుతోంది. కాంగ్రెస్‌ చిల్లర దాడులకు బీఆర్‌ఎస్‌ భయపడేది లేదు. ఇప్పటికైనా పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేయాలి'అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

రవ్‌నీత్‌సింగ్‌ బిట్టు తలతెచ్చిన వారికి నా ఆస్తి రాసిస్తా: వెడ్మ



ఉట్నూర్‌ రూరల్‌: కేంద్ర మంత్రి రవ్‌నీత్‌సింగ్‌ బిట్టు తల తీసుకొచ్చిన వారికి తన ఆస్తి, తన తండ్రి పేర ఉన్న ఆస్తిని బహుమానంగా ఇస్తానంటూ ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ పిలుపు మేరకు గురువారం ఆదిలాబాద్‌ జిల్లా ఉట్నూర్‌ మండల కేంద్రంలోని ఐబీచౌరస్తాలో కేంద్రమంత్రి రవ్‌నీత్‌సింగ్‌బిట్టు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ దేశంలో అల్లకల్లోలం సృష్టించడానికి బీజేపీ నిరంతరం కుట్ర పన్నుతోందని విమర్శించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌ షా ఇప్పటివరకు స్పందించకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. రవ్‌నీత్‌సింగ్‌ బిట్టుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, సీఎం రేవంత్‌రెడ్డిపై విచ్చలవిడిగా మాట్లాడుతూ నోరు పారేసుకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కేటీఆర్‌ విదేశాల్లో ఉంటూ ప్రభుత్వాన్ని బద్నామ్‌ చేయడం సరికాదన్నారు.

'హైడ్రా'పై తేలేది నేడే!

చట్టబద్ధతపై నిర్ణయం తీసుకోనున్న రాష్ట్ర కేబినెట్

- వెంటనే ఆర్డినెన్స్‌ జారీ చేసే అవకాశం
- వర్షాలు, వరద నష్టాలు, పరిహారం చెల్లింపుపై చర్చించనున్న మంత్రివర్గం
- దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, ప్రాజెక్టులకు మరమ్మతులపై నిర్ణయం
- కొత్త రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డుల జారీపై పరిశీలన

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమావేశం కానుంది. 'హైదరాబాద్‌ విపత్తు నిర్వహణ- ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ సంస్థ (హైడ్రా)'కు చట్టబద్ధత కల్పించడం, వరదల నష్టం, పరిహారం చెల్లింపు, కొత్త రేషన్‌కార్డులు వంటి ముఖ్యమైన అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనుంది.

హైడ్రాపై ఆర్డినెన్స్‌!

రెవెన్యూ, మున్సిపల్‌, నీటిపారుదల శాఖలకు ఉన్న కొన్ని విశేష అధికారాలను హైడ్రాకు కల్పించాలనే ప్రతిపాదనలపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుంది. ఆ వెంటనే ఆర్డినెన్స్‌ రూపంలో ఉత్తర్వులను జారీ చేసి హైడ్రాకు చట్టబద్ధతను, విశేష అధికారాలను కల్పించే అవకాశం ఉంది. ఓఆర్‌ఆర్‌ పరిధిలో చెరువులు, నాలాల పరిరక్షణ కోసం రెవెన్యూ, మున్సిపల్‌, నీటిపారుదల శాఖల చట్టాల్లోని కీలకమైన అధికారాలను హైడ్రాకు అప్పగించనున్నారు. చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయడం, కూల్చివేతలు నిర్వహించడం కోసం అవసరమైన అధికారాలను హైడ్రా పొందనుంది. శీతాకాల శాసనసభ సమావేశాల్లో హైడ్రా చట్టం బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని ప్రభుత్వం భావిస్తోంది.

వరద నష్టంపై కేబినెట్‌లో జరగనున్న చర్చ..

ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో సంభవించిన నష్టంపై మంత్రివర్గం చర్చించనుంది. ముంపు బాధితులకు, దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లింపు, రోడ్లు, చెరువులు, సాగునీటి ప్రాజెక్టులకు మరమ్మతులు, ఇతర అంశాలపై నిర్ణయం తీసుకోనుంది. వరదలతో రాష్ట్రంలో రూ.10,300 కోట్ల మేర నష్టం జరిగిందని అంచనా వేసిన ప్రభుత్వం .. కేంద్ర సాయం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది. కేంద్రం నుంచి సాయాన్ని రాబట్టుకునే అంశంపై సైతం చర్చించనుంది.

కొత్త రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల జారీపైనా..

రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులు, హెల్త్‌ కార్డుల జారీపై మంత్రివర్గ ఉపసంఘం సమర్పించిన మధ్యంతర ప్రతిపాదనలపై కేబినెట్‌ చర్చించి.. ఉప సంఘానికి పలు సూచనలు చేసే అవకాశం ఉంది. ఈ మేరకు ఈ నెల 21న మంత్రి ఉత్తమ్‌ నేతృత్వంలో మంత్రివర్గ ఉప సంఘం సమావేశమై కొత్త రేషన్‌కార్డులు, హెల్త్‌ కార్డుల జారీకి సంబంధించిన విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకోనుంది. వచ్చే నెల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఇక రైతు భరోసాపైనా మంత్రివర్గంలో చర్చించి ఎప్పట్నుంచి అమలు చేయాలన్న అంశంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

యూనివర్సిటీలకు కొత్త పేర్లు

రాష్ట్రంలోని మూడు యూనివర్సిటీలకు కొత్త పేర్లు పెట్టాలని ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను మంత్రివర్గం ఆమోదించనుంది. పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీగా, కోఠి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా.. హ్యాండ్లూమ్‌ వర్సిటీకి కొండా లక్ష్మణ్‌ బాపూజీ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ హ్యాండ్లూమ్‌ టెక్నాలజీగా కొత్త పేర్లను పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కులగణన చేసి తీరుతాం

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ సన్మానసభలో మంత్రి పొన్నం



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న వీహెచ్‌. చిత్రంలో సీతక్క, పొన్నం ప్రభాకర్‌, ఆది శ్రీనివాస్‌, రాజ్‌ఠాకూర్‌, కేశవరావు, జాజుల తదితరులు

గన్‌ఫౌండ్రీ(హైదరాబాద్‌): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరిగే విధంగానే రిజర్వేషన్లు ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్‌ స్పష్టం చేశారు. గురువారం రవీంద్రభారతిలో మాజీ ఎంపీ వి.హన్మంతరావు ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ కులగణనకు అంతా సిద్ధంగా ఉందని, దీనికి నిధులు కేటాయించినట్టు తెలిపారు. ఎవరెంత అరిచి గీ పెట్టినా రాష్ట్రంలో కులగణన చేయడం ఖాయమని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ చెప్పిన మాటలకు అనుగుణంగానే అసెంబ్లీలో తీర్మానం చేశామని, వెనువెంటనే బీసీ కమిషన్‌ను కూడా నియమించామని గుర్తు చేశారు. కులగణనకు వ్యతిరేకంగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్‌ దాఖలు చేసిందని, ఇదే పార్లమెంట్‌లో కులగణన తీర్మానం చేస్తామని రాహుల్‌గాంధీ చెప్పారన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు బీజేపీ అసలు స్వరూపం తెలుసుకోకపోతే రాబోయేతరాలకు నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలంతా ఐక్యంగా ఉండి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం : టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ గౌడ్‌

కాంగ్రెస్‌ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ గౌడ్‌ అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాహుల్‌గాంధీ ఎంతగానో కృషి చేస్తున్న వ్యక్తి అని తెలిపారు. ఆయన దేశవ్యాప్తంగా కులగణన చేయాలని మాట్లాడుతుండటంతో బీజేపీ నేతలు ఆయన్ను హత్య చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల విషయంలో తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి బీసీలకు ఏమీ చేయని బీఆర్‌ఎస్‌.. నేడు కల్లిబొల్లి మాటలు చెబుతుందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌కు ఒక బీసీ వ్యక్తిని రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించే దమ్ముందా అని ప్రశ్నించారు. తన కార్యవర్గంలో 60 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అవకాశం ఉండేలా చూస్తానని చెప్పారు. అనంతరం వివిధ కుల సంఘాల ప్రతినిధులు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్‌, వీరపల్లి శంకర్‌, మక్కన్‌సింగ్‌ ఠాకూర్‌, ఎమ్మెల్సీలు అమీర్‌అలీఖాన్‌, యెగ్గె మల్లేశం,, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌, మాజీ మంత్రి శంకర్‌రావు, కోదండరెడ్డి, నిర్మలాజగ్గారెడ్డి, అనిల్‌, శివసేనారెడ్డి, మెట్టు సాయికుమార్‌, కాల్వ సుజాత, ముత్తినేని వీరయ్య పాల్గొన్నారు.

బడి.. ఇక త్రీడీ..!

▶ మొదటి పేజీ తరువాయి

అధ్యయనాలు తేల్చాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలు సర్కారీ బడుల్లో అత్యాధునిక సాంకేతికత సమకూర్చుకుని, డిజిటల్‌ బోధనను అమలు చేయాలని కేంద్రం కోరింది. ఇందుకోసం అయ్యే వ్యయంలో 60 శాతం భరిస్తామని ప్రకటించింది. వాస్తవానికి ఈ ప్రయత్నం 2022లోనే మొదలైంది. అవసరమైన మౌలిక వసతులనూ గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వ బడుల్లో డిజిటల్‌ విద్యపై రెండేళ్ల క్రితం కొంత కసరత్తు జరిగింది. త్రీడీ విద్యను రెండు స్కూళ్లలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. కానీ ప్రతిపాదనల దశలోనే అది ఆగిపోయింది.

ఆధునిక విద్యకు ఎన్నో అవసరాలు!

స్కూళ్లలో డిజిటల్‌ బోధనకు 75 అంగుళాల మానిటర్లు అవసరం. కంప్యూటర్లు, వర్చువల్‌ రియాలిటీ, త్రీడీ పరికరాలతో కూడిన స్మార్ట్‌ క్లాస్‌రూంలు, మెటల్‌ ఫ్రేమ్‌ కూడిన బోర్డ్‌, పాఠ్యాంశాల బోధన కోసం యాప్‌లు, ట్యూబ్‌లైట్లు, గ్రీన్‌బోర్డ్‌లు, విద్యుత్‌ అంతరాయంతో ఇబ్బంది రాకుండా యూపీఎస్‌లు వంటివి అవసరం. దీనికితోడు వేగవంతమైన ఇంటర్నెట్‌, వైఫై తప్పనిసరి. విద్యార్థులకు కావాల్సిన ఆడియో, వీడియో, త్రీడీ చిత్రాలు, గ్రాఫ్‌లు, మ్యాప్‌లు, వీడియోలను డౌన్‌లోడ్‌ చేసుకునే సదుపాయం ఉండాలి. యానిమేషన్‌, త్రీడీ చిత్రాలను ఉపయోగించే సాంకేతికత ఉండాలి.

కొత్త టెక్నాలజీలతో సులువుగా..

ఇప్పుడు డిజిటల్‌, త్రీడీ, వర్చువల్‌ విద్యా బోధన సులువుగా మారిందని నిపుణులు తెలిపారు. గతంలో ప్రొథీయమ్‌ బోర్డ్‌ వాడాల్సి వచ్చేదని.. దానితో ఒక్కో బడికి రూ.25 లక్షల దాకా వెచ్చించాల్సి వచ్చేదని.. ఇప్పుడు తక్కువ ఖర్చయ్యే కొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ప్రస్తుతం ప్రొజెక్టర్‌, స్మార్ట్‌ టచ్‌ స్క్రీన్‌ టీవీలను వాడుతున్నారని.. బోధనకోసం వాడే కంటెంట్‌ను బడిలోని కంప్యూటర్‌లోనే ఇన్‌స్టాల్‌ చేయడానికి వీలుందని వెల్లడించారు. బోధన కంటెంట్‌ ఉచితంగా కూడా దొరుకుతుందని.. కాకపోతే స్థానికతను దృష్టిలో ఉంచుకుని కంటెంట్‌ రూపొందించుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు. కంటెంట్‌ను తగిన మెళకువలతో అందిస్తే విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందని తెలిపారు.

సూచనలు, అంచనాలివీ..

- → 6 నుంచి 10 తరగతుల వరకు రికార్డు చేసిన డిజిటల్‌ కంటెంట్‌ను ఇంటర్నెట్‌ సాయంతో వినేలా చేయవచ్చు. టీచర్లు చెప్పే లైవ్‌ పాఠాలు ఇంటివద్దే వినే, చూసే వీలుంటుంది.
- → ప్రతి పాఠశాలలో రెండు డిజిటల్‌ క్లాస్‌ రూంలను ఏర్పాటు చేయాలి. ఇందులో ప్రొజెక్టర్‌, కంప్యూటర్లు, డిజిటల్‌ తెర .. ఇలా మొత్తం 25 ఎలక్ట్రానిక్‌ పరికరాలు అమర్చాల్సి ఉంటుంది.
- → ప్రయోగాత్మక పరిశీలన కోసం రాష్ట్రంలో 3 వేల స్మార్ట్‌ క్లాస్‌రూమ్‌ల అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇందులోనే వర్చువల్‌, డిజిట ల్‌, త్రీడీ పాఠాలు చెప్పవచ్చు. ఒక్కో స్కూల్‌కు రూ.10 లక్షల వరకూ ఖర్చు అవుతుందని అంచనా. ఇలా మొత్తంగా 300 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని విద్యాశాఖ అంచనా వేసింది.


ఇంటర్నెట్‌, ఇతర వసతులు కల్పించాలి



మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ స్కూళ్లలో డిజిటల్‌ విద్యను ప్రవేశపెట్టడం స్వాగతించాల్సిన అంశం. ఇందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన ముఖ్యం. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో స్కూళ్లకు ఇంటర్నెట్‌ నెట్‌ సదుపాయం లేదు. కొన్నిచోట్ల వేగం సరిగారాదు. ఇలాంటి సమస్యలను పరిష్కరించాలి. డిజిటల్‌ విద్యా బోధన వల్ల ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

– పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పీఆర్టీయూటీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు

లోకల్‌ కంటెంట్‌ అవసరం



డిజిటల్‌, త్రీడీ విద్యా బోధన ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలనే మారుస్తుంది. అయితే ఎక్కడి నుంచో పాఠాలు దిగుమతి చేసుకుంటే లాభం లేదు. జాతీయ స్థాయిలో రూపొందించిన పాఠాలు. స్థానిక పరిస్థితులను ప్రతిబింబించేలా వీడియోలు, యానిమేషన్‌ ఉండాలి. దీనిపై రాష్ట్రంలో కొన్ని సంస్థలు పనిచేస్తున్నాయి. వాటి భాగస్వామ్యాన్ని తీసుకోవాలి. విద్యార్థులకు పాఠం చెప్పే సమయంలోనే డిజిటల్‌, త్రీడీ విధానాలను వినియోగించాలి. కేవలం రివిజన్‌ సమయంలో వాడితే ప్రయోజనం ఉండదు.

– పన్నీరు భానుప్రసాద్‌, సూపర్‌ టీచర్‌ ఎడ్యు రిఫార్మ్స్‌ సీఈవో

వచ్చేస్తోంది.. పెద్ద డ్రోన్‌

మేడిన్‌ హైదరాబాద్‌.. 100 కిలోల బరువు మోసుకెళ్తుంది

2026లో మార్కెట్‌లోకి.. దేశంలోనే మొట్టమొదటిది..



ప్రత్యేకతలు..

- డ్రోన్‌ బరువు 400 కేజీలు
- మోసుకెళ్లే సామర్థ్యం 300 కి.మీ.
- వేగం గంటకు 200 కి.మీ.
- ప్రయాణించే ఎత్తు: భూమికి 1000 అడుగుల ఎత్తులో
- ఇంధనం: హైడ్రోజన్‌, విద్యుత్‌ (కాలుష్యరహితంగా)

అతిపెద్ద డ్రోన్‌ను తయారు చేసిన నిర్వాహకులు ఉత్తమ్‌, అమర్‌దీప్‌ ◀

శంషాబాద్‌: అత్యవసరాల్లో ట్రాఫిక్‌ కష్టాలుండవు.. అనుకున్న సమయానికి మీ కార్గో చేరిపోతుంది. ఎమర్జెన్సీలో తీసుకెళ్లాల్సిన వైద్య సంబంధిత వస్తువులు, ఆర్గాన్స్‌ కూడా గ్రీన్‌ చానల్‌ ఏర్పాట్లు లేకుండా గమ్యానికి చేరిపోతాయి. దీనికి మరెంతో దూరం లేదు. 2026లో మార్కెట్‌లోకి రాబోతున్న అతి పెద్ద డ్రోన్‌తో ఇవన్నీ సాకారమవుతాయి. హైదరాబాద్‌ యువ ఇంజనీర్లు దీన్ని సిద్ధం చేశారు. ఇప్పటికే ట్రయల్‌రన్‌లో సక్సెస్‌ కావడంతో డైరెక్టరేట్‌ ఆఫ్‌ సివిల్‌ ఏవియేషన్‌ (డీజీసీఏ) అనుమతులతో త్వరలోనే అందుబాటులోకి రానుంది. దీనిని ఆదిభట్లలోని బ్లూజే ఏరోస్పేస్‌ వ్యవస్థాపకులు ఉత్తమ్‌కుమార్‌, అమర్‌దీప్‌ నేతృత్వంలోని ఏరోనాటికల్‌ ఇంజనీర్ల బృందం తయారు చేసింది. నోవాటెల్‌ హోటల్‌లో 'కోల్డ్‌చైన్‌ అన్‌బ్రోకెన్‌–2024'సదస్సులో దీనిని ఏర్పాటు చేశారు. 'పర్యావరణహితంగా తయారు చేసిన ఈ పైలట్‌రహిత డ్రోన్‌ 100 కిలోల కార్గోను 300 కిలోమీటర్ల దూరంలోని గమ్యస్థానానికి గంటన్నర సమయంలో తీసుకెళ్తుంది. ఇంత సామర్థ్యమున్న డ్రోన్‌ తయారీ దేశంలో ఇదే మొదటిది. 2029 నాటికి పదిమంది ప్రయాణికులతోపాటు వేయి కేజీల బరువు, వేయి కి.మీ. దూరం ప్రయాణించే డ్రోన్‌ను తయారుచేసేందుకు కృషిచేస్తున్నాం'అని ఉత్తమ్‌కుమార్‌ 'సాక్షి'తో తెలిపారు.

ప్రజాభవన్‌ చుట్టూ కంచెలు ఎందుకు?

- రుణమాఫీ కోరితే రైతులను అరెస్టు చేస్తారా: కేటీఆర్‌
- ప్రజాభవన్‌కు రైతులు వస్తుంటే భయమెందుకు

సాక్షి, హైదరాబాద్‌: రుణమాఫీ కోరుతూ ప్రజాభవన్‌ ముట్టడికి పిలుపునిచ్చిన రైతులను రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేయడాన్ని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ఖండించారు. 'రుణమాఫీ కోరుతూ చలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చిన రైతులను బుధవారం రాత్రి నుంచే అక్రమంగా అరెస్టు చేసి దొంగలు, ఉగ్రవాదుల్లా పోలీసు స్టేషన్లలో నిర్బంధించడం దారుణం. పోలీసుల నిర్బంధకాండతో రైతుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అక్రమంగా నిర్బంధించిన రైతులను పోలీసులు బేషరతుగా విడుదల చేయాలి. రుణమాఫీపై హామీ ఇచ్చి మోసం చేసినందునే రైతులు ఆందోళన చేస్తున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా రైతులు సంఘటితమై చేస్తున్న ఉద్యమం ఆగదు. దగా చేసిన కాంగ్రెస్‌ ప్రభుత్వం తలవంచక తప్పదు' అని కేటీఆర్‌ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

శిశు మరణాలపై కమిటీ వేస్తాం

గాంధీ ఆసుపత్రిలో మాతా శిశు మరణాలపై ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని కేటీఆర్‌ అన్నారు. సమస్యపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్షాలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. గాంధీ ఆసుపత్రిలో మాతా శిశు మరణాలపై బీఆర్‌ఎస్‌ తరఫున నిజ నిర్ధారణ కమిటీ నియమిస్తామన్నారు. ఈ కమిటీ గాంధీ ఆసుపత్రిలో మాతా శిశు మరణాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి, ప్రజలకు నివేదిస్తుందని చెప్పారు. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా తాము ఇచ్చే సలహాలు, సూచనలు ప్రభుత్వం స్వీకరించాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమీక్ష చేసి వైద్యంలో నాణ్యత పెరిగేలా చూడాలన్నారు. గాంధీ ఆసుపత్రిలో అనుభవం కలిగిన వైద్యులను బదిలీ చేయడం వల్లే చికిత్సకు ఆటంకం ఏర్పడిందన్నారు.

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతకు కేటీఆర్‌ నివాళి



శ్వేత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్‌, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులు

జడ్చర్ల: మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి డాక్టర్‌ శ్వేతారెడ్డి మరణం అత్యంత బాధాకరమని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీ రామారావు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్‌ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామంలో గురువారం జరిగిన శ్వేతారెడ్డి దశదినకర్మకు కేటీఆర్‌తో పాటు మాజీమంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్‌, మహమూద్‌ అలీ, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, సీతాదయాకర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్‌, బాల్క సుమన్‌, ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీలు మన్నె శ్రీనివాస్‌ రెడ్డి, మందా జగన్నాథం తదితరులు హాజరయ్యారు. లక్ష్మారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన శ్వేత చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

రేవంత్‌ నేరపూరిత వ్యాఖ్యలను అరికట్టండి

- కేసీఆర్‌పై సీఎం చేస్తున్న అసభ్య వ్యాఖ్యలపై స్పందించండి
- కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌ గాంధీకి హరీశ్‌రావు లేఖ



సాక్షి, హైదరాబాద్‌: 'మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు, ఆయన కుటుంబ సభ్యులపై సీఎం రేవంత్‌రెడ్డి ఉపయోగిస్తున్న అసభ్యకర భాష, నేరపూరిత వ్యాఖ్యలపై కాంగ్రెస్‌ అధిష్టానం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు డిమాండ్‌చేశారు. రేవంత్‌ వ్యాఖ్యలను అరికట్టడంలో కాంగ్రెస్‌ అధిష్టానం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేత రాహుల్‌ గాంధీకి హరీశ్‌రావు గురువారం బహిరంగ లేఖ రాశారు. 'కేసీఆర్‌పై రేవంత్‌ వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం. రాహుల్‌ తీవ్రవాది అంటూ బీజేపీ చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చిన కాంగ్రెస్‌.. రేవంత్‌పై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఢిల్లీలో ఒక నిబంధన, గల్లీలో మరో నిబంధన అన్నట్లుగా కాంగ్రెస్‌ వ్యవహరిస్తోంది. రేవంత్‌ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం. ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్న రేవంత్‌పై కఠినచర్యలు తీసుకోవాలి'అని హరీశ్‌రావు లేఖలో డిమాండ్‌ చేశారు.

రుణమాఫీ కోరితే నిర్బంధిస్తారా?

'ఆంక్షలు, కంచెలు లేని ప్రభుత్వం, ప్రజాపాలన అంటూ డబ్బాకొట్టుకుంటున్న రేవంత్‌ ప్రభుత్వం రుణమాఫీ కోరిన రైతులను నిర్బంధిస్తోంది. ప్రజాభవన్‌ చుట్టూ కంచెలు, ఆంక్షలు ఎందుకు? ప్రజాభవన్‌కు రైతులు తరలివస్తుంటే సీఎం ఎందుకు భయపడుతున్నారు? రుణమాఫీపై మాట తప్పినందుకు అది రేవంత్‌ ప్రభుత్వానికి ఉరితాడుగా మారుతుంది'అని హరీశ్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అరచేతిలో స్వర్గం చూపించి అధికారం దక్కించుకున్న రేవంత్‌ రైతులను మోసం చేశాడని, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు.

జీవన్‌దాన్‌ అక్రమాలపై విచారణ?

ఆడిట్‌ కమిటీ వేయాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్‌: జీవన్‌దాన్‌ అక్రమాలపై విచారణ చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఆడిట్‌ కమిటీ వేసేందుకు త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది. పదేళ్లుగా జరిగిన అవయవ మార్పిడులపై సమగ్ర వివరాలు సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రైవేట్‌, కార్పొరేట్‌ సహా ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగిన అవయవ మార్పిడులపై వివరాలు తీసుకోనున్నారు. వివిధ ప్రైవేట్‌, కార్పొరేట్‌ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడుల్లో వచ్చిన వరుస ఫిర్యాదులపై సర్కార్‌ సీరియస్‌గా ఉంది. అవయవాల దందాలు జరుగుతున్నాయని ఇటీవల కొన్ని ఎన్‌జీవోలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. పదేళ్లుగా జీవన్‌దాన్‌లో ఎంతమంది రిజిస్టర్‌ అయ్యారు? ఎన్ని అవయవాలు రోగులకు అందజేశారు? డోనర్స్‌ ద్వారా వచ్చినవి ఎన్ని? పోర్టల్‌ ద్వారా నమోదైన వారికి ఆర్డర్‌లోనే అందజేశారా? ప్రైవేట్‌, కార్పొరేట్‌ ఆస్పత్రులలో జరిగిన ట్రాన్స్‌ప్లాంటేషన్ల లెక్కలు జీవన్‌దాన్‌లో ఉన్నాయా? తదితర అంశాలపై ఆడిట్‌ కమిటీ విచారణ చేయనున్నది. ముున్ముందు రాష్ట్రంలో అవయవ మార్పిడుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వ యాక్ట్‌ కూడా అడాప్ట్‌ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

న్యాయవ్యవస్థపైనే ఆరోపణలా?

ధిక్కరణ కేసులో రఘునందన్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్‌: న్యాయవ్యవస్థపై నిరాధార ఆరోపణలు చేయడం క్షంతవ్యం కాదంటూ మెదక్‌ ఎంపీ ఎం.రఘునందన్‌రావుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీడియా సమావేశాల్లో ఇష్టం వచ్చినట్లు ఎలా మాట్లాడతారని ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇస్తూ కౌంటర్‌ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడుతూ జ్యుడీషియరీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారని, ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఓ జడ్జి లేఖ రాశారు. ఎంపీపై విచారణ జరిపి ధిక్కరణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేఖపై సుమోటోగా విచారణ జరిపేందుకు సీజే అంగీకరించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ అలోక్‌ అరాధే, జస్టిస్‌ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. లేఖలోని అంశాలను పరిశీలించిన ధర్మాసనం.. ఎంపీకి నోటీసులు జారీ చేస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

స్మార్ట్‌ కార్డుల్లో నాణ్యత లేని చిప్స్‌

- ఫిర్యాదులపై ఎట్టకేలకు స్పందించిన రవాణా శాఖ
- ఎన్‌ఐసీ విచారణలో నాణ్యత లేదని వెల్లడి
- కార్డులు సరఫరా చేసిన నోయిడాకు చెందిన సంస్థపై వేటు
- ఇక రవాణాశాఖ టెండర్లలో పాల్గొనకుండా డిబార్‌



సాక్షి, హైదరాబాద్‌: వాహనదారులకు తెలంగాణ రవాణా శాఖ సరఫరా చేస్తున్న స్మార్ట్‌ కార్డుల్లో నాణ్యత లేని చిప్స్‌ వాడుతున్న వ్యవహారం వెలుగు చూసింది. స్మార్ట్‌ కార్డులు సకాలంలో రాకపోవడం, అందిన కార్డుల్లోనూ నాణ్యత లేకపోవటంపై చాలాకాలంగా ఫిర్యాదులు వస్తున్నా, రవాణాశాఖ సరిగ్గా స్పందించలేదు. చివరకు ఆ ఫిర్యాదుల ఆధారంగా ఇప్పుడు ఎట్టకేలకు విచారణ జరిపింది. జారీ అయిన కార్డుల్లో నాణ్యత లేని చిప్స్‌ ఉన్నాయన్న విషయాన్ని శాస్త్రీయంగా తెలుసుకొని చర్యలకు ఉపక్రమించింది. తెలంగాణ రవాణా శాఖకు లైసెన్సులు, ఆర్‌సీ కార్డులకు సంబంధించి స్మార్ట్‌ కార్డులు జారీ చేస్తున్న నోయిడాకు చెందిన సంస్థను బాధ్యతల నుంచి తప్పించింది. తదుపరి రవాణాశాఖకు సంబంధించి ఎలాంటి టెండర్లలో పాల్గొనకుండా డిబార్‌ చేయటం విశేషం. వాహన లైసెన్సులు, ఆర్‌సీ కార్డులకు సంబంధించి కొన్నేళ్లుగా రవాణాశాఖ చిప్స్‌తో కూడిన స్మార్ట్‌ కార్డులను జారీ చేస్తున్న విషయం తెలిసిందే. స్కాన్‌ చేయగానే పూర్తి వాహనం, లైసెన్సు వివరాలను తెలిపే సమాచారాన్ని అందించే చిప్స్‌ను స్మార్ట్‌ కార్డుల్లో నిక్షిప్తం చేసి జారీ చేస్తున్నారు. టెండర్ల ద్వారా ఈ బాధ్యతను ప్రైవేట్‌ సంస్థలకు రవాణా శాఖ అప్పగించింది. అలా ఢిల్లీ సమీపంలోని నోయిడా కేంద్రంగా పనిచేస్తున్న మెజర్స్‌ కలర్‌ప్లాస్ట్‌ సిస్టమ్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ స్మార్ట్‌ కార్డుల జారీ టెండర్‌ దక్కించుకుంది. కానీ, చాలాకాలంగా ఆ సంస్థ కార్డులను సరిగ్గా జారీ చేయటం లేదు. స్మార్ట్‌ కార్డు రుసుము, పోస్టల్‌ చార్జీలు చెల్లించినా నెలల తరబడి కార్డులు సరఫరా కాక వాహనదారులు టెన్షన్‌ పడాల్సి వస్తోంది. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే, కార్డులు జారీ అవుతాయని చెప్పటం, తప్ప వాస్తవాలు వెల్లడించటం లేదు.

ఆ ఫిర్యాదుతో....

ఇటీవలే మళ్లీ కార్డుల జారీ ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో ది సేఫ్‌ కమ్యూనిటీ ఫౌండేషన్‌ సంస్థ చైర్మన్‌ నుంచి రవాణా శాఖకు గత మే నెలలో ఫిర్యాదు అందింది. తమకు జారీ అయిన స్మార్ట్‌ కార్డుల్లో నాణ్యత లేదన్నది దాని సారాంశం. దీంతో రవాణాశాఖ కొన్ని కార్డులను సేకరించి స్మార్ట్‌ కార్డ్‌ ఆపరేటింగ్‌ సిస్టం నిబంధనల మేరకు కార్డుల్లో నాణ్యత ఉందో లేదో తేల్చాలని ఎన్‌ఐసీ(నేషనల్‌ ఇన్ఫర్మేషన్‌ సెంటర్‌)ని కోరింది. శాంపిల్‌ కార్డులను పరిశీలించిన ఎన్‌ఐసీ, కొన్ని కార్డుల్లోని చిప్స్‌లో నాణ్యత లేదని తేల్చి నివేదిక అందించింది. దీనిని తీవ్రంగా పరిగణించిన రవాణా శాఖ, ఆ కార్డులను సరఫరా చేసిన నోయిడాలోని సంస్థకు షోకాజ్‌ నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులకు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని తేల్చి, ఇప్పుడు చర్యలకు ఉపక్రమించింది. కార్డుల జారీకి సంబంధించి రవాణా శాఖతో చేసుకున్న ఒప్పందంలోని అంశాలకు విరుద్ధంగా వ్యవహరించినందున, తదుపరి రవాణా శాఖకు సంబంధించి ఎలాంటి టెండర్లలో పాల్గొనకుండా ఆ సంస్థను డిబార్‌ చేస్తున్నట్టు రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు, టెండర్‌ ఒప్పందాలను ఉల్లంఘించినందుకు ఆ సంస్థపై చట్టపరంగా చర్యలు తీసుకుంది.

● టెక్.. టాక్

శాంసంగ్ గెలాక్సీ ఏ06



డిస్‌ప్లే: 6.70 అంగుళాలు
బరువు: 189 గ్రా.
రిజల్యూషన్: 720×1600 పిక్సెల్స్
మెమోరీ: 64జీబి 4జీబి ర్యామ్/ 128జీబి 4జీబి ర్యామ్/ 128జీబి 6జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 14; **ఫ్రంట్ కెమెరా:** 8 ఎంపీ; **బ్యాటరీ:** 5000 ఎంఏహెచ్

టెక్నో ఫాంటమ్ వి ఫోల్డ్ 2



డిస్‌ప్లే: 7.85 అంగుళాలు
వోఎస్: ఆండ్రాయిడ్ 14
ర్యామ్: 12జీబి
స్టోరేజ్: 512 జీబి
బ్యాటరీ: 5750 ఎంఏహెచ్
రిజల్యూషన్: 2000×2296 పిక్సెల్స్

వీడియోల నుంచి జిఫ్ (ఆండ్రాయిడ్) క్రియేట్ చేయడానికి...



వాట్సాప్‌లోని వీడియో–టు–జిఫ్ ఫీచర్ అనేది ఫన్ మూమెంట్. కుటుంబసభ్యులు, ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకోవచ్చు. అయిదు లేదా అంతకంటే తక్కువ సెకన్‌లలో జిఫ్‌ను క్రియేట్ చేయడానికి ఈ ఫీచర్ ఉపకరిస్తుంది. ఈ ఫీచర్‌ని ఉపయోగించడానికి వాట్సాప్ లేటెస్ట్ వెర్షన్ అవసరం.

- వాట్సాప్ ఓపెన్ చేసి పర్సన్ లేదా గ్రూప్ చాట్ విండోలోకి వెళ్లాలి.
- 'పిన్' ఐకాన్‌ను ట్యాప్ చేసి 'గ్యాలరీ' సెలెక్ట్ చేయాలి.
- వీడియోను సెలెక్ట్ చేసుకున్న తరువాత షేర్ చేయదలుచుకున్న అయిదు–సెకన్‌ల పోర్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.
- టాప్‌లో ఉన్న 'జిఫ్' ఐకాన్‌ను నొక్కాలి.

ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్త ఫీచర్



యూజర్‌లు తమ పుట్టిన రోజు సందర్భంగా నోట్ క్రియేట్ చేసుకునే కొత్త ఫీచర్‌ని ప్రవేశపెట్టింది ఇన్‌స్టాగ్రామ్. ఫాలోవర్‌లు ఈ నోట్‌పై ట్యాప్ చేస్తే కేక్ ఎఫెక్ట్ యానిమేషన్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. 'ఫాల్' 'సబ్రినా కార్పెంటర్' అనే చాట్ థీమ్స్‌ను ఇన్‌స్టాగ్రామ్ యాడ్ చేసింది.

కొత్త దారి



● నూరున్నీసా ● అయేషా

కళ్లు లేకున్నా క్యాన్సర్ చూపుతారు

'చూపున్నా చూడలేని అంధుల కంటే....అంధులు బాగా చూడగలరు' అంటుంది పెర్షియన్ సామెత. కంటిచూపు బాగున్నా వాస్తవాలు చూడలేని వారిపై ఈ సామెత ఒక చురక అనుకున్నప్పటికీ.... చూపులేని మహిళలు వైద్యరంగంలో కొత్త కాంతితో వెలుగుతున్నారు. తమ 'మ్యాజిక్ ఫింగర్స్'తో ఎర్లీ స్టేజీలో బ్రెస్ట్ క్యాన్సర్‌ను గుర్తిస్తూ ఎంతోమంది మహిళలు ప్రమాదం బారిన పడకుండా చూస్తున్నారు...

మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ప్రారంభ సంకేతాలను గుర్తించడంలో చూపులేని అయేషా వైద్యులకు సహాయ పడుతుంది. ఈ పరీక్షల కోసం తన చేతి వేళ్లను ఉపయోగిస్తుంది. 'మా చేతి వేళ్లలోని అధిక స్పర్శ జ్ఞానం వక్షోజాలలోని చిన్న లంప్స్‌ను కనిపెట్టడంలో సహాయపడుతుంది. ఈ వృత్తి నాలాంటి చూపులేని మహిళలకు బాగా సరిపోతుంది' అంటుంది అయేషా.

బెంగళూరులోని 'సైట్‌కేర్' హాస్పిటల్‌లో పనిచేస్తుంది అయేషా. రోజుకు తొమ్మిది పరీక్షలు చేస్తుంది. ఒక్కొక్కరికి అరగంట సమయం తీసుకుంటుంది.

'కంటిచూపు లేని అయేషా లాంటి యువతులు ఎర్లీ స్టేజీలో బ్రెస్ట్ క్యాన్సర్‌ను డిటెక్ట్ చేయడంలో మంచి నైపుణ్యాన్ని చూపిస్తున్నారు' అంటున్నాడు 'సైట్‌కేర్ హాస్పిటల్స్ కో–ఫౌండర్, సీయివో సురేష్ రాము. చిన్న వయసులోనే కంటిచూపు కోల్పోయిన అయేషా డిగ్రీ పూర్తి చేయడానికి ఎన్నో సవాళ్లు ఎదుర్కొంది. అయితే ఎప్పుడూ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. అయేషా తన నెల జీతంలో కొంత మొత్తాన్ని సేవాకార్యక్రమాలకు వినియోగిస్తుంటుంది.

అయేషాలాగే కోలార్‌కు చెందిన 29 సంవత్సరాల నూరున్నీసా చిన్న వయసులోనే చూపు కోల్పోయింది. తన 'మ్యాజిక్ ఫింగర్స్' ద్వారా ఎంతోమంది మహిళలను బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించి పొంచి ఉన్న ప్రమాదం గురించి హెచ్చరిస్తుంటుంది.

బెంగళూరులోని 'జ్యోతి నివాస్ కాలేజీ'లో డిగ్రీ చేసిన నూరున్నీసాకు ఉద్యోగం దొరకడం కష్టం అయింది. 'మ్యాజిక్ ఫింగర్స్' ద్వారా తనకు ఉపాధి దొరకడమే కాదు గుర్తింపు కూడా లభించింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా మారింది.

'గతంలో మాదిరిగా కాదు. ఇప్పుడు చూపులేని వారికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి' అంటుంది నూరున్నీసా.

అయేషా, నూరున్నీసా...ఈ ఇద్దరిలో ఎవరికీ మెడికల్ బ్యాక్‌గ్రౌండ్ లేదు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కలిగించడానికి, టక్టైల్ బ్రెస్ట్ పరీక్షలు నిర్వహించడానికి అయేషా, నూరున్నీసాలు దేశంలోని ఎన్నో ప్రాంతాలు తిరిగారు. టక్టైల్ బ్రెస్ట్ పరీక్షలు అనేవి చూపు లేని మహిళల కోసం రూపొందించిన ప్రత్యేక పరీక్షలు. ఈ పరీక్షలను నిర్వహించేవారిని మెడికల్ టక్టైల్ ఎగ్జామినర్స్(ఎంఐటీ)లుగా వ్యవహరిస్తారు. 'ఎంఐటీ'లుగా ఎంతో మంది చూపు లేని మహిళలు ఉపాధి పొందడమే కాదు తమ 'మ్యాజిక్ ఫింగర్స్' ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్‌ను ఎర్లీ స్టేజీలో గుర్తిస్తున్నారు.

డిస్కవరింగ్ హ్యాండ్స్

ఢిల్లీకి చెందిన 'డిస్కవరింగ్ హ్యాండ్స్' అనే స్వచ్ఛంద సంస్థ టక్టైల్ బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలకు సంబంధించి చూపు లేని మహిళల కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రెండున్నర సంవత్సరాల తరువాత ఈ సంస్థ బెంగళూరులో కూడా శిక్షణా కార్యక్రమాలను మొదలుపెట్టింది. ఇక్కడ శిక్షణ తీసుకున్న మహిళల్లో అయేషా, నూరున్నీసా ఉన్నారు. 'మొదట్లో వైద్యానికి సంబంధించిన పదాలను అర్థం చేసుకోవడం కష్టంగా ఉండేది' అంటుంది లీనా మెహతా. పన్నెండు సంవత్సరాల వయసులో ఆమె చూపు కోల్పోయింది. అయితే ట్రైనర్స్ ఒకటికి పదిసార్లు అర్థమయ్యేలా చెప్పేవాళ్లు. త్రీడీ మోడల్స్‌తో శరీర పనితీరును సులభంగా అర్థం చేయించేవారు.

యువర్స్

• స్టోరీ టెల్లర్

వరే మన కరెన్సీ



'అన్నం గురించి చెప్పండి' అని అడిగితే... 'రోజూ తింటాం' అనేవాళ్లే ఎక్కువ. 'మీకు తెలిసిన వరివంగడాల గురించి చెప్పండి' అని అడిగితే... ఒకటి, రెండు మాత్రమే చెప్పేవాళ్లు ఎక్కువ. అంతేనా! 'కాదు... ఎంతో ఉంది' అంటున్నాడు బెంగళూరుకు చెందిన ఆర్టిస్ట్, స్టోరీ టెల్లర్ వినయ్ వారణాసి. భారతీయ సంస్కృతిలో అన్నం, సంప్రదాయ వరి ధాన్యాల ప్రాముఖ్యతను చెబుతున్న వినయ్ ప్రసంగాలు యువతరాన్ని ఆకట్టుకుంటున్నాయి...

మనం ఎప్పుడూ వినని కొత్త కథలు కాదు. అయితే వాటిని కొత్తగా ఎలా చెప్పవచ్చో వినయ్ ప్రసంగాలు వింటే అర్థం అవుతుంది. అన్నంతో సంబంధం ఉన్న వివిధ ఆచారాలు, వాటి పట్ల రుషులకు ఉన్న భక్తి, మనిషి జీవితాన్ని నిలబెట్టడంలో దాని విలువైన పాత్ర, దైవత్వానికి దాని ప్రతీకాత్మక సంబంధం గురించి వివరిస్తాడు.

అన్నదానం చేసే ప్రక్రియను పౌరాణిక కథల ద్వారా చెబుతాడు. 'మన దేశంలో బియ్యం అనేది సామాజిక, ఆర్థిక కరెన్సీ' అంటున్న వినయ్ 'స్పిరిట్ ఆఫ్ ది ఎర్త్' అనే సంస్థతో కలిసి బడులను నుంచి వ్యవసాయ కళాశాలల వరకు వరి ధాన్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు.

'ఎన్నో రకాల వరి వంగడాలను పునరుద్ధరించడంపై మేము దృష్టి సారించాం. ప్రతి దానికి దాని ప్రత్యేకమైన ఆకృతి. రంగు, వాసనకు పేరు ఉంది. ఉదాహరణకు ఒకప్పుడు కన్యాకుమారిలో కనిపించే అనికొంబన్ ఇప్పుడు అంతరించిపోయింది. అనేక దేశీ రకాలు కనుమరుగు అవుతున్నాయి' అంటుంది 'స్పిరిట్ ఆఫ్ ఎర్త్' ఫౌండర్ షీలా బాలాజీ. ప్రాచీన వరి వంగడాల పునర్జీవానికి వాటి గురించి అవగాహన కలిగించడం అనేది కీలకం.

హైబ్రిడ్ వరి వంగడాల వైపు ఎక్కువగా దృష్టి సారించడం వల్ల అనేక సంప్రదాయ వరి రకాలు క్షీణించాయి. ఎక్కువమంది ఈ పురాతన రకాలపై ఆసక్తి చూపితే సహజంగానే వాటికి డిమాండ్ పెరుగుతుంది. పెరిగిన డిమాండ్ మన వ్యవసాయ వైవిధ్యాన్ని కాపాడుతుంది. దీనికి అవగాహన కల్పించడం అవసరం. ఆ పనిని సగర్వంగా భుజాల కెత్తుకున్నాడు వినయ్ వారణాసి. ఇక వినయ్ మల్టీ టాలెంట్ విషయానికి వస్తే... ఆర్టిస్ట్, స్టోరీ టెల్లర్ మాత్రమే కాదు ఆర్కిటెక్ట్, డిజైన్ రిసెర్చర్, క్లాసిక్ మ్యూజిక్ లిరిసిస్ట్, డిజైన్ ఎడ్యుకేషన్ స్టార్టప్ 'అన్‌బైండ్' ఫౌండర్.

ఏఐ ఏరియా: ఓపెన్ వో1



'ఓపెన్ వో1' పేరుతో కొత్త ఏఐ మోడల్స్ సిరీస్‌ను ఓపెన్ ఏఐ లాంచ్ చేసింది. సైన్స్, కోడింగ్,మ్యాథ్స్...మొదలైన సబ్జెక్ట్‌లకు సంబంధించిన జటిలమైన సమస్యలకు పరిష్కారం చూపేలా వీటిని డిజైన్ చేశారు. కఠినమైన ప్రశ్నలకు జవాబు చెప్పడానికి మనుషులు ఎక్కువ సమయం తీసుకున్నట్లే ఈ మోడల్స్ కూడా జవాబు ఇవ్వడానికి కాస్త ఎక్కువ సమయమే తీసుకుంటాయి. ప్రాబ్లమ్స్ గురించి జాగ్రత్తగా, లోతుగా ఆలోచించేలా ఈ మోడల్స్‌ను ట్రైన్ చేశారు. ఈ మోడల్స్ కోసం ఓపెన్ ఏఐ కొత్త సేఫ్టీ మెజర్స్‌ను డెవలప్ చేసింది. సేఫ్టీ రూల్స్‌కు సంబంధించి గత మోడళ్లతో పోల్చితే 'వో1–ప్రివ్యూ' మోడల్‌ను మెరుగుపరిచారు. ఈ మోడల్స్‌లో ఫస్ట్ వెర్షన్ 'వో 1–ప్రీవ్యూ' ప్రస్తుతం చాట్‌జీపిటిలో అందుబాటులో ఉంది.

'ఈత'రం స్వచ్ఛందంగా



బ్రిటన్‌లో భారత సంతతికి చెందిన పదహారు సంవత్సరాల ప్రిషా తాప్రే చిన్న వయసులోనే ఇంగ్లీష్ చానెల్‌ను ఈదిన వారిలో ఒకరిగా రికార్డ్ సృష్టించింది. తాప్రే సాహసం వెనక సామాజిక స్పృహ ఉంది. తన సాహసం ద్వారా ఇండియా, బ్రిటన్‌లో సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ 'అక్షయ్ పాత్ర'కు నిధుల సేకరణలో భాగంగా 3,700 పౌండ్లు (నాలుగు లక్షల రూపాయల పైచిలుకు) ఇచ్చింది.

ప్రిషా తాప్రే ఇంగ్లాండ్‌లోని డోవర్ నుంచి ఫ్రాన్స్‌లోని క్యాప్ గ్రిస్ నెజ్ వరకు 34 కిలోమీటర్‌ల లక్ష్యాన్ని 11 గంటల 48 నిమిషాల్లో ఛేదించింది.

తాప్రే పూర్వీకులు ఎన్నో సంవత్సరాల క్రితం మహారాష్ట్ర నుంచి యూకేకు వలస వచ్చారు. పన్నెండేళ్ల వయసులో ఇంగ్లీష్ చానల్ చాలెంజ్ గురించి కుటుంబ సభ్యులు మాటల్లో విన్న తాప్రే దానిపై దృష్టి సారించింది. ఇంగ్లీష్ చానల్‌ను ఈదిన ఎంతోమంది గురించి తెలుసుకుంది. ఈ క్రమంలో తాను కూడా ఇంగ్లీష్ చానల్ ఈదాలనే లక్ష్యాన్ని ఏర్పరుచుకుంది. అయితే అది అనుకున్నంత తేలిక కాదనే విషయం తనకు తెలియనిదేమీ కాదు. దీని కోసం నాలుగు సంవత్సరాల పాటు శిక్షణ తీసుకుంది. కోచ్ జెరెమీ ఇర్విన్ ప్రిషా తాప్రేకు మార్గనిర్దేశం చేశాడు. శారీరక, మానసిక సన్నద్ధత కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పాడు. 'మొదట్లో చాలా కష్టంగా అనిపించేది. రోజు రోజుకూ పరిస్థితి మెరుగుపడడంతో నా మీద నాకు నమ్మకం వచ్చింది' అంటున్న ప్రిషా తాప్రే ఆరు గంటలు, ఏడుగంటలు, పది గంటలు... ఇలా స్విమ్మింగ్ టైమ్‌ను పెంచుకుంటూ పోయింది. విజయాన్ని సొంతం చేసుకుంది.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



టఫ్ కుకీ

ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, ఎన్ని కష్టాలు వచ్చినా తట్టుకొని నిలబడే వ్యక్తుల విషయంలో వాడే మాట...టఫ్ కుకీ.
ఉదా:యూ హ్యావ్ టు బీ ఏ టఫ్ కుకీ టు సర్వైవ్ ఇన్ సచ్ ఏ కాంపిటీటివ్ ఇండస్ట్రీ.

హార్ప్ ఆన్ ది సేమ్ స్ట్రింగ్

ఒకే విషయం లేదా అభిప్రాయాన్ని పదే పదే చెబుతున్నప్పుడు ఉపయోగించే మాట... హార్ప్ ఆన్ ది సేమ్ స్ట్రింగ్.
ఉదా: డూరింగ్ ది మీటింగ్, షీ హార్ప్‌డ్ ఆన్ ది సేమ్ స్ట్రింగ్ ఎబౌట్ ది నీడ్ ఫర్ బెటర్ కమ్యూనికేషన్.

సినిమా

ధనుష్ ఇడ్లీ కొట్టు!

ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించనున్న తాజా సినిమాకు 'ఇడ్లీ కడై' (ఇడ్లీ కొట్టు) అనే టైటిల్ ఖరారైంది. గురువారం ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ధనుష్ కెరీర్‌లోని ఈ 52వ చిత్రాన్ని డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ పతాకాలపై ఆకాశ్ భాస్కరన్ నిర్మించనున్నారు. ''మా డాన్ పిక్చర్స్ సంస్థలోని తొలి సినిమాకే ధనుష్ గారితో అసోసియేట్ కావడం సంతోషంగా ఉంది. మా సంస్థలో ఈ సినిమా ఓ మైల్‌స్టోన్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది. త్వరలోనే ఈ సినిమా గురించిన పూర్తి వివరాలను వెల్లడిస్తాం'' అన్నారు ఆకాశ్ భాస్కరన్. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: కిరణ్ కౌశిక్.



నెల ఆలస్యంగా కంగువ



● సూర్య, బాబీ డియోల్

'కంగువ' సినిమా కొత్త విడుదల తేదీ ఖరారైంది. సూర్య హీరోగా నటించిన ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ చిత్రాన్ని నవంబరు 14న రిలీజ్ చేయనున్నట్లు గురువారం మేకర్స్ ప్రకటించారు. శివ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, యోగిబాబు ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయనున్నారు. ''పీరియాడిక్ యాక్షన్ జానర్‌లో ఇప్పటివరకూ రాని ఒక సరికొత్త కాన్సెప్ట్‌తో 'కంగువ' సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అని దర్శక–నిర్మాతలు పేర్కొన్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... 'కంగువ' సినిమాను తొలుత ఈ ఏడాది అక్టోబరు 10న రిలీజ్ చేయాలనుకున్నారు. ఫైనల్‌గా ఓ నెల ఆలస్యంగా నవంబరు 14కి వాయిదా వేశారు.



● రామ్‌చరణ్

మోత మోగిపోతాయి!

హీరో రామ్‌చరణ్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. కాగా ఇటీవల ఓ సందర్భంలో ఈ సినిమాను క్రిస్మస్ సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు 'దిల్' రాజు పేర్కొన్నారు. అయితే రిలీజ్ డేట్‌ను మాత్రం ఆ సమయంలో చెప్పలేదు. కాగా ఈ సినిమా గురించిన తాజా అప్‌డేట్‌ను ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ తమన్ 'ఎక్స్' వేదికగా షేర్ చేశారు. 'గేమ్ చేంజర్' సినిమా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ వర్క్ అక్టోబరు 1న ఆరంభిస్తాం. డిసెంబరు 20, 2024లో థియేటర్స్ మోత మోగిపోతాయని (బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆ రేంజ్‌లో ఉంటుందని పరోక్షంగా చెబుతున్నట్లు కావొచ్చు) తమన్ 'ఎక్స్'లో షేర్ చేశారు.

పెద్దికి తంగలాన్ కాస్ట్యూమ్ డిజైనర్

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతదర్శకుడు. 'తంగలాన్' సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేసిన ఏకాంబరంను ఈ చిత్రానికి డిజైనర్‌గా తీసుకున్నారు బుచ్చిబాబు. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మించనున్నారు.



● ఏకాంబరం, బుచ్చిబాబు

దసరా కాంబినేషన్ షురూ


'దసరా' (2023) వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో 'నాని ఓదెల 2' (వర్కింగ్ టైటిల్) చిత్రం షురూ అయింది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందనుంది. ఈ సందర్భంగా శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ– ''నా ఫస్ట్ సినిమా 'దసరా'కి 2023 మార్చి 7న చివరిసారిగా కట్, షాట్ ఓకే అని చెప్పాను. 2024 సెప్టెంబర్ 18న 'నాని ఓదెల 2' ప్రకటన వీడియో కోసం మళ్లీ యాక్షన్ చెప్పాను. 48,470,400 సెకన్లు గడిచాయి. ప్రతి సెకను ఈ ప్రాజెక్ట్ కోసం సిన్సియర్‌గా ఉన్నాను. 'దసరా' చిత్రం స్థాయిని 'నాని ఓదెల 2'తో వంద రెట్లు పెంచుతానని మాట ఇస్తున్నాను'' అని తెలిపారు. ''నానీని ఎక్స్‌ట్రార్డినరీ క్యారెక్టర్‌లో చూపిస్తూ, యునిక్ అండ్ ఎగ్జయిటింగ్ నెరేటివ్‌తో గొప్ప సినిమాటిక్ అనుభూతిని 'నాని ఓదెల 2' చిత్రం అందించనుంది'' అని నిర్మాత పేర్కొన్నారు.



● నాని

అరవయ్యేళ్లు వెనక్కి...

పల్లెకు పోదాం అంటున్నారు హీరో శర్వానంద్. సంపత్ నంది దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా గ్రామీణ నేపథ్యంలో ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామా తెరకెక్కనుంది. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ చిత్రం అధికారిక ప్రకటన గురువారం వెలువడింది. ''ఉత్తర తెలంగాణ, తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నేపథ్యంలో 1960 కాలంలో జరిగే గ్రామీణ చిత్రం ఇది. ఎమోషన్, యాక్షన్ సీక్వెన్స్‌లతో ఈ మూవీ కోసం ఓ పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను రెడీ చేశారు సంపత్ నంది. మునుపెన్నడూ చూడని ఓ కొత్త పాత్రలో శర్వానంద్ కనిపిస్తారు. 1960 నాటి క్యారెక్టర్‌లో కనిపించేందుకు శర్వానంద్ మేకోవర్ అయ్యారు. యూనివర్సల్ అప్పీల్ ఉన్న సబ్జెక్ట్ ఇది. దీంతో ఈ సినిమాను తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నాం'' అని దర్శక–నిర్మాతలు తెలిపారు. ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ఎస్. సౌందర్ రాజన్.



● శర్వానంద్

ఈశ్వరుడి ఆశీర్వాదంతో...


శ్రీ గణేష్ దేవి మూవీ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో, కదిరి శిరీష సమర్పణలో చిత్తజల్లు ప్రసాద్ దర్శకత్వంలో కదిరి రమాదేవి రెడ్డి నిర్మిస్తున్న భక్తిరసాత్మక చిత్రం 'కాశీనగర్ –1947. ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ, సుప్రీం కోర్టు స్టాండింగ్ కౌన్సిల్ సీనియర్ న్యాయవాది యస్. రామచంద్ర రావు మాట్లాడుతూ– ''ఈ భక్తిరసాత్మక చిత్రాన్ని అందరికీ నచ్చే విధంగా దర్శక–నిర్మాతలు తీర్చిదిద్దారు'' అన్నారు. ''ప్రపంచంలోని తెలుగు వారందరికీ నచ్చే సినిమా ఇది'' అని రిటైర్డ్ డీజీపీ సీయస్ గోపీనాథ్ రెడ్డి అన్నారు. ''ఈ సినిమాను అందరూ ఫ్యామిలీతో కలిసి చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు చిత్తజల్లు ప్రసాద్. ''ఈశ్వరుడి ఆశీర్వాదం వల్లే ఈ సినిమాను నిర్మించగలిగాం. ఈ సినిమాలో ఒక పాత్ర కూడా చేశాను'' అన్నారు కదిరి రమాదేవి రెడ్డి. కేవీయల్ నరసింహారావు, జబర్దస్త్ చిట్టిబాబు నటించారు.



● రమాదేవి రెడ్డి

మా నాన్నే హీరోలే...

'అనగనగా ఓ కథ చెబుతాను వినరా బ్రదరూ..' అంటూ నాన్న గురించి పాటగా చెబుతున్నారు సుధీర్‌బాబు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సుధీర్‌బాబు, ఆర్ణ జోడీగా నటించిన చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. సాయాజీ షిండే, సాయిచంద్, రాజు సుందరం, శశాంక్, ఆమని ఇతర కీలక పాత్రల్లో నటించారు. సునీల్ బలుసు నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 11న విడుదల కానుంది. జై క్రిష్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'నాన్న..' సాంగ్‌ని రిలీజ్ చేశారు. 'అనగనగా ఓ కథ చెబుతాను వినరా బ్రదరూ.. నే చెప్పే కథలో మా నాన్నే హీరోలే..' అంటూ సాగే ఈ పాటకి లక్ష్మీ ప్రియాంక సాహిత్యం అందించగా, నజీరుద్దీన్ పాడారు. రాజు సుందరం కొరియోగ్రఫీ చేశారు. ''తండ్రీ కొడుకుల మధ్య జరిగే అందమైన కథే 'మా నాన్న సూపర్ హీరో'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● సాయాజీ షిండే, సుధీర్‌బాబు

ఓటీటీ ఇది చూడొచ్చు

సున్నితమైన సమస్యకు కామెడీ పరిష్కారం

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'నూనక్కూళి' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



సమస్య అన్నది ఎవ్వరికైనా, ఎప్పుడైనా రావచ్చు. కానీ దానిని ఎలా పరిష్కరించుకుంటామన్నది మాత్రం మన మీదే ఆధారపడి ఉంటుంది. గుండు సూదంత ప్రశ్నకు గుండ్రాయంత సమాధానం అనుకుంటే అంతా గందరగోళమే. ఇదే నేపథ్యంలో వచ్చిన మలయాళ సినిమా 'నూనక్కూళి'. ఇది తెలుగులో డబ్ అయింది. ప్రముఖ దర్శకులు జీతూ జోసెఫ్ తీసిన ఈ సినిమా జీ5 ఓటీటీ వేదికగా ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఇక ఈ చిత్రం కథాంశానికొస్తే... ఓ పెద్ద వ్యాపార సంస్థకు ఎండీ అయిన పూళికున్నేల్ తన భార్యతో ఆంతరంగికంగా కలిసున్న వీడియోను తన లాప్‌టాప్‌లో దాచుకుంటాడు. ఇంతలో పూళికున్నేల్ సంస్థ పై ఐటీ రైడ్ జరిగి, ఇతని లాప్‌టాప్‌ను కూడా స్వాధీనపరుచుకుంటారు ఐటీ ప్రతినిధులు. కంపెనీ లావాదేవీల కన్నా ఇప్పుడు పూళికున్నేల్ దృష్టి తన వీడియో ఇతరుల దృష్టిలో పడకుండా చూడాలని ఆ ఐటీ ప్రతినిధి ఇంటికి తన లాప్‌టాప్ కోసం దొంగతనానికి వెళతాడు. ఆ సమయంలో వేరే ఒకావిడ తాను ఆత్మహత్య కోసం తయారు చేసుకున్న విషాన్ని పూళికున్నేల్ పొరపాటున తాగేస్తాడు. అది కాస్తా పోలీస్ కేసు అవుతుంది. చివరాఖరికి పూళికున్నేల్ తన లాప్‌టాప్ దక్కించుకున్నాడా? ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఆమెకు, ఐటి ప్రతినిధికి, హీరో పూళికున్నేల్‌కు ఉన్న సంబంధం ఏంటి? అన్నది మాత్రం ఓటీటీలోనే చూడాలి. పూళికున్నేల్ పాత్రలో బసిల్ జోసెఫ్ అలాగే మరో ప్రధాన పాత్రలో గ్రేస్ ఆంటోని అద్భుతంగా నటించారు. సినిమా ఆద్యంతం కితకితలు పెట్టిస్తూనే ఉంటుంది. సున్నిత సమస్యకు ఆ సరదా పరిష్కారం ఏంటో 'నూనక్కూళి' సినిమాలో ఈ వారం చూసేయండి.

– ఇంటూరు హరికృష్ణ

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	237	83,184
నిఫ్టీ ▲	38	25,415

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	18,097	▲ 523
డోజోన్స్	42,159	▲ 656
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,329	▲ 75
డాక్స్	19,002	▲ 291
షాంఘై	2,736	▲ 19
నికాయ్	36,380	▲ 775

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,485	▲ 228
బంగారం (99.5 స్వచ్ఛత)	72,964	▲ 227
వెండి (కిలో)	88,418	▲ 1,012

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.05	85.73
£	బ్రిటన్ పౌండ్		109.42	112.04
€	యూరో		91.89	94.36
¥	జపాన్ ఎన్ (100)		57.93	59.26
AUS	ఆస్ట్రేలియా డాలర్		55.95	57.90
S$	సింగపూర్ డాలర్		62.42	67.08
SAR	సౌదీ రియాల్		21.45	23.01
UAE D	యూఏఈ దిర్హామ్		21.93	23.69
¥	చైనా యువాన్		10.92	12.68

ఫెడ్ వడ్డీ కోత పసిడికి బూస్ట్



- ఈక్విటీలపై రాబడి తగ్గే అవకాశం
- మార్కెట్ నిపుణుల విశ్లేషణ

న్యూఢిల్లీ: ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపగల యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు బాట పట్టింది. నాలుగేళ్ల తదుపరి బుధవారం 0.5 శాతం కోత పెట్టింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 4.75–5 శాతానికి దిగివచ్చాయి. అయితే చౌకగా లభించనున్న ఫైనాన్సింగ్ భారత్ వంటి వర్ధమాన దేశాలకు పెద్దగా కలసిరాకపోవచ్చని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. విదేశీ నిధులు బంగారం ధరలకు దన్నునిచ్చే వీలున్నట్లు అంచనా వేస్తున్నారు.

మిశ్రమ అంచనాలు

సుమారు 14 నెలలపాటు రెండు దశాబ్దాల గరిష్టం వద్ద కొనసాగిన ఫెడ్ ఫండ్స్ రేట్లు దిగివస్తున్నాయి. తాజాగా రేట్ల తగ్గింపు టర్న్ తీసుకున్న ఫెడ్ ఈ ఏడాది చివరి(డిసెంబర్)కల్లా మరో 0.5 శాతం కోత పెట్టనున్నట్లు అంచనా. అయితే ఫెడ్ రేట్ల తగ్గింపుతో ఈక్విటీలపై రాబడి క్షీణించనున్నట్లు పీహెచ్‌డీసీసీఐ ప్రెసిడెంట్ సంజీవ్ అగర్వాల్ అంచనా వేశారు. మరోవైపు బంగారం ధరలు బలపడే వీలున్నట్లు పేర్కొన్నారు. కామా జ్యువెలరీ ఎండీ కొలిన్ షా సైతం ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు. సమీపకాలంలో పసిడి ధరలు సరికొత్త గరిష్టాలకు చేరవచ్చని తెలియజేశారు. యూఎస్ రేట్ల కోత బంగారంలో పెట్టుబడులకు దారిచూపుతుందని అభిప్రాయపడ్డారు.

రేట్ల కోతకు దారి...

ఫెడ్ వడ్డీ తగ్గింపుతో భారత్‌కు మరిన్ని విదేశీ పెట్టుబడులు తరలిరానున్నట్లు బిజ్2క్రెడిట్ సహవ్యవస్థాపకుడు, సీఈవో రోహిత్ అరోరా పేర్కొన్నారు. అటు స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు, ఇటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల మార్గంలోనూ విదేశీ నిధులు పెరగనున్నట్లు అంచనా వేశారు. ఇది దేశీ కరెన్సీ రూపాయికి బలాన్నిస్తుందని తెలియజేశారు. వెరసి ఆర్‌బీఐ సైతం వడ్డీ రేట్లను తగ్గించేందుకు వీలు చిక్కుతుందని అభిప్రాయపడ్డారు. 2023 ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ వడ్డీ రేట్లకు కీలకమైన రెపో రేటును 6.5 శాతంవద్దే కొనసాగిస్తోంది. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు కఠిన పరపతి విధానాలను అవలంబిస్తోంది. వచ్చే నెల(అక్టోబర్) 7–9 మధ్య ఆర్‌బీఐ పాలసీ సమీక్షను చేపట్టనున్న విషయం విదితమే. అయితే ప్రపంచ దేశాల వడ్డీ రేట్ల ప్రభావం భారత్‌పై ఉండదని ఇండియాబాండ్స్.కామ్ సహవ్యవస్థాపకుడు విశాల్ గోయెంకా పేర్కొన్నారు. రిస్కీ ఆస్తులలో భారీ ర్యాలీ, ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి, ద్రవ్యోల్బణ ప్రభావాల కారణంగా ప్రస్తుతం వడ్డీ రేట్ల తగ్గింపునకు చాన్స్ తక్కువేనని తెలియజేశారు. అంచనాలకు మించి ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించినట్లు ఎడిల్‌వీజ్ ఎంఎఫ్ ఈక్విటీస్ సీఐవో త్రిదీప్ భట్టాచార్య అభిప్రాయపడ్డారు.

> **భారత్‌పై ప్రభావం అంతంతే..**
>
> మార్కెట్‌వర్గాలు ఇప్పటికే చాలా మటుకు ఫెడ్ వడ్డీ రేట్ల కోతను పరిగణనలోకి తీసుకున్నందున దీని ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండు. దేశీయంగా స్టాక్ మార్కెట్లు ఇప్పటికే ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్నాయి. అయితే, మొత్తం మీద రేట్ల తగ్గింపనేది వర్ధమాన మార్కెట్లకు మాత్రం సానుకూలమే.
>
> – వి. అనంత నాగేశ్వరన్, ప్రధాన ఆర్థిక సలహాదారు

మార్కెట్లో రికార్డుల మోత

- సరికొత్త శిఖరంపై సెన్సెక్స్
- ఇంట్రాడేలో నిఫ్టీ కొత్త రికార్డు

ముంబై: దేశీయ స్టాక్ సూచీలు మరోసారి సరికొత్త రికార్డులు నమోదు చేశాయి. సెన్సెక్స్ 237 పాయింట్లు పెరిగి ఆల్‌టైం హై 83,184 వద్ద ముగిసింది. నిఫ్టీ 38 పాయింట్లు బలపడి 25,415 పాయింట్ల వద్ద స్థిరపడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను 50 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఉదయం సూచీలు భారీ లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 825 పాయింట్లు ఎగసి 83,774 వద్ద, నిఫ్టీ 234 పాయింట్లు బలపడి 25,612 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. అధిక వాల్యుయేషన్ ఆందోళనలు, ఆర్‌బీఐ అక్టోబర్‌లో వడ్డీరేట్లు తగ్గించకపోవచ్చనే అంచనాలతో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో సూచీల లాభాలు సగానికిపైగా ఆవిరయ్యాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 1%, అరశాతానికి పైగా నష్టపోయాయి. ఎన్‌టీపీసీ షేరు 2.5% పెరిగి రూ.424 వద్ద స్థిరపడింది. పునరుత్పాదక ఇంధన అనుబంధ సంస్థ ఎన్‌టీపీసీఎల్ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ ద్వారా రూ.10 వేల కోట్ల నిధుల సమీకరించేందుకు సెబీకి దరఖాస్తు చేసింది. దీంతో ఇంట్రాడేలో 4% ఎగసి రూ.432 రికార్డు గరిష్టాన్ని తాకింది.



నాలుగేళ్ల తదుపరి ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించడంతో యూఎస్ స్టాక్ మార్కెట్లకు జోష్ వచ్చింది. గురువారం డోజోన్స్ 565 పాయింట్లు జంప్‌చేసి తొలిసారి 42,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. ఇక ఎస్అండ్‌పీ-500 సైతం 105 పాయింట్లు (1.9%) ఎగసి 5,724కు చేరింది. నాస్‌డాక్ మరింత అధికంగా 494 పాయింట్లు(2.8 శాతం) జంప్‌చేసి 18,068ను తాకింది. వెరసి డోజోన్స్, ఎస్అండ్‌పీ సరికొత్త గరిష్టాల వద్ద ట్రేడవుతున్నాయి. మ్యాగ్నిఫిషియంట్-7గా పేర్కొంటున్న టెక్ దిగ్గజాలతో సహా పలు బ్లూచిప్ షేర్లు దూకుడు చూపుతున్నాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు 1–2% పెరిగాయి.

డోజోన్స్ @ 42,000

ఎగుమతి, దిగుమతిదారులకు ఊరట



- పోర్టుల్లో చార్జీల తగ్గింపు
- ఐదు కంటెయినర్ల కొనుగోలు
- కేంద్ర మంత్రి గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ: ఎగుమతి, దిగుమతిదారులు ఎదుర్కొంటున్న నౌకా రవాణా సంబంధిత సమస్యల పరిష్కారానికి కేంద్రం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా పోర్టుల్లో కొన్ని రకాల చార్జీలు తగ్గించింది. అలాగే, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ) ద్వారా ఐదు సెకండ్ హ్యాండ్ కంటెయినర్ వెసెల్స్ (సరుకులు, ఉత్పత్తుల రవాణాకు ఉపయోగించే) కొనుగోలుకు నిర్ణయం తీసుకుంది. వాణిజ్య, పరిశ్రమలు, షిప్పింగ్, పోర్టులు, ఫైనాన్స్, పౌర విమానయాన, రైల్వే తదితర శాఖల సీనియర్ అధికారులు, ఎగుమతిదారుల సమాఖ్య ఎఫ్ఐఈవో, కస్టమర్స్ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లు, షిప్పింగ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం తర్వాత కేంద్రం ఈ చర్యలు ప్రకటించింది. సమావేశం అనంతరం వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ మీడియాకు వివరించారు. 'తాజాగా తీసుకున్న చర్యలు రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. అలాగే, ఖాళీ కంటెయినర్ల లభ్యత పెరుగుతుంది. సరుకులు వేగంగా ఎగుమతి చేసేందుకు వీలవుతుంది. పోర్టుల్లో రద్దీ గణనీయంగా తగ్గుతుంది' అన్నారు.

చర్యలు ఇవీ..

- కార్గో రవాణా సామర్థ్యం పెంచేందుకు వీలుగా ఎస్‌సీఐ అదనంగా 5 సెకండ్ హ్యాండ్ కంటెయినర్ నౌకలను కొనుగోలు చేస్తుంది.
- రైల్వే బోర్డు, కంటెయినర్ కార్పొరేషన్ ఖాళీగా ఉన్న కంటెయినర్లను యార్డులో 90 రోజుల పాటు చార్జీల్లేకుండా అందుబాటులో ఉంచుతాయి. 90 రోజుల తర్వాత రూ.3,000గా వసూలు చేస్తున్న చార్జీని రూ.1,500కు తగ్గించారు.
- కంటెయినర్ సామర్థ్యాన్ని 9,000 టీఈయూల మేర పెంచుతున్నట్లు ఎస్‌సీఐ ప్రకటించింది.
- 40 అడుగుల కంటెయినర్‌కు రేట్లను రూ.9,000 నుంచి రూ.2,000కు తగ్గించారు. 20 అడుగుల కంటెయినర్ చార్జీలు రూ.6,000 నుంచి రూ.1,000కు దిగొచ్చాయి.

యాక్సిస్ క్యాపిటల్‌కు సెబీ షాక్

మర్చంట్ బ్యాంకర్ సేవలకు చెక్

న్యూఢిల్లీ: సోజో ఇన్ఫోటెల్ జారీచేసిన మార్పిడిరహిత డిబెంచర్ల (ఎన్‌సీడీలు) రిడెంప్షన్‌కు హామీ (గ్యారంటీ)లు ఇచ్చినందుకు యాక్సిస్ క్యాపిటల్‌పై క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ కన్నెర్ర చేసింది. తదుపరి నోటీస్ జారీ చేసేటంతవరకూ మర్చంట్ బ్యాంకర్‌గా కొత్త అసైన్‌మెంట్లు చేపట్టవద్దంటూ ఆదేశించింది. అండర్‌రైటింగ్‌లో భాగంగా గ్యారంటీ లేదా ఇండెమ్నిటీ జారీ చేసినందుకు యాక్సిస్ క్యాపిటల్‌పై నిషేధం విధిస్తున్నట్లు మధ్యంతర ఆదేశాలలో సెబీ తెలియజేసింది. ఇది ప్రస్తుత నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఇవి ఫైనాన్షియల్ వ్యవస్థలో రిస్కులకు కారణమవుతుందని వివరించింది. వెరసి మర్చంట్ బ్యాంకర్‌గా అనుమతిలేని అంశాలను యాక్సిస్ క్యాపిటల్ నిర్వహించినట్లు గుర్తించామని సెబీ పేర్కొంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

విలువలో టీసీఎస్ నంబర్ 1 | వృద్ధిలో బ్యాంకులు కీలకం: సీతారామన్

ఐఫోన్ 16 సిరీస్ సేల్స్ నేటి నుంచే..

ధర రూ. 79,900 నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: ఐఫోన్ 16 సిరీస్ స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు భారత్‌లో నేటి నుంచి (సెప్టెంబర్ 20) ప్రారంభం కానున్నట్లు యాపిల్ వర్గాలు తెలిపాయి. ప్రో సిరీస్‌ను భారత్‌లో తెలిసారిగా అసెంబ్లింగ్ చేసే యోచనలో కంపెనీ ఉందని సమాచారం. ఇటీవలి బడ్జెట్‌లో దిగుమతి సుంకం తగ్గిన నేపథ్యంలో తొలిసారిగా గత సిరీస్ కన్నా కొత్త ప్రో సిరీస్ ఫోన్లను యాపిల్ తక్కువ రేటుకు విక్రయించనుంది. దేశీయంగా ఐఫోన్ 16 ప్రో ధర రూ. 1,19,000 నుంచి, ప్రో మ్యాక్స్ రేటు రూ. 1,44,900 నుంచి ప్రారంభమవుతుందని కంపెనీ తెలిపింది. గతేడాది ఐఫోన్ 15 ప్రో ధర రూ. 1,34,900 నుంచి, ప్రో మ్యాక్స్ రేటు రూ. 1,59,900 నుంచి మొదలైంది. మరోవైపు, తాజా ఐఫోన్ 16 రేటు రూ. 79,900 నుంచి, 16 ప్లస్ ధర రూ. 89,900 నుంచి ప్రారంభమవుతుంది. యాపిల్ ఐఫోన్ 16 సిరీస్ ఫోన్లు 128 జీబీ నుంచి 1 టీబీ వరకు స్టోరేజీతో లభిస్తాయి.

ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి కేంద్రం ఓకే...

న్యూఢిల్లీ: పీఎస్‌యూ.. ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్) విక్రయానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆమోదముద్ర వేసింది. దీంతో జపనీస్ లిస్టెడ్ దిగ్గజం కొనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను రూ. 320 కోట్లకు విక్రయించనుంది. స్టీల్ శాఖ నిర్వహణలోని ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు 100 శాతం అనుబంధ సంస్థగా ఎఫ్ఎస్ఎన్ఎల్ వ్యవహరిస్తోంది. 1979 మార్చి 28న ఏర్పాటైన ఎఫ్ఎస్ఎన్ఎల్ స్టీల్ మిల్ సర్వీసులను అందిస్తోంది.



చెస్ ఒలింపియాడ్: పసిడి వేటలో మరో విజయం

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల జట్టు వరుసగా ఎనిమిదో విజయం సాధించింది. తద్వారా పసిడి వేటలో మరో ముందడుగు పడింది. గురువారం జరిగిన 8వ రౌండ్లో భారత్ 3.5–0.5తో ఇరాన్‌పై భారీ విజయాన్ని నమోదు చేసింది. తెలంగాణకు చెందిన భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్... డానెశ్వర్ బర్దియాపై గెలిచి పురుషుల జట్టుకు చక్కని ఆరంభమిచ్చాడు. అనంతరం దొమ్మరాజు గుకేశ్... పర్హామ్ మగ్సూద్‌ను ఓడించడంతో భారత్ 2–0తో ఆధిక్యంలో నిలిచింది. మూడో పోరులో ప్రజ్ఞానంద... అమిన్ టబటబేతో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. నాలుగో మ్యాచ్‌లో విదిత్ గుజరాతి విజయంతో భారత్‌కు ఎదురులేని విజయం ఖాయమైంది. అతను డానెశ్వర్ బర్దియాను ఓడించడంతో భారత్ ఆడిన 8 రౌండ్లలోనూ గెలుపొందింది. ఇంకా మూడు రౌండ్లు మాత్రమే మిగిలున్న ఈ టోర్నీలో భారత్ ఇదే జోరు కొనసాగిస్తే ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో 'స్వర్ణ చరిత్ర' లిఖిస్తుంది.

అశ్విన్ అదరహో...



అశ్విన్

అజేయ సెంచరీతో చెలరేగిన బ్యాటర్

జడేజా 86 నాటౌట్	మొదటి రోజు భారత్ 339/6	బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు మ్యాచ్

ఒకరికి అది ఓనమాలు నేర్చుకున్న సొంత మైదానం... మరొకరికి అక్కడి అభిమానులు ఆత్మీయతతో తమ సొంతవాడిగా మార్చుకున్న మైదానం... ఈ ఇద్దరూ జత కలిస్తే అక్కడ అద్భుతం జరగాల్సిందే. చెపాక్ మైదానంలో గురువారం సరిగ్గా అదే జరిగింది. సాధారణ పరిస్థితుల్లో అలవోకగా ఆడటం వేరు... 144/6 వద్ద కష్టాల్లో ఉన్న సమయంలో టీమ్‌ను రక్షించి పటిష్టమైన స్థితికి చేర్చడం వేరు. రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా దానిని చేసి చూపించారు. బంగ్లా దేశ్ బౌలింగ్ ముందు అనూహ్యంగా టీమిండియా కుప్పకూలగా వీరిద్దరి భాగస్వామ్యం భారీ స్కోరుకు బాటలు వేసింది. ఉదయం పేస్‌కు అనుకూలించిన పిచ్‌పై బంగ్లా బౌలర్ హసన్ మహమూద్ ధాటికి ఒక దశలో 34/3 వద్ద నిలిచిన టీమ్ కోలుకొని తొలి రోజును ఘనంగా ముగించింది. అశ్విన్ ఆరో శతకంతో మెరవగా... జడేజా సెంచరీకి చేరువయ్యాడు.

చెన్నై: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో భారత జట్టుకు సరైన ఆరంభం లభించింది. టాస్ ఓడి ఆరంభంలో తడబడినా...చివరకు టీమిండియాదే పైచేయి అయింది. మ్యాచ్ మొదటి రోజు గురువారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. రవిచంద్రన్ అశ్విన్ (112 బంతుల్లో 102 నాటౌట్; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకోగా... రవీంద్ర జడేజా (117 బంతుల్లో 86 నాటౌట్; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) అతనికి అండగా నిలుస్తూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరు ఇప్పటికే ఏడో వికెట్‌కు అభేద్యంగా 195 పరుగులు జోడించారు. యశస్వి జైస్వాల్ (118 బంతుల్లో 56; 9 ఫోర్లు) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహమూద్ (4/58) భారత్‌ను దెబ్బ తీశాడు.

రోహిత్, కోహ్లి విఫలం...

చల్లటి వాతావరణం, కాస్త తేమను దృష్టిలో ఉంచుకొని బంగ్లా కెప్టెన్ నజ్ముల్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. భారత గడ్డపై ప్రత్యర్థి కెప్టెన్ ఒకరు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోవడం ఏడేళ్లలో ఇదే మొదటిసారి. కేవలం 3 టెస్టుల అనుభవం ఉన్న పేసర్ హసన్ మహమూద్ వరుసగా మూడు ఓవర్లలో మూడు వికెట్లు తీసి తన కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టాడు. తన మూడో ఓవర్లోనే అతను రోహిత్ శర్మ (6)ను పెవిలియన్ పంపించాడు. తన తర్వాతి ఓవర్లోనే శుబ్‌మన్ గిల్ (0)ను కూడా అతను అవుట్ చేశాడు. ఆ తర్వాత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (6) కూడా ఎక్కువ సేపు నిలవలేదు. హసన్ బౌలింగ్‌లోనే డ్రైవ్ చేయబోయి కీపర్‌కు క్యాచ్ ఇవ్వగా... హసన్ 5–2–6–3 స్పెల్‌తో అదరగొట్టాడు. అయితో మరో ఎండ్‌లో యశస్వి పట్టుదలగా ఆడాడు. అతనికి రిషభ్ పంత్ (52 బంతుల్లో 39; 6 ఫోర్లు) నుంచి సహకారం లభించింది. వీరిద్దరు చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ నాలుగో వికెట్‌కు 62 పరుగులు జత చేశారు. అయితే లంచ్ తర్వాత పంత్ వికెట్ కూడా హసన్‌కే దక్కింది. 95 బంతుల్లో యశస్వి హాఫ్ సెంచరీ పూర్తయింది. భారత గడ్డపై వరుసగా ఆరు టెస్టుల్లో అతను కనీసం అర్ధ సెంచరీ సాధించడం విశేషం. అనంతరం ఒకే స్కోరు వద్ద యశస్వి, కేఎల్ రాహుల్ (16) వెనుదిరిగారు.



హసన్ మహమూద్

భారీ భాగస్వామ్యం...

స్కోరు 144/6గా ఉన్న స్థితిలో జట్టు ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతో సమయం పట్టదనిపించింది. అయితే ఈ దశలో జడేజాకు అశ్విన్ జత కలిశాడు. అప్పటి నుంచి మ్యాచ్ స్వరూపం మారిపోయింది. ఆ తర్వాత 37.4 ఓవర్ల పాటు ఈ జోడీని విడదీయలేక బంగ్లా బౌలర్లు చేతులెత్తేశారు. గత తప్పిన బంతులతో వారు ఈ ద్వయం పాతుకుపోయేందుకు అవకాశం కల్పించారు. ఏ ఒక్క బౌలర్ కూడా ప్రభావం చూపలేకపోయాడు. సొంతగడ్డపై అశ్విన్ జోరుగా ఆడగా, జడేజా పరిస్థితులను బట్టి సహచరుడికి అండగా నిలిచాడు. డ్రైవ్, పంచ్, పుల్, స్లాగ్... ఇలా అశ్విన్ బ్యాటింగ్‌లో అన్ని షాట్లూ కనిపించాయి. ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య అతను కవర్స్, స్క్వేర్‌లెగ్ దిశగా పరుగులు రాబట్టాడు. వీరిద్దరు కుదురుకున్న తర్వాత పరుగులు అలవోకగా వచ్చాయి. నాహిద్ బౌలింగ్‌లో అశ్విన్ కొట్టిన ర్యాంప్ షాట్ బౌండరీ హైలైట్‌గా నిలిచింది. మరో ఆరు నిమిషాల్లో రోజు ముగుస్తుందనగా షకీబ్ బౌలింగ్‌లో మిడ్ వికెట్ దిశగా ఆడి సింగిల్ తీయడంతో 108 బంతుల్లో అశ్విన్ సెంచరీ పూర్తయింది. ఒక్క చివరి సెషన్‌లోనే భారత్ 32 ఓవర్లలో 163 పరుగులు సాధించగా... అశ్విన్, జడేజా వేగంగా ఓవర్‌కు 5.17 పరుగుల రన్‌రేట్‌తో పరుగులు తీయడం విశేషం.



జడేజా

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి) షాద్‌మన్ (బి) నాహిద్ 56; రోహిత్ (సి) నజ్ముల్ (బి) హసన్ 6; గిల్ (సి) దాస్ (బి) హసన్ 0; కోహ్లి (సి) దాస్ (బి) హసన్ 6; పంత్ (సి) దాస్ (బి) హసన్ 39; రాహుల్ (సి) జాకీర్ (బి) మిరాజ్ 16; జడేజా (నాటౌట్) 86; అశ్విన్ (నాటౌట్) 102; ఎక్స్‌ట్రాలు 28; మొత్తం (80 ఓవర్లలో 6 వికెట్లకు) 339. వికెట్ల పతనం: 1–14, 2–28, 3–34, 4–96, 5–144, 6–144. బౌలింగ్: తస్కీన్ 15–1–47–0, హసన్ మహమూద్ 18–4–58–4, నాహిద్ రాణా 17–2–80–1, మెహదీ హసన్ మిరాజ్ 21–2–77–1, షకీబ్ 8–0–50–0, మోమినుల్ 1–0–4–0.

> **6** టెస్టుల్లో అశ్విన్‌కు ఇది ఆరో సెంచరీ. వెస్టిండీస్‌పై నాలుగు సెంచరీలు సాధించిన అతను... 2021లో ఇదే చెన్నై మైదానంలో ఇంగ్లండ్‌పై మరో శతకం బాదాడు.

> 'సొంత ప్రేక్షకుల మధ్య ఆడటం ఎప్పుడూ సంతోషాన్నిస్తుంది. నాకెంతో ఇష్టమైన మైదానమిది. ఇక్కడ ఆడిన గత టెస్టులాగే ఈ సారి సెంచరీ చేయడం ప్రత్యేకంగా అనిపిస్తోంది. ఇటీవలే టి20 టోర్నీ ఆడిన నేను బ్యాటింగ్‌పై బాగా దృష్టి పెట్టాను. ఇలాంటి పిచ్‌పై దూకుడుగా ఆడటం అవసరం. నేను అలసిపోయిన సమయంలో జడేజా అండగా నిలిచి ఉత్సాహపరిచాడు. రెండో రోజు కూడా ఆరంభంలో ఇక్కడ పేసర్లు ప్రభావం చూపిస్తారు. కానీ మ్యాచ్ సాగుతున్న కొద్దీ ఈ పిచ్ స్పిన్‌కు అనుకూలంగా మారుతుంది' –రవిచంద్రన్ అశ్విన్

క్వార్టర్ ఫైనల్లో మాళవిక బన్సోద్

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



చాంగ్జౌ: భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్స్‌లో తనకన్నా ఎక్కువ ర్యాంక్‌లో ఉన్న ప్లేయర్‌ను ఓడించి సత్తా చాటింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 43వ ర్యాంకర్ మాళవిక 21–17, 19–21, 21–16తో రెండుసార్లు కామన్వెల్త్ క్రీడల చాంపియన్ క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)ను కంగు తినిపించింది. ప్రపంచ 25వ ర్యాంకర్‌తో జరిగిన ఈ పోరులో ప్రతి గేమ్‌లోనూ ఒక్కో పాయింట్ గెలిచేందుకు 22 ఏళ్ల మాళవిక చెమటోడ్చాల్సి వచ్చింది. రెండో గేమ్‌లో ఆఖరిదాకా పోరాడినా... గేమ్‌ను 2 పాయింట్ల తేడాతో కోల్పోయిన భారత షట్లర్ నిర్ణాయక మూడో గేమ్‌లో పుంజుకొని ఆడింది. ప్రత్యర్థిపై ఆధిక్యాన్ని పెంచుకుంటూ 21–16తో గేమ్‌ను, మ్యాచ్‌ను గెలిచింది. క్వార్టర్ ఫైనల్లో భారత ప్లేయర్‌కు మరింత క్లిష్టమైన ప్రత్యర్థి ఎదురవుతోంది. శుక్రవారం జపాన్‌కు చెందిన నాలుగో సీడ్ అకానె యామగుచితో మాళవిక తలపడుతుంది. మ్యాచ్ ముగిసిన అనంతరం మాళవిక మాట్లాడుతూ 'బీడబ్ల్యూఎఫ్ సూపర్-1000 టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. ఓ పెద్దస్థాయి టోర్నీలో ముందంజ వేయాలన్న నా కల నిజమైనందుకు చాలా సంతోషంగా ఉంది. టోర్నీకి ముందే క్వార్టర్స్ చేరితే బాగుండేదనిపించింది. ఇప్పుడు టాప్-8కు అర్హత సంపాదించడం గొప్ప అనుభూతినిస్తోంది' అని తెలిపింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

iPhone 16
Built for Apple Intelligence.



Apple Intelligence starting in US English in late 2024.[1]

Available today. Go to IndiaiStore.com to find Apple Authorised stores near you.

₹5000* Instant cashback on credit cards of ICICI Bank | kotak Mahindra Bank | SBI card + Exchange bonus up to **₹6000***

	iPhone 16	iPhone 16 Plus
MRP (incl. of all taxes) (128 GB, 1N)	₹79900.00	₹89900.00
Instant Cashback*	₹5000.00	₹5000.00
Exchange value of your old smartphone*	₹20000.00	₹20000.00
Exchange bonus*	₹6000.00	₹6000.00
Exchange Effective Price*	**₹48900.00**	**₹58900.00**

INDIA iSTORE

INGRAM | Redington

EMI starting at **₹3329/month*** | No cost EMI up to 24 months. Available with select leading Banks and NBFCs

[1] Apple Intelligence will be available in beta on all iPhone 16 models, iPhone 15 Pro and iPhone 15 Pro Max, with Siri and device language set to US English, as an iOS 18 update in late 2024. Some features and support for additional languages, including Indian English, French, Japanese and Spanish, will be coming over the course of the next year.

*The limited period offer illustrative Exchange Effective prices are computed on the MRP ₹79900.00 (incl. of all taxes) of iPhone 16, 128 GB, (15.54 cm, 1 N) and on the MRP ₹89900.00 (incl. of all taxes) of iPhone 16 Plus, 128 GB, (17.00 cm, 1 N) and reduced by ₹5000.00 Instant Cashback, which is valid exclusively on ICICI Bank Credit Card, Kotak Mahindra Bank Credit Card and SBI Credit Card (Non-EMI and EMI) & on ICICI Bank Debit Card (EMI only) and further reduced by exchange value of ₹20000.00 of iPhone 13, 128 GB (15.40 cm, 1 N) in a good working condition along with ₹6000.00 Exchange Bonus.The applicable Instant Cashback offer is valid for transactions made using Brand EMI option on Pine Labs and Paytm terminals and applicable on select online merchants via Pine Labs Payment Gateway. No Cost EMI on cards for up to 6 months tenure is available on ICICI Bank Credit Card, Kotak Mahindra Bank Credit Card, SBI Credit Card & ICICI Bank Debit Card EMI transactions. Low-Cost EMI is also available on tenures greater than 6 months. The above illustrative consumer loan offer of EMI of ₹3329.00 p.m. is computed on No Cost EMI of up to 24 months available from Bajaj Finance Ltd, HDFC Bank, HDB Financial services, ICICI Bank, IDFC First Bank and TVS Credit and is calculated on the MRP 79900.00 (inclusive of all taxes) for iPhone 16 (15.54 cm, 1N) 128 GB. 33% down payment is required to avail the above illustrated consumer loan offer from Bajaj Finance Ltd. 0 down payment offer is also available from other financiers. The consumer loan approval from the financier is at their sole discretion. EMIs illustrated above are rounded off to the nearest rupee for ease of reference. The offer is provided as No Cost EMI i.e. the benefit of No Cost EMI as a total applicable interest to be charged by financier on consumer loan or by bank on card EMI transactions for original tenure will be borne by Apple Authorised Distributors. Processing fee is applicable and will be charged to customer as per Financier's or Bank's terms and conditions. Goods and Services Tax will be applicable on processing fee, interest component and foreclosure charges, as applicable. Customer may be required to enter into separate agreements or arrangements (by whatever name called) with the financier to avail or use the EMI facility. Customers are advised to read the offer/agreement terms and conditions carefully. *The Exchange Bonus of up to ₹6000.00 is exclusively provided by the Apple Authorised Trade-in Providers Cashify and Servify at select participating stores in association with participating resellers at their sole discretion. Exchange Bonus is valid only for transactions involving Trade-in of customer's eligible old devices valued at least ₹3000.00 or above. Customer's eligible old devices valued between ₹3000.00 and ₹10000.00 will receive an Exchange Bonus of ₹3000.00 and customer's eligible devices valued between ₹10000.00 and ₹15000.00 will receive an Exchange Bonus of ₹4000.00 and customer's eligible devices valued above ₹15000.00 will receive an Exchange Bonus of ₹6000.00. The Exchange Bonus and Trade-in value will be passed on as a credit or discount in the customer's invoice. Customer's eligible old device trade-in value as diagnosed and assessed by Apple Authorised Trade-in Providers will be the final offer. Any other T&C's as specified by Apple Authorised Trade-in Providers will apply. The offers may be revised or withdrawn without any prior notice. Offer available till stocks last. Available at select participating Apple Authorised Reseller stores. For store details log on to IndiaiStore.com. All trademarks, logos and brand names are the property of their respective owners. Product features vary by model. TM and © 2024 Apple Inc. All rights reserved.

వెంటాడుతున్న ఆర్థిక అనిశ్చితి భయాలు..

సాక్షి, హైదరాబాద్: భారతీయులను 'ఆర్థిక అనిశ్చితి'భయాలు వెంటాడుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులతోనే కాకుండా రాబోయే ఐదేళ్లలో చోటుచేసుకోబోయే అనూహ్య పరిస్థితులపై కూడా వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. రాబోయే ఐదేళ్లలో భారత్‌తో సహా ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చిత వాతావరణం కొనసాగొచ్చన్న అభిప్రాయంతో మెజారిటీ భారతీయులు ఉన్నారు. ఇదే సమయంలో భారత్‌తో సహా దాదాపుగా అన్ని ప్రపంచ దేశాల్లోని ప్రజలను ఆర్థిక అనిశ్చితి భయపెడుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికరంగం ఒడిదుడుకులను ఎదుర్కొంటుండగా...రాబోయే ఐదేళ్లలోనూ ఇదే స్థితి కొనసాగుతుందా? పరిస్థితులు మరింత దిగజారుతాయా అన్న ఆందోళన వివిధ వర్గాల ప్రజల్లో వ్యక్తమవుతోంది.

కుటుంబ ఖర్చులు, పిల్లల చదువుల వ్యయం, వైద్యఖర్చులు, తదితరాల పెరుగుదలతో వచ్చే ఐదేళ్లలో మనదేశంతో పాటు వివిధ దేశాల్లో ఆర్థిక అస్థిరత, నిలకడలేని వాతావరణం కొనసాగుతుందని 88 శాతం భారతీయులు భావిస్తున్నారు. ఈ అనిశ్చితితో పాటు ఉద్యోగాలు, అప్పులు, రాజకీయ పరిస్థితులు, ఇతర అంశాలు కూడా తమ జీవితాలతో ముడిపడిన ఆర్థిక అంశాలను ప్రభావితం చేసే అవకాశాలున్నాయని వారు అంచనా వేస్తున్నారు. ఆర్థిక అనిశ్చితితో తమకు వచ్చే ఆదాయంలో హెచ్చుతగ్గులు, అప్పులు, ఊహించని ఖర్చుల పెరుగుదలతో మానసిక ఒత్తిళ్లు, ఆందోళన వంటి వాటికి దారితీస్తున్నట్టుగా చెబుతున్నారు. ఆర్థిక అనిశ్చితి, దానిని ప్రభావితం చేసే అంశాలు తదితరాలపై తాజాగా 'అనిశ్చిత్ ఇండెక్స్'నివేదికను ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 7,978 మంది వ్యక్తుల (5,320 మంది వేతన జీవులు, 2,658 మంది బిజినెస్ ప్రొఫెషనల్స్) నుంచి సేకరించిన సమాచారం, వివరాల మేరకు ఈ నివేదికను సిద్ధం చేశారు.

ఈ సర్వే ముఖ్యాంశాలు ఇవీ...

- భారతీయులకు పెరుగుతున్న ఖర్చులే అతి పెద్ద అనిశ్చితి..
- కుటుంబ ఖర్చుల పెరుగుదలతో ఇబ్బంది పడొచ్చని భావిస్తున్నవారు 77 శాతం మంది
- ఆరోగ్యం, జీవితంలో అనిశ్చితి, అప్పుడు, ఊహించని ఖర్చులు రావొచ్చునని అంచనా వేస్తున్నవారు 71 శాతం మంది
- ఆర్థిక అనిశ్చితి ఎదురుకావొచ్చుననే భావనలో 67 శాతం
- రాజకీయ అనిశ్చితితో ఇబ్బందులు ఎదురుకావొచ్చుననే అభిప్రాయంతో ఉన్న వారు 65 శాతం
- చేస్తున్న ఉద్యోగాల్లో మార్పుచేర్పుల అనిశ్చితి ఏర్పడొచ్చునంటున్న వారు 64 శాతం
- వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల ప్రభావంతో అనిశ్చితి ఉండొచ్చుననే భావనతో 62 శాతం

వచ్చే ఐదేళ్లలో భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా... అనిశ్చిత వాతావరణం కొనసాగొచ్చన్న అభిప్రాయంతో మెజారిటీ ఇండియన్లు..

- కుటుంబ ఖర్చులు, పిల్లల చదువుల వ్యయం, వైద్యఖర్చులు తదితరాల పెరుగుదలపై 88 శాతం భారతీయుల ఆందోళన
- ఆర్థిక అనిశ్చితితో పాటు ఉద్యోగాలు, అప్పులు, మారనున్న రాజకీయ పరిస్థితులు ఇతర అంశాలు ప్రభావితం చేయొచ్చనే అంచనాలు
- ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రణాళికలు.. • ఇన్సూరెన్స్ పాలసీలు 77 శాతం మంది, ఫిక్స్‌డ్ డిపాజిట్లు 49 శాతం
- మ్యూచువల్ ఫండ్స్/స్టాక్స్‌లో 46 శాతం, పెన్షన్‌పై ధీమా/సజావుగా సాగుతున్న వ్యాపారాలు 42 శాతం ఎలాంటి ఆర్థిక రక్షణలు ప్లాన్ చేయనివారు 6 శాతం
- ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్ 'అనిశ్చిత్ ఇండెక్స్'తాజా నివేదికలో వెల్లడి



ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి ఏర్పడొచ్చా అన్న దానిపై ఏమన్నారంటే...

- 88 శాతం మంది వచ్చే 5 ఏళ్లలో భారత్‌తో సహా ప్రపంచదేశాల్లో ఆర్థిక అనిశ్చితి నెలకొనవచ్చుననే భావనతో ఉన్నారు.
- 10 శాతం మంది ఈ అనిశ్చితి తక్కువస్థాయిలో ఉండొచ్చునని నమ్ముతున్నారు.
- 2 శాతం మందికి ఇది అతి స్వల్పంగా లేదా అసలు ఉండకపోవచ్చుననే అభిప్రాయం

ఈ అనిశ్చితిని అధిగమించేందుకు 'ఫైనాన్షియల్ ప్లానింగ్'ఏ మేరకు తోడ్పడుతుంది ?

- ఆర్థిక ప్రణాళికల సాయంతో ఈ అనిశ్చితిని తగ్గించవచ్చునని నమ్ముతున్నవారు 46 శాతం మంది
- ఈ విషయంలో 'ఫైనాన్షియల్ ప్లానింగ్'ను గట్టిగా సమర్థిస్తున్నవారు 37 శాతం
- ఈ ప్లానింగ్ పట్ల పెద్దగా మేలు జరగదని భావిస్తున్నవారు 13 శాతం
- దీనిని పూర్తిస్థాయిలో నిరాకరిస్తున్న వారు 4 శాతం మంది

అనిశ్చితిని ఎదుర్కొనేందుకు ఎలాంటి ఆర్థిక సురక్షితలు ఉపయోగపడతాయి?

- 77 శాతం మంది ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కొనేందుకు ఇన్సూరెన్స్ పాలసీ అతిపెద్ద ఆర్థిక సురక్షితగా భావిస్తున్నారు.
- 49 శాతం రాబోయే రోజుల్లో ఏవైనా ఆర్థికపరమైన సవాళ్లు వస్తే ఎదుర్కునేందుకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి వాటిలో కొంత మొత్తం జమ చేశామని చెబుతున్నారు.
- 46 శాతం మంది మ్యూచువల్ ఫండ్స్/స్టాక్స్‌లలో పెట్టుబడి పెట్టినట్టుగా వెల్లడించారు.
- 42 శాతం మంది పెన్షన్ వచ్చే ఉద్యోగం ఉందని, తాము ప్రస్తుతం నిర్వహిస్తున్న వ్యాపారం లాభదాయకంగా ఉన్నట్టుగా తెలిపారు.
- 6 శాతం మంది మాత్రం తాము ఎలాంటి ఆర్థిక సురక్షితలను సిద్ధం చేసుకోలేదని పేర్కొన్నారు.

'ఫైనాన్షియల్ ప్లానింగ్'ను సమీక్షిస్తుంటారా ?

- 37 శాతం మంది తమకు తాముగా ఇలాంటి సమీక్షలు చేయడం లేదు. తమ తరఫున సీఏలు, ఫైనాన్షియల్ అడ్వయిజర్లు తమ బాధ్యతను తీసుకుంటున్నట్టు తెలిపారు.
- 22 శాతం మంది ఏడాదికి ఒకసారి లేదా అంతకంటే తక్కువ కాలంలో సమీక్షిస్తామన్నారు.
- 15 శాతం మంది 3 నెలలకు ఒకసారి సమీక్షిస్తామని చెప్పారు.
- 14 శాతం మంది 6 నెలలకు, 14 శాతం నెలకు ఒకసారి ఈ పనిచేస్తామన్నారు.

భవిష్యత్‌లో చోటుచేసుకునే పరిణామాల్లో ఏ అంశం అధిక ఆందోళనకు కారణమవుతోంది?

- 64 శాతం మంది ఉద్యోగ, వృత్తిపరంగా ఎదురయ్యే ఒడిదుడుకులు, పురోగతిపైనే అని వెల్లడి.
- 61 శాతం దీర్ఘకాలిక ఆర్థిక పరమైన లక్ష్యాలు ఆందోళనకు గురిచేస్తున్నాయంటున్నారు.
- 58 శాతం మంది తమ/కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంటుందన్న దానిపైనే ఎక్కువ ఆందోళన ఉన్నట్టుగా తెలిపారు.
- 39 శాతం మంది కుటుంబసభ్యులు/ స్నేహితులతో సంబంధ బాంధవ్యాలు ఏ రకంగా ఉంటాయనే దానిపై సందిగ్ధతతో ఉన్నట్టుగా పేర్కొన్నారు.

ఇదీ అధ్యయనం...

ఆర్థిక అనిశ్చితితో తలెత్తే పరిస్థితులు, ఇబ్బందులను ఎదుర్కునేందుకు వివిధవర్గాల ప్రజలు తమ తమ ప్రాధాన్యతలను ఎప్పటికప్పుడు మార్చుకోవడంతో పాటు దీర్ఘకాలిక లక్ష్యాలను పునర్ నిర్దేశించుకోవడానికి కొన్ని త్యాగాలు చేయాల్సి వస్తున్నట్టుగా ఈ నివేదికలో వెల్లడైంది. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆర్థికంగా సురక్షిత స్థితికి చేరేందుకు అవసరమైన మార్గాల అన్వేషణ, అప్పులను తెలివిగా నిర్వహించడం, పెట్టే ఖర్చులను జాగ్రత్తగా వ్యయం చేయడం, డబ్బు పొదుపు వంటి వాటికి ప్రజలు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్టుగా పేర్కొంది. రాబోయే రోజుల్లో ఎదురయ్యే ఆర్థిక అనిశ్చితిని అధిగమించేందుకు వివిధ రంగాలకు చెందినవారు అనుసరించే ప్రణాళికలు, ముందస్తు ఆలోచనలను బట్టి చూస్తే... ఇన్సూరెన్స్ పాలసీలు 77 శాతం మంది, ఫిక్స్‌డ్ డిపాజిట్లు 49 శాతం, మ్యూచువల్ ఫండ్స్/స్టాక్స్‌లో 46 శాతం, పెన్షన్‌పై ధీమా/సజావుగా సాగుతున్న వ్యాపారాలున్న వారు 42 శాతం, ఎలాంటి ఆర్థిక రక్షణ ప్రణాళికలున్‌చేయనివారు 6 శాతం ఉన్నట్టు ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ నివేదిక తెలిపింది.



మంత్రి సీతక్కతో ఆకునూరి మురళి భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి గురువారం ప్రజాభవన్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల విద్యా కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఆకునూరి మురళిని ఈ సందర్భంగా మంత్రి సీతక్క శాలువా కప్పి అభినందించారు. తెలంగాణలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి సీతక్కతో ఆకునూరి మురళి చర్చించారు.

విద్యా వ్యవస్థను మరింత ముందుకు తీసుకెళ్లాలి: పొన్నం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత ముందుకు తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యాశాఖపై తీసుకోవాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. విద్యా కమిషన్ చైర్మన్‌గా నియామకమైన మురళికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

23న అక్రెడిటేషన్లపై రౌండ్‌టేబుల్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని యూట్యూబ్ చానళ్లకు గుర్తింపు అంశంతోపాటు వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లపై ఈ నెల 23న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగే ఈ సమావేశంలో జర్నలిస్టులకు అక్రెడిటేషన్ల విధివిధానాలు, అనుసరించాల్సిన నియమ నిబంధనలు వంటి అంశాలపై చర్చిస్తామని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎడిటర్లు, సీనియర్ జర్నలిస్టులు ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని సంబంధిత అంశాలపై చర్చించి, పలుసూచనలు చేస్తారని వెల్లడించారు.

దానం నాగేందర్‌పై చర్యలు తీసుకోండి

మహిళా కమిషన్‌కు బీజేపీ మహిళా మోర్చా ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌పై అసభ్యకరంగా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్‌కు బీజేపీ మహిళా మోర్చా ఫిర్యాదు చేసింది. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా, ఎంపీ కంగనాను, సినీ పరిశ్రమలోని మహిళలను అవమానించే రీతిలో ఆయన చేసిన వ్యాఖ్యలపై స్పందించాలని కోరింది. గురువారం ఈ మేరకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి వినతిపత్రం సమర్పించారు.

జమిలి ఎన్నికలపై ప్రజలకు నిజాలు తెలియాలి

• కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఒకేసారి శాసనసభ, పార్లమెంటు ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయంపై ప్రజలకు నిజానిజాలు తెలియజేయాలని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికలపై రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికలో వాస్తవాలు లేవని, ఈ కమిటీ దేశంలో ఎవరిని కలిసిందో, ఎక్కడ సమావేశం నిర్వహించిందో స్పష్టత లేదని అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జమిలి ఎన్నికలు పెట్టాల్సి వస్తే రాజ్యాంగానికి 18 సవరణలు చేయాల్సి ఉంటుందని, అందుకు పార్లమెంటులో రెండింట మూడొంతుల మంది సభ్యుల ఆమోదం అంటే లోక్‌సభలో 362 మంది ఎంపీల మద్దతు, రాజ్యసభలో 164 ఎంపీల మద్దతు కావాలని, సగం రాష్ట్రాలు మద్దతు ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. జమిలి ఎన్నికలపై ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

వీడియో కాన్ఫరెన్స్‌తో తల్లికి ఊరట

• ఆన్‌లైన్ ద్వారా హాజరుకు హైకోర్టు అంగీకారం

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు నాలుగు నెలల పసికందు తల్లికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యే స్వేచ్ఛనిచ్చింది. ఇరుపక్షాలు సౌలభ్యం కోసం ఆన్‌లైన్‌ను వినియోగించుకోవాలని ట్రయల్ కోర్టుకు సూచించింది. 4 నెలల చిన్నారితో 190 కి.మీ. దూరం నుంచి ప్రతి వాయిదాకు రావడం ఇబ్బందిగా ఉందని.. పురాణిహవేలీలోని ఫ్యామిలీ కోర్టులో ఉన్న విడాకుల కేసును పెద్దపల్లికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ఎం.నవితా సమీక్ష హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పి.శ్రీసుధ గురువారం విచారణ చేపట్టారు. ప్రతివాది (నవితా సమీక్ష భర్త సాయికుమార్) తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. చాలాకాలంగా సాయి తీవ్ర వెన్నునొప్పితో బాధపడుతున్నారని, ఎక్కువ దూరం ప్రయాణం చేయొద్దని వైద్యులు సూచించారని చెప్పారు. క్షురకుడిగా పనిచేస్తున్న సాయికి అతని సోదరి ఆర్థిక సాయం అందిస్తున్నారని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. 'ఇక్కడ ప్రతివాది (సాయికుమార్) ప్రయాణ ఖర్చులను భరించే స్థితిలో లేరు. పిటిషనర్ 4 నెలల పసికందుతో ప్రయాణించడం శ్రేయస్కరం కాదు. వాయిదాల హాజరు నుంచి ఆమె మినహాయింపు కోరడం సహేతుకమని ఈ కోర్టు భావిస్తోంది. వీడియో కాన్ఫరెన్సింగ్ లేదా ప్రతివాది ఖర్చుతో అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించి ఆమె క్రాస్ ఎగ్జామినేషన్ చేయొచ్చని ఆదేశిస్తున్నాం'అని పేర్కొన్నారు.

ఆదివాసీ మహిళలపై అకృత్యాలను అరికట్టండి

• గవర్నర్‌కు బీజేపీ ఎస్టీమోర్చా వినతి

సాక్షి, హైదరాబాద్: ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడుల ఘటనలపై సమగ్ర విచారణ జరిపేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని బీజేపీ ఎస్టీ మోర్చా.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు విజ్ఞప్తి చేసింది. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూరులో కొంతకాలంగా జరుగుతున్న ఘటనలపై దృష్టి సారించాలని, అక్కడ అక్రమంగా తిష్ట వేసిన ఒక వర్గం ప్రజలను వెంటనే మైదాన ప్రాంతాలకు తరలించాలని కోరింది. రాజ్యాంగం ఐదవ షెడ్యూల్లోని గిరిజనుల హక్కులు, పీసా చట్టం, 1/70 యాక్ట్ అమలు చేయాలని, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ నేతృత్వంలో ప్రతినిధి బృందం గురువారం ఈ మేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించింది. తాము సమర్పించిన వినతిపత్రంపై గవర్నర్ సానుకూలంగా స్పందించారని, త్వరలో జైనూర్‌కి వచ్చి గిరిజనులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని కల్యాణ్ తెలిపారు. గవర్నర్‌ను కలసిన బృందంలో బిక్కునాథ్ నాయక్, నేనావత్ రవి నాయక్, కొట్నాక విజయ్‌రాజు రాథోడ్, భానోత్ అనూష, భానోత్ జ్యోతి ఉన్నారు.

కోర్టు తీర్పు వచ్చాకే గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించాలి

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 ఉద్యోగ నియామకాలకు సంబంధించి న్యాయస్థానంలో కేసుల విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో తుది తీర్పు వచ్చే వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించొద్దని అభ్యర్థులు డిమాండ్ చేశారు. గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో పలువురు గ్రూప్-1 అభ్యర్థులు సమావేశమయ్యారు. విచారణలో ఉన్న కేసులపై తీర్పు వెలువడిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈమేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు ఇవ్వాలని నిర్ణయించారు.





గిజి'గూడు'

గడ్డిపరక..పరక తెచ్చి, శ్రద్ధగా అల్లి.. ముచ్చటగా గూడును తయారు చేసుకొన్న బుల్లిపిట్టల 'ఇంజనీరింగ్ ఘనత' ఇది. నిజామాబాద్ నగరంలోని అమ్మ వెంచర్ వద్ద ఖాళీ ప్రదేశంలో మూతపడిన గ్రౌండ్‌లోని క్రికెట్ నెట్‌కి ఇలా అందంగా గూళ్లను కట్టుకున్నాయి పిచ్చుకలు (గిజిగాడు), ఇతర పక్షులు. సాయంత్రమైతే చాలు గుంపులుగా వచ్చి కిచకిచలతో సందడి చేస్తుంటాయి. ఇక్కడ ఒకటీ రెండూ కాదు ఏకంగా ఇక్కడ 50కిపైగా గూళ్లను కట్టుకుని ఇవన్నీ నివాసం ఉంటున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



హైదరాబాద్ పాతబస్తీలో గురువారం మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. పలుచోట్ల ముస్లింలు భారీ ర్యాలీలు నిర్వహించారు. యువకులు భారీ జెండాలను చేతబట్టి వాహనాలపై ర్యాలీగా సాగారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ ప్రాంతంలో ర్యాలీ సాగుతుండగా గుర్రం, ఒంటెలపై వెళ్తున్న యువకులు

హే బ్రో.. కాస్త చూసుకో



వాహనాల రద్దీ అత్యధికంగా ఉండే తిరుమల రెండో ఘాట్ రోడ్డులో ఓ ఊసరవెల్లి ఒక్కసారిగా ఇలా దూసుకువచ్చింది. బిడ్డా.. ఇది నా అడ్డా, నువ్వే కాస్త చూసుకుని వెళ్లు అన్నట్లు రోడ్డు మధ్యలో కాసేపు ఆగి నిదానంగా పక్కకి వెళ్లింది. వాహనదారులు తమ వాహనాలను కాస్త నెమ్మదిగా నడిపి ఊసరవెల్లి రోడ్డు దాటేవరకూ ఆగారు. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- కేతారి మోహన్ కృష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

మీరు దున్నుకోండి.. మేం ఏరుకుంటాం



ఓ వైపు రైతు పొలాన్ని దమ్ముపట్టే పనిలో నిమగ్నమై ఉంటే మరోవైపు వెనుక ఉన్న కొంగలు తేలిన పురుగుల్ని ఏరుకునే పనిలో బిజీగా ఉన్నాయి. విజయనగరం జిల్లా చింతలవలస సమీపంలో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- డి. సత్యనారాయణమూర్తి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

మకరందం.. అతిమధురం



చుక్కల పరికిణీ చుట్టుకున్న సీతాకోకచిలుక పువ్వులో మకరందాన్ని చాకచక్యంగా జుర్రుకుంటోంది. నెల్లూరు మినీ బైపాస్‌లో పూలమొక్కలు అమ్మే ఓ నర్సరీలో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- ఏ కమలాకర్, సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

పీహెచ్‌సీ వైద్యుల గొంతు నొక్కిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఇన్‌సర్వీస్ కోటా జీవో రద్దు కోరుతూ ఆందోళన చేస్తున్న పీహెచ్‌సీ వైద్యుల గొంతును కూటమి ప్రభుత్వం నొక్కేస్తోంది. వారు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును హరిస్తోంది. విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన తెలపడానికి అనుమతులు ఇచ్చిన పోలీస్ శాఖ బుధవారం హఠాత్తుగా అనుమతులను రద్దు చేసింది. దీంతో ఆ రోజంతా విజయవాడలోని ప్రైవేట్ ఆడిటోరియంలో వైద్యులు సమావేశమయ్యారు. గురువారం నిరసనకు విజయవాడ సీపీని అనుమతి కోరగా తిరస్కరించడంతోపాటు, అనుమతుల్లేకుండా నిరసన కార్యక్రమాలు చేపడితే కేసులు పెడతామని బెదిరించినట్లు వైద్యులు తెలిపారు.

ఏడు జాతీయ రహదారులకు రూ.6,585 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 384 కిలోమీటర్ల మేర ఏడు జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.6,585 కోట్లు మంజూరు చేసిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం వెలగపూడిలోని సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో రాష్ట్రానికి మంజూరైన జాతీయ రహదారులకు ఈ నిధులు కేటాయించినట్టు చెప్పారు. కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ ఆ ప్రాజెక్టులను భారత మాల ప్రాజెక్ట్ నుంచి తొలగించి నేషనల్ హైవేస్ ఆర్డినరీ ప్రోగ్రాం లోకి తెచ్చిందన్నారు.

భూములిచ్చిన రైతులకు వెంటనే రిటర్నబుల్ ప్లాట్లు

రాయపూడి (తాడికొండ): అమరావతిలో పూలింగ్‌కు భూములిచ్చిన రైతులకు వెంటనే రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని, అయితే ముందుగా భూమి ఇచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో రైతు షేక్ మహబూబ్ సుభానీ 4.5 ఎకరాలను మంత్రి గురువారం రాత్రి ఆయన ఇంటికి వెళ్లి సమీకరణకు తీసుకున్నారు.

వంద రోజుల్లో విద్యుత్ శాఖలో చేసిందేమీ లేదు

అధికారులతో మొక్కుబడిగా ముగిసిన విద్యుత్ శాఖ మంత్రి సమీక్ష

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని తేటతెల్లమైంది. ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వంద రోజుల్లో ఏం చేశామో చెప్పమని అడిగారు. 12 వేల కొత్త వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చామని అధికారులు చెప్పారు. అయితే, వీటిలో చాలావరకు గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న రైతులకు ఇచ్చిన సర్వీసులే. వ్యవసాయ విద్యుత్ సర్వీస్ కోసం రైతు దరఖాస్తు చేస్తే ప్రక్రియ పూర్తికావడానికి కనీసం మూడు నెలలు పడుతుంది. అలాంటప్పుడు వంద రోజుల్లో 12 వేల సర్వీసులు మంజూరు అనేది దాదాపు అసాధ్యం. సమీక్షలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిస్కంల సీఎండీలు పాల్గొన్నారు.

ఏపీ ఈడీబీలో కన్సల్టెంట్ల నియామకం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ)లో కన్సల్టెంట్ల నియామకానికి రెండు కమిటీలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది కాలపరిమితికి మొత్తం 13 పోస్టుల నియామకం కోసం వర్చువల్‌గా ఇంటర్వ్యూలు చేయడం కోసం ఒక కమిటీ, నేరుగా ఇంటర్వ్యూ చేయడం కోసం మరో కమిటీ ఏర్పాటు చేస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

'విశాఖ స్టీల్'కు కేంద్రం రూ.500కోట్లు విడుదల

సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.500 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ గురువారం ప్రకటించింది. ఆర్ఐఎన్ఎల్‌కు చేయూతనందించేందుకు ఈ నిధులు విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే.. మంజూరైన ఈ మొత్తాన్ని ప్రభుత్వ లెవీ, వెండర్ పేమెంట్స్‌కు, జీఎస్టీ బకాయిలు చెల్లించేందుకు మాత్రమే వినియోగించాలంటూ షరతులు విధించింది.

ఇది సాయమా? మరో గాయమా!?

- వరద బాధితులను ఆదుకోకుండా కార్పొరేట్ సంస్థతో చేతులు కలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- గృహోపకరణాల మరమ్మతులకు ఆ సంస్థతో ఒప్పందం
- మార్కెట్‌లో ఎక్కడాలేని విధంగా ఒక్కో పనికి ఒక్కో రేటుతో ధరల పట్టిక
- జేబులకు చిల్లులుపడేలా ఉన్నాయంటూ బాధితుల ఫైర్
- అప్పుడు ఆదుకుంటామని చెప్పి ఇప్పుడు సొంత ఖర్చులతో చేయించుకోవాలనడంపై మండిపాటు
- స్వచ్ఛందంగా ఉచిత సేవలందిస్తున్న వారిని ప్రోత్సహించకుండా వీరికి కొమ్ముకాయడమేంటని ప్రశ్న



సాక్షి, అమరావతి: అంతన్నాడు ఇంతన్నాడే గంగరాజు.. అన్నట్లుగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం తీరు చూస్తుంటే. విజయవాడను వరదలు ముంచెత్తి 15 రోజులు పూర్తయినా బాధితులకు చిల్లిగవ్వ సాయం కూడా చేయని రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు వారి జేబులకు చిల్లులుపడే బాధ్యతను మాత్రం భుజానికెత్తుకుంది. బాధితులకు మేలు చేస్తున్నట్లు ఓ వైపు బిల్డప్ ఇస్తూనే మరోవైపు ఓ కార్పొరేట్ సంస్థకు మేలు చేకూర్చేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా.. బాధితుల ఇళ్లలో పనికిరాకుండా పోయిన గృహోపకరణాలతోపాటు ఇళ్లలో నీటి పైపులైన్లు, నీటి కుళాయిలు వంటి ప్లంబింగ్ పనులకు నిర్ణీత రేట్లతో మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వం ఓ కార్పొరేట్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈ మరమ్మతుల రేట్లు అవాక్కయ్యేలా ఉండడం ముంపు ప్రాంతాల్లో పెద్ద చర్చనీయాంశమవుతోంది. ఉదా.. స్విచ్‌బాక్స్ బిగించడానికి రూ.279, ఫ్యాన్ రెగ్యులేటర్ మార్చడానికి రూ.99, ఫ్యాన్ రిపేరుకు రూ.199, ఫ్యాన్ మార్చడానికి రూ.239, గీజర్ చెక్ చేయడానికి రూ.299, వాష్ బేసిన్ లీకేజీ రిపేరుకు రూ.169, సింక్ డ్రెయిన్ పైపు రిపేరుకు రూ.209, డ్రెయిన్ పైపులో అడ్డుతొలగించేందుకు రూ.169, వాటర్ ట్యాప్ రిపేరుకు రూ.139, ఫ్లష్ ట్యాంకు రిపేరుకు రూ.299, వెస్టర్న్ టాయిలెట్ రిపేరుకు రూ.799, వెస్టర్న్ టాయిలెట్ మార్చడానికి రూ.1,499, ఇండియన్ టాయిలెట్ బిగించడానికి రూ.1,699.. అంటూ సదరు సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుని ధరలను నిర్ణయించింది. అంటే.. ఈ ధరలను బాధితులు స్వయంగా డబ్బులు చెల్లించి రిపేర్లు చేయించుకోవాల్సి ఉంటుంది. నిజానికి.. బయట మార్కెట్లో ఈ ధరలు ఇంకా తక్కువగానే ఉన్నాయని బాధితులే స్వయంగా చెబుతున్నారు. మరోవైపు.. ఈ కార్పొరేట్ సంస్థకు అదనంగా అవసరమయ్యే టెక్నీషియన్లను స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ పొందిన వారిని ప్రభుత్వమే కేటాయించడం గమనార్హం.

కళ్లుచెదిరేలా రిపేరింగ్ రేట్లు..

నిజానికి.. పాడైన వస్తువులను ఇంటి చుట్టుపక్కల ఉండే టెక్నీషియన్‌తో బాగుచేయించుకుంటే తక్కువ ఖర్చుతో అయిపోతుంది. కానీ, ప్రభుత్వ ఒప్పందం ప్రకారం నిర్ణయించిన రేట్లు చూస్తే బయట మార్కెట్ రేట్లు లేదా ఆ కార్పొరేట్ సంస్థ తన యాప్‌లో ప్రదర్శించే ధరల కన్నా ఎక్కువగా ఉన్నాయి. వీరిని ఆశ్రయిస్తే బాధితుల ఖర్చులు తడిసిమోపెడవడం ఖాయం. ఎందుకంటే.. ఒకే ఇంట మూడు ట్యూబ్‌లైట్లను ఆ కంపెనీ ద్వారా మార్చుకుంటే మొత్తం రూ.360 చెల్లించాల్సి ఉంటుంది. కానీ, బయట మెకానిక్‌తో చేయిస్తే 150–200 మించి కావు. అలాగే.. ఎలక్ట్రికల్ స్విచ్ బాక్స్ బిగించడానికి రూ.239లు అని యాప్‌లో పేర్కొనగా, వరద ప్రాంతాల్లో ఇదే సేవకు రూ.279లుగా ధరను ప్రభుత్వం నిర్ణయించింది. లోకల్‌గా ఉండే మెకానిక్‌లు ఇదే పనికి రూ.100 నుంచి రూ.250 వరకు వసూలు చేస్తామని చెబుతున్నారు. మరోవైపు.. ఫ్యాన్ మార్చడానికి యాప్ ధర రూ.199లు ఉంటే వరద ప్రాంతాల్లో రూ.239లుగా నిర్ణయించారు. అదే స్థానిక మెకానిక్‌లు ఈ పనికి కేవలం రూ.100–150ల చొప్పున తీసుకుంటామని చెబుతున్నారు. నీటి కుళాయి మార్చడానికి రూ.50 అని యాప్‌లో ఉంటే ఇదే పనికి వరద ప్రాంతాల్లో ప్రభుత్వం రూ.139లు నిర్ణయించింది. స్థానిక మెకానిక్‌లు ఈ పనికి రూ.100 తీసుకుంటున్నారు. వాస్తవానికి.. అనేక ప్రైవేట్ సంస్థలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి బాధితులకు ఉచితంగా సేవలందిస్తుంటే ప్రభుత్వం వీటిని ప్రోత్సహించకుండా కార్పొరేట్ సంస్థకు కొమ్ముకాయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక.. విపత్తు సమయంలో నిండా మునిగిన బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకుండా బాధితుల నుంచి కార్పొరేట్ కంపెనీలు అధిక ధరలు వసూలుచేసుకునేలా వీలు కల్పించడం విడ్డూరంగా ఉందని బాధితులు వాపోతున్నారు.

బాధితులకు యాప్ బాధ్యత ప్రభుత్వ సిబ్బందికి..

ఇదిలా ఉంటే.. వరద ముంపు బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9–12 వరకు ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వ సిబ్బందితో ఇంటింటి సర్వే నిర్వహించింది. ఏ ఇంట్లో ఏ వస్తువులు పాడయ్యాయో వివరాలను సేకరించింది. ఇప్పుడు వీరి సమాచారం పరోక్షంగా ఆ సంస్థ చేతిలో ప్రభుత్వం పెట్టేసింది. అలాగే, పొదుపు సంఘాల కార్యక్రమాలను పర్యవేక్షించే ఉన్నతాధికారులు ఇటీవలే విజయవాడ పరిధిలోని మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించి ముంపు ప్రాంతాల్లోని పొదుపు మహిళల ఫోన్లలో సదరు కార్పొరేట్ సంస్థ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించే బాధ్యతను వారికి అప్పగించారు. కొన్నిచోట్ల సచివాలయాల ఉద్యోగులు ఈ బాధ్యతను చేపట్టినట్లు సమాచారం. అంతేకాక.. 'మీ ఇంట్లో పాడైన వాటిని సంబంధిత కంపెనీతో తక్కువ ఖర్చుతో బాగుచేయించుకోండి' అంటూ ఆ సంస్థ క్యూఆర్ కోడ్‌తో ప్రభుత్వమే కరపత్రాలను బాధితులకు అందిస్తూ ఆ సంస్థను ప్రోత్సహిస్తోంది.

ఆదుకుంటామని చెప్పి ఇలా చేస్తారా!?

ఇక వరద తగ్గిన ప్రాంతాల్లో ఫైర్ ఇంజన్లతో నీట మునిగిన ఇళ్ల పరిసరాలు శుభ్రం చేయిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇంట్లోని సామాన్లు, దుస్తులు, గృహోపకరణాలు పాడైపోయిన వారిని ఏ విధంగా ఆదుకోవాలో కూడా ప్రకటిస్తామన్నారు. తీరా ఇప్పుడు బాధితులే డబ్బులు కట్టి బాగుచేయించుకోవాలని సూచించడంతో పాటు ఆయా పనులకు ప్రభుత్వం ధరలు నిర్ణయించి కార్పొరేట్ సంస్థతో ఒప్పందం చేసుకోవడంపై బాధితులు మండిపడుతున్నారు. సాయం మాట దేవుడెరుగు ఇది తమను మరింత గాయపర్చేలా ఉందని వారు ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు.

లా కోర్సుల ప్రవేశాల్లో జాప్యం ఎందుకు?

- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) నిబంధనల ప్రకారం లా కోర్సుల ప్రవేశాలను ఎందుకు చేపట్టడంలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. జాతీయ న్యాయ కాలేజీల్లో జూలైకల్లా కౌన్సెలింగ్ పూర్తి చేసి తరగతులు ప్రారంభిస్తుంటే, రాష్ట్రంలో అలా ఎందుకు చేయడంలేదో వివరణ ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం ఆదేశించింది. లా కోర్సుల ప్రవేశాలను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయకపోవడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది తాండవ యోగేష్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సీజే ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. పిటిషనర్ యోగేష్ స్వయంగా వాదనలు వినిపిస్తూ.. నిబంధనల ప్రకారం జూలై నాటికి తరగతులు ప్రారంభించాల్సి ఉందని చెప్పారు. జాతీయ కళాశాలల్లో జూలైకల్లా తరగతులు ప్రారంభిస్తుంటే రాష్ట్రంలో మాత్రం నవంబర్–డిసెంబర్‌లో మొదలు పెడుతున్నారని వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ప్రభుత్వానికి న్యాయ విద్య అంటే చిన్నచూపు ఉన్నట్లుందని, అందుకే మెడికల్, ఇంజనీరింగ్ కన్నా అతి తక్కువ ప్రాధాన్యతనిస్తున్నట్లు కనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ ఏడాది లా కోర్సుల ప్రవేశాలకు ఇంకా కౌన్సెలింగ్ ఎందుకు నిర్వహించలేదని, ఈ జాప్యానికి కారణాలేమిటో చెప్పాలని, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి, లాసెట్ కన్వీనర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది.

పాత బిల్లుల్లోనూ బొక్కేస్తాం

- కమీషన్లు బేరమాడుకుంటాం.. బిల్లులు వెనక్కి తీసుకోండి
- జలవనరులశాఖ అధికారులపై ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు
- 'నిధి' పోర్టల్ నుంచి వెనక్కి తీసుకోవాలని హుకుం
- కాదన్న అధికారులను బదిలీ చేస్తామని బెదిరింపులు




సాక్షి, అమరావతి: సాగునీటి ప్రాజెక్టుల పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లించేలా 'నిధి' పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులను వెనక్కి తీసుకోవాలంటూ జలవనరుల శాఖలో సీఈ, ఎస్ఈ, ఈఈ, డీఈలపై టీడీపీ ప్రజాప్రతినిధులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. ఏడాది క్రితం అప్‌లోడ్ చేసిన బిల్లులను కూడా వెనక్కి తీసుకోవాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. పోర్టల్ నుంచి అప్‌లోడ్ చేసిన బిల్లులను వెనక్కి తీసుకోవడం సాంకేతికంగా వీలు కాదన్న అధికారులకు బదిలీలను బహుమానంగా ఇస్తామంటూ హెచ్చరిస్తున్నారు. తాము చెప్పిన కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లించేలా పోర్టల్ వివరాలను అప్‌లోడ్ చేయాలని షరతు విధిస్తున్నారు. ఈలోగా కమీషన్ల కోసం కాంట్రాక్టర్లతో బేరసారాలు మాట్లాడుకుంటామంటూ ప్రజాప్రతినిధులు బాహాటంగా చెబుతుండటంతో అధికారులు నివ్వెరపోతున్నారు.

'మేం చెబితేనే అప్‌లోడ్ చేయండి'

సాగునీటి ప్రాజెక్టుల్లో చేసిన పనుల వివరాలను ఎం.బుక్‌లో నమోదు చేసి.. వాటికి చెల్లించాల్సిన బిల్లుల వివరాలను 'నిధి' పోర్టల్‌లో అధికారులు అప్‌లోడ్ చేస్తారు. వాటిని ఆర్థిక శాఖ తనిఖీ చేసి.. ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు బిల్లులు చెల్లిస్తుంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల పరిధిలో సాగునీటి ప్రాజెక్టులలో జరిగిన పనులను వివరాలను తెలుసుకుని, వాటి బిల్లుల చెల్లింపు ఎంతవరకూ వచ్చిందన్నది ఆరా తీస్తున్నారు. చేసిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు పెండింగ్‌లో ఉందని చెప్పిన అధికారులకు.. వాటిని తక్షణమే 'నిధి' పోర్టల్ నుంచి వెనక్కి తీసుకోవాలంటూ టీడీపీ ప్రజాప్రతినిధులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. తాము చెప్పే వరకూ ఆ బిల్లులను మళ్లీ పోర్టల్ అప్‌లోడ్ చేయొద్దంటూ హుకుం జారీ చేస్తున్నారు. సాంకేతికంగా వీలు కాదని చెప్పిన అధికారులకు.. సాధారణ బదిలీలలో లూప్‌లైన్‌లో సుదూర ప్రాంతాలకు బదిలీ చేయిస్తామంటూ అల్టిమేటం ఇస్తున్నారు. రాయలసీమ కరవు నివారణ పథకంలో భాగంగా చేసిన పనులకు సంబంధించిన బిల్లులను పోర్టల్ నుంచి వెనక్కి తీసుకోవాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. సోమశిల హైలెవల్ కెనాల్, చింతలపూడి ఎత్తిపోతల, వంశధార, తోటపల్లి, వెలిగొండ తదితర ప్రాజెక్టులలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులను వెనక్కి తీసుకోవాలంటూ తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తుండటంతో ఇంజనీర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 78,690 మంది స్వామివారిని దర్శించుకోగా 26,086 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.18 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: విశాఖనగరం బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు.

కాణిపాకం వినాయకుడికి పట్టువస్త్రాలు




మహానంది: కాణిపాకంలో జరుగుతున్న వినాయక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మహానంది దేవస్థానం నుంచి గురువారం పట్టువస్త్రాలను తీసుకెళ్లారు. ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలను తీసుకెళ్లారు. అక్కడ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, వేదపండితులు సుబ్బారావుకు అందజేశారు.

అద్దాల మండపం సందర్శనకు అనుమతి



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయం ప్రాంగణంలోని అద్దాల మండప సందర్శనకు భక్తులను అనుమతించారు. ఈ మండపంలో స్వామిఅమ్మవార్లకు శయనోత్సవం నిర్వహిస్తారు. అద్దాల మండపాన్నే శయన మందిరం అని అంటారు. ఈ మందిరంలో స్వామిఅమ్మవారలు సేదతీరే ఊయల చుట్టు భక్తులు ప్రదక్షిణ చేసేవారు. అయితే కరోనా సమయం నుంచి మందిరంలోకి భక్తుల ప్రవేశం నిలిచిపోయింది. కాగా గురువారం దేవస్థాన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శయన మందిరం సందర్శనకు అనుమతి లభించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ద్వారకాతిరుమల నూతన ఈఓగా మూర్తి



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ నూతన ఈఓగా ఎన్‌వీఎస్ఎన్ మూర్తి నియమితులయ్యారు. రాష్ట్ర దేవదాయ శాఖలోని పలు ప్రముఖ ఆలయాల ఈఓలను బదిలీ చేస్తూ ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆర్‌జేసీగా విధులు నిర్వర్తించిన ఎన్‌వీఎస్ఎన్ మూర్తిని ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేస్తూ, ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న వేండ్ర త్రినాథ రావును సింహాచలం ఈఓగా నియమించారు.

ఏయూ ఉద్యోగుల హాజరు తనిఖీ



విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో కప్యూటర్ సైన్స్, ఐటీ, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాలను గురువారం కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన, బోధనేతర సిబ్బంది హాజరు, తరగతుల నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. తనిఖీల్లో రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వేదవిద్య నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగులు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పల్నాడు జిల్లా దేవదాయశాఖ అధికారి కోట వీరాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. వేద విద్యలో క్రమాంతం, ఆపై కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో త్రీడీ ప్రింటింగ్‌పై వర్క్‌షాప్

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని మెకానికల్ విభాగంలో త్రీడీ ప్రింటింగ్‌పై ఒక్క రోజు వర్క్‌షాపును గురువారం నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో విద్యార్థులకు త్రీడి ప్రింటింగ్ పనిచేయు విధానం, వాటి విడిభాగాల అమరిక, త్రీడి ప్రింటింగ్‌కి ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌పై లైవ్ డెమో ద్వారా శిక్షణ ఇచ్చారు.

సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లుగా పదోన్నతి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్ -2 ఫార్మాసిస్టులకు ఆరుగురికి పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించి సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లుగా ప్రమోషన్ ఉత్తర్వులను ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర గురువారం అభ్యర్థులకు అందజేశారు.


అమితాబ్ బచ్చన్

రెండు రోజులు నిద్రపట్టలేదు!

బాలీవుడ్ బిగ్ బి అమితాబ్ బచ్చన్‌కి తన కుటుంబ సభ్యులంటే ఎంతో ప్రేమ. ఈ విషయాన్ని ఎన్నో సందర్భాల్లో వెల్లడించారాయన. తన కోడలు ఐశ్వర్యా రాయ్ (అభిషేక్ బచ్చన్ సతీమణి) అంటే కూడా ఆయనకు ఎంతో అభిమానం. సందర్భం వచ్చినప్పుడల్లా ఆమె గురించి ప్రస్తావించే అమితాబ్ తాజాగా మరోసారి ఐశ్వర్యా రాయ్ గురించి ప్రముఖ సోషల్ మీడియా వేదిక రెడిట్‌లో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. ''2003లో 'ఖాకీ' సినిమా షూటింగ్ కోసం నాసిక్‌కి వెళ్లాం. నేను, అక్షయ్ కుమార్, ఐశ్వర్యా రాయ్ చిత్రీకరణలో ఉన్నాం. ఓ సన్నివేశంలో కారు అదుపు తప్పి వేగంగా వచ్చి ఐశ్వర్య కూర్చున్న కుర్చీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తనకు తీవ్రంగా దెబ్బలు తగలడంతో ముంబై తీసుకెళ్లాలనుకున్నాం. ఇందుకు అనిల్ అంబానీ ప్రైవేట్ విమానం వినియోగించుకున్నాం. అయితే నాసిక్‌లో నైట్ ల్యాండింగ్ సౌకర్యం లేదు. దీంతో అక్కడికి కొంత దూరంలో ఉన్న సైనిక స్థావరంలో విమానాన్ని ల్యాండ్ చేయడానికి ఢిల్లీ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకున్నాం. అయితే ఈ ఘటనని అందరూ చిన్నదిగా భావించారు. కానీ ఐశ్వర్య గాయాలు చూసి నా మనసు చలించిపోయింది.. రెండు రోజులు నిద్ర పట్టలేదు. నా కళ్ల ముందే జరిగిన ఆ ఘటనను మర్చిపోవడానికి నాకు చాలా రోజులు పట్టింది'' అని తెలిపారు అమితాబ్ బచ్చన్.


నాగ చైతన్య

జనవరిలో తండేల్?

'తండేల్' సినిమా జనవరిలో రిలీజ్ అయ్యే అవకాశం ఉందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. 'లవ్‌స్టోరీ' (2021) చిత్రం తర్వాత హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి జంటగా నటిస్తున్న సినిమా 'తండేల్'. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాకు చందు మొండేటి దర్శకత్వం వహిస్తుండగా, అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. దీంతో 'తండేల్' రిలీజ్ గురించి మేకర్స్ సన్నాహాలు మొదలుపెట్టారు. తొలుత డిసెంబరులో రిలీజ్ చేయాలనుకున్నా వివిధ కారణాల వల్ల జనవరిలో రిలీజ్ చేయాలనుకుంటున్నారట. అయితే సంక్రాంతి బరిలో 'తండేల్' చిత్రం ఉంటుందా? లేక రిపబ్లిక్ డే సందర్భంగా థియేటర్స్‌కు వస్తుందా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే సంక్రాంతి బరిలో ఇప్పటికే ఐదారు సినిమాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే... 'తండేల్'లో మంచి లవ్‌స్టోరీ, ఎమోషన్‌తో పాటు దేశభక్తి అంశాలు కూడా ఉన్నాయి. దీంతో ఈ చిత్రం రిపబ్లిక్ డేకు రిలీజ్ కావొచ్చని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.


మహేశ్ బాబు
త్రిష

మహేశ్‌తో కాలేజ్ డేస్ నుంచే పరిచయం - త్రిష

''మహేశ్ బాబు చాలా కాలం నుంచి నాకు తెలుసు. మేమిద్దరం కళాశాల రోజుల్లో చెన్నైలో ఉన్నాం'' అన్నారు హీరోయిన్ త్రిష. మహేశ్‌బాబు, త్రిష కలిసి 'అతడు' (2005), 'సైనికుడు' (2006) వంటి చిత్రాల్లో నటించారు. ఆ తర్వాత వీరిద్దరూ నటించ లేదు. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న త్రిషకి.. 'మహేశ్‌బాబు గురించి మీ అభిప్రాయం ఏంటి?' అనే ప్రశ్న ఎదురైంది. ఇందుకు త్రిష బదులిస్తూ– ''నాకు ఇష్టమైన నటుల్లో మహేశ్‌బాబు ఒకరు. ఎంత పెద్ద స్టార్ హీరో అయినా తోటి నటులను చాలా గౌరవిస్తారు. సెట్‌లో చాలా సరదాగా ఉంటారు. అలాగే చాలా హార్డ్ వర్క్ చేస్తారు. తన షూటింగ్ అయిపోయినా కేరవ్యాన్‌లోకి వెళ్లకుండా మానిటర్ దగ్గర కూర్చొని గమనిస్తూ ఉంటారు. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే.. మహేశ్ చాలా కాలం నుంచి నాకు తెలుసు. మేమిద్దరం కాలేజ్ డేస్‌లో చెన్నైలో ఉన్నాం. మా ఇద్దరికీ మ్యూచువల్ ఫ్రెండ్స్ ఉండే వారు. వారి వల్ల మహేశ్‌తో పరిచయం ఏర్పడింది. మేము యాక్టర్స్ అవుతామని అప్పుడు అనుకోలేదు'' అన్నారు త్రిష. ఇదిలా ఉంటే త్రిష నటిస్తున్న తాజా తెలుగు చిత్రం 'విశ్వంభర'. ఈ మూవీలో చిరంజీవికి జోడీగా నటిస్తున్నారు త్రిష. 'స్టాలిన్' (2006) సినిమా తర్వాత చిరంజీవి– త్రిష కలిసి నటిస్తున్న చిత్రం ఇదే. సంక్రాంతి కానుకగా 2025 జనవరి 10న 'విశ్వంభర' విడుదల కానుంది.



హౌస్‌లో శేఖర్ బాషా అంకం సమాప్తం

బిగ్ బాస్ హౌస్‌లోని రెండవ వారం వాడి వేడి వాదనలతో నామినేషన్స్ అవగా మిగతా వారమంతా ఫుడ్ టాస్క్ మీద నడిచింది. ముందుగా నామినేషన్స్ గురించి చెప్పుకుందాం. హౌస్‌లోని ప్రతి కంటెస్టెంట్ తాను నామినేట్ చేయాలనుకున్న కంటెస్టెంట్ గురించి చెప్పేటప్పుడు సదరు కంటెస్టెంట్ ఆటను ముందుగా పొగిడి తరువాత తన నామినేషన్ కారణాన్ని వివరిస్తూ వివాదపర్చడం విడ్డూరమనిపించింది. ఈ నామినేషన్స్ టైమ్‌లో విచిత్రంగా ప్రతి కంటెస్టెంట్ ఫైర్ అవుతున్నారు. ఇటువంటి ఫైరింగ్ నామినేషన్స్ నుండి జోవియల్ కంటెస్టెంట్ అయిన శేఖర్ బాషా ఎలిమినేట్ అవడం విశేషం. శేఖర్ బాషా ఎలిమినేషన్ వ్యక్తిగతంగా అతను తండ్రి అవడం ఓ కారణమైతే అదే కారణాన్ని చూచాయగా చూపిస్తూ హౌస్‌లోని కంటెస్టెంట్లందరూ (ఒక్క కంటెస్టెంట్ తప్ప) శేఖర్ బాషా హౌస్ నుండి బయటకు వెళ్లాలి అని బాహాటంగానే నామినేట్ చేశారు. బిగ్ బాస్ హౌస్‌లో చిన్న కారణమైనా పెద్దదిగా చేస్తారు. అందుకేనేమో బిగ్ బాస్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చుతాయి. ఈ సందర్భంగా ఓ విషయం చెప్పుకోవాలి. ఈ వారాంతం జరిగిన షోలో బిగ్ బాస్ తెలుగు ప్రేక్షకులను నాగార్జున అందలం ఎక్కించారు. అదేంటంటే భారతదేశంలోని ఏ బిగ్ బాస్ షోకి రానంత ప్రేక్షకాదరణ ఒక్క తెలుగు బిగ్ బాస్‌కే దక్కిందట. మొత్తంగా 6 బిలియన్ల నిమిషాల నిడివితో ఈ తెలుగు బిగ్ బాస్ షోని తెలుగు ప్రేక్షకులు చూశారట. ఇది ఒక రికార్డ్ బ్రేక్ అని నాగార్జున చెప్పుకొచ్చారు. ఇకపోతే ఫుడ్ టాస్క్ గురించి చాలానే చెప్పాలి. రాతి యుగంలో ఆది మానవులు ఆహారం కోసం అరాచకం చేసేవారట. ఈ విషయం మన తరం వారు చూసి ఉండరు కానీ చదువుంటారు. అదే పరిస్థితి చూడాలనుకుంటే ఈ వారం బిగ్ బాస్ ఫుడ్ టాస్క్ చూసి ఆనందించవచ్చు. ఫుడ్ టాస్క్‌కు సంబంధించి దీనికి మించిన వివరణ మరేదీ ఉండదు. వారం వారం అంచనాలు అందుకోలేని సంచలనాలతో దూసుకువెళ్తున్న బిగ్ బాస్ ముందు ముందు మరెన్ని సంచనాలకు తావిస్తుందో చూడాలి.

– ఇంటూరి హరికృష్ణ

నిజమైన పవర్ జనమే

'బిచ్చగాడు' ఫేమ్ విజయ్ ఆంటోనీ నటించిన తాజా చిత్రం 'హిట్లర్'. ధన దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రియా సుమన్, గౌతమ్ వాసుదేవ మీనన్, చరణ్ రాజ్ కీలక పాత్రలు పోషించారు. విజయ్ ఆంటోనీతో గతంలో 'విజయ్ రాఘవన్' చిత్రం నిర్మించిన చెందూర్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ సంస్థ తమ 7వ ప్రాజెక్ట్‌గా 'హిట్లర్' నిర్మించింది. డీటీ రాజా, డీఆర్ సంజయ్ కుమార్ నిర్మాతలు. ఈ నెల 27న తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదలవుతోంది. గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'ఈ ప్రపంచంలో నిజమైన పవర్ అన్నది డబ్బు, అధికారం కాదు.. ఒక మనిషిని నమ్మి అతని వెనకున్న జనమే' వంటి డైలాగ్‌లు ట్రైలర్‌లో ఉన్నాయి. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'హిట్లర్'. పొలిటికల్ డ్రామా, లవ్ అండ్ రొమాంటిక్ అంశాలు కూడా ఈ చిత్రంలో ఉన్నాయి. విజయ్ ఆంటోనీ నటన, ఉన్నత నిర్మాణ విలువలు, నేపథ్య సంగీతం, అద్భుతమైన విజువల్స్ ఈ సినిమాకి హైలైట్స్‌గా నిలుస్తాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నవీన్ కుమార్.ఐ, సంగీతం: వివేక్, మెర్విన్.


గౌతమ్ వాసుదేవ మీనన్, విజయ్ ఆంటోనీ, రియా


సయీ మంజ్రేకర్

నన్ను ట్రోల్ చేశారు!

ప్రముఖ నటుడు, దర్శక–నిర్మాత మహేశ్ మంజ్రేకర్ కుమార్తె సయీ మంజ్రేకర్ 'దబాంగ్ 3' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. సల్మాన్ ఖాన్ హీరోగా ప్రభుదేవా దర్శకత్వం వహించిన ఈ సినిమా 2019 డిసెంబరు 20న విడుదలైంది. అయితే తొలి సినిమాకే వయసులో తనకంటే 37 ఏళ్ల పెద్ద నటుడైన సల్మాన్‌తో నటించడంతో అప్పట్లో ఆమెపై ట్రోల్స్ వచ్చాయి. ఇటీవల ఓ సందర్భంగా ఆ ట్రోల్స్‌పై సయీ మంజ్రేకర్ స్పందించారు. ''నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో సల్మాన్ ఖాన్‌గారితో నటించే అవకాశం రావడంతో వెంటనే అంగీకరించాను. అయితే అప్పట్లో నాకు పీఆర్ టీమ్ లేదు. అందుకే నాకేమీ తెలియదు. వెండితెరపై నన్ను చూసుకోవాలనే లక్ష్యం మాత్రం బలంగా ఉండేది. అందుకే సల్మాన్‌గారి వంటి పెద్ద స్టార్‌తో నటించే అవకాశం రావడంతో ఎంతో సంతోషించాను. 'దబాంగ్ 3' సినిమా విడుదలైన తర్వాత నాపై విమర్శలు వచ్చాయి. నాకంటే 37 ఏళ్ల పెద్ద వయసున్న హీరోతో నటించానంటూ నన్ను ట్రోల్ చేయడంతో చాలా బాధపడ్డాను. ఆ ట్రోల్స్ నా కెరీర్‌పై ప్రభావం చూపకూడదని ఆర్నెళ్ల పాటు సోషల్ మీడియాకు దూరంగా ఉన్నాను. కొన్నాళ్ల తర్వాత అలాంటి విమర్శలు వస్తే బాధపడటం మానేశాను. ఎవరైనా పొగిడితే సంతోషిస్తాను. విమర్శిస్తే వాటిని సరిచేసుకునే ప్రయత్నం చేస్తున్నాను'' అని తెలిపారు సయీ మంజ్రేకర్. కాగా 'గని, మేజర్, స్కంద' వంటి తెలుగు చిత్రాలతో టాలీవుడ్‌లోనూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు సయీ మంజ్రేకర్.


సల్మాన్ ఖాన్

సింగమ్‌కు అతిథి!

అజయ్ దేవగన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సింగమ్ ఎగైన్'లో సల్మాన్ ఖాన్ అతిథిగా కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. హీరో అజయ్ దేవగన్, దర్శకుడు రోహిత్ శెట్టి కాంబినేషన్‌లోని 'సింగమ్ ఫ్రాంచైజీ' నుంచి వస్తున్న తాజా చిత్రం 'సింగమ్ ఎగైన్'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కరీనా కపూర్, విలన్‌గా అర్జున్ కపూర్ నటిస్తుండగా, అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమాలో ప్రభాస్ ఓ గెస్ట్ రోల్ చేయనున్నారనే టాక్ ఇటీవల తెరపైకి వచ్చింది. తాజాగా సల్మాన్ ఖాన్ కూడా ఓ గెస్ట్ రోల్ చేయనున్నారనే టాక్ బాలీవుడ్‌లో గట్టిగా వినిపిస్తోంది. మరి... 'సింగమ్ ఎగైన్'లో సల్మాన్ ఖాన్ అతిథిగా కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక 'సింగమ్ ఎగైన్' సినిమాను ఈ ఏడాది ఆగస్టు 15న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ కుదరలేదు. దీంతో దీపావళికి వాయిదా వేశారు. అయితే దీపావళికి కూడా 'సింగమ్ ఎగైన్' చిత్రం రిలీజ్ కాదనే టాక్ బాలీవుడ్‌లో తెరపైకి వచ్చింది. మరి... సింగమ్ దీపావళికి వస్తాడా? చూడాలి.

ముంబై టు యూరప్


షారుక్ ఖాన్

షారుక్ ఖాన్ హీరోగా, ఆయన కుమార్తె సుహానా ఖాన్ మరో లీడ్ రోల్‌లో నటించనున్న హిందీ చిత్రం 'కింగ్' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ యాక్షన్ సినిమాకు సుజోయ్ ఘోష్ దర్శకత్వం వహించనున్నారు. అభిషేక్ బచ్చన్ విలన్ రోల్ చేయనున్నారని సమాచారం. ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాదే ప్రారంభించాలనుకున్నారు మేకర్స్. కానీ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌కు మరింత సమయం పడుతుండటంతో షూటింగ్ కాస్త ఆలస్యంగా ప్రారంభం కానుందట. ఈ ఏడాది చివర్లో ప్రారంభం కావాల్సిన 'కింగ్' చిత్రీకరణ వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభం అవుతుందని, ముందుగా ముంబైలో చిత్రీకరణ జరిపి, ఆ తర్వాత యూరప్‌లో ఓ లాంగ్ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారని భోగట్టా. చిత్రీకరణ ఆలస్యం కావడంతో 2025 చివర్లో రిలీజ్ కావాల్సిన ఈ సినిమా 2026కు వాయిదా పడిందని బాలీవుడ్ టాక్.

ఒక్క వీడియోతో కష్టం వృథా అయిపోయింది

- దర్శకుడు లోకేశ్ కనగరాజ్



రెండు నెలల పాటు తాము పడ్డ కష్టం అంతా ఒక్క లీక్ వీడియోతో వృథా అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'కూలీ'. ఈ చిత్రంలో దేవాగా రజనీకాంత్, సైమన్‌గా నాగార్జున, రాజశేఖర్‌గా సత్యరాజ్, ప్రీతీగా శ్రుతీహాసన్, కలీషాగా ఉపేంద్ర నటిస్తున్నారు. కాగా ఈ సినిమాలోని నాగార్జున పాత్రకు చెందిన వీడియో ఒకటి లీకై, సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వైట్ సూట్ ధరించి, డిఫరెంట్ గెటప్‌లో ఉన్న నాగార్జున ఓ వ్యక్తిని చంపుతున్నట్లుగా ఆ వీడియోలో కనిపించింది. ఈ వీడియో లీక్ కావడం పట్ల లోకేశ్ కనగరాజ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ''రెండు నెలలుగా మేం అందరం పడ్డ కష్టం ఓ చిన్న రికార్డింగ్‌తో వృథాగా పోయినట్లయింది. ఫలితం లేకుండా పోయింది. ఇలాంటి వాటిని ప్రోత్సహించకండి'' అంటూ 'ఎక్స్'లో స్పందించారు లోకేశ్. ఇదిలా ఉంటే... 'కూలీ' సినిమాలో నాగార్జున విలన్ రోల్ చేస్తున్నారని గతంలో ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఈ వీడియో చూసిన వారికి 'కూలీ' సినిమాలో నాగార్జునది విలన్ రోల్ అనే అభిప్రాయం మరింత బలపడవచ్చు. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ సినిమా 2025లో రిలీజ్ కానుంది.


హృతిక్ రోషన్
కియారా అద్వానీ

ఇటలీలో ఆటా పాటా

ఇటలీలో రెండో యుద్ధం చేస్తున్నారు హృతిక్ రోషన్. వైఆర్ఎఫ్ (యశ్ రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న తాజా చిత్రం 'వార్ 2'. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా సిద్దార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కుతోంది. హృతిక్ రోషన్‌తో పాటు ఎన్టీఆర్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్న 'వార్ 2' సినిమాకు 'బ్రహ్మాస్త్రం' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం 'వార్ 2' సినిమా చిత్రీకరణ ఇటలీలో జరుగుతోంది. హృతిక్ రోషన్, కియారా అద్వానీల కాంబినేషన్‌లో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ సాంగ్ పూర్తయిన తర్వాత ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఇటలీలో దాదాపు ఇరవై రోజుల పాటు జరిగే 'వార్ 2' సినిమా నెక్ట్స్ షెడ్యూల్ ముంబైలో ప్రారంభం కానుందని, ఈ షెడ్యూల్‌లో హృతిక్ రోషన్– ఎన్టీఆర్ కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరిస్తారని బాలీవుడ్ భోగట్టా. ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 ఆగస్టు 15న విడుదల కానుంది.

ఆరాధ్య అదుర్స్!


ఆరాధ్య, ఐశ్వర్య, శివరాజ్ కుమార్


ఆరాధ్య

హీరోయిన్ ఐశ్వర్యా రాయ్‌బచ్చన్ తనయ ఆరాధ్య బచ్చన్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ఇంతకీ ఏం జరిగిందంటే... ఇటీవల దుబాయ్‌లో 'సైమా' (సౌత్ ఇండియన్ ఇంటర్‌నేషనల్ మూవీ అవార్డ్స్) వేడుక జరిగిన సంగతి తెలిసిందే. 'పొన్నియిన్ సెల్వన్: 2' సినిమాలోని నటనకు గాను ఐశ్వర్యా రాయ్‌కు ఉత్తమ నటి (క్రిటిక్స్ విభాగం) అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఐశ్వర్యా రాయ్‌ని కన్నడ ప్రముఖ నటుడు శివ రాజ్ కుమార్ అభినందించారు. ఈ సమయంలో తన కుమార్తెను శివ రాజ్‌కుమార్‌కు పరిచయం చేశారు ఐశ్వర్యా రాయ్. తల్లి పరిచయం చేసిన వెంటనే శివ రాజ్‌కుమార్ కాళ్లకు నమస్కరించి, ఆశీర్వాదం తీసుకుంది ఆరాధ్య. వెంటనే ఆరాధ్యను పైకి లేపారు శివ రాజ్‌కుమార్. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అలాగే ఆరాధ్య సంస్కారాన్ని, ఐశ్వర్యా రాయ్ పెంపకాన్ని, శివ రాజ్‌కుమార్ పెద్దరికాన్ని ప్రసంశిస్తూ నెటిజన్లు కామెంట్స్ పోస్ట్ చేస్తున్నారు. ఇలా ఆరాధ్య నెటిజన్లతో అదుర్స్ అనిపించుకున్నారు.

బిజినెస్ రీల్

మెడికల్ టూరిజంలోకి ఈజ్‌మైట్రిప్

న్యూఢిల్లీ: వేగంగా వృద్ధి చెందుతున్న మెడికల్ టూరిజం రంగంలోకి ఈజ్‌మైట్రిప్ ప్రవేశించింది. హోమ్ హెల్త్‌కేర్ సేవలందించే ఫ్లైజ్ హోమ్ హెల్త్‌కేర్‌లో 49 శాతం, రోలిన్స్ ఇంటర్నేషనల్‌లో 30 శాతం వాటాలు కొనుగోలు చేసింది. దుబాయ్ కేంద్రంగా ఫ్లైజ్ కార్యకలాపాలు సాగిస్తుండగా, రోలిన్స్ ఇంటర్నేషనల్ సంస్థ దేశీయంగా హెల్త్ సప్లిమెంట్లు, అలర్జెన్‌రహిత ఆహారోత్పత్తులు మొదలైనవి విక్రయిస్తోంది. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సర్వీసులకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ కొనుగోళ్ల నిర్ణయం తీసుకున్నట్లు ఈజ్‌మైట్రిప్ సీఈవో నిశాంత్ పిట్టీ తెలిపారు. సుమారు 7.69 బిలియన్ డాలర్లుగా ఉన్న మెడికల్ టూరిజం పరిశ్రమ 2029 నాటికి 14.31 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా.

ఏస్టర్ డీఎం క్వాలిటీ కేర్!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల రంగంలో ఉన్న ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్, కేర్ హాస్పిటల్స్ విలీనం దిశగా వేగంగా అడుగులేస్తున్నట్లు సమాచారం. ఇది కార్యరూపం దాలిస్తే ఏస్టర్ డీఎం క్వాలిటీ కేర్‌గా పేరు మార్చాలని ఇరు సంస్థలు భావిస్తున్నట్టు తెలుస్తోంది. విలీనం అనంతరం ఏర్పడే కంపెనీ దేశంలో టాప్-3 వైద్య సంస్థగా నిలవనుంది. షేర్ల మార్పిడి 50:50 నిష్పత్తిలో ఉండే అవకాశం ఉంది.



ఏస్టర్ డీఎం మార్కెట్ విలువ రూ.21,052 కోట్లుగా ఉంది. కేర్ హాస్పిటల్స్‌ను రూ.16,800 కోట్లుగా విలువ కట్టినట్టు సమాచారం. విలీనం అనంతరం ఓపెన్ ఆఫర్ ఉంటుంది. అలాగే విలీనం అనంతరం ఏర్పడే కంపెనీని ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేస్తారు. ఇక కొత్తగా ఏర్పాటైన కంపెనీకి ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ వ్యవస్థాపకులు ఆజాద్ మూపెన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కేర్ హాస్పిటల్స్‌ను బ్లాక్‌స్టోన్, టీపీజీ ప్రమోట్ చేస్తున్నాయి.

స్టార్ ఇండియా కేసుపై పోరాడతాం

జీ ఎంటర్‌టైన్‌మెంట్ వెల్లడి

న్యూఢిల్లీ: లండన్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ కోర్టు(ఎల్‌సీఐఏ)లో స్టార్ ఇండియా దాఖలు చేసిన 94 కోట్ల డాలర్ల(సుమారు రూ. 7,870 కోట్లు) కేసుపై పోరాడనున్నట్లు జీల్ తాజాగా పేర్కొంది. 2024-27 మధ్య కాలంలో ఐసీసీ ఇంటర్నేషనల్ మ్యాచ్‌ల బ్రాడ్‌క్యాస్టింగ్ హక్కుల సబ్‌లైసెన్స్‌కు సంబంధించి ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు జీల్‌కు వ్యతిరేకంగా స్టార్ ఇండి యా ఆర్బిట్రేషన్ కోర్టును ఆశ్రయించినట్లు వెల్ల డించింది. స్టార్ ఇండియా క్లెయిములన్నిటినీ తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. వీటికి వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేయనున్నట్లు తెలియజేసింది. ఈ వారం మొదట్లో స్టార్ ఇండియా ఎల్‌సీఐఏలో జీల్‌కు వ్యతిరేకంగా కేసు పెట్టినట్లు పేర్కొంది.

విలువలో టీసీఎస్ నంబర్ 1



- వరుసగా మూడో ఏడాది తొలి స్థానం
- తర్వాతి స్థానాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ: అత్యంత విలువైన భారత బ్రాండ్‌గా టీసీఎస్ మరోసారి మొదటి స్థానంలో నిలిచింది. కాంటార్ బ్రాండ్జ్ రిపోర్ట్‌లో వరుసగా మూడో ఏడాది ఈ గుర్తింపు పొందింది. ఆ తర్వాతి స్థానాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ ఉన్నాయి. టీసీఎస్ బ్రాండ్ విలువ 49.7 బిలియన్ డాలర్లుగా ఈ నివేదిక తెలిపింది. గతేడాది నుంచి చూస్తే టీసీఎస్ బ్రాండ్ విలువ 16 శాతం పెరిగింది. ఏఐ, డిజిటల్ విభాగాల్లో టీసీఎస్ చేసిన పెట్టుబడులు బ్రాండ్ విలువ పెరిగేందుకు దోహదపడినట్టు తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 38.3 బిలియన్ డాలర్ల విలువను సొంతం చేసుకుంది. 18 బిలియన్ డాలర్ల విలువతో ఎస్‌బీఐ ఐదో స్థానంలో నిలవగా, 15.6 బిలియన్ డాలర్లతో ఐసీఐసీఐ బ్యాంక్ ఆరో స్థానంలో, 11.5 బిలియన్ డాలర్ల విలువతో ఎల్‌ఐసీ పదో స్థానంలో నిలిచాయి. గతేడాది నుంచి చూస్తే 54 బ్రాండ్లు తమ విలువను పెంచుకున్నాయి. భారత్‌లోని టాప్-75 బ్రాండ్ల విలువ అద్భుతమైన రీతిలో ఏడాదిలోనే 19 శాతం పెరిగి 450.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు కాంటార్ బ్రాండ్జ్ నివేదిక వెల్లడించింది. ఆర్థిక సేవల బ్రాండ్లు ఈ జాబితాలో ప్రముఖంగా నిలిచాయి. మొత్తం బ్రాండ్ల విలువలో 17 ఆర్థిక సేవల బ్రాండ్ల రూపంలోనే 28 శాతం ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది.

జొమాటో స్పీడ్..

ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో చాలా వేగంగా తన విలువను రెట్టింపు చేసుకున్నట్టు కాంటార్ బ్రాండ్జ్ నివేదిక తెలిపింది. 3.5 బిలియన్ డాలర్ల విలువతో జాబితాలో 31వ స్థానాన్ని సొంతం చేసుకుంది. బజాజ్ ఆటో 20వ స్థానంలో ఉంది. మహీంద్రా అండ్ మహీంద్రా బ్రాండ్ విలువ ఏడాదిలో 78 శాతం పెరిగింది. 30వ స్థానం సొంతం చేసుకుంది. మొత్తం 1535 బ్రాండ్లకు సంబంధించి 1.41 లక్షల మంది అభిప్రాయాలను కాంటార్ సంస్థ పరిగణనలోకి తీసుకుంది.

2 కంపెనీలుగా హిందుస్తాన్ జింక్

- విడదీత ప్రణాళికల్లో మార్పులు
- ప్రభుత్వంతో తాజాగా చర్చలు



ఉదయ్‌పూర్: మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ జింక్(హెచ్‌జెడ్ఎల్) విడదీత ప్రతిపాదనపై తాజాగా చర్చలు ప్రారంభమైనట్లు కంపెనీ సీఈవో అరుణ్ మిశ్రా వెల్లడించారు. కంపెనీని రెండు విభాగాలుగా విడదీసే ప్రతిపాదనపై ప్రభుత్వంతో తిరిగి చర్చలు మొదలుపెట్టినట్లు తెలియజేశారు. ఇంతక్రితం మూడు బిజినెస్‌లుగా విడదీసేందుకు ప్రతిపాదించిన నేపథ్యంలో తాజా చర్చలకు ప్రాధాన్యత ఏర్పడింది. మూడు ప్రత్యేక కంపెనీలుగా విడదీసే తొలి పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనను హిందుస్తాన్ జింక్ నిలిపివేసింది. కంపెనీలో 29.54 శాతం వాటా కలిగిన ప్రభుత్వం ఇందుకు సమ్మతించకపోవడం ప్రభావం చూపింది. కాగా.. ప్రస్తుతం రెండు ప్రత్యేక కంపెనీలుగా విడదీసే ప్రతిపాదనపై ప్రభుత్వంతో నిర్వహిస్తున్న చర్చలు సానుకూలంగా సాగుతున్నట్లు మిశ్రా పేర్కొన్నారు. కంపెనీ బిజినెస్‌లకు సంబంధించిన ఎలాంటి పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనకైనా మైనింగ్ శాఖ అనుమతి తీసుకోవలసి ఉంటుందని ప్రభుత్వం లేఖ ద్వారా స్పష్టం చేసింది. అయితే ఆస్తులు, మైన్స్, స్మెల్టర్ తదితరాల పునర్వ్యవస్థీకరణ భారీ అంశమని, దీంతో గనుల శాఖ కార్యదర్శి, కంపెనీ ప్రతినిధులు ఇటీవల సమావేశమైనట్లు వెల్లడించారు. గత నెలలో వేదాంతా గ్రూప్ కంపెనీ వాటాదారులకు షేరుకి రూ. 19 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందుకు రూ. 8,028 కోట్లు కేటాయించనుంది.

భారత్ అభివృద్ధిలో బ్యాంకులది కీలక పాత్ర

- ఇన్‌ఫ్రా, ఎంఎస్ఎంఈలకు దన్నుగా ఉండాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



పుణె: 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇందులో భాగంగా ఇన్‌ఫ్రా రంగానికి బ్యాంకులు దన్నుగా నిలవాలని, చిన్న-మధ్యతరహా సంస్థల అవసరాలకు తగ్గట్లుగా రుణ లభ్యత ఉండేలా చూడాలని ఆమె చెప్పారు. అలాగే, ఆర్థిక సేవలు అందుబాటులో లేని వర్గాలను బ్యాంకింగ్ పరిధిలోకి తేవాలని, బీమా విస్తృతిని మరింత పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 90వ వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ విషయాలు చెప్పారు.

టెక్నాలజీతో కొత్త మార్పులు..

ఖాతాదారులకు డిజిటల్ బ్యాంకింగ్‌ను సులభతరం చేసేందుకు ఉపయోగపడుతున్న టెక్నాలజీతో పరిశ్రమలో కొత్త మార్పులు చోటు చేసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ ప్రాధాన్యం పెరుగుతోందని, ప్రస్తుతం భూటాన్, ఫ్రాన్స్ తదితర ఏడు దేశాల్లో ఈ విధానం అందుబాటులో ఉందని ఆమె తెలిపారు. అంతర్జాతీయంగా జరిగే రియల్-టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 45 శాతం వాటా భారత్‌దే ఉంటోందన్నారు. అయితే, టెక్నాలజీతో పాటు పెరుగుతున్న హ్యాకింగ్ రిస్కులను నివారించేందుకు, అలాంటి వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు బ్యాంకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బ్యాంకుల్లో మొండిబాకీలు తగ్గుతున్న నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని రిజర్వ్ బ్యాంక్ జూన్ ఆర్థిక స్థిరత్వ నివేదిక సూచిస్తోందని మంత్రి చెప్పారు. లాభదాయకతతో పాటు ఆదాయాలను పెంచుకునే దిశగా బ్యాంకులు తగు విధానాలను పాటించాలని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం నాగరాజు సూచించారు.

10 నగరాలకు అల్ట్రావయొలెట్ ఈవీ విస్తరణ

న్యూఢిల్లీ: వేగవంతమైన ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీ సంస్థ అల్ట్రావయొలెట్ ఆటోమోటివ్ ఈ ఏడాది దీపావళి నాటికి పది నగరాలకు కార్యకలాపాలను విస్తరించనుంది. గురువారం తమ అయిదో స్టోర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించిన సందర్భంగా సంస్థ సహ వ్యవస్థాపకుడు నారాయణ్ సుబ్రమణియం ఈ విషయం తెలిపారు. ఇటీవలే 1,000 వాహనాల డెలివరీలను పూర్తి చేయగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 4,000 బైక్‌ల విక్రయాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం విక్రయిస్తున్న ఎఫ్77 మాక్ 2 మోడల్ ధర రూ. 2.99 లక్షల నుంచి రూ. 3.99 లక్షల వరకు (ఎక్స్‌షోరూం) ఉందని, ఒకసారి చార్జి చేస్తే 323 పైచిలుకు కిలోమీటర్ల రేంజి, గంటకు 165 కి.మీ. గరిష్ట వేగం ఉంటుందని నారాయణ్ వివరించారు. బ్యాటరీపై అత్యధికంగా 8,00,000 కి.మీ. వారంటీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే 2-3 ఏళ్లలో ఎలక్ట్రిక్ బైక్‌ల సెగ్మెంట్‌కి సంబంధించి 4 విభాగాల్లోకి ప్రవేశించనున్నట్లు తెలిపారు. మరోవైపు, అంతర్జాతీయంగా జర్మనీ తదితర దేశాల్లో 50 పైచిలుకు సెంటర్స్ ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు నారాయణ్ చెప్పారు. టీవీఎస్ మోటర్స్, శ్రీధర్ వెంబు (జోహో) తదితర ఇన్వెస్టర్లు సంస్థలో 55 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 400 కోట్లు) ఇన్వెస్ట్ చేశాయి. సుమారు 3,500 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటైన హైదరాబాద్ స్టోర్‌లో సేల్స్, సర్వీస్, స్పేర్స్ అన్నీ ఒకే చోట ఉంటాయి.



ఇరెడా నిధుల సమీకరణకు సై

ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: పీఎస్‌యూ సంస్థ ఇండియన్ రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఇరెడా) నిధుల సమీకరణకు లైన్ క్లియర్ అయ్యింది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా రూ. 4,500 కోట్లవరకూ సమకూర్చుకునేందుకు ప్రభుత్వం తాజాగా అనుమతించింది. అత్యున్నత కమిటీ సిఫారసులమేరకు పెట్టుబడులు, పబ్లిక్ ఆస్తుల నిర్వాహక శాఖ(దీపమ్) ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వెరసి క్విప్ ద్వారా కంపెనీలో 7 శాతంవరకూ ప్రభుత్వ వాటాను విక్రయించనున్నట్లు ఇరెడా వెల్లడించింది. ఒకే దశలో లేదా దశలవారీగా క్విప్‌ను చేపట్టనున్నట్లు తెలియజేసింది. కంపెనీ మూలధన పటిష్టతకు నిధులను వినియోగించనుంది. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు మరిన్ని నిధులను వెచ్చించే ప్రణాళికల్లో భాగంగా క్విప్‌నకు తెరతీయనుంది. తద్వారా దేశీయంగా శుద్ధ ఇంధన పరివర్తనకు ప్రోత్సాహాన్నివ్వనుంది. కంపెనీ విస్తరణ ప్రణాళికలకు దీపమ్ అనుమతి కీలక ముందడుగా నిలవనున్నట్లు ఇరెడా చైర్మన్, ఎండీ ప్రదీప్ కుమార్ దాస్ పేర్కొన్నారు.

బీఎస్ఈలో ఇరెడా షేరు యథాతథంగా రూ. 230.20 వద్ద ముగిసింది.

రుణ సెక్యూరిటీల జారీ ఇక వేగం

నిబంధనలు సవరించిన సెబీ



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా రుణ(డెట్) సెక్యూరిటీల జారీ విధానాలను క్రమబద్ధీకరించేందుకు నడుం కట్టింది. ఇందుకు వీలుగా నిబంధనలను సవరించింది. దీంతో ఇక డెట్ సెక్యూరిటీల జారీ వేగవంతంకానుంది. తద్వారా పబ్లిక్‌కు సెక్యూరిటీలను జారీ చేసే సంస్థలకు నిధులు త్వరగా అందనున్నాయి. తాజా నిబంధనల ప్రకారం సెబీ పబ్లిక్ నుంచి స్పందన కోరే ముసాయిదా డాక్యుమెంట్ల గడువును ప్రస్తుత 7 రోజుల నుంచి 1 పనిదినానికి సవరించింది. ఇది ఇప్పటికే లిస్టయిన నిర్దిష్ట సెక్యూరిటీలకు వర్తించనుంది. ఇతరత్రా సెక్యూరిటీల జారీని చేపట్టే సంస్థలకు 5 రోజులుగా వర్తించనుంది. జాతీయస్థాయిలో టెర్మినళ్లు కలిగి గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టయిన నిర్దిష్ట సెక్యూరిటీలకు ఫైలింగ్ తదుపరి ఒక రోజులోనే ముసాయిదా పత్రాలను దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ బాటలో కనీస సబ్‌స్క్రిప్షన్ గడువును సెబీ 3 నుంచి 2 రోజులకు తగ్గించింది.

విస్తరణలో ప్యూర్ ఈవీ

PURE ELECTRIC VEHICLE

ముంబై: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ప్యూర్ ఈవీ దేశవ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లో కార్యకలాపాలను భారీగా విస్తరించే యోచనలో ఉన్నట్లు సంస్థ సీఈవో రోహిత్ వధేరా తెలిపారు. రాబోయే నాలుగేళ్లలో రూ. 2,000 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఐపీవోకి వచ్చే యోచనలో ఉన్నట్లు ఆయన వివరించారు. పటిష్టమైన ఆర్థిక మూలాలతో గత మూడేళ్లుగా నిర్వహణ లాభాలు నమోదు చేస్తున్నట్లు వధేరా చెప్పారు. లారస్ ల్యాబ్స్ ఫ్యామిలీ ఆఫీస్, నాట్కో ఫార్మా ఫ్యామిలీ ఆఫీస్, హెచ్‌టీ వెంచర్స్ మొదలైనవి ప్యూర్ ఈవీలో పెట్టుబడులు పెట్టాయి.

భారత్‌లో గ్రండ్‌ఫోస్ యూజర్ ఫెయిర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అధునాతన పంప్ సొల్యూషన్స్ అందించే అంతర్జాతీయ సంస్థ గ్రండ్‌ఫోస్ భారత్‌లో కస్టమర్ల కోసం ఎండ్-యూజర్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ఇందులో టెక్స్‌టైల్ విభాగానికి సంబంధించి సొల్యూషన్స్‌ను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపింది. నీటి వనరులు, వ్యర్థాల విషయంలో జౌళి పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు ఇవి ఉపయోగపడగలవని సీనియర్ రీజనల్ సేల్స్ డైరెక్టర్ (ఐఎంఈఏ) బురాక్ గ్రికాన్ తెలిపారు. ఈ ప్రదర్శనలో దాదాపు 200 మంది పైగా పరిశ్రమ ప్రతినిధులు పాల్గొంటున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా నిపుణులతో చర్చా కార్యక్రమాలు, నెట్‌వర్కింగ్‌తో పాటు కొత్త టెక్నాలజీల గురించి తెలుసుకునే అవకాశాలు ఉంటాయని గ్రండ్‌ఫోస్ పంప్స్ ఇండియా డైరెక్టర్ శంకర్ రాజారాం తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)	
20-9-2024	
విశాఖ	550-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	545-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NTPC	424	2.38
TITAN	3,793.00	1.82
NESTLEIND	2,643.00	1.77
KOTAKBANK	1,872.00	1.76
TATACONSUM	1,216.00	1.26

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BPCL	324.65	-3.41
COALINDIA	479.7	-1.52
ONGC	286.5	-1.34
ADANIPORTS	1,410.90	-1.25
SHRIRAMFIN	3,530.00	-1.25

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,792
ఎన్ఎస్ఈ	1,33,899
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,16,834
ఎఫ్ఐఐ	- 2,548
డీఐఐ	+ 2,013

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.11	$ 69.88
బ్రెంట్	74.80	$ 73.65

భారత్‌లో ఆకర్షణీయమైన అవకాశాలు

సేల్స్‌ఫోర్స్ చైర్మన్ మార్క్ బెనియాఫ్



శాన్ ఫ్రాన్సిస్కో: భారత్‌లో వ్యాపార అవకాశాలు అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయని, దేశంలో గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నామని కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్ చైర్మన్ మార్క్ బెనియాఫ్ తెలిపారు. ప్రపంచం అంతా 'భారతీయ శకం'లోకి మారుతోందని ఆయన వ్యాఖ్యానించారు. తమకు భారత్‌లో 11,000 మంది ఉద్యోగులు ఉన్నారని, వారిలో చాలా మంది అంతర్జాతీయ క్లయింట్లకు సర్వీసులు అందిస్తున్నారని బెనియాఫ్ చెప్పారు. డిజిటల్ టెక్నాలజీల వినియోగం పెరిగే కొద్దీ భారత వ్యాపార విభాగం కూడా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. బజాజ్ గ్రూప్ వంటి దిగ్గజ కస్టమర్లకు కూడా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కంపెనీ నిర్వహించిన వార్షిక 'డ్రీమ్‌ఫోర్స్' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా బెనియాఫ్ ఈ విషయాలు చెప్పారు. సేల్స్‌ఫోర్స్ భారత విభాగం చీఫ్‌గా ఉన్న ఎస్‌బీఐ మాజీ చైర్మన్ అరుంధతి భట్టాచార్య సారథ్య సామర్థ్యాలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమం సందర్భంగా ఏజెంట్‌ఫోర్స్ సొల్యూషన్‌ను ఆవిష్కరించారు. వివిధ విభాగాలవ్యాప్తంగా ఉద్యోగుల కార్యకలాపాల నిర్వహణను సులభతరం చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో గిగ్ వర్కర్ల నమోదు



న్యూఢిల్లీ: తాత్కాలిక వర్కర్లకు వివిధ సామాజిక భద్రత పథకాల ప్రయోజనాలు లభించేలా వారి పేర్లను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ప్లాట్‌ఫాం అగ్రిగేటింగ్ సంస్థలకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సూచించింది. లబ్ధిదారుల పక్కా రిజిస్ట్రీని రూపొందించేందుకు ఇది ఉపయోగపడుతుందని ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం పాటించాల్సిన ప్రక్రియకు సంబంధించి మార్గదర్శకాలను కూడా ప్రకటించింది. వీటి ప్రకారం రిజిస్టర్ అయిన తర్వాత ప్లాట్‌ఫాం వర్కర్లకు యూనివర్సల్ అకౌంటు నంబరు (యూఏఎన్) లభిస్తుంది. వారి రికార్డులను (పని, చెల్లింపులు, నిష్క్రమణ మొదలైనవి) అగ్రిగేటర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేలా ఏపీఐ ఇంటిగ్రేషన్ కోసం ఇప్పటికే కొన్ని అగ్రిగేటర్లతో కలిసి పనిచేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అసంఘటిత కార్మికులకు కూడా సామాజిక భద్రత, సంక్షేమ పథకాలను అందించే దిశగా జాతీయస్థాయి డేటాబేస్‌గా ఈ-శ్రమ్ పోర్టల్ ఉపయోగపడుతోంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం భారత్‌లో 2020-21లో 77 లక్షలుగా ఉన్న గిగ్ వర్కర్ల సంఖ్య 2029-30 నాటికి 2.35 కోట్లకు చేరుతుందనే అంచనాలున్నాయి. గిగ్ వర్కర్లు రెండు రకాలుగా ఉంటారు. ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ యాప్‌లు లేదా డిజిటల్ ప్లాట్‌ఫాంలలో పని చేసేవారిని ప్లాట్‌ఫాం వర్కర్లుగా, క్యాజువల్ వర్కర్లుగా పార్ట్-టైమ్ లేదా ఫుల్‌టైమ్ పని చేసేవారిని నాన్-ప్లాట్‌ఫాం గిగ్ వర్కర్లుగా పరిగణిస్తారు.

రెనో సీఎన్‌జీ వేరియంట్స్ వస్తున్నాయ్



చెన్నై: వాహన తయారీలో ఉన్న ఫ్రెంచ్ కంపెనీ రెనో.. భారత మార్కెట్లో సీఎన్‌జీ వేరియంట్లను త్వరలో పరిచయం చేయనుంది. తొలుత ట్రైబర్, కైగర్ ఆ తర్వాత క్విడ్ సీఎన్‌జీ రానున్నాయి. కొన్ని నెలల్లో కంపెనీ ప్రవేశపెట్టదలచిన ఆరు కొత్త మోడళ్ల కంటే ముందే ఈ సీఎన్‌జీ వేరియంట్లు దర్శనమీయనున్నాయని రెనో ఇండియా ఆపరేషన్స్ సీఈవో, ఎండీ వెంకట్రామ్ మామిళ్లపల్లె తెలిపారు. భారత్‌లో 2023లో సీఎన్‌జీ ఆధారిత ప్యాసింజర్ వెహికిల్స్ 5.24 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఈ సంఖ్య 4.8 లక్షల యూనిట్లు రోడ్డెక్కాయి. కాగా, కంపెనీ విడుదల చేయనున్న మోడళ్లలో సరికొత్త బి-సెగ్మెంట్ ఎస్‌యూవీ, సి-సెగ్మెంట్ ఎస్‌యూవీ, రెండు ఈవీలతోపాటు ఆధునీకరించిన ట్రైబర్, కైగర్ ఉన్నాయి. రెనో ఇండియా ప్రత్యేక ఫీచర్లతో ట్రైబర్, కైగర్, క్విడ్ మోడళ్లలో నైట్ అండ్ డే లిమిటెడ్ ఎడిషన్ వేరియంట్లను బుధవారం ప్రవేశపెట్టింది. లిమిటెడ్ ఎడిషన్‌లో 1,600 యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉంచామని వెంకట్రామ్ తెలిపారు. గతేడాది మాదిరిగానే 2024లో 53,000 యూనిట్లను విక్రయించే అవకాశం ఉందని రెనో ఇండియా అంచనా వేస్తోంది.

విదేశీ బ్రాండ్ల చలో భారత్

గతంలో వెళ్లిపోయినవి తిరిగొస్తున్న వైనం

Ford

HARLEY-DAVIDSON MOTOR CYCLES

Carrefour

- ఆకర్షిస్తున్న చక్కని వృద్ధి అవకాశాలు
- మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సై
- క్యారీఫోర్, ఫోర్డ్ మోటార్స్ రీ ఎంట్రీ

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే వేగవంతమైన వృద్ధి, అధిక యువ జనాభా, బలమైన వినియోగం.. వెరసి భారత్ మార్కెట్ విదేశీ బ్రాండ్లను ఆకర్షిస్తోంది. గతంలో భారత్ మార్కెట్ నుంచి వెళ్లిపోయిన సంస్థలు పునరాలోచనలో పడ్డాయి. ఇప్పటికే కొన్ని సంస్థలు తిరిగి భారత్‌లోకి పునరాగమనం చేయనున్నట్టు ప్రకటించేశాయి. పలు బహుళజాతి సంస్థలు భారత్‌లో బలమైన వృద్ధి అవకాశాలతో చొచ్చుకుపోతుండగా.. తాము ఎందుకు అలా రాణించకూడదన్న దృక్పథంతో అవి తమ పెట్టుబడుల ప్రణాళికలను సమీక్షించుకుంటున్నట్టు పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ముఖ్యంగా భారత్ ఆశాకిరణంగా కనిపిస్తుండడంతో గతంలో ఇక్కడి నుంచి తట్టా, బుట్టా సర్దేసుకుని వెళ్లిన విదేశీ కంపెనీలు, మరో విడత ఇక్కడ కాలు మోపేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. యూరప్‌లో రెండో అతిపెద్ద రిటైల్ చైన్ 'క్యారీఫోర్', భారత్‌లోనూ అదే మాదిరి విజయగాథను నమోదు చేయాలని భావించింది. కానీ, విధానాలు ఫలితమివ్వకపోవడంతో 2014 జూలైలో భారత్‌లోని క్యాష్ అండ్ క్యారీ స్టోర్ల వ్యాపారాన్ని మూసేసి వెళ్లిపోయింది. మరో ఫార్మాట్‌తో తిరిగి భారత్‌లోకి వస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. అంతేకాదు అమెరికాకు చెందిన బహుళజాతి ఆటో సంస్థ (డెట్రాయిట్) ఫోర్డ్ మోటార్ 2022 సెప్టెంబర్‌లో భారత్ మార్కెట్‌ను వీడింది. కరోనా తర్వాత డిమాండ్ క్షీణత, పోటీ పెరిగిపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవలే తమిళనాడు సర్కారు ఫోర్డ్ యాజమాన్యంతో మాట్లాడగా.. చెన్నైకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరైమలై ప్లాంట్‌లో తయారీని త్వరలో ప్రారంభిస్తామంటూ ప్రకటించింది. భారత్‌లో అపార అవకాశాలు మరికొన్ని విదేశీ బ్రాండ్లను సైతం ఆకర్షిస్తున్నాయి. దీంతో అవి తిరిగొచ్చేందుకు ఉత్సాహం చూపిస్తున్నాయి.

జాయింట్ వెంచర్లు

అమెరికాకు చెందిన ప్రముఖ ద్విచక్ర వాహనాల సంస్థ హార్లే డేవిడ్సన్ సైతం తొలుత భారత మార్కెట్లో సొంతంగా వ్యాపార అవకాశాల కోసం ప్రయత్నం చేసి, నష్టాలు వస్తుండడంతో తప్పుకుంది. హీరో మోటోకార్ప్‌తో కలసి జాయింట్ వెంచర్ రూపంలో గతేడాది మళ్లీ ఎంట్రీ ఇచ్చింది. చైనాకు చెందిన ఫ్యాషన్ సంస్థ షీన్ రిలయన్స్ రిటైల్‌తో టై అప్ పెట్టుకుని భారత్‌లోకి తిరిగి ప్రవేశించింది. క్యారీఫోర్ యూరప్‌లో మల్టీబ్రాండ్ (బహుళ బ్రాండ్ల) రిటైల్ అవుట్‌లెట్లతో మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు భారత్‌లో ఇదే విధమైన వ్యాపారం కోసం దుబాయ్ అప్పారెల్ గ్రూప్‌తో జట్టు కట్టింది. ఫోర్డ్ మోటార్స్ సైతం ఈ విడత భారత్‌లో రిటైల్ విక్రయాలు కాకుండా, ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతులకు భారత్‌ను కేంద్రంగా చేసుకోవాలనే ప్రణాళికతో వస్తోంది.

విధానాల ఫలితం..

క్యాష్ అండ్ క్యారీ వ్యాపారం నుంచి మెట్రో సైతం గతేడాది వైదొలగడం గమనార్హం. తన వ్యాపారాన్ని రిలయన్స్‌కు అమ్మేసి వెళ్లిపోయింది. మల్టీబ్రాండ్ రిటైల్ వ్యాపారం పట్ల వాల్‌మార్ట్ గ్రూప్ సైతం ఆసక్తితో ఉండగా, ఎఫ్‌డీఐ విధానాల్లో స్పష్టత లేమితో.. చివరికి 2018లో 16 బిలియన్ డాలర్లతో ఫ్లిప్‌కార్ట్‌ను సొంతం చేసుకుంది. కానీ, ఆ తర్వాతి కాలంలో ఐకియా, యాపిల్ సంస్థలు ఇక్కడి రిటైల్ మార్కెట్లోకి అడుగుపెట్టడం తెలిసిందే. ప్రభుత్వ ప్రగతిశీల విధానాలతో విదేశీ కంపెనీల్లో ఆసక్తి పెరిగినట్టు సబ్నివిస్ తెలిపారు.

విస్మరించలేనివి...

భారత వినియోగ మార్కెట్ ప్రపంచంలోనే పెద్దదంటూ, ఇక్కడి అవకాశాలను కంపెనీలు విస్మరించలేనివిగా ఫ్రాంచైజీ ఇండియా చైర్మన్ గౌరవ్ మార్య తెలిపారు. భారత్‌లో అవకాశాలకు అనుగుణంగా తమ వ్యూహాలను సర్దుబాటు చేసుకునేందుకు క్యారీఫోర్, ఫోర్డ్, తదితర విదేశీ బ్రాండ్లు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఇదే అంశంపై సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ స్పందిస్తూ.. అతిపెద్ద మార్కెట్, వేగవంతమైన వృద్ధి, విజయవంతమైన ఆర్థిక సంస్కరణలు భారత్‌లో అవకాశాలను అన్వేషించేలా విదేశీ ఇన్వెస్టర్లను ప్రేరేపిస్తున్నట్టు వివరించారు. అతిపెద్ద వినియోగ మార్కెట్, బలమైన వృద్ధి విదేశీ బ్రాండ్లను ఆకర్షిస్తున్నట్టు బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ సైతం అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రానిక్స్, రెన్యువబుల్ ఎనర్జీ, విజ్ఞానాధారిత సేవలు తదితర రంగాల్లో విదేశీ కంపెనీలు భారీ పెట్టుబడుల ప్రకటనలు చేస్తున్నట్టు చంద్రజీత్ బెనర్జీ తెలిపారు. ''విదేశీ సంస్థలతో మాట్లాడినప్పుడు భారత్‌లో కార్యకలాపాలు చేపట్టేందుకు అవి ఎంతో ఆసక్తితో ఉన్నట్టు తెలిసింది. స్థిరమైన ఆర్థిక వృద్ధి నేపథ్యంలో భారత్ ఇక ముందు పెద్ద ఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షిస్తుందని భావిస్తున్నాం'' అని బెనర్జీ వివరించారు.

ఓటమితో మొదలు



- బెంగళూరు చేతిలో హైదరాబాద్ చిత్తు
- ఇండియన్ సూపర్ లీగ్

బెంగళూరు: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో గత ఏడాది చెత్త ప్రదర్శన తర్వాత కొత్త మేనేజ్‌మెంట్ నేతృత్వంలో కొత్త సీజన్‌ను ప్రారంభించిన హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్ఎఫ్‌సీ) ఆటలో ఎలాంటి మార్పూ రాలేదు. భారీ పరాజయంతో హెచ్ఎఫ్‌సీ ఈ సీజన్‌ను ప్రారంభించింది. గురువారం జరిగిన పోరులో బెంగళూరు ఎఫ్‌సీ 3–0 గోల్స్ తేడాతో హెచ్ఎఫ్‌సీపై ఘన విజయం సాధించింది. మ్యాచ్ 5వ నిమిషంలోనే రాహుల్ భేకే గోల్‌తో హైదరాబాద్‌ను ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత దాదాపు ఎనభై నిమిషాల పాటు ప్రత్యర్థిని నిలువరించిన హైదరాబాద్ దురదృష్టవశాత్తూ పట్టు విడిచింది. స్టార్ ఆటగాడు సునీల్ ఛెత్రి తొమ్మిది నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి బెంగళూరును గెలిపించాడు. 85వ నిమిషంలో పెనాల్టీ ద్వారా ఛెత్రి గోల్ సాధించాడు. స్కోరు సమం కావడంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. ఇదే జోరులో 90+4 నిమిషంలో ఛెత్రి దూసుకొచ్చి మరో గోల్ కొట్టాడు. దాంతో హైదరాబాద్ ఓటమి ఖాయమైంది. న్యూఢిల్లీలో నేడు జరిగే పోరులో పంజాబ్ ఎఫ్‌సీతో ఒడిశా ఎఫ్‌సీ తలపడుతుంది.



చాంపియన్ పంజాబ్

జూనియర్ హాకీ జాతీయ చాంపియన్‌షిప్

జలంధర్: పురుషుల జూనియర్ హాకీ జాతీయ చాంపియన్‌షిప్‌లో పంజాబ్ జట్టు 14వ సారి విజేతగా నిలిచింది. గురువారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో పంజాబ్ జట్టు షూటౌట్‌లో 4–3తో ఉత్తరప్రదేశ్‌ను చిత్తుచేసి టైటిల్ గెలుచుకుంది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు మూడేసి గోల్స్‌తో సమంగా నిలవగా... విజేతను తేల్చేందుకు షూటౌట్ నిర్వహించాల్సి వచ్చింది. పంజాబ్ తరఫున సుఖ్విందర్ సింగ్ (5వ నిమిషంలో), జర్మన్ సింగ్ (33వ నిమిషంలో), జోబన్‌ప్రీత్ సింగ్ (39వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... ఉత్తర ప్రదేశ్ తరఫున అజీత్ యాదవ్ (31వ నిమిషంలో), సూరజ్ పాల్ (48వ నిమిషంలో), ఆకాశ్ పాల్ (54వ నిమిషంలో) తలా ఒక గోల్ సాధించారు. అనంతరం జరిగిన షూటౌట్‌లో పంజాబ్ తరఫున సుఖ్విందర్ సింగ్, జర్మన్ సింగ్, జప్నీత్ సింగ్, లవ్‌నూర్ సింగ్ గోల్స్ సాధించగా... ఉత్తర ప్రదేశ్ నుంచి ఆకాశ్ పాల్, నితీశ్ భరద్వాజ్, అజీత్ యాదవ్ మాత్రమే సఫలీకృతమయ్యారు. దీంతో పంజాబ్ చాంపియన్‌గా నిలిచింది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో హర్యానా 5–0తో కర్ణాటకపై విజయం సాధించింది.

50 వేల డాలర్లు ఇవ్వండి!

- భారత్‌కు ఆడేందుకు ఫీజు కావాలన్న నగాల్
- ప్లేయర్ తీరుపై 'ఐటా' అసంతృప్తి


న్యూఢిల్లీ: భారత టెన్నిస్ స్టార్, నంబర్‌వన్ సింగిల్స్ ప్లేయర్ సుమిత్ నగాల్ దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు ఫీజును డిమాండ్ చేసినట్లు తెలిసింది. అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు నగాల్ కూడా దీన్ని తోసిపుచ్చలేదు. 'స్టాండర్డ్ ప్రాక్టీస్' కోసమే అడిగినట్లు సోషల్ మీడియా వేదికగా అంగీకరించాడు. నగాల్ ఈ ఏడాది అదేపనిగా డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1 టైలకు దూరమయ్యాడు. ఫిబ్రవరిలో పాకిస్తాన్‌లో ఆడేందుకు నిరాకరించిన అతను ఇటీవల స్వీడన్‌లో జరిగిన పోటీలకు వెన్ను గాయం సాకుతో దూరంగా ఉన్నాడు. అయితే చైనాలో జరుగుతున్న హాంగ్జౌ ఓపెన్ ఏటీపీ టోర్నమెంట్ ఆడేందుకు వెళ్లడంపై 'ఐటా' బాహాటంగా విమర్శలు గుప్పించింది. దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు సాకులు చెబుతున్న ఆటగాడు ఏటీపీ టోర్నీ ఆడేందుకు సై అంటున్నాడని నగాల్‌ను ఉద్దేశించి 'ఐటా' వ్యాఖ్యానించింది. యూకీ బాంబ్రీ, శశికుమార్ ముకుంద్‌లు కూడా డేవిస్ కప్ ఆడలేదు. ఈ నేపథ్యంలో స్వీడన్‌తో స్పెషలిస్ట్ సింగిల్స్ ప్లేయర్ అందుబాటులో లేకపోవడంతో భారత్ 0–4తో చిత్తుగా ఓడింది. 'ఐటా' అధ్యక్షుడు అనిల్ ధూపర్ మాట్లాడుతూ 'ఎవరైనా దేశానికి ఆడేందుకు డబ్బులు డిమాండ్ చేస్తారా చెప్పండి. సుమిత్ నగాల్ తనకు వార్షిక ఫీజుగా 50 వేల డాలర్లు (సుమారు రూ.45 లక్షలు) చెల్లించాలని డిమాండ్ చేశాడు. చెల్లింపులు జరగలేదు కాబట్టే అతను ఆడటం లేదు. ఇదేం పద్ధతి. ఇది తప్పా ఒప్పా అనేది జాతి తెలుసుకోవాలి. ప్రభుత్వం నిర్ణయానికి రావాలి. ఎందుకంటే ప్రతిభ, ప్రదర్శన ఆధారంగా ఎంపిక చేసిన ఆటగాళ్లకు 'టాప్స్' నిధులు అందుతున్నాయి. డేవిస్ కప్ ఆడేందుకు నిర్ణీత మొత్తం చెల్లింపులు కూడా జరుగుతున్నాయి. అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) నుంచి డేవిస్ కప్‌లో ఆడుతున్నందుకు పార్టిసిపేషన్ ఫీజుగా సుమారు రూ.30 లక్షలు వస్తున్నాయి. ఇందులో నుంచి 70 శాతం ఆటగాళ్లకే చెల్లిస్తున్నాం. కేవలం 30 శాతం మాత్రమే 'ఐటా' వద్ద ఉంటున్నాయి' అని వివరించారు.

ఇదీ సుమిత్ వాదన...

'ఐటా' వ్యాఖ్యల్ని టెన్నిస్ ఆటగాడు సుమిత్ నగాల్ ఖండించలేదు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా తన వాదన వినిపించాడు. 'ఫీజు అడిగిన మాట వాస్తవమే. దీనిపై మీకు స్పష్టత ఇవ్వాలనుకుంటున్నా. ఆటగాళ్లు సన్నద్ధమయ్యేందుకు ఖర్చులెన్నో ఉంటాయి. నేను డిమాండ్ చేసిన పరిహారం కూడా ఆ కోవకే చెందుతుంది. స్టాండర్డ్ ప్రాక్టీస్ కోసమే నేను డిమాండ్ చేశాను తప్ప... డబ్బులు గుంజాలనే ఉద్దేశం కాదు. దేశానికి ఆడటమనేది ఎవరికైనా గర్వకారణమే. అదో గొప్ప గౌరవం. అయితే నేను వెన్నునొప్పి వల్లే స్వీడన్‌తో డేవిస్ కప్ ఆడలేకపోయాను. ఇప్పుడు కూడా ఇదే సమస్య వల్ల చైనా ఓపెన్ నుంచి కూడా వైదొలిగాను' అని వివరణ ఇచ్చాడు.


నగాల్

ట్రవిస్ హెడ్ సూపర్ సెంచరీ



తొలి వన్డేలో ఆస్ట్రేలియా విజయం

నాటింగ్‌హామ్: ఓపెనర్ ట్రవిస్ హెడ్ (129 బంతుల్లో 154 నాటౌట్; 20 ఫోర్లు, 5 సిక్సలు) మెరుపు సెంచరీతో చెలరేగడంతో ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. గురువారం జరిగిన తొలి వన్డేలో ఆసీస్ 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 49.4 ఓవర్లలో 315 పరుగులకు ఆలౌటైంది. బెన్ డకెట్ (91 బంతుల్లో 95; 11 ఫోర్లు) త్రుటిలో శతకం చేజార్చుకోగా... విల్ జాక్స్ (56 బంతుల్లో 62; 5 ఫోర్లు, 2 సిక్సలు) అర్ధ సెంచరీ సాధించాడు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (31 బంతుల్లో 39; 2 ఫోర్లు, 3 సిక్సలు), జాకబ్ బెతెల్ (34 బంతుల్లో 35; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో లబుషేన్, జంపా చెరో 3 వికెట్లు పడగొట్టగా...ట్రవిస్ హెడ్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం ఆస్ట్రేలియా 44 ఓవర్లలో 3 వికెట్లకు 317 పరుగులు సాధించింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (10), స్టీవ్ స్మిత్ (32), కామెరాన్ గ్రీన్ (32) వెనుదిరిగిన తర్వాత హెడ్, మార్నస్ లబుషేన్ (61 బంతుల్లో 77 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్సలు) జత కట్టారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 107 బంతుల్లోనే అభేద్యంగా 148 పరుగులు జోడించడం విశేషం. రెండో వన్డే శనివారం లీడ్స్‌లో జరుగుతుంది.

అజయ్ బాబుకు స్వర్ణం



కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

సువా (ఫిజీ): భారత యువ వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకంతో మెరిశాడు. పురుషుల 81 కేజీల విభాగంలో 19 ఏళ్ల అజయ్ బాబు కామన్వెల్త్ రికార్డు బద్దలు కొడుతూ పసిడి పతకం ఖాతాలో వేసుకున్నాడు. గురువారం జరిగిన పోటీల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన అజయ్ బాబు మొత్తం 326 కేజీల (147 కేజీలు + 179 కేజీలు) బరువెత్తి అగ్ర స్థానం దక్కించుకున్నాడు. ఈ క్రమంలో అజయ్ క్లీన్ అండ్ జెర్క్‌లో కామన్వెల్త్ చాంపియన్‌షిప్ రికార్డు తిరగరాశాడు. జూనియర్ కేటగిరీలో భారత్‌కే చెందిన సాయిరాజ్ పర్‌దేశీ రెండో స్థానంలో నిలిచి రజతం గెలుచుకున్నాడు. పురుషుల 89 కేజీల విభాగంలో లాల్‌రుత్‌ఫెలా 301 కేజీల (135 కేజీలు + 166 కేజీలు) ఎత్తి రజతం గెలుచుకోగా... హృదానంద దాస్ 299 కేజీల (129 కేజీలు + 170 కేజీలు) బరువెత్తి యూత్ కేటగిరీలో రజతం, జూనియర్ విభాగంలో కాంస్యం గెలుచుకున్నాడు.

న్యూజిలాండ్ 255/4



టామ్ లాథమ్

శ్రీలంకతో తొలి టెస్టు

గాలె: టాపార్డర్ రాణించడంతో శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ దీటుగా బదులిస్తోంది. గురువారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. టామ్ లాథమ్ (111 బంతుల్లో 70; 6 ఫోర్లు), కేన్ విలియమ్సన్ (104 బంతుల్లో 55; 4 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకాలతో రాణించగా.. రచిన్ రవీంద్ర (39), డరైల్ మిచెల్ (41 బ్యాటింగ్) ఫర్వాలేదనిపించారు. లంక బౌలర్లలో ధనంజయ డిసిల్వా 2 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 302/7తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక మరో మూడు పరుగులు మాత్రమే చేసి 305 పరుగుల వద్ద ఆలౌటైంది. న్యూజిలాండ్ బౌలర్లలో విలియమ్ రూర్కె 5 వికెట్లు పడగొట్టగా... గ్లెన్ ఫిలిప్స్, ఎజాజ్ పటేల్ చెరో రెండు వికెట్లు తీశారు. ప్రస్తుతం చేతిలో 6 వికెట్లు ఉన్న న్యూజిలాండ్ జట్టు లంక తొలి ఇన్నింగ్స్‌కు ఇంకా 50 పరుగులు వెనుకబడి ఉంది. వర్షం కారణంగా రెండో రోజు ఆటకు అంతరాయం వాటిల్లగా...డరైల్ మిచెల్‌తో పాటు కీపర్ టామ్ బ్లండెల్ (18 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

మెరిసిన భరత్, భుయ్

- రాణించిన సంజు సామ్సన్
- భారత్ 'డి' 306/5
- భారత్ 'బి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్

సాక్షి, అనంతపురం: ప్రధాన ఆటగాళ్లంతా సమష్టిగా సత్తాచాటడంతో భారత్ 'బి' జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో భారత్ 'డి' జట్టు మంచి స్కోరు దిశగా సాగుతోంది. అనంతపురం వేదికగా గురువారం ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 'డి' జట్టు 77 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. వికెట్ కీపర్ సంజు సామ్సన్ (83 బంతుల్లో 89 బ్యాటింగ్; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ అర్ధశతకం సాధించగా... ఆంధ్ర ఆటగాళ్లు శ్రీకర్ భరత్ (105 బంతుల్లో 52; 9 ఫోర్లు), రికీ భుయ్ (87 బంతుల్లో 56;9 ఫోర్లు) కూడా హాఫ్ సెంచరీలు చేశారు. ఓపెనర్ దేవదత్ పడిక్కల్ (95 బంతుల్లో 50; 8 ఫోర్లు) కూడా రాణించాడు. భారత టెస్టు జట్టులో సుస్థిర స్థానం దక్కించుకోవాలని చూస్తున్న మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ (0) మాత్రం నిరాశ పరిచాడు. భారత్ 'డి' కెప్టెన్‌గా బరిలోకి దిగిన శ్రేయస్ అయ్యర్ ఐదు బంతులు ఎదుర్కొని ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. ఈ టోర్నీలో ఇప్పటి వరకు ఆడిన ఐదు ఇన్నింగ్స్‌ల్లో శ్రేయస్ ఒక్కసారి మాత్రమే అర్ధ శతకం సాధించాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు మాత్రమే భారత జట్టును ప్రకటించగా... రెండో టెస్టు కోసం త్వరలో ప్రకటించనున్న జట్టులో చోటు దక్కించుకోవాలనుకున్న శ్రేయస్ అయ్యర్... స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన శ్రీకర్ భరత్, పడిక్కల్‌తో కలిసి తొలి వికెట్‌కు 105 పరుగులు జోడించి జట్టుకు శుభారంభం అందివ్వగా.. రికీ భుయ్, సంజు సామ్సన్ దాన్ని కొనసాగించారు. భారత్ 'బి' బౌలర్లలో రాహుల్ చహర్ 3, ముకేశ్ కుమార్, నవ్‌దీప్ సైనీ చెరో వికెట్ పడగొట్టారు. ప్రస్తుతం సామ్సన్‌తో పాటు సారాంశ్ జైన్ (56 బంతుల్లో 26 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.


భరత్


రికీ భుయ్

స్కోరు వివరాలు

భారత్ 'డి' తొలి ఇన్నింగ్స్: దేవదత్ పడిక్కల్ (సి) జగదీశన్ (బి) నవ్‌దీప్ సైనీ 50; శ్రీకర్ భరత్ (సి) జగదీశన్ (బి) ముకేశ్ కుమార్ 52; రికీ భుయ్ (సి) నవ్‌దీప్ సైనీ (బి) రాహుల్ చహర్ 56; నిశాంత్ సింధు (సి) ప్రభుదేశాయ్ (బి) రాహుల్ చాహర్ 19; శ్రేయస్ అయ్యర్ (సి) నితీశ్ కుమార్ రెడ్డి (బి) రాహుల్ చహర్ 0; సంజు సామ్సన్ (నాటౌట్) 89; సారాంశ్ జైన్ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు: 14, **మొత్తం (77 ఓవర్లలో 5 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1–105, 2–119, 3–172, 4–175, 5–216, **బౌలింగ్:** ముకేశ్ కుమార్ 16–4–37–1; మోహిత్ అవస్థి 15–1–64–0; నితీశ్ కుమార్ రెడ్డి 10–1–54–0; నవ్‌దీప్ సైనీ 13–2–51–1; రాహుల్ చహర్ 13–1–60–3; వాషింగ్టన్ సుందర్ 7–0–27–0; ముషీర్ ఖాన్ 3–0–9–0.

శాశ్వత్ రావత్ అజేయ సెంచరీ

- భారత్ 'ఎ' 224/7
- భారత్ 'సి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్

సాక్షి, అనంతపురం: మిడిలార్డర్ ఆటగాడు శాశ్వత్ రావత్ (235 బంతుల్లో 122 బ్యాటింగ్; 15 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగడంతో భారత్ 'సి'జట్టుతో జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో భారత్ 'ఎ'జట్టు 77 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. భారత్ 'సి'జట్టు బౌలర్ల ధాటికి 36 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ భారత్ 'ఎ'జట్టును శాశ్వత్ రావత్ ఒంటరి పోరాటంతో ఆదుకున్నాడు. ప్రథమ్ సింగ్ (6), కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (6), హైదరాబాద్ ఆటగాడు తిలక్ వర్మ (5), రియాన్ పరాగ్ (2), కుమార్ కుషాగ్ర (0) విఫలమయ్యారు. ఈ దశలో షమ్స్ ములానీ (76 బంతుల్లో 44; 5 ఫోర్లు, ఒక సిక్సర్)తో కలిసి శాశ్వత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. దులీప్ ట్రోఫీలో అటు బౌలింగ్‌లో ఇటు బ్యాటింగ్‌లో ఆకట్టుకుంటున్న ఆల్‌రౌండర్ షమ్స్ ములానీ మరోసారి తన విలువ చాటుకున్నాడు. భారత్ 'సి'జట్టు బౌలర్లలో అన్షుల్ కంబోజ్ 3, విజయ్ కుమార్ వైశాఖ్ రెండు వికెట్లు పడగొట్టారు. గత మ్యాచ్‌లో 8 వికెట్లతో సత్తాచాటిన అన్షుల్... ఆరంభంలోనే పదునైన పేస్‌తో ప్రత్యర్థి టాపార్డర్‌ను కుప్పకూల్చాడు. జట్టు స్కోరులో సింహభాగం పరుగులు చేసిన శాశ్వత్ అజేయంగా నిలవగా... అతడితో పాటు అవేశ్ ఖాన్ (16 బ్యాటింగ్; 2 ఫోర్లు, ఒక సిక్సర్) క్రీజులో ఉన్నాడు.



స్కోరు వివరాలు

భారత్ 'ఎ'తొలి ఇన్నింగ్స్: ప్రథమ్ సింగ్ (సి) సాయి సుదర్శన్ (బి) అన్షుల్ కంబోజ్ 6; మయాంక్ అగర్వాల్ (సి) ఇషాన్ కిషన్ (బి) అన్షుల్ కంబోజ్ 6; తిలక్ వర్మ (రనౌట్) 5; రియాన్ పరాగ్ (సి) సాయి సుదర్శన్ (బి) విజయ్ కుమార్ వైశాఖ్ 2; శాశ్వత్ రావత్ (నాటౌట్) 122; కుమార్ కుషాగ్ర (సి) ఇషాన్ కిషన్ (బి) విజయ్ కుమార్ వైశాక్ 0; షమ్స్ ములానీ (సి) రజత్ పాటిదార్ (బి) గౌరవ్ యాదవ్ 44; తనుశ్ కొటియాన్ (సి) బాబా ఇంద్రజిత్ (బి) అన్షుల్ కంబోజ్ 10; అవేశ్ ఖాన్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు: 13, **మొత్తం : (77 ఓవర్లలో 7 వికెట్లకు) 224. వికెట్ల పతనం** : 1–11; 2–14; 3–17; 4–35; 5–36; 6–123; 7–154, **బౌలింగ్:** అన్షుల్ కంబోజ్ 14–2–40–3; గౌరవ్ యాదవ్ 17–7–46–1; విజయ్‌కుమార్ వైశాఖ్ 15–1–33–2; పుల్కిత్ నారంగ్ 21–0–58–0; మానవ్ సుతార్ 10–1–38–0.



జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో 85 ఏళ్లు ఆపైబడిన వారు, దివ్యాంగులకు ఇళ్ల వద్దే ఓటేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం 'హోమ్ వోటింగ్' విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం పడవలో బయలుదేరిన ఎన్నికల సిబ్బంది.



ఉత్తరప్రదేశ్ రాష్ట్ర గోరఖ్‌పూర్‌లోని పర్యాటక ప్రాంతం రామ్‌గఢ్ తాల్ సరస్సులో తేలియాడే రెస్టారెంట్ ఇది. అత్యాధునిక సౌకర్యాలు కలిగిన ఈ రెస్టారెంట్‌ను సీఎం యోగి ఆదిత్యనాథ్ గురువారం ప్రారంభించారు.



రాజస్తాన్‌లోని దౌసాలో రెండేళ్ల బాలిక నీరూ బుధవారం సాయంత్రం 5 గంటలప్రాంతంలో 35 అడుగుల లోతైన బోరు గుంతలో పడింది. రాష్ట్ర విపత్తు స్పందన దళ సభ్యులు గురువారం ఉదయం దాదాపు 17 గంటలపాటు శ్రమించి చిన్నారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.

'కెనడా పర్మిట్' మరింత కఠినం

విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లు 35 శాతం తగ్గింపు

- 2025లో మరో 10 శాతం తగ్గించనున్నట్లు ప్రకటన
- విదేశీ కార్మికుల నిబంధనల్లోనూ పెను మార్పులు

టొరంటో: వలసల తగ్గించడానికి కెనడా ప్రభుత్వం కార్మికులు, విద్యార్థులపై నిబంధనలను మరింత కఠినతరం చేసింది. అంతర్జాతీయ విద్యార్థులకు స్టడీ పర్మిట్ల సంఖ్యను మరింత తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. వలసల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనమే ఉన్నా.. నిబంధనలు దుర్వినియోగం అవుతున్నప్పుడు కఠిన చర్యలు తప్పవని ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో బుధవారం ప్రకటించారు. అంతర్జాతీయ విద్యార్థుల పెంపుపై పరిమితి విధిస్తున్నట్లు ప్రభుత్వం జనవరిలోనే ప్రకటించింది. దేశ జనాభాలో తాత్కాలిక నివాసితుల సంఖ్య ఏప్రిల్‌లో 6.8 శాతంగా ఉండగా దానిని 5 శాతానికి తగ్గిస్తామని ఇదివరకే తెలిపింది.

ఇందులో భాగంగా వచ్చే రెండేళ్లపాటు విద్యార్థులకు అనుమతులను అదనంగా 10 శాతం తగ్గిస్తామని ట్రూడో ట్వీట్ చేశారు. కెనడా ప్రభుత్వం 2024లో విద్యార్థులకు 4,85,000 అనుమతులను జారీ చేసింది. 2023తో పోలిస్తే ఈ ఏడాదిలో 35 శాతం తగ్గుతుందని అంచనా. ఇక 2025 నాటికి ఈ సంఖ్యను పది శాతం తగ్గించి 4,37,000 అనుమతులను ఇవ్వాలని నిర్ణయించింది. 2026లోనూ ఇదే కొనసాగనుంది. అంతేకాదు అంతర్జాతీయ విద్యార్థులు, విదేశీ కార్మికుల జీవిత భాగస్వాముల వర్క్ పర్మిట్లపైనా అదనపు ఆంక్షలు అమలు చేయాలని కెనడా ప్రయత్నిస్తోంది. కెనడాకు రావడం హక్కు కాదని, ఇక్కడ ఉండాలనుకోవడం ప్రతి ఒక్కరికీ సాధ్యం కాదని విదేశాంగ మంత్రి మార్క్ మిల్లర్ మీడియాకు తెలిపారు. వలసల పెరుగుదల ఇళ్ల కొరతే కాదు.. స్థానికుల ఉపాధిపైనా ప్రతికూల ప్రభావం చూపుతోంది.

దీంతో ఇటీవల కాలంలో ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకత పెరిగింది. తాజాగా క్విబెక్ ప్రావిన్స్‌లో జరిగిన ఉప ఎన్నికలో ట్రూడో నేతృత్వంలోని లిబరల్ పార్టీ కీలక స్థానాన్ని కోల్పోయింది. మరో వారం రోజుల్లో ట్రూడో విశ్వాస పరీక్షను ఎదుర్కోనున్నారు. ఈ కీలక సమయంలో ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. 2025లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వలసలను తగ్గించేందుకు ట్రూడో ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. పెరుగుతున్న ఇళ్ల కొరత కారణంగా వలసల విషయంలో మరింత సమగ్రమైన ప్రణాళికను అమలు చేస్తామని ట్రూడో ప్రకటించారు.

అగ్నివీర్‌లకు ఉద్యోగం గ్యారెంటీ

24 రకాల పంటలకు కనీస మద్దతు ధర

- హరియాణా బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల
- ప్రతి మహిళకు నెలకు రూ.2,100, రూ.500కే గ్యాస్ సిలిండర్
- రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు
- 5 లక్షల ఇళ్లు, 10 పారిశ్రామిక నగరాలు నిర్మిస్తామని హామీ



మేనిఫెస్టో విడుదల చేస్తున్న జేపీ నడ్డా, సీఎం నయాబ్ సింగ్ సైనీ, మోహన్ లాల్ బడోలీ

సాక్షి, న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీకి వచ్చే 5న జరిగే ఎన్నికల కోసం 20 హామీలతో అధికార బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసింది. రాష్ట్రానికి చెందిన అగ్నివీర్‌లందరికీ కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని పేర్కొంది. లాడో లక్ష్మీ యోజన కింద మహిళలకు నెలకు రూ.2,100 అందజేస్తామని ప్రకటించింది. యువతకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, హర్ ఘర్ గృహిణి యోజన కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చింది. రోహ్‌తక్‌లో హరియాణా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మోహన్ లాల్ బడోలీ సమక్షంలో అధ్యక్షుడు జేపీ నడ్డా 'సంకల్ప పత్ర' పేరిట మేనిఫెస్టోను విడుదల చేశారు. 24 రకాల పంటలకు కనీస మద్దతు ధర, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 5 లక్షల ఇళ్లను నిర్మిస్తామని వరాలు కురిపించింది. యువత, పేదలు, రైతులు, మహిళలే లక్ష్యంగా 'సంకల్ప పత్ర'రూపొందించామని జేపీ నడ్డా తెలిపారు.

బీజేపీ సంకల్ప పత్రలోని హామీలు

- లాడో లక్ష్మీ పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,100.
- ఐఎంటీ ఖర్‌ఖోడా తరహాలో హరియాణాలో 10 పారిశ్రామిక నగరాల నిర్మాణం, ప్రతి నగరంలో 50 వేల మంది స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు.
- చిరాయు–ఆయుష్మాన్ యోజన కింద, ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, 70 ఏళ్లు పైబడిన కుటుంబంలోని ప్రతి పెద్దకూ రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు.
- కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో 24 పంటల కొనుగోలు.
- ఎలాంటి ఖర్చు లేకుండా 2 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు.
- జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ కింద 5 లక్షల మంది యువతకు శిక్షణ, ఉపకార వేతనం.
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 5 లక్షల ఇళ్ల నిర్మాణం.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత డయాలసిస్, అన్ని ఆసుపత్రుల్లో ఉచిత రోగ నిర్ధారణ.
- ప్రతి జిల్లాలో ఒలింపిక్ క్రీడల నర్సరీ.
- 'హర్‌ఘర్ గృహిణి'పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్.
- 'అవ్వల్ బాలికా'పథకం కింద కాలేజీకి వెళ్లే ప్రతి గ్రామీణ విద్యార్థికి స్కూటర్.
- హరియాణాకు చెందిన ప్రతి అగ్నివీర్‌కు ప్రభుత్వ ఉద్యోగం.
- భారత ప్రభుత్వ సహకారంతో కేఎంపీ ఆర్బిటల్ రైలు కారిడార్ నిర్మాణం, వందే భారత్ రైళ్లకు శ్రీకారం.
- కేంద్ర ప్రభుత్వ సహకారంతో ర్యాపిడ్ రైలు సేవలు, ఫరీదాబాద్, గురుగ్రామ్‌ల మధ్య రైలు, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మెట్రో సేవలు.
- ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకారవేతనాలు, వెనుబడిన కులాల (36 సంఘాలు) కోసం తడిన బడ్జెట్ తో ప్రత్యేక సంక్షేమ బోర్డులు.
- డీఏ, పింఛన్లను జోడించే సైంటిఫిక్ ఫార్ములా ఆధారంగా అన్ని సామాజిక వర్గాల నెలవారీ పెన్షన్లలో వృద్ధి.
- బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దేశంలోని ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కడైనా ఇంజనీరింగ్, వైద్య విద్య అభ్యసించినా వారికి స్కాలర్‌షిప్స్.
- అన్ని ఓబీసీ పారిశ్రామిక వేత్తలకు ముద్ర యోజన కింద రూ.25 లక్షల వరకు రుణానికి హరియాణా ప్రభుత్వం గ్యారంటీ.
- రాష్ట్రాన్ని గ్లోబల్ ఎడ్యుకేషన్ కేంద్రంగా మార్చడం ద్వారా ఆధునిక నైపుణ్యాలతో శిక్షణ.
- దక్షిణ హరియాణాలో అంతర్జాతీయ స్థాయిలో ఆరావళి జంగిల్ సఫారీ పార్క్ ఏర్పాటు.

లారెన్స్ బిష్ణోయ్‌ని పంపించాలా?

సల్మాన్ తండ్రికి బెదిరింపులు

ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్, ఆయన కుటుంబం భద్రత పట్ల ఆందోళన కలిగించే రెండు పరిణామాలు. ఓ ఘటనలో..సినీ రచయిత, సల్మాన్ తండ్రి సలీం ఖాన్‌ను ఓ వ్యక్తి, బుర్ఖా ధరించిన మహిళ బెదిరించగా, మరో ఘటనలో సల్మాన్ ఖాన్ వై–ప్లస్ కేటగిరీ భద్రతా వలయంలోకి బైక్‌పై ఓ యువకుడు అనూహ్యంగా ప్రవేశించాడు. సల్మాన్ నివాసమున్న గ్యాలక్సీ అపార్టుమెంట్ ప్రాంతంలో బుధవారం జరిగిన ఈ ఘటనలపై కేసులు నమోదు చేసి, ఇద్దరిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లిన సలీం ఖాన్ బాంద్రా బ్యాండ్‌స్టాండ్ వద్ద సేదతీరుతున్నారు. బైక్‌పై అటుగా వచ్చిన ఓ జంట సలీంను చూసి ఆగారు. 'మీ కోసం లారెన్స్ బిష్ణోయ్‌ని పంపమంటారా? అని సలీంనుద్దేశించి వ్యాఖ్యానించి, వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. ఆయన భద్రతా సిబ్బంది ఆ వాహనం నంబర్‌ను నోట్ చేసుకుని, పోలీసులకు సమాచారమిచ్చారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు బుర్ఖా ధరించిన మహిళతోపాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సలీంను కేవలం ఆటపట్టించడానికే అలా అన్నట్లుగా విచారణలో వారు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరిపైనా పోలీసులు కేసులు పెట్టారు.

కాన్వాయ్‌లోకి అపరిచితుడు

గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి పలుమార్లు బెదిరింపులు వచ్చిన సల్మాన్ ఖాన్‌కు ముంబై పోలీసులు వై–ప్లస్ కేటగిరీ భద్రత కల్పించారు. మంగళవారం అర్ధరాత్రి 12.15 గంటల సమయంలో మెహబూబా స్టూడియో వైపు నుంచి గ్యాలక్సీ అపార్టుమెంట్ వైపు వస్తున్న సల్మాన్ కాన్వాయ్‌లోకి ఉజయిర్ ఫైజ్ మొహియుద్దీన్ అనే కాలేజీ విద్యార్థి బైక్‌పై అతి సమీపంలోకి వచ్చాడు. సల్మాన్ నివాసానికి చేరుకున్నాక, పోలీసులు ఆ యువకుడిని పట్టుకున్నారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి వదిలేశారు.



'గోల్డ్ ఫింగర్' బుల్లి కారు

1964 నాటి జేమ్స్‌బాండ్ చిత్రం గోల్డ్ ఫింగర్‌లో కనిపించిన ఆస్టన్ మార్టిన్ డీబీ5 మోడల్ మినీ కారు ఇది. 24 క్యారెట్ బంగారం పూత కలిగిన మ్యూజియం క్వాలిటీతో బ్రిటన్‌కు చెందిన అగోరా మోడల్స్ కంపెనీ ఇలాంటి కేవలం ఏడు కార్లు మాత్రమే తయారు చేసింది. గోల్డ్ ఫింగర్ సినిమాకు 60 ఏళ్లు నిండిన సందర్భంగా దీనిని గురువారం లండన్‌లోని బర్లింగ్టన్ ఆర్కేడ్‌లో ప్రదర్శనకు ఉంచారు. ధర సుమారు రూ.27 లక్షలు.

ఎవరికీ మద్దతివ్వబోం

- అమెరికా అధ్యక్ష ఎన్నికలపై టీమ్‌స్టర్స్ ప్రకటన
- 2000 నుంచి డెమొక్రటిక్ అభ్యర్థులకు యూనియన్ బాసట
- కీలక పరిణామమన్న రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవ్వరికీ మద్దతివ్వబోమని అమెరికా లేబర్ యూనియన్ ఇంటర్నేషనల్ బ్రదర్‌హుడ్ ఆఫ్ టీమ్‌స్టర్స్ ప్రకటించింది. ట్రక్ డ్రైవర్లు, ఎయిర్‌లైన్స్ పైలట్ల నుంచి జూ కీపర్ల వరకు విస్తృత శ్రేణికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ యూనియన్‌లో 13 లక్షల మంది సభ్యులున్నారు. యూనియన్ సభ్యుల జాతీయ ఎలక్ట్రానిక్ పోల్ ఫలితాలను బుధవారం విడుదల చేసింది. 1984 ఎన్నికల్లో అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్‌కు, 1988లో ఉపాధ్యక్షుడు జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ సహా రిపబ్లికన్లకు మద్దతు ఇచ్చింది. 2000 సంవత్సరం నుంచి డెమొక్రాట్లకు మద్దతు ఇస్తూ వచ్చింది. 1996 తరువాత.. ఈ ఎన్నికల్లోనే ఏ అభ్యర్థికీ మద్దతు తెలపకుండా ఉండాలని టీమ్‌స్టర్స్ నిర్ణయించుకుంది. యునైటెడ్ ఆటో వర్కర్స్ యూనియన్‌తో సహా ప్రధాన యూనియన్లు హారిస్‌కే మద్దతు పలికాయి. 60 యూనియన్ల నుంచి కోటి 25 లక్షల మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏఎఫ్‌ఎల్–సీఐఓ జూలైలో హారిస్‌కు మద్దతు తెలిపింది. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే మిషిగాన్, నెవాడా, పెన్సిల్వేనియా వంటి కీలకమైన రాష్ట్రాల్లో టీమ్‌స్టర్స్ యూనియన్ సైతం బలంగా ఉంది. తమ ప్రధాన సమస్యలకు పరిష్కారాలను పొందలేకపోయామని, అందుకే మద్దతివ్వడం లేదని టీమ్‌స్టర్స్ అధ్యక్షుడు సీన్ ఒబ్రెయిన్ చెప్పారు. నిజంగా కార్మికుల మద్దతు కావాలనుకుంటే, పార్టీలు తమ విధానాలను పునఃసమీక్షించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

తారుమారైన ఎంపికలు..

నేషనల్ యూనియన్ నిర్ణయం అలా ఉన్నప్పటికీ స్థానికంగా టీమ్‌స్టర్స్ హారిస్‌కు మద్దతు ఇస్తున్నారని ప్రచార ప్రతినిధి లారెన్ హిట్ తెలిపారు. టీమ్‌స్టర్స్ ఎల్లప్పుడూ పోరాడే వ్యక్తులకే మద్దతు ఇస్తారని, అలా పోరాడే వ్యక్తిగా హారిస్‌కే వారి మద్దతు ఉంటుందని వెల్లడించారు. అయితే ఎవ్వరికీ మద్దతివ్వబోమంటూ టీమ్‌స్టర్స్ తీసుకున్న నిర్ణయం కీలకమైన విషయమని చెప్పారు. అయితే సెప్టెంబర్ 10వ తేదీన అధ్యక్ష డిబేట్ తరువాత.. ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో టీమ్‌స్టర్స్ సభ్యులు 59 శాతం మంది ట్రంప్‌కు మద్దతు తెలిపారని, హారిస్‌కు 31 శాతానికి పైగా మద్దతు లభించిందని యూనియన్ ప్రకటించింది. తమ సొంత పోలింగ్ డేటాలో సభ్యులు జూలై 21న అధ్యక్ష రేసు నుంచి బైడెన్ వైదొలగడానికి ముందు ఆయనకు 44.3 శాతం, ట్రంప్‌కు 36.3 శాతం మద్దతు ఇచ్చారని, అభ్యర్థి మారిన తరువాత తారుమారయ్యిందని తెలిపింది. అయితే సమ్మెకు దిగే కార్మికులను తొలగిస్తామంటూ జూలైలో జరిగిన రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో ట్రంప్ చేసిన వ్యాఖ్యలను యూనియన్ తప్పుబట్టింది.

ఫుడ్ డెలివరీ ఆలస్యమైందని..

కస్టమర్ కొట్టిన దెబ్బలతో యువకుడి ఆత్మహత్య

చెన్నై: ఫుడ్ డెలివరీ ఆలస్యం కావడం..ఓ విద్యార్థి నిండు ప్రాణాలను బలి తీసుకుంది. చెన్నైకి చెందిన పవిత్రన్(19) బీకాం చదువుకుంటూ తీరిక వేళల్లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన కొరట్టూర్ ప్రాంతం నుంచి వచ్చిన ఆర్డర్‌ను అందజేయడానికి పవిత్రన్ బయలుదేరాడు. లొకేషన్ గుర్తించి, చేరుకోవడంలో ఆలస్యమైంది. ఈ విషయంలో మహిళా కస్టమర్‌తో పవిత్రన్‌కు వివాదం తలెత్తింది. ఆమె సంబంధిత కంపెనీకి ఫిర్యాదు చేశారు. రెండు రోజుల తర్వాత పవిత్రన్ రాయి విసరడంతోనే తన ఇంటికి కిటికీ అద్దం పగిలిందని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం పవిత్రన్ తన ఇంట్లో ఉరి వేసుకుని, తనువు చాలించాడు. ఫుడ్ డెలివరీ ఆలస్యమైనందుకు మహిళా కస్టమర్ తనను కొట్టడంతో తీవ్ర మనస్తాపంతో ఈ విపరీత నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొన్నాడు. పోలీసులు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెంగాల్‌లో పడవ బోల్తా

- ఇద్దరు ఎంపీలు, ఎమ్మెల్యేలకు తప్పిన ప్రమాదం
- వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తుండగా ఘటన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లాలో ఘోర ప్రమాదం తప్పింది. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు వెళ్లిన ఇద్దరు ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా మేజిస్ట్రేట్ సహా 13 మంది ప్రయాణిస్తున్న స్పీడ్ బోటు బోల్తా పడింది. నదిలో పడిపోయిన ప్రజాప్రతినిధులు, అధికారులను స్థానికులు రక్షించారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా బెంగాల్‌లోని పలు జిల్లాలు వరద బారిన పడ్డాయి. బీర్‌భూమ్ జిల్లాలో వంతెనలు, పంటలు నీట మునిగాయి. వీటిని పరిశీలించేందుకు టీఎంసీ ఎమ్మెల్యే అభిజిత్ సింగ్, ఎంపీలు అసిత్ మాల్, షమీరుల్ ఇస్లాం, జిల్లా మేజిస్ట్రేట్ బిధాన్ రాయ్, ఇతర అధికారులతో కలిసి వెళ్లారు. లబ్‌పూర్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం స్పీడ్ బోట్ తీసుకొని బయల్దేరగా బలరాంపూర్ గ్రామ సమీపంలో స్పీడ్ బోటు ఒక్కసారిగా బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే విపత్తు నిర్వహణ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ఘటన జరిగిన సమయంలో వారు ఎలాంటి భద్రతా జాకెట్లను ధరించకపోవడం గమనార్హం.

వర్షాలతో ముగ్గురు మృతి

భారీ వర్షాలు, స్వల్ప వ్యవధిలోనే బ్యారేజీల నుంచి నీటి విడుదల పెరగడంతో పశ్చిమబెంగాల్‌లోని పలు జిల్లాల్లో వరద పరిస్థితి నెలకొంది. బీర్భూమ్, బంకురా, హౌరా, హుగ్లీ, ఉత్తర, దక్షిణ 24 పరగణాలు, పూర్బా, పశ్చిమ్ మేదినీపూర్, పశ్చిమ్ బర్ధమాన్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు నీట మునిగాయి. గత 24 గంటల్లో దుర్గాపూర్ బ్యారేజీ నుంచి 1,33,750 క్యూసెక్కులు, కంగ్సాబాటి డ్యామ్ నుంచి 40 వేల క్యూసెక్కులు, మైథోన్ డ్యామ్ నుంచి 2 లక్షల క్యూసెక్కులు, పంచెట్ డ్యామ్ నుంచి 50 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వరదల కారణంగా ముగ్గురు మరణించారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సలహాదారు ఆలాపన్ బందోపాధ్యాయ తెలిపారు.

'దేశద్రోహ' టీషర్టు ధరించినందుకు

14 నెలల జైలుశిక్ష

హాంకాంగ్: ప్రభుత్వ తీరు పట్ల నిరసన నినాదాలు, తమ డిమాండ్లు రాసి ఉన్న టీషర్టు, మాస్క్ ధరించడమే నేరమైంది. 14 నెలల జైలు శిక్ష పడింది. చైనా పెత్తనం కింద నలిగిపోతున్న హాంకాంగ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇలాంటి నినాదాలను వ్యాప్తి చేయడం దేశద్రోహమేనని ప్రభుత్వం చెబుతోంది. 27 ఏళ్ల యువకుడు చుకాయ్–పాంగ్ హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య ఉద్యమానికి ఐదేళ్లు నిండిన సందర్భంగా ఈ ఏడాది జూన్ 12వ తేదీన టీషర్టు, మాస్క్ ధరించాడు. వీటిపై 'హాంకాంగ్‌కు విముక్తి కల్పించాలి. ఇది మా పోరాటం. ఐదు డిమాండ్లు నెరవేర్చాలి'అని నినాదాలు రాసి ఉన్నాయి. చుకాయ్–పాంగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దేశద్రోహ నేరం కింద కేసు పెట్టారు. విచారణ చేపట్టిన వెస్ట్ కౌలూన్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం తీర్పు ప్రకటించింది. చుకాయ్–పాంగ్‌కు 14 నెలల జైలు శిక్ష విధిస్తున్నట్లు వెల్లడించింది. హాంకాంగ్‌లో ఇటీవల ఆర్టికల్ 23 కఠినమైన జాతీయ భద్రతా చట్టాన్ని తీసుకొచ్చారు.

బిహార్‌లో ఎస్సీ/ఎస్టీల ఇళ్లకు నిప్పు

- 34 నివాసాలను దహనం చేసిన దుండగులు
- భూవివాదమే కారణమన్న పోలీసులు
- బాధ్యులను వదిలేది లేదు: సీఎం నితీశ్

నవాదా: దాదాపు 30 ఏళ్లనాటి భూ వివాదం ముదిరి ఎస్సీ/ఎస్టీ వర్గాలకు చెందిన బడుగులకు నిలువ నీడ లేకుండా చేసింది. ముందు హెచ్చరికగా గాల్లోకి కాల్పులు జరిపిన దుండగులు అనంతరం ఇళ్లకు నిప్పు పెట్టారు. ఈ దారుణం బిహార్‌లోని ముఫస్సిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాంఝి టోలా గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. రాత్రి 7 గంటల సమయంలో ఘటనకు సంబంధించిన సమాచారం అందిందని నవాదా ఎస్పీ అభినవ్ ధిమన్ తెలిపారు. వెంటనే ఫైరింజన్లు అక్కడికి చేరుకుని, మంటలను అదుపు చేశాయన్నారు. మొత్తం 28 మందిపై కేసులు నమోదు చేసి, కీలక నిందితుడు సహా ఇళ్ల దహనానికి పాల్పడినట్లు గుర్తించిన 15 మందిని అరెస్ట్ చేసినట్లు నవాదా జిల్లా మేజిస్ట్రేట్ అశుతోష్ కుమార్ చెప్పారు. మూడు దేశవాళీ పిస్టళ్లు, మందుగుండు సామగ్రి, ఆరు బైక్‌లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. మిగతా వారి కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేశారు. 'దుండగులు తగులబెట్టిన మొత్తం 34 ఇళ్లలో 21 వరకు పూర్తిగా కాలి బూడిదవ్వగా మరో 13 పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆహుతైన ఇళ్లలో అత్యధికం ఎస్సీ/ఎస్టీలకు చెందినవే. నిందితులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ, ఆయుధాల కేసులు నమోదు చేశాం. ఇళ్లకు నిప్పుపెట్టేందుకు ముందుగా దుండగులు గాల్లోకి కాల్పులు జరిపారు. బాధితుల కోసం తాత్కాలిక టెంట్లు ఏర్పాటు చేసి ఆహార పొట్లాలు, తాగు నీరు వంటివి అందజేశాం. ఘటనలో పశువులు కూడా సజీవ దహనమైనట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు'అని డీఎం అశుతోష్ కుమార్ స్పష్టం చేశారు. గృహ దహనం ఘటనను సీఎం నితీశ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. బాధ్యులను వదిలేది లేదన్నారు. విచారణ వేగవంతం చేయాలని అదనపు డీజీపీని ఆదేశించారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

సాక్షి ప్లస్
శుక్రవారం। 20-9-2024

సిక్కు సామ్రాజ్య నిర్మాత రంజిత్ సింగ్

ప్రాంతీయ రాజ్యాలు

సిక్కులు

గురునానక్ (1469-1539)

సిక్కు మతస్థాపకుడు గురునానక్. ఇతడు 1469లో పంజాబ్‌లోని తల్వండి అనే గ్రామంలో జన్మించాడు. మొదటి సిక్కు గురువైన గురునానక్ సర్వమత సమానత్వాన్ని, సహన భావాన్ని బోధించాడు. ఇతడి శిష్యులను 'నానక్ పంతి' అంటారు. కొంత కాలం తర్వాత వీరినే సిక్కులుగా పిలిచారు. దేవుడు ఒక్కడేనని, కర్మ సిద్ధాంతాన్ని నమ్మాలని నానక్ బోధించాడు.

గురు అంగద్ (1539-1552)

గురు అంగద్ 1539లో నానక్ వారసుడిగా గురువయ్యాడు. ఇతడు మొగల్ చక్రవర్తి హుమాయూన్‌కు సమకాలీకుడు. అంగద్ 'గురుముఖి' లిపిని కనిపెట్టాడు. భాయిబాల సహాయంతో నానక్ జీవిత చరిత్రను రచించాడు.

గురు అమర్‌దాస్ (1552-1574)

ఇతడు 78 ఏళ్ల వయస్సులో సిక్కు గురువు అయ్యాడు. సతీ సహగమనాన్ని నిరసించాడు.

గురు రామ్‌దాస్ (1574-81)

ఇతడు గురు అమర్‌దాస్ అల్లుడు. గురు రామ్‌దాస్ మొగల్ చక్రవర్తి అక్బర్‌కు సమకాలీకుడు. అక్బర్ పంజాబ్‌లోని అమృత్‌సర్ ప్రాంతాన్ని ఇతడికి బహుకరించగా అక్కడే 1577లో స్వర్ణ దేవాలయ నిర్మాణానికి పునాది వేశాడు. ఒక సరస్సును తవ్వించాడు. ఇతడి కాలం నుంచే గురువు కావడం వారసత్వ హక్కుగా మారింది.

గురు అర్జున్ దేవ్ (1581-1606)

ఇతడు సిక్కుల అయిదో గురువు. ప్రాచీన హిందూ, ముస్లింల రచనల్లోని ముఖ్య సిద్ధాంతాలు సేకరించి 'ఆదిగ్రంథ్'ను సంకలనం చేశాడు. ఇది సిక్కుల పవిత్ర గ్రంథం. స్వర్ణ దేవాలయ నిర్మాణాన్ని పూర్తి చేశాడు. 'వైశాఖి' అనే పండుగను ప్రవేశపెట్టి ప్రజల సంపాదనలో పదో వంతు వసూలు చేసేవాడు. జహంగీర్ కుమారుడైన ఖుస్రూ తండ్రికి ఎదురు తిరిగాడు. అర్జున్ దేవ్ ఖుస్రూకు ఆశ్రయం కల్పించాడు. ఫలితంగా జహంగీర్ చక్రవర్తి అర్జున్ దేవ్‌పై దేశద్రోహ నేరం మోపి అతణ్ని ఉరితీయించాడు. ఈ ఘటనతో అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న సిక్కులు సైనికులుగా మారారు.

గురు హర గోవింద్ (1606-44)

ఇతడు గురు అర్జున్ దేవ్ వారసుడు. రక్షక దళాన్ని చిన్న సైన్యంగా మార్చాడు. సైనిక శిక్షణ ఇప్పించాడు. 'అఖల్ తక్త్'ను స్థాపించాడు. 'లోహఘర్' (అమృత్‌సర్) కోటను నిర్మించాడు. ఇతడికి 'సచ్చా బాద్షా' అనే బిరుదు ఉంది. హర గోవింద్ సింగ్ 'సంగ్రామ్' యుద్ధంలో షాజహాన్ సైన్యాన్ని ఓడించాడు. ఇతడి తర్వాత గురువైన గురు హర రాయ్ (1644-61)శాంత స్వభావుడు. హర రాయ్ తర్వాత గురు హర కృష్ణ (1661-64) గురువయ్యాడు.

గురు తేజ్ బహద్దూర్ (1664-1675)

తేజ్ బహదూర్ కశ్మీర్‌లోని ఆనందపూర్‌లో స్థిరపడ్డాడు. ఇతడు ఔరంగజేబ్ అసహన మత విధానాన్ని వ్యతిరేకించాడు. దీంతో ఔరంగజేబ్ తేజ్ బహద్దూర్‌ను చిత్రవధ చేసి చంపించాడు.

గురు గోవింద్ సింగ్ (1675-1708)

ఇతడు పదో గురువు, చివరి వాడు. ఇతడు సిక్కులను రాజకీయ, సైనిక సమాజంగా రూపొందించాడు. దీన్నే ఖల్సా సమాజం అంటారు. సిక్కులు ఖడ్గంతో చిలికిన నీటిని తాగి 'సింగులు' (సింహాలు)గా బిరుదు వహించారు. ఖల్సా ప్రకారం సిక్కులు కేశ (పొడవు వెంట్రుకలు), కంఘూ (దువ్వెన), కృపాణ్ (ఖడ్గం), కచ్చా (పొట్టి లాగు), కర్ద (చిన్న చాకు)ను ధరించేవారు. ఇతడి కుమారులందరూ ఆనందపూర్ యుద్ధంలో మరణించారు. గోవింద్ సింగ్‌ను నాందేడ్‌లో ఒక అఫ్గాన్ సైనికుడు కత్తితో పొడిచి చంపాడు. అయిదుగురు సిక్కులు ఎక్కడ కూడితే అక్కడే నేనుంటాను అని గురు గోవింద్ సింగ్ తన శిష్యులకు చివరి సందేశం ఇచ్చాడు.

1708 తర్వాత సిక్కుల చరిత్ర

బందా బహదూర్ (1708-16)

ఇతడు సిక్కుల నాయకుడయ్యాడు. సిక్కుల స్వాతంత్ర్యం కోసం మొగలులతో పోరాటం చేశాడు. సయ్యద్ సోదరులు బందా బహదూర్‌ను బంధించి హత్య చేశారు. సిక్కులు స్థాపించిన రాజ్యాలను ఖల్సా రాజ్యాలంటారు. 1773 నాటికి 12 ఖల్సా రాజ్యాలుండేవి. సుకేర్ చకియా వీటిలో ఒక రాజ్యం. చరత్ సింగ్ దీని స్థాపకుడు. అతని కుమారుడు రంజిత్ సింగ్. ఈయన 1780 నాటికి సుకేర్ చకియా పాలకుడయ్యాడు.

రంజిత్ సింగ్ (1792-1839)

ఇతడికి పంజాబ్ సింహం అనే బిరుదు ఉంది. 1799లో లాహోర్‌ను ఆక్రమించి సట్లేజ్ నదికి పశ్చిమంగా ఉన్న ఖల్సా రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. 1801లో మహారాజా అనే బిరుదు ధరించాడు. ఇతడు సిక్కు సామ్రాజ్య నిర్మాత. బ్రిటిష్ వారితో సఖ్యతతో మెలిగాడు. 1809లో గవర్నర్ జనరల్ మింటోతో సంధి చేసుకున్నాడు. రైతుల నుంచి 40 శాతం శిస్తు వసూలు చేసేవాడు. రంజిత్ సింగ్ వారసులు అసమర్థులైనందువల్ల మొదటి ఆంగ్లో సిక్కు యుద్ధం (1845-46), రెండో ఆంగ్లో సిక్కు యుద్ధం (1848-49)లో బ్రిటిషర్లు సిక్కులను జయించారు. దీంతో పంజాబ్ బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనమైంది.

మరాఠాలు

శివాజీ

శివాజీ 1627లో జన్మించాడు. ఇతడి తల్లి జిజియా బాయి. శివాజీ దాదాజీ కొండదేవ్ సంరక్షణలో పెరిగాడు. ఇతడి గురువు రామదాస్. రాయ్‌గఢ్ వద్ద దుర్గాన్ని నిర్మించి తన కార్యకలాపాలకు కేంద్రం చేసుకున్నాడు. శివాజీని చంపి లేదా బంధించి తీసుకురమ్మని 1659లో బీజాపూర్ సుల్తాన్ తన సేనాని అఫ్జల్ ఖాన్‌ను ఆదేశించాడు. శివాజీ భాఘనఖ్ (పులిగోళ్లు) ఉపయోగించి అఫ్జల్‌ఖాన్‌ను హతమార్చాడు. 1665లో ఔరంగజేబ్ మీర్జా జయసింగ్‌ను శివాజీపై యుద్ధానికి పంపాడు. జయసింగ్ పురంధర్‌ను ముట్టడించాడు. శివాజీ 23 దుర్గాలను మొగలులకు ఇచ్చి 12 దుర్గాలను తన వద్ద ఉంచుకునేలా సంధి చేసుకున్నాడు. 1666లో శివాజీ తన కుమారుడైన శంభాజీతో కలిసి ఆగ్రాలో ఔరంగజేబ్‌ను సందర్శించాడు. కానీ ఔరంగజేబ్ శివాజీతో అమర్యాదగా ప్రవర్తించి అతణ్ని గృహ నిర్బంధం చేశాడు. శివాజీ మిఠాయిల గంపలో దాక్కొని తప్పించుకున్నాడు. తర్వాత దక్కన్ చేరి మొగలులకు ఇచ్చిన కోటలన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. రాయ్‌గఢ్‌ను రాజధానిగా చేసుకున్న శివాజీ 1674లో పట్టాభిషిక్తుడయ్యాడు. శివాజీ 'ఛత్రపతి' బిరుదు వహించాడు. ఇతడి రాజ్యానికి స్వరాజ్యమని పేరు. శివాజీ రాజ్యాన్ని రెండు భాగాలుగా విభజించాడు. అతడి ప్రత్యక్ష పాలనలో ఉన్న ప్రాంతానికి స్వరాజ్యమని, దాని చుట్టూ ఉన్న ప్రాంతానికి మొగలాయ్ అని పేరు. ఈ ప్రాంతాల నుంచి చౌత్, సర్దేశ్‌ముఖి అనే పన్నులు వసూలు చేశాడు. కేంద్ర ప్రభుత్వంలో అష్టప్రధాన్ అనే మంత్రి పరిషత్ ఉండేది. రాజు వారికి నేరుగా జీతాలను చెల్లించేవాడు. పంటలో నాలుగో వంతు భూమి శిస్తుగా వసూలు చేసేవారు. సైన్యాన్ని వ్యవస్థీకరించారు. పది మంది ఉన్న దళానికి అధిపతి 'నాయక' నుంచి వేయి మంది ఉన్న దళానికి అధిపతి 'హజరీ' వరకు అనేక భాగాలుగా సైన్యాన్ని విభజించారు. శివాజీ, అతడి వారసులు గెరిల్లా యుద్ధంలో ప్రావీణ్యం పొందారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

పీష్వాలు

బాలాజీ విశ్వనాథ్ (1713-20)

సాహు కాలంలో బాలాజీ విశ్వనాథ్ ప్రధాన మంత్రి లేదా పీష్వా. సాహుకు వారసులు లేకపోవడం వల్ల అతడి మరణానంతరం మరాఠా సామ్రాజ్యం పీష్వాల పరమైంది. పీష్వా వంశ స్థాపకుడు బాలాజీ విశ్వనాథ్. ఇతణ్ని మహారాష్ట్ర జాతీయ స్థాపకుడిగా అభివర్ణిస్తారు. బాలాజీ విశ్వనాథ్ పీష్వా పదవిని వంశ పారంపర్యం చేశాడు. పుణేను రాజధానిగా చేసుకున్నాడు.

మొదటి బాజీరావు (1720-1740)

ఇతడు పీష్వాలందరిలోకెల్లా సమర్థుడు. హిందూ పద్ పద్ షాహి లేదా అఖిల భారత సామ్రాజ్యం నిర్మించాలనేది ఇతడి ఆశయం. లక్ష్య సాధనలో కొంత మేర సఫలీకృతుడయ్యాడని చెప్పవచ్చు. ఇతడి కాలంలో పన్నులు వసూలు చేసే సర్దార్లు బలవంతులై స్వతంత్రం ప్రకటించుకున్నారు. నాగ్‌పూర్‌లో రఘూజీ భోంస్లే, బరోడాలో పిల్లాజీ గైక్వాడ్, ఇండోర్‌లో మల్హర్‌రావ్ హోల్కార్, గ్వాలియర్‌లో రోబోజీ సింధియా స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు. వీరందర్నీ మహారాష్ట్ర కూటమిగా చేర్చిన ఘనత మొదటి బాజీరావుదే.

బాలాజీ బాజీరావు (1740-1761)

ఇతడు మొదటి బాజీరావు కుమారుడు. బాలాజీ బాజీరావు కాలంలో మరాఠాల అధికారం, వైభవం ఉచ్ఛ స్థితికి చేరింది. 1757లో మరాఠాలు అహ్మద్ షా అబ్దాలీ ప్రతినిధి నుంచి ఢిల్లీని స్వాధీనం చేసుకున్నారు. రఘుబా పీష్వా తమ్ముడు పంజాబ్‌ను జయించి అటక్ కోటపై మరాఠా జెండా ఎగురవేశాడు. ఇదే సమయంలో అఫ్గానిస్తాన్ రాజైన అహమ్మద్ షా అబ్దాలీ 1761లో పానిపట్ వద్ద మరాఠాలను ఓడించాడు. దీన్నే 'మూడో పానిపట్' యుద్ధం అంటారు. ఈ యుద్ధంలో అబ్దాలీకి రెండో షా ఆలం, ఔద్ నవాబు సహకరించారు. గెరిల్లా పోరాటం చేయకపోవడం వల్లే మరాఠాలు ఈ యుద్ధంలో ఓడారు.

హైదరాబాద్ రాజ్యం

నిజాం-ఉల్-ముల్క్ అసఫ్‌జా 1724లో హైదరాబాద్ రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు 1722-24 మధ్య మొగల్ సామ్రాజ్యానికి వజీర్‌గా పనిచేశాడు. హిందువుల పట్ల సహన భావం ప్రదర్శించాడు. పూరన్ చంద్ అనే హిందువు ఆయన వద్ద దివాన్‌గా పనిచేయడమే దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. నిజాం-ఉల్-ముల్క్ 1748లో మరణించాడు. తర్వాత వరుసగా.. అతడి రెండో కుమారుడైన నాజర్ జంగ్, నిజాం మనవడైన ముజఫర్ జంగ్, నిజాం మూడో కుమారుడైన సలాబత్ జంగ్ అధికారంలోకి వచ్చారు. వీరి తర్వాత రెండో నిజాంగా లేదా రెండో అసఫ్‌జాగా నిజాం అలీ రాజ్యపాలన చేపట్టాడు. ఇతడు 1763లో ఉత్తర సర్కార్ జిల్లాలను, 1788లో గుంటూరును, 1802లో దత్త జిల్లాలను బ్రిటీషర్లకు ఇచ్చేశాడు. నిజాం అలీ తర్వాత సికిందర్ ఝా మూడో నిజాంగా రాజ్యానికొచ్చాడు. ఇతడు లష్కర్ (సికింద్రాబాద్)ను నిర్మించాడు. నసీరుద్దౌలా నాలుగో నిజాం, అఫ్జల్ ఉద్దౌలా అయిదో నిజాం. ఇతడి కాలంలో హైదరాబాద్ రాజ్యంలో సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఇతడి ప్రధాని సాలార్‌జంగ్-1 గొప్పవాడు. సాలార్‌జంగ్ అసలు పేరు తురాబ్ అలీఖాన్. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ అఫ్జల్‌గంజ్‌లో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, కాచిగూడలో రైల్వేస్టేషన్, నిజాం కళాశాల (1887), మహబూబ్ ఆలియా కళాశాలను నిర్మించాడు. చివరి నిజాంగా మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911లో పాలనా పగ్గాలు చేపట్టాడు.

ప్రధాన దేవాలయాలు	
కృష్ణస్వామి ఆలయం - హంపి	మహావీర్‌స్వామి ఆలయం - మౌంట్ అబూ
తీర దేవాలయం - మహాబలిపురం	మార్తాండ దేవాలయం - కశ్మీర్
కైలాసనాథాలయం - కంచి	విశ్వనాథ ఆలయం - కాశీ
జగన్నాథ ఆలయం - పూరి	త్రిమూర్తి విగ్రహం - ఎలిఫెంటా గుహలు
నటరాజ ఆలయం - చిదంబరం	కాందరీయ మహాదేవ ఆలయం-ఖజురహో
సుబ్రహ్మణ్యస్వామి ఆలయం - తిరుత్తణి	చెన్నకేశవ ఆలయం - బేలూరు
సూర్య దేవాలయం - కోణార్క్	వేయి స్తంభాల గుడి - హన్మకొండ
	రాజరాణి ఆలయం - భువనేశ్వర్

బెంగాల్

ముర్షిద్ కులీఖాన్ 1700 నుంచి బెంగాల్ దివాన్‌గా పనిచేసి స్వతంత్రంగా వ్యవహరించాడు. ఇతడు 1717లో మరణించాడు. అలీ వర్దీఖాన్ 1741లో స్వతంత్రం ప్రకటించుకున్నాడు. ఇతడి రాజధాని ముర్షిదాబాద్. 1756లో సిరాజ్ ఉద్దౌలా సింహాసనాన్ని అధిష్ఠించాడు. 1757లో ఆంగ్లేయులు రాబర్ట్ క్లైవ్ నేతృత్వంలో బెంగాల్ నవాబైన సిరాజ్ ఉద్దౌలాను ప్లాసీ యుద్ధంలో ఓడించారు. ఆంగ్లేయులు జయించిన మొదటి రాష్ట్రం బెంగాల్.

ఔద్

సాదత్ ఖాన్ 1724లో ఔద్‌ను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించాడు. 1764లో ఔద్ నవాబైన షుజాద్దౌలా మొగల్ చక్రవర్తి రెండో షా ఆలం, బెంగాల్ నవాబ్ మీర్ ఖాసీంతో ఒక కూటమిని ఏర్పాటు చేశాడు. వీరు ఆంగ్లేయుల నుంచి బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. 1764లో జరిగిన ఈ యుద్ధానికి బక్సార్ యుద్ధమని పేరు. కూటమిపై విజయం సాధించిన ఆంగ్లేయులు, బెంగాల్, బిహార్, ఒరిస్సాలపై దివానీ హక్కు పొందారు. ఈ యుద్ధం వల్ల ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో స్వతంత్ర రాజకీయాధికారం పొందింది. షుజాద్దౌలా తర్వాత అసఫ్ ఉద్దౌలా ఔద్ రాజ్యానికి నవాబు అయ్యాడు.

మైసూర్

1766లో మైసూర్ రాజు మరణించగానే హైదరాలీ సింహాసనం ఆక్రమించి సుల్తాన్ అయ్యాడు. 1776లో మొదటి ఆంగ్లేయ-మరాఠా యుద్ధంలో హైదరాలీ, నిజాం నవాబు కలిసి ఆంగ్లేయులపై పోరాడారు. ఈ యుద్ధంలో ఏ పక్షానికి విజయం లభించలేదు. 20 ఏళ్లపాటు శాంతి వర్ధిల్లింది. వారన్ హేస్టింగ్స్ నిజాం నవాబుకు గుంటూరు జిల్లాను ఇచ్చి అతణ్ని బ్రిటిష్ వ్యతిరేక కూటమి నుంచి వేరు చేశాడు. 1781-82లో జరిగిన రెండో మైసూర్ యుద్ధంలో ఐర్‌కూట్ నాయకత్వంలోని బ్రిటిష్ సేనలు పోర్టోనోవో వద్ద హైదరాలీని ఓడించాయి. 1782లో హైదరాలీ మరణించాడు. అతడి కుమారుడైన టిప్పు సుల్తాన్ అధికారాన్ని చేపట్టాక 1784లో శాంతి ఒప్పందం జరిగింది. గవర్నర్ జనరల్ లార్డ్ కారన్ వాలీస్ మహారాష్ట్రులు, నిజాం నవాబు, తిరువాన్కూరు, కూర్గు రాజులను తన వైపు తిప్పుకొని కూటమిని ఏర్పాటు చేశాడు. యుద్ధంలో టిప్పు సుల్తాన్‌ను ఓడించి అతడి రాజ్యంలోని సగ భాగాన్ని స్వదేశీ రాజులకు ఇచ్చేశాడు. దీన్నే మూడో ఆంగ్లో-మైసూర్ యుద్ధం (1790-92) అంటారు. 1799లో జరిగిన నాలుగో ఆంగ్లో-మైసూర్ యుద్ధంలో బ్రిటిష్ సైన్యం టిప్పును ఓడించింది. శ్రీ రంగ పట్నాన్ని రక్షించుకునే ప్రయత్నంలో టిప్పు సుల్తాన్ 1799 మే 4న వీర మరణం పొందాడు.

అర్థ వ్యాకోచానికి ఉదాహరణలు?

అర్థ పరిణామం

భాషలోని వర్ణాలు,ధ్వనులు, వాక్య నిర్మాణం, వ్యాకరణ నిర్మాణం మారినట్లుగానే అర్థాలు కూడా మారడం సహజం. నన్నయ భారతంలో 'కంపు' అనే పదాన్ని వాసన అనే అర్థంలో వాడారు. నేటి భాషలో అది చెడు వాసన అనే అర్థంగా మారింది. ప్రతి పదానికీ చరిత్ర ఉంది. ఒక మాటకు ఒకే అర్థం కాకుండా అనేకార్థాలుంటాయి. కొత్త కొత్త భావాలు, ఆలోచనలు, అవసరాలు వచ్చినప్పుడు ఉన్న పదాలనే కొత్త సందర్భాల్లో వాడటం వల్ల కొత్త అర్థాలు ఏర్పడటం సహజం. పాతకాలంలో ఇల్లు అంటే పూరిల్లు అనే అర్థం ఉండేది. ఆధునిక కాలంలో ఇల్లు అంటే పెంకుటిల్లు, డాబా, మేడ, అపార్ట్‌మెంట్ అనే అర్థాల్లో రూఢమైంది.

అర్థ పరిణామానికి హేతువులు

అర్థ పరిణామానికి స్థూలంగా ప్రధానమైన ఐదు కారణాలను పేర్కొనవచ్చు. అవి..

- నాగరికతలో మార్పు రావడం
- చారిత్రక కారణాల వల్ల కొన్ని పదాలు ప్రసిద్ధిలోకి వచ్చి అర్థాంతరంలో ఉపయోగించడం వల్ల
- అలంకారిక ప్రయోగం
- పరిసరాల్లో మార్పు రావడం
- భావాభివ్యక్తిలో మార్పు
- ఇవేకాకుండా ప్రకరణార్థాలు, నానార్థాలు, శ్లేషార్థాలు, పలుకుబడులు, జాతీయాలు, వ్యాకరణార్థాలు, పర్యాయపదాల వల్ల అర్థాల్లో మార్పు వస్తుంది.

అర్థ పరిణామ భేదాలు

భాషావేత్తలు.. అర్థ వ్యాకోచం, అర్థ సంకోచం , అర్థ సౌమ్యత లేదా అర్థ గౌరవం, అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష, లక్ష్యార్థాలు, కేవల సంకేతార్థాలు, వస్తు పరిణామం, అలంకారిక ప్రయోగం, లోక నిరుక్తి వంటి భేదాలను పేర్కొన్నారు. వాటిని పరిశీలిద్దాం..

అర్థ వ్యాకోచం లేదా అర్థ విస్తృతి

ఒక పదం పాతకాలంలో పరిమితార్థంలో ఉండి, తర్వాత కాలంలో విశాలార్థంలో విస్తృతం కావడాన్ని అర్థ వ్యాకోచం లేదా అర్థ విస్తృతిగా పేర్కొనవచ్చు. ఆంగ్లంలో దీన్ని Extention of the meaning అంటారు. అర్థ వ్యాకోచానికి కొన్ని ఉదాహరణలు..

- **చెంబు:** రాగి లోహంతో చేసిన దాన్నే ప్రాచీన కాలంలో చెంబు అనేవారు. నేడు ఏ లోహంతో చేసినా చెంబు అంటున్నారు. ప్రత్యేకార్థం నుంచి విస్తృతార్థంలో ఇత్తడి చెంబు, ప్లాస్టిక్ చెంబు, వెండి చెంబు అని వ్యవహరిస్తున్నారు.
- **నూనె:** ప్రాచీన కాలంలో నువ్వుల నుంచి తీసినదాన్నే నూనెగా పరిమితార్థంలో వ్యవహరించేవారు. ప్రస్తుతం వేరుశెనగ, కొబ్బరి, సన్‌ఫ్లవర్ నుంచి తీసిన వాటిని కూడా నూనెగానే సామాన్య అర్థంలో వాడుతున్నారు.
- **అష్టకష్టాలు:** ప్రాచీన కాలంలో ఎనిమిది రకాలైన కష్టాలను పేర్కొన్నారు. అవి.. 1) దేశాంతర గమనం (విదేశాలకు వెళ్లడం) 2) భార్యా వియోగం 3) ఆపదల్లో బంధు దర్శనం 4) శత్రుస్నేహం 5) నీచ ఉచ్ఛిష్ట భోజనం 6) పరాన్న భోజన ప్రతీక్షణం 7) అప్రతిష్ఠ 8) దారిద్ర్యం. నేడు వీటినే అసంఖ్యాకమైన కష్టాలు అనే అర్థంలో వాడుతున్నారు.
- **అవధాని:** ప్రాచీన కాలంలో అవధానం చేసే వ్యక్తినే అవధాని అనేవారు. నేడు బ్రాహ్మణుల పేర్ల చివర అవధాని చేరుతోంది. ఇక్కడ అర్థ విస్తృతి జరిగింది.
- **కమ్మలు:** ప్రాచీన కాలంలో తాటి ఆకులతో చేసి చెవులకు ధరించే ఆభరణాలనే కమ్మలనేవారు. నేడు చెవులకు ధరించే బంగారం, వెండి, ప్లాస్టిక్ ఆభరణాలన్నింటినీ విస్తృతార్థంలో కమ్మలంటున్నారు.

అర్థ సంకోచం

ప్రాచీన కాలంలో విస్తృతార్థంలో ఉండి నేడు పరిమితార్థానికి వచ్చిన పదాలను అర్థ సంకోచం అంటారు.అర్థం కుంచించుకుపోవడమే అర్థ సంకోచం.

ఉదాహరణ:

- ప్రాచీన కాలంలో స్త్రీ, పురుషులిద్దరూ ధరించే వస్త్రాలను చీర, కోక అనేవారు. ఇప్పుడు కేవలం స్త్రీలు ధరించే వస్త్రాలు అనే అర్థంలో పరిమితమయ్యాయి.
- పూర్వం అవ్వ అనే పదాన్ని స్త్రీ అనే సామాన్య అర్థంలో వాడేవారు. ఇప్పుడు కేవలం వృద్ధ స్త్రీ అనే అర్థానికే పరిమితమైంది.
- పని, ప్రయత్నం అనే అర్థంలో ప్రాచీనకాలంలో ఉద్యోగం అనే పదం వాడేవారు. నేడు కేవలం ప్రభుత్వ, ప్రైవేటు, పారిశ్రామిక సంబంధమైన సంస్థల్లో చేసే ఉద్యోగం అనే అర్థంలో పరిమితమైంది.
- **శ్రాద్ధం:** దీనికి పూర్వం శ్రద్ధతో చేసే పని అనే అర్థం ఉండేది. ఇప్పుడు చనిపోయిన వారికి నిర్వహించే కర్మకాండగా రూఢమైంది.
- **అర్థ సంకోచం జరిగిన కొన్ని పదాలు:** వ్యవసాయం, మృగం, ఆరాధ్యుడు, సంభావన, నెయ్యి, సాహెబ్, జంగమ, కర్మ.

అర్థ సౌమ్యత లేదా అర్థ గౌరవం లేదా అర్థోత్కర్ష

పూర్వకాలంలో నిందార్థంలో వాడిన పదాలు కాలక్రమంలో విశిష్టార్థ బోధకాలై వాటికి అర్థ గౌరవం కలిగినప్పుడు వాటిని అర్థ సౌమ్యత లేదా అర్థోత్కర్ష అంటారు.

ఉదాహరణలు:

- **సభికులు:** ప్రాచీన కాలంలో జూదగాళ్లు అనే అర్థంలో వాడేవారు. నేడు సభలోని వారు అనే గౌరవార్థంలో వాడుతున్నారు.
- **వైతాళికులు:** పూర్వం రాజును నిద్రలేపే వారు అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం సంస్కర్తలు, మూఢాచారాలపై అవగాహన కలిగించేవారు అనే గౌరవార్థంలో వాడుతున్నారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు - కంటెంట్ (ఎస్ఏ)

- **ముహూర్తం:** గతంలో నిమిష కాలం, అల్పకాలం అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం పవిత్రమైన శుభకార్యాలు నిర్వహించే కాలం అనే అర్థంలో రూఢమైంది.
- **మర్యాద:** 'హద్దు' అనే అర్థంలో ఉండేది. నేడు గౌరవం అనే అర్థంలో వాడుతున్నారు.
- **అదృష్టం:** కనిపించనిది అనే అర్థం ఉండేది. నేడు సంపద, భాగ్యం అనే అర్థంలో ఉంది.
- **అంతస్తు:** మేడ పై భాగం అనే అర్థంలో పూర్వం వాడేవారు. ప్రస్తుతం పరువు, ప్రతిష్ఠ అనే అర్థ గౌరవాన్ని సంతరించుకుంది.
- ఆంగ్లంలో Knight అనే పదం Servant అనే అర్థంలో పాతకాలంలో ఉండేది. ప్రస్తుతం ప్రజ్ఞాశాలి అనే అర్థంలో వాడుతున్నారు.
- nice అనే పదం stupid అనే అర్థంలో ఉండేది. నేడు అందమైన అనే అర్థంలో వాడుతున్నారు.

అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష లేదా అర్థ న్యూనత

ప్రాచీనకాలంలో గౌరవార్థంలో ఉండి కాలక్రమంలో నిందార్థంలో ప్రయోగిస్తున్న పదాలను అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష అంటారు.

- **కంపు:**ఒకనాడు సువాసన అనే అర్థం ఉండేది. ప్రస్తుతం దుర్వాసన అనే అర్థంలో వాడుతున్నారు.
- **ఛాందసుడు:** పూర్వకాలంలో వేద పండితుడు అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం అమాయకుడు, లోకజ్ఞానం లేనివాడు అనే నిందార్థంలో వాడుతున్నారు.
- **కర్మ:** పూర్వం పని అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం పితృకర్మ అనే అర్థానికి పరిమితమైంది.
- **దేవదాసి:** ఒకప్పుడు దేవాలయాల్లో నృత్యగానాదులు నిర్వహించే స్త్రీ అనే అర్థం ఉండేది. ప్రస్తుతం వేశ్యకు పర్యాయపదంగా మారింది.
- **సాని:** పూర్వం రాణి, దొరసాని అనే గౌరవార్థంలో వాడేవారు. ప్రస్తుతం వేశ్య, వ్యభిచారిణి అనే అర్థంలో వాడుతున్నారు.

అర్థాపకర్ష జరిగిన కొన్ని పదాలు: కళావంతులు, కైంకర్యం, పూజ్యం, ఘటం మొదలైనవి.

లక్ష్యార్థ సిద్ధి

పదాలకు అసలు అర్థాలతోపాటు కొన్ని లక్ష్యార్థాలు ఏర్పడి రూఢికెక్కాయి. లక్ష్యార్థాలకు అనేక మూలాలుంటాయి. లక్ష్యార్థాలు ఏర్పడేందుకు 1) ఆధార ఆదేయ సంబంధం 2) కార్యకారణ సంబంధం 3) అశాంశి సంబంధం ఉంటుంది.

1. **ఆధార ఆదేయ సంబంధం:**ప్రాచీనార్థం, ముష్టి - పిడికిలి, నేడు భిక్ష, భిక్షం ఆధారమైంది. పిడికిలి కాబట్టి భిక్ష అనే లక్ష్యార్థం ఏర్పడింది.
2. **కార్యకారణ సంబంధం:** పూర్వం దాహం అనే పదానికి దహించడం, తపించడం అనే అర్థాలు ఉన్నాయి. కార్యకారణ సంబంధం వల్ల దప్పిక, దాహం అనే లక్ష్యార్థాలు ఏర్పడ్డాయి.
3. **లక్ష్యలక్షణ సంబంధం:** ప్రాచీనార్థంలో సూది.. వస్త్రాలు కుట్టేందుకు ఉపకరించేది. ప్రస్తుతం డాక్టర్లు వాడే ఇంజక్షన్ అనే లక్ష్యార్థంలో సూది వాడుతున్నారు.

కేవలం సంకేతార్థాలు

ఒక పదానికి జన వ్యవహారంలో ఒక అర్థం ఉండగా, ఒక వృత్తి, విజ్ఞాన శాస్త్రపరంగా ఆ పదాన్ని ప్రత్యేక అర్థంలో వాడతారు. ఇలాంటి వాటిని సంకేతార్థాలు అంటారు.

1. **వాయువు:** సామాన్యార్థం గాలి (ప్రాచీ నకాలం), నేడు పశువైద్యులు, పశువులకు వచ్చే వ్యాధిని గాలి అంటున్నారు. ఇది సంకేతార్థం.
2. **ద్రవ్యం:** ప్రాచీనార్థం.. ధనం, డబ్బు. నేడు ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు, పదార్థం అనే సంకేతార్థంలో వాడుతున్నారు.
3. **ఇంధనం:** ఇంతకుముందు వంట చెరకు, చిదుకులు, పెట్రోలు వంటి అర్థాల్లో వాడేవారు. నేడు ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం ఉష్ణశక్తినిచ్చే చమురు, బొగ్గు వంటి వాటికి సంకేతార్థంగా వాడుతున్నారు.

వస్తు పరిణామం

ఒక పదం ప్రాచీన కాలంలో సూచించే వస్తు రూపం, నిర్మాణం మొదలైన వాటిలో కాలక్రమంలో వచ్చిన భేదాన్ని సూచించే విస్తృతిని వస్తు పరిణామం అంటారు.

1. లక్కపిడతలు అంటే పూర్వం పిల్లలు ఆడుకొనే లక్కతో చేసిన బొమ్మలు. ప్రస్తుతం లక్కబొమ్మలే కాకుండా కర్ర, లోహంతో చేసిన బొమ్మలను కూడా లక్కపిడతలు అంటున్నారు. ఇది వస్తు పరిణామం.
2. **ఆయుధం:** ప్రాచీన కాలంలో విల్లు, గద, కత్తి వంటివి ఆయుధాలు. నేడు తుపాకీ, రైఫిల్, ఫిరంగి, అణ్వస్త్రాలు వంటి వాటిని ఆయుధాలుగా పిలుస్తున్నారు. ఇది వస్తు పరిణామం.

అలంకారిక ప్రయోగం

అలంకారికమైన పోలికను చెప్పడం వల్ల జరిగే అర్థ పరిణామాన్ని అలంకారిక ప్రయోగం అంటారు.

ఉదా॥ ఆమె <u>రంభ</u>, వాడు <u>మన్మథుడు</u>

1. రంభ, మన్మథుడు వంటి ఉపమానాల ద్వారా వారు సౌందర్యవంతులనే అర్థం స్ఫురిస్తుంది.
2. **ఎండ నిప్పులు చెరుగుతోంది** - ఎండ తీవ్రతను సూచించేందుకు నిప్పు ఉపమానాన్ని జోడించినందున ఇది అలంకారిక ప్రయోగం.
3. **చూపుల వెన్నెలలు:** చూపుల చల్లదనాన్ని సూచించేందుకు వెన్నెల ఉపమానాన్ని ప్రయోగించినందున ఇది అలంకారిక ప్రయోగం.

- తీపి మాటలు, చేదు నిజం, పచ్చి అబద్ధం, వంటివి అలంకారిక ప్రయోగాలు.

లోక నిరుక్తి

కొందరు తమకు పరిచయమున్న పదాలను తమకు పరిచయం లేని పదాలస్థానంలో వాడతారు. కాలక్రమేణా అవి జన వ్యవహారంలో బహుళ ప్రాచుర్యం పొందుతాయి. అలాంటి పదాల మార్పును లోక నిరుక్తి అంటారు.

1. **నారద సింహాచలం:** జన వ్యవహారంలో నార్త్ సింహాచలం నారద సింహాచలంగా మారింది. నార్త్ సింహాచలం ఒక రైల్వే స్టేషన్ పేరు. అది తెలియనివారు నారద సింహాచలంగా పిలవడంతో అలాగే ప్రసిద్ధి చెందింది. అదేవిధంగా బోరన్ మిఠాయి, మొక్కజొన్న, చక్రకేళి, మధురవాడ వంటి పదాలు లోక నిరుక్తికి ప్రసిద్ధాలు.

గత పోటీ పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో అర్థ సంకోచం జరిగిన పదాలు? (టెట్, జనవరి 2012)
   1) చందమామ, వస్తాదు, కోక
   2) ఛాందసుడు, కైంకర్యం, పత్రం
   3) సీసా, నూనె, ముష్టి
   4) ఆరాధ్యుడు, సీసా, పత్రం
2. దివంగతులగు, శివైక్యం చెందు మాటల్లో జరిగిన అర్థ పరిణామం? (టెట్, జనవరి 2012)
   1) అర్థ సంకోచం 2) లోక నిరుక్తి
   3) లక్ష్యార్థ సిద్ధి 4) సభ్యోక్తి

సమాధానాలు: 1) 4 2) 4

మాదిరి ప్రశ్నలు

1. పదజాలానికి అర్థంలో జరిగే మార్పును ఏమంటారు?
   1) ధ్వని పరిణామం 2) శబ్ద పరిణామం
   3) అర్థ పరిణామం 4) వ్యాకరణ పరిణామం
2. నన్నయ భారతంలో వాడిన కంపు పదంలో ప్రస్తుతం జరిగిన అర్థ పరిణామం?
   1) అర్థ న్యూనత 2) అర్థాపకర్ష
   3) అర్థ గ్రామ్యత 4) పైవన్నీ
3. తెలుగులో అర్థ పరిణామాన్ని గురించి మొట్టమొదట పరిశోధన చేసిన భాషావేత్త?
   1) ఆచార్య దొణప్ప 2) ఆచార్య జి.ఎన్.రెడ్డి
   3) ఆచార్య యల్.చక్రధరరావు
   4) ఆచార్య చేకూరి రామారావు
4. కింది పదాల్లో అర్థ వ్యాకోచానికి ఉదాహరణలు?
   1) కంపు, సంభావన, మృగం
   2) ధర్మరాజు, కమ్మ, పత్రం
   3) చెంబు, నూనె, ధర్మరాజు
   4) ఛాందసుడు, సాని, కమ్మ
5. ప్రాచీనకాలంలో విస్తృతార్థంలో ఉండి ఇప్పుడు పరిమితార్థానికి పరిమితమైతే అది ఏ అర్థ పరిణామం?
   1) అర్థ వ్యాకోచం 2) అర్థ సంకోచం
   3) అర్థ గ్రామ్యత 4) లోక నిరుక్తి
6. ప్రాచీన కాలంలో గౌరవార్థంలో ఉండి ప్రస్తుతం నిందార్థానికి దిగజారితే దాన్ని ఏ అర్థ పరిణామం అంటారు?
   1) అర్థ సౌమ్యత 2) వస్తు పరిణామం
   3) అర్థోత్కర్ష 4) అర్థ సంకోచం
7. సాని, కైంకర్యం, కర్మ, దేవదాసి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం?
   1) అర్థ సంకోచం 2) అర్థ న్యూనత
   3) సభ్యోక్తి 4) మృదూక్తి
8. తుపాకీ, రైఫిల్, ఫిరంగి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం?
   1) లోక నిరుక్తి 2) అలంకార ప్రయోగం
   3) వస్తు పరిణామం 4) అర్థ సంకోచం
9. వాచ్యం చేయకూడని పదాల అర్థాన్ని నూతన పద బంధాలతో చెప్పడాన్ని ఏ అర్థ పరిణామం అంటారు?
   1) అర్థ గ్రామ్యత 2) సభ్యోక్తి
   3) మృదూక్తి 4) అర్థోత్కర్ష
10. సభికులు, అంతస్తు, అదృష్టం పదాల్లో జరిగిన అర్థ పరిణామం ఏది?
    1) అర్థ సంకోచం 2) అర్థ వ్యాకోచం
    3) అర్థోత్కర్ష 4) లోక నిరుక్తి
11. ముష్టి - ఇంజక్షన్, దాహం వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామాన్ని ఏమంటారు?
    1) వస్తు పరిణామం 2) లక్ష్యార్థ సిద్ధి
    3) లోక నిరుక్తి 4) అర్థ సంకోచం
12. చనిపోవు, కులాల పేర్లు, గర్భవతి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం ఏది?
    1) అర్థ గౌరవం 2) అర్థ గ్రామ్యత
    3) సభ్యోక్తి 4) మృదూక్తి
13. దీపం కొండెక్కింది, నల్లపూసలు పెరిగిపోయాయి వంటి పదాలు ఏ అర్థ పరిణామానికి ఉదాహరణలు?
    1) సభ్యోక్తి 2) మృదూక్తి
    3) అర్థ గౌరవత 4) అర్థ సంకోచం
14. మొక్కజొన్న, నారద సింహాచలం,చక్రకేళి,వంటి పదాలు ఏ అర్థ పరిణామానికి ఉదాహరణలు?
    1) సభ్యోక్తి 2) లక్ష్యార్థ సిద్ధి
    3) లోక నిరుక్తి 4) అర్థ గౌరవం

సమాధానాలు

1) 3 2) 4 3) 2 4) 3 5) 2
6) 3 7) 2 8) 3 9) 2 10) 3
11) 2 12) 3 13) 2 14) 3

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

భారత రాజ్యాంగంలో 'విద్య' ఏ జాబితాలో ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



మాదిరి ప్రశ్నలు

1. జతపరచండి.
   ప్రభుత్వ తరహాలు:
   1. కేబినెట్ ప్రభుత్వం
   2. అధ్యక్ష ప్రభుత్వం
   3. సమాఖ్య ప్రభుత్వం
   4. ఏక కేంద్ర ప్రభుత్వం
   ప్రధానమైన లక్షణాలు:
   ఎ. అధికారాల వేర్పాటు
   బి. సమష్టి బాధ్యత
   సి. అధికారాల వికేంద్రీకరణ
   డి. అధికారాల కేంద్రీకరణ
   1) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
   2) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
   3) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   4) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
2. రాజ్యాంగ సభ అధ్యక్షుడు ఎవరు?
   1) డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్
   2) సచ్చిదానంద సిన్హా
   3) బాబూ రాజేంద్రప్రసాద్
   4) జవహర్‌లాల్ నెహ్రూ
3. వింగ్స్ ఆఫ్ ఫైర్ (Wings of Fire) ఎవరి స్వీయ చరిత్ర పేరు?
   1) ఆర్. వెంకట్రామన్ 2) కె.ఆర్. నారాయణన్
   3) రాధాకృష్ణన్ 4) ఎ.పి.జె. అబ్దుల్ కలాం
4. భారతదేశ రాష్ట్రపతిగా ఎన్నికైన మొదటి దళితుడు ఎవరు?
   1) కె.ఆర్. నారాయణన్
   2) దామోదరం సంజీవయ్య
   3) ఆర్. వెంకట్రామన్
   4) శంకర్ దయాళ్ శర్మ
5. 'సమాన పనికి సమాన వేతనం' అంటే..
   1) ప్రాథమిక హక్కు 2) ఆదేశిక సూత్రం
   3) ప్రాథమిక విధులు 4) పైవేవీ కావు
6. ఓటింగ్ వయోపరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన రాజ్యాంగ అధికరణ ఏది?
   1) అధికరణ 324 2) అధికరణ 325
   3) అధికరణ 326 4) అధికరణ 327
7. కింది వాటిలో ఏ స్వేచ్ఛ భారత రాజ్యాంగం కల్పించలేదు?
   1) భారత దేశమంతా యథేచ్ఛగా సంచరించే స్వేచ్ఛ
   2) నిరాయుధంగా, శాంతియుతంగా సమావేశమయ్యే స్వేచ్ఛ
   3) ఏదైనా వృత్తిని,వ్యాపారాన్ని నిర్వహించే స్వేచ్ఛ
   4) ఆస్తిని సంపాదించే, సొంతం చేసుకునే, బదిలీ చేసే స్వేచ్ఛ
8. కింది వాటిలో ఏ హక్కును డా.బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగానికి 'హృదయం, ఆత్మ'గా అభివర్ణించారు?
   1) సమానత్వపు హక్కు
   2) స్వాతంత్ర్యపు హక్కు
   3) మతస్వాతంత్ర్యపు హక్కు
   4) రాజ్యాంగ పరిహారపు హక్కు
9. భారత రాజ్యాంగంలోని ఏ భాగం అంతర్జాతీయ శాంతి, భద్రతను పెంపొందించే బాధ్యతను తెలియజేస్తుంది?
   1) ప్రాథమిక హక్కులు 2) ప్రాథమిక విధులు
   3) రాజ్య విధాన ఆదేశిక సూత్రాలు
   4) అత్యవసర పరిస్థితి అధికరణలు
10. పార్లమెంటులో భాగస్వాములు ఎవరు?
    1) ప్రధానమంత్రి, లోక్‌సభ, రాజ్యసభ
    2) మంత్రి మండలి, ప్రధానమంత్రి, లోక్‌సభ
    3) లోక్‌సభ, రాజ్యసభ, స్పీకర్
    4) లోక్‌సభ, రాజ్యసభ, భారత రాష్ట్రపతి
11. కేంద్ర మంత్రుల జీతభత్యాలు ఎవరు నిర్ణయిస్తారు?
    1) పార్లమెంటు 2) కేబినెట్ సచివాలయం
    3) ఆర్థిక మంత్రాలయం 4) భారత రాష్ట్రపతి
12. ఒక సాధారణ బిల్లును పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశానికి నివేదించినపుడు దేని ద్వారా ఆమోదించాలి?
    1) ఉభయ సభల మొత్తం హాజరైన, ఓటేసిన సభ్యుల్లో సాధారణ ఆధిక్యంతో
    2) ఉభయ సభల మొత్తం సభ్యులతో మూడింట రెండు వంతుల ఆధిక్యం
    3) ఉభయ సభల మొత్తం సభ్యులతో సాధారణ ఆధిక్యం
    4) ఉభయ సభల మొత్తం సభ్యుల్లో హాజరై, ఓటేసిన సభ్యుల్లో మూడింట రెండు వంతుల ఆధిక్యం
13. కింది వాటిలో దేనిని భారత రాజ్యాంగంలో ప్రస్తావించలేదు?
    ఎ. ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రి మండలి
    బి. రాష్ట్ర మంత్రిమండలి సమష్టి బాధ్యత
    సి. రాష్ట్ర మంత్రుల రాజీనామా
    డి. ఉపముఖ్యమంత్రి పదవి
    1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, సి
14. భారత సుప్రీంకోర్టుకు సంబంధించి, కింది వాక్యాల్లో సరైంది ఏది?
    ఎ. సుప్రీంకోర్టుకు భారతదేశంలోని ఏదైనా న్యాయస్థానం/ట్రిబ్యునల్‌ల నుంచి అప్పీల్‌ను స్వీకరించే అధికారం ఉంటుంది.
    బి. సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్వారా నిర్దేశించిన శాసనాత్మక/వాస్తవాత్మక ప్రశ్నలపై సలహాపూర్వక అభిప్రాయాన్ని వెల్లడించే అధికారం ఉంటుంది.
    సి. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల జీతాలు రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు.
    డి. సుప్రీంకోర్టు అధికార పరిధి భారతదేశంలోని అన్ని ఇతర న్యాయస్థానాలపై కట్టుబడి ఉంటుంది.
    1) ఎ, సి 2) సి, డి
    3) బి, సి, డి 4) ఎ, బి, డి
15. రాష్ట్ర 'ఓట్ ఆన్ అకౌంట్' కాలపరిమితి ఎంత?
    1) నెల రోజులు 2) మూడు నెలలు
    3) ఆరు నెలలు 4) సంవత్సరం
16. పార్లమెంటు సభ్యులు కాని వారు మంత్రిగా ఉంటే ఎన్ని నెలల్లో ఎన్నికవ్వాలి?
    1) రెండు నెలలు 2) నాలుగు నెలలు
    3) ఆరు నెలలు 4) సంవత్సరం
17. జతపరచండి.
    అధికరణలు:
    ఎ. 39 (ఎ) అధికరణ బి. 43 అధికరణ
    సి. 44 అధికరణ డి. 50 అధికరణ
    విషయాలు/అంశాలు:
    1. కార్మికులకు సరైన వేతనాలు
    2. కామన్ సివిల్ కోడ్ (ఒకే పౌరస్మృతి)
    3. న్యాయశాఖ నుంచి కార్యనిర్వాహక శాఖవేరు
    4. ఉచిత న్యాయ సహాయం
    1) ఎ-1, బి-4, సి-2, డి-3
    2) ఎ-4, బి-1, సి-3, డి-2
    3) ఎ-4, బి-1, సి-2, డి-3
    4) ఎ-1, బి-4, సి-3, డి-2
18. రాజ్యాంగంలోని ఏ విభాగం/ ప్రకరణల్లో ప్రాథమిక విధుల ప్రస్తావన ఉంది?
    1) విభాగం IV ప్రకరణ 51
    2) విభాగం III ప్రకరణ 51
    3) విభాగం IV(A) ప్రకరణ 51(A)
    4) విభాగం III(A) ప్రకరణ 51
19. రాష్ట్ర స్థాయిలో లోకాయుక్తల నియామకం చేసిన క్రమంలో కింది రాష్ట్రాలని అమర్చండి?
    ఎ. మహారాష్ట్ర బి. ఒడిశా
    సి. ఆంధ్రప్రదేశ్ డి. ఉత్తరప్రదేశ్
    ఇ. కర్ణాటక
    1) బి, ఎ, డి, సి, ఇ 2) ఎ, సి, డి, బి, ఇ
    3) బి, ఎ, డి, ఇ, సి 4) బి, డి, ఇ, సి, ఎ
20. కింది వాటిలో ఎవరి పరిపాలన కాలంలో అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేశారు?
    1) 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం
    2) 1978లో జనతా ప్రభుత్వం
    3) 1990లో జనతాదళ్-నేతృత్వ ప్రభుత్వం
    4) 1996లోయునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం
21. కేంద్ర మంత్రి మండలి సభ్యుల సంఖ్య లోక్‌సభ సభ్యుల సంఖ్య 15 శాతానికి మించకుండా కట్టడి చేసిన రాజ్యాంగ సవరణ ఏది?
    1) 89వ రాజ్యాంగ సవరణ 2001
    2) 91వ రాజ్యాంగ సవరణ 2003
    3) 92వ రాజ్యాంగ సవరణ 2002
    4) 93వ రాజ్యాంగ సవరణ 2003
22. జోనల్ మండలి చైర్మన్ ఎవరు?
    1) ప్రధానమంత్రి నామినేట్ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి
    2) రాష్ట్రపతి నామినేట్ చేసిన కేంద్రమంత్రి
    3) పదవి రీత్యా హోదాలోని హోంమంత్రి
    4) ఉపరాష్ట్రపతి
23. కింది వాటిలో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన ప్రకటన పర్యవసనాలు కానివేవి?
    ఎ. రాష్ట్ర శాసనసభ రద్దు
    బి. రాష్ట్రంలో మంత్రి మండలిని తొలగించడం
    సి. స్థానిక సంస్థలను రద్దు చేయడం
    డి. రాష్ట్ర పరిపాలనను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం.
    1) ఎ, బి, డి 2) ఎ, సి
    3) బి, సి 4) ఎ, సి, డి
24. కింది వాక్యాల్లో ఏది సరైనది?
    ఒక హైకోర్టు న్యాయమూర్తిని సుప్రీంకోర్టు తాత్కాలిక న్యాయమూర్తిగా హాజరు కావాలని భారత ప్రధాన న్యాయమూర్తి కోరాలంటే..
    1) భారత రాష్ట్రపతి ద్వారా ముందస్తు సమ్మతి మాత్రమే అవసరం.
    2) భారత రాష్ట్రపతి ముందస్తు సమ్మతి, సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంప్రదింపు అవసరం.
    3) సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంప్రదింపు మాత్రమే అవసరం.
    4) భారత రాష్ట్రపతి ముందస్తు సమ్మతి, సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంప్రదింపు రెండు అవసరం లేదు.
25. భారత్‌లో మొదటి మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ప్రాంతం ఏది?
    1) ముంబై 2) మద్రాసు 3) కలకత్తా 4) ఢిల్లీ
26. రాజ్యాంగంలోని 163వ అధికరణ ప్రకారం మంత్రి మండలి సలహాను అనుసరించి గవర్నర్ చర్య తీసుకోవాలి. అయితే కింది ఏ విషయాలకు సంబంధించి ఈ నిబంధన వర్తించదు.
    ఎ. రాష్ట్ర బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసం పంపడం
    బి. శాసన సభలో ప్రసంగించడం
    సి. రాష్ట్రపతి పాలన విధించవలసిందిగా రాష్ట్రపతికి సిఫార్సు చేయడం
    1) ఎ, సి 2) ఎ, బి, సి 3)బి, సి 4)బి మాత్రమే
27. ప్రతిపాదన(A): ఒక రాష్ట్ర బిల్లును రాష్ట్రపతి అమోదానికి ప్రత్యేకించడం గవర్నర్‌కి ఉన్న ఒక విచక్షణాత్మక అధికారం
    హేతువు(R): రాష్ట్ర శాసన సభ ఆమోదించిన ఒక బిల్లును రాష్ట్రపతి నిరాకరించవచ్చు, పునఃపరిశీలించవచ్చు, తిప్పి పంపవచ్చు.
    1) A, Rలు రెండు విడివిడిగా సరైనవి, Aకు R సరైన వివరణ
    2) A, Rలు రెండు విడివిడిగా సరైనవే కానీ Aకు R సరైన వివరణ కాదు
    3) A సరైంది కానీ R తప్పు
    4) A తప్పు కానీ R సరైంది.
28. రాజ్యాంగ భూమికను తయారు చేసింది ఎవరు?
    1) బి.ఆర్. అంబేద్కర్
    2) బాబూ రాజేంద్రప్రసాద్
    3) జె.బి. కృపలానీ 4) జవహర్‌లాల్ నెహ్రూ
29. ఎన్నికల్లో ఓటు వేసిన అభ్యర్థికి ఏ వేలుకు ఇంకు చుక్కను పెడతారు?
    1) ఎడమ చేయి చూపుడువేలు
    2) ఎడమ చేయి మధ్యవేలు
    3) కుడి చేయి చూపుడువేలు
    4) కుడి చేయి మధ్యవేలు
30. భారతదేశంలో కలెక్టర్ పదవిని ప్రవేశపెట్టింది ఎవరు?
    1) లార్డ్ విలియం బెంటింగ్
    2) లార్డ్ వారెన్ హేస్టింగ్స్
    3) లార్డ్ కర్జన్ 4) లార్డ్ రిప్పన్
31. ఒక రాష్ట్ర గవర్నర్ అనుభవించే అధికారాలకు సంబంధించి కింది వివరణను పరిశీలించండి?
    1) ప్రతి సంవత్సరం జరిగే శాసనసభ తొలి సమావేశం ప్రారంభంలో గవర్నర్ ప్రసంగిస్తారు
    2) శాసనసభ పరిశీలనలో ఉన్న ఒక బిల్లుకు సంబంధించి అతడు శాసనసభకు సందేశాలు పంపవచ్చు.
    3) అతడు రాష్ట్ర శాసన సభను సమావేశ పరచవచ్చు, వాయిదా వేయవచ్చు, రద్దు చేయవచ్చు.
    4) రాష్ట్ర హైకోర్టు అధికారాలకు భంగం కలిగించే ఒక బిల్లుకు అతని ఆమోదం తెలుపవచ్చు.
32. కింది వారిలో గవర్నర్ నియమించనిది ఎవరు?
    1) రాష్ట్ర మంత్రి మండలి
    2) రాష్ట్ర అడ్వకేట్ జనరల్
    3) రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్
    4) రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు
33. అశోక్ మెహతా కమిటీ పంచాయతీ రాజ్ వ్యవస్థకు ఎన్ని అంచెల విధానాన్ని సిఫార్సు చేసింది?
    1) 3 2) 2 3) 1 4) 4
34. భారత రాజ్యాంగంలో'విద్య' ఏ జాబితాలో ఉంది?
    1) ఉమ్మడి జాబితా 2) కేంద్ర జాబితా
    3) రాష్ట్ర జాబితా 4) అవశిష్ట అంశాలు
35. ఒక రాష్ట్ర గవర్నర్‌ను అతని పదవి నుంచి రాష్ట్రపతి తొలిగించేది ఎప్పుడు?
    1) రాష్ట్ర ముఖ్యమంత్రి వినతితో
    2) లోకాయుక్త సలహాతో
    3) కేంద్ర కేబినెట్ సలహాపై
    4) అటార్నీ జనరల్ సలహాపై
36. మూల రాజ్యాంగం ప్రాథమిక హక్కులను ఏడు రకాలుగా వర్గీకరించింది కానీ అవి ఇపుడు ఎన్ని?
    1) ఐదు 2) నాలుగు 3) ఎనిమిది 4) ఆరు
37. ప్రస్తుత లోక్‌సభలో సీట్ల కేటాయింపు ఏ జనాభా లెక్కల ప్రకారం జరిగింది?
    1) 1951 2) 1971 3) 2001 4) 1991
38. భారత రాజ్యాంగం ప్రకారం ఏ వ్యవస్థను రాజ్యాంగపు 'రక్షకుని'గా గుర్తించారు?
    1) పార్లమెంటు 2) సుప్రీంకోర్టు
    3) కార్యనిర్వాహకశాఖ 4) ఏవీకావు
39. ప్రతిపాదన (A): ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఆ రాష్ట్ర మంత్రి మండలి అధినేత
    హేతువు (R): ముఖ్యమంత్రి శాసన సభకు బాధ్యత వహిస్తాడు, సభలో మెజార్టీ మద్దతును అనుభవిస్తాడు.
    1) A, Rలు విడివిడిగా సరైనవి. R, Aకు సరైన వివరణ
    2) A, Rలు విడివిడిగా సరైనవి కానీ Aకు R వివరణ కాదు
    3) A సరైంది కానీ R తప్పు
    4) A తప్పు కానీ R ఒప్పు
40. కింది వాక్యాలను పరిశీలించండి.
    ఎ. రాష్ట్ర మంత్రిమండలి లేకుండా గవర్నర్ విధులు నిర్వహించలేడు
    బి. రాష్ట్ర శాసనసభలో సభ్యుడు కానీ వ్యక్తి మంత్రిగా నియమించలేం
    సి. ముఖ్యమంత్రి మరణం/రాజీనామా తర్వాత కొంతకాలం పాటు రాష్ట్రమంత్రి మండలి విధుల్లో కొనసాగుతుంది
    డి. ముఖ్యమంత్రి లేనపుడు రాష్ట్రమంత్రి మండలి అత్యవసర సమావేశాలకు హోంశాఖ మంత్రి మాత్రమే అధ్యక్షత వహిస్తాడు.
    1) ఎ మాత్రమే 2) సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 1	5) 2
6) 3	7) 4	8) 4	9) 3	10) 4
11) 1	12) 1	13) 3	14) 4	15) 3
16) 3	17) 3	18) 3	19) 3	20) 3
21) 2	22) 3	23) 2	24) 2	25) 2
26) 1	27) 2	28) 4	29) 1	30) 2
31) 4	32) 3	33) 2	34) 1	35) 3
36) 4	37) 2	38) 2	39) 1	40) 1

When I visited the town for the first time..

BANK EXAMS
GENERAL ENGLISH



MODEL QUESTIONS

Directions (Q.No. 1 - 4): Read the following passage and answer the questions as directed.

Paragraph - 1: Do Indians have the potential to pay more tax ? Most individual taxpayers will respond with a vehement 'No'. But the Finance Minister is quite convinced that there's **room** to collect more. Recently pointing out that India is still "far from being a tax-compliant society", he noted that the tax-to-GDP ratio is low, and there's room to bump it up by another 1.5 percentage points. So, why is there such a sharp dichotomy between the perception of citizens - who feel they are taxed at every turn - and the government - which thinks that there's room to extract more? The answer could lie in the flawed measurement of tax compliance.

Paragraph - 2: The metric that is often used to drive home the poor culture of compliance in India, is the small proportion of population paying direct taxes. In FY18, 6.84 crore entities (individuals, HUFs and businesses) field their Income Tax Returns. Of these, there were about 6 crore individual assesses. A straight forward comparison of this number with the population estimate (132 crore) suggests that only 4.5 per cent of Indians pay income tax. But that's a flawed comparison because an individual can be said to 'evading' income tax only if he is (_____) to pay it in the first place. Therefore, the most important step to assessing actual tax compliance in India, is to estimate the proportion of the population that is liable to pay income tax.

1. Which of the following can be inferred as the theme of the passage?
1) People are quite convinced that there's room to collect more Individual taxes
2) India needs more collection of taxes to meet the financial needs of the country
3) Most people in India are reluctant to pay direct taxes
4) India needs more stringent laws to stop tax evasion
5) The govt and the citizens do not think alike.

2. Which of the following can replace the word given in bold in the passage?
1) Home 2) Requirements
3) Range 4) Scope 5) Leeway

3. What is the tone of writing in the passage?
1) Nostalgic 2) Didactic
3) Critical 4) Sarcastic
5) Satirical

4. Which of the following words can be filled in the blank to make it meaningful?
1) Unable 2) Compatible
3) Willing 4) Capable 5) Liable

Directions (Q.No. 5-7): Read the following paragraph and answer the questions as directed.

Though India is among the top nations in the world in software development, we have lagged behind in facilitating the spread of IT in services across sectors. Over the past decade though, we have been making up in many ways. Singapore leads in connectivity and speed, thanks to strong government impetus on using technology to deliver better citizen services, and in due course we too should catch up, despite our huge size. Singapore is the most tech-savvy government and the US, **surprisingly**, does not find a place in the top 10, which has two Asian and three Arab nations. We must look to developing IT standards sector-wise to achieve seamless digitization. *We can work on this aspect in parallel, to provide ease of consumer use and reliability.*

5. Which of the following has been assumed in the given passage?
1) Whatever efforts may the Indian government make in IT, it cannot deliver better citizen services.
2) India is not a tech-savvy country.
3) The huge population of India is a great obstacle in the spread of IT in services across sectors.
4) Though the government has made efforts to spread IT in services across sectors, yet a lot requires to be done to catch up IT standards sector-wise.
5) In facilitating the spread of IT in services across sectors we lag behind two Asian and three Arab nations.

6. Which of the following words is opposite of the word given in bold?
1) Especially 2) Usually
3) Exceptionally 4) Notably
5) Principally

7. Which of the following is the best way of writing the line given in italics in the paragraph, without changing its intended meaning?
1) In order to provide ease of consumer use and reliability we can work side by side to develop IT standards sector-wise.
2) To achieve the target of flawless digitization we can work on this aspect in parallel.
3) For consumer satisfaction and reliability full digitization is required.
4) To achieve full digitization we should work on this aspect in parallel.
5) None of these

Directions (Q.No. 8-10): Read the following paragraph and answer the questions as directed.

If consumers and businesses expect 'no change' or contraction, the promised growth may not materialise. How much is the Indian economy likely to grow by? This remains a moot question, especially in the wake of the recently released GDP estimates. A perusal of the RBI's recently released Forward Looking Surveys may provide an important lens into what we can expect in the near future. In particular, three of these surveys, focusing on consumer confidence, business expectations and the demand conditions in the manufacturing sector ______ attention. The main drivers of growth in an economy are domestic consumption and investment. With India being largely a consumption-driven economy, consumption spending must grow to drive overall growth. Consumer spending depends to a large extent on growth in disposable incomes. However, an important factor, which is often overlooked is consumer confidence regarding the general economic situation captured in consumer's perceptions and expectations.

8. Which of the following is true from the paragraph?
1) According to an estimate by the RBI, India's economy is likely to register a negative growth.
2) Consumer spending depends to a large extent on growth in taxable incomes.
3) The growth of an economy is driven by foreign direct investment.
4) The main drivers of growth in an economy are domestic consumption and investment.
5) None of the above.

9. Which of the following words should be filled in the blank in the paragraph?
1) Merit 2) Must 3) Pay
4) Deserve 5) Both 1 & 4

10. Which of the following can be the next line after the last line of the paragraph?
1) The Consumer Confidence Index (CCI) may indicate either consumer pessimism (if less than 100) or optimism (if above 100) regarding the general economic situation, price levels, consumer's own income, employment and spending.
2) The latest RBI survey indicates that the current CCI (at 96.7) continues to remain below 100, even two years after the disruptions to the economy through demonetisation, and later through the imposition of the Goods and Services Tax (GST).
3) Consumers, however, expect the future to be rosier.
4) Negative perceptions lead to negative consumer sentiments, which are likely to halt consumer spending - a major lever for growth in India, accounting for 56 per cent of GDP.
5) The rate hikes / cuts by the RBI have dominated public discussion in the last few quarters, especially since the RBI adopted a policy stance of calibrated tightening since October 2018.

Directions (Q.No. 11-20): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word in each case.

India has become, in purchasing power parity terms, the third largest economy in the world. India's economic (11) since 1980 has been among the (12) rapid. Although India managed its one incipient crisis in the early 1990s, it avoided the catastrophic losses (13). While many (14) that exposing India's economy to global competition would reveal India's economic (15), it has rather revealed strengths and often unexpected strengths in new areas no planner would have (16) of. India is increasingly taking its (17) on the global stage and in international forums as a 21st century superpower. The generations of politicians and policy makers who have been (18) of leading India to where it is today can be justifiably (19) of the transformation. But achievements create new (20) two of which are improving service delivery, particularly to the poor, through greater accountability and expanding the benefits of rapid growth across sectors, regions and people.

11. 1) Decline 2) Policy 3) Crisis 4) Treaty 5) Growth
12. 1) Several 2) Very 3) Most 4) Much 5) So
13. 1) End 2) Deterioration 3) Thus 4) Together 5) Elsewhere
14. 1) Asked 2) Feared 3) Think 4) Spoke 5) Believe
15. 1) Growth 2) Space 3) Gain 4) Weakness 5)Void
16. 1) Questioned 2) Dreamed 3) Arranged 4) Plan 5) Wanted
17. 1) Matter 2) Place 3) Life 4) Generation 5)Mark
18. 1) Part 2) Issues 3) Humans 4) Figment 5) Thought
19. 1) Worried 2) Angry 3) Honoured 4) Distinguished 5) Proud
20. 1) Impossibilities 2) Evaluation 3) Challenges 4) Comparisons 5) Dangers

Directions (Q.No.21-25): Rearrange the following six sentences (1), (2), (3), (4), (5) and (6) in the proper sequence to form a meaningful paragraph; then answer the questions given below them.

(1) When I visited the town for the first time, I was struck by startling changes.
(2) And not only that, they were happy to remain so.
(3) But what surprised me most was the realization, that people over there were strangers to one another.
(4) As a young boy, I had not moved far from my small native village.
(5) Swift moving vehicles and tall buildings drew my attention and almost baffled me.
(6) I had intimate relationship with everybody in my village.

21. Which of the following will be the **FIFTH** sentence after rearrangement?
1) 2 2) 3 3) 4 4) 5 5) 6

22. Which of the following will be the **SECOND** sentence after rearrangement?
1) 2 2) 3 3) 4 4) 5 5) 6

23. Which of the following will be the **FOURTH** sentence after rearrangement?
1) 2 2) 3 3) 4 4) 5 5) 6

24. Which of the following will be the **SIXTH** sentence after rearrangement?
1) 2 2) 3 3) 4 4) 5 5) 6

25. Which of the following will be the **FIRST** sentence after rearrangement?
1) 2 2) 3 3) 4 4) 5 5) 6

KEY

1) 3	2) 4	3) 3	4) 5	5) 3
6) 2	7) 1	8) 4	9) 5	10) 4
11) 5	12) 3	13) 3	14) 2	15) 4
16) 2	17) 2	18) 1	19) 5	20) 3
21) 2	22) 5	23) 4	24) 1	25) 3